భాగవత మూర్తి

# భీష్ముడు



మాస్టర్ పార్వతీకుమార్

ఈ ప్రచురణ యొక్క కంటెంట్ సద్భావన చర్యగా మరియు వ్యక్తిగత ఉపయోగం కోసం మాత్రమే ఉచితంగా ఇవ్వబడుతుంది. దానిని అలానే ఉంచడం మన బాధ్యత.
విధంగానైనా లేదా ఏ ప్లాట్‌ఫారమ్‌లోనైనా వాణిజ్యీకరణ నిషేధించబడింది, అలాగే ప్రచురణకర్త యొక్క వ్రాతపూర్వక అనుమతి లేకుండా పంపిణీ, లేదా పూర్తిగా, లేదా కొంత భాగాన్ని ప్రచురించడం నిషేధించబడింది. అన్ని హక్కులూ గ్రంథకర్తవి, ప్రచురణకర్తవి.

# భాగవతమూర్తి

# భీష్ముడు

సంకలన కర్త

**మాస్టర్ పార్వతీకుమార్**

ధనిష్ఠ

ప్రథమ ముద్రణ : 2018 (గురుపూజలు)

ప్రతులు : 1,000

© ధనిష్ఠ

వెల : **రూ. 100-00**

ప్రతులకు :
**ధనిష్ఠ పబ్లికేషన్స్,**
15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్,
కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002
ఫోన్ : 0891-2701531, 2509154,
website : www.dhanistha.org.
info@dhanistha.org
ISBN : 978-81-89467-79-1

ముద్రణ :
**సత్యం ఆఫ్‌సెట్ ఇంప్రింట్స్**
విశాఖపట్నం-530 016.
ఫోన్ : 0891-2796538, 9849996538.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

"**ధనిష్ఠ**" అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువలేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ'' 1992లో జన్మించినది.

"**ధనిష్ఠ**" మాస్టర్ పార్వతీకుమార్ గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపములోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

"**ధనిష్ఠ**" ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును సద్గోష్ఠికై వలసిన వాతావరణమును – "జగద్గురు మందిరము"గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## సంకలనకర్త : **మాస్టర్ పార్వతీకుమార్**

మాతృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో 33 సంవత్సరములుగా బోధనలు గావించుచూ, పరమగురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించుచున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ పార్వతీకుమార్** గారు. వారి బోధనలు లెక్కకుమించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియవచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసరణీయమై, ఆచరణ యోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించు చున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళారంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ 1997వ సంవత్సరములో "**డాక్టర్ ఆఫ్ లెటర్స్**" పట్టా నందించినది. 2013వ సంవత్సరములో గౌరవ ఆచార్యులుగా నియమింపబడిరి.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో – మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత

అలరారినప్పుడే దానికి సాఫల్యత, సార్థకత ఉండునని, "మానవ సేవయే మాధవసేవ" అను మాటకు సరియైన అర్థము యిదేనని మాస్టరుగారు తమ ప్రవర్తన ద్వారా తెలియపరచు చున్నారు. మాస్టర్ పార్వతీకుమార్ గారు బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక – మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, అష్టాంగ యోగము ననుష్ఠానము చేయుచు, వేలాదిమందితో అనుష్ఠింప చేయుచున్న యోగి. శతాధిక గ్రంథముల సంకలన కర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తననుతాను ప్రకటించుకొనుచుండు ననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాలరనియూ, సంకలన కర్తలే ననియు మాస్టరుగారి దృఢ విశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

మాస్టర్ పార్వతీకుమార్ గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశవిదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "పరహితము పరమధర్మ" మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించు చున్నది. భగవద్ధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠ**

# ముందుమాట

*“భాగవతమూర్తి భీష్ముడు”* ఒక భాషణా గ్రంథము. మాస్టర్ పార్వతీకుమార్ గారి గురుపూజా భాషణములను ఈ నడుమ శ్రోతల అభీష్టము మేరకు యథాతథముగా, ధనిష్ఠ పాఠ్య గ్రంథములుగ ప్రచురించుచున్నది. *అంబరీషుడు, మార్కండేయుడు, శ్రీ రుక్మిణీ కళ్యాణము, సతీ సావిత్రీదేవి ఉపాఖ్యానము, కుమార సంభవము* భాషణా గ్రంథములుగ ప్రచురింపబడినవి. మాస్టరుగారి భాషణము సన్నిహితమగు స్పర్శ నిచ్చుచున్నదని, వారి భాషణము నట్లే ప్రచురించిన బాగుండునని, అన్ని కేంద్రము లందలి శ్రోతలు ప్రోత్సహించుట వలన ఈ భీష్మ పితామహుని గూర్చిన భాషణము కూడ చిరు సవరణలతో భాషణా గ్రంథముగ ప్రచురించు చున్నాము.

విజయవాడలో 40వ గురుపూజా ఉత్సవములు, 2017వ సంవత్సరము నందు భీష్మాష్టమినాడు ప్రారంభింపబడుట గుర్తించి మాస్టర్ పార్వతీకుమార్ గారు అప్పటికప్పుడు నిర్ణయము గావించుకొని భీష్మ పితామహుని గూర్చి నాలుగు ప్రవచనము లందించినారు. భీష్ముడు కేవలము అజేయుడు, అమిత పరాక్రమవంతుడే గాక భాగవత మూర్తులలో ఆయన కొక విశిష్ట

స్థానమున్నదని, మహాజ్ఞాని యని, శ్రీకృష్ణ పరమాత్మచే ప్రత్యేకముగ ఆదరింపబడిన మరియు గౌరవింపబడిన విశిష్టమూర్తి యని పేర్కొనినారు. దివ్యప్రజ్ఞ భూమిపై ఒక నిర్దిష్ట ప్రయోజనమునకై రూపు కట్టుకొని నాలుగు తరములు చరించినది అని పేర్కొనినారు. శ్రీమద్భాగవత మందలి భీష్మస్తుతిని ప్రత్యేకముగ వివరించినారు. చదువరులను ఆసాంత మీ గ్రంథము ఆకట్టుకొనగలదు.

ఈ గ్రంథ ప్రచురణకు ఉత్సుకతతో సంసిద్ధత ప్రకటించిన పూజ్యసోదరులు **శ్రీ అన్నలూరు రామ కోటేశ్వరరావు గారు** హైదరాబాదు వాస్తవ్యులు మాస్టరుగారి రచనల యందు భాషణముల యందు అమిత ఆసక్తి కలిగి యున్నవారు. వారి సహాయ సహకారములకు ధనిష్ఠ కృతజ్ఞతను హృదయ పూర్వకముగ ప్రకటించుచున్నది. పుస్తక రూపమున ఈ భాషణమును కొని వచ్చిన భాగ్యనగర సోదర బృందమునకు, ధనిష్ఠ కార్యకర్తలకు మాస్టరుగారి ఆశీర్వచనములు నిండుగ, దండిగ లభించుగాక!

*ఆస్తిక జనుల సేవలో.....*

**– ధనిష్ఠ**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | ఈశ్వరానుసంధానము | 11 |
| 2. | మాఘ మాస ప్రజ్ఞ | 43 |
| 3. | అమ్మవారి శిక్షణ | 70 |
| 4. | వ్యాస మహర్షి జననం | 76 |
| 5. | భీష్మ ప్రతిజ్ఞ | 82 |
| 6. | నిమిత్త కారణం | 91 |
| 7. | వేదవ్యాసుని ప్రజ్ఞ | 104 |
| 8. | ధర్మనిర్ణయం | 108 |
| 9. | భీష్ముని యుద్ధము | 115 |
| 10. | భీష్ముని యుపదేశము | 121 |
| 11. | శ్రీకృష్ణస్తుతి | 162 |
| 12. | వాసుదేవ వ్యూహము | 189 |

# భాగవతమూర్తి
# భీష్ముడు

# 1. ఈశ్వరానుసంధానము

మాస్టర్ C.V.V. గురుపూజా మహోత్సవములలో పాల్గొనటానికి విచ్చేసిన సోదర, సోదరీ బృందానికి నా హృదయపూర్వక నమస్కారములు. 40 సంవత్సరములుగా విజయవాడ కేంద్రంలో మాస్టర్ C.V.V. గురుపూజా మహోత్సవములు నిర్వర్తింపబడటం ఒక విశేషం. విజయవాడ, విజయవాడయే! విజయుడు శివుడిని మెప్పించినటువంటి పుణ్యభూమి ఇది. ఆ తర్వాత కొన్నాళ్ళు బెజవాడగా పిలుచుకుంటూ విజయుణ్ణి మర్చిపోయాం. తెలిసినవారందరూ విజయవాడగానే దీన్ని భావిస్తూ ఉంటారు. విజయవాడకి ప్రత్యేకత ఏమిటంటే స్థలప్రభావం. మన ప్రభావం కాదు.

మానవుడు విజయం చెందితే 'విజయుడు' అంటారు. మానవుడు విజయం పొందటం అంటే ఏమిటో కూడా మన పెద్దలు చెప్పారు. ఇంక ఎవరో నిర్వచించి విజయం అంటే ఇది అనుకోకుండా. ఏమిటి విజయం మానవుడికి? మానవుడు నరుడైతే విజయుడవుతాడని పెద్దలు చెప్పారు. మానవుడంటే మనసు ప్రధానంగా జీవించేవాడు. మనసు ప్రధానంగా జీవించేవాడు అన్నీ మర్చిపోతూ ఉంటాడు. చేసిన పనులే చేసుకుంటూ ఉంటాడు. మళ్ళీ మర్చిపోతూ ఉంటాడు. మళ్ళీ వెతుక్కుంటూ ఉంటాడు.

కొంత గుర్తు ఉంటుంది. కొంత మర్చిపోవడం ఉంటుంది. ఇలాంటివి జరుగుతూ ఉంటాయి. మనసుకి మరణం అనేది ఒకటి ఉన్నది. ఎందుకంటే మరుపే మరణం. మరుపు మరణం కాబట్టే ఇప్పుడు మనం అన్నీ మర్చిపోతున్నాం అనుకోండి. మనం మనసులో ఉన్నట్టే లెఖ్ఖ. అసలు మనసు యొక్క ప్రధాన లక్షణమే మరుపు. నిన్ను నీకు మరుపు కలిగించి నీవు కాని నీవుగా నువ్వు జీవించేట్లుగా, ఒక క్షరమైనటువంటి జీవితము నందు నిన్ను నిమగ్నం చెయ్యటానికి, మనసనేది ఒకటి ఏర్పడింది. దాని యందు నీవు విజయం సంపాదించడమే విజయం. అందుచేత మానవుడు మనసు అనే కక్ష్యలో నుండి బుద్ధి అనే కక్ష్యలోకి తనని తాను ఉద్ధరించుకుని, ఆ బుద్ధి కక్ష్య యందు ఆత్మయొక్క వెలుగుగా తాను జీవిస్తూ ఉంటే అలాంటి వాణ్ణి విజయుడు అంటారు.

విజయం అనేది ఎవరికి సాధ్యం అంటే మనస్సు యందు జీవించి అంటే కేవలం బాహ్యమే అంతా అనుకుని జీవించడం కాకుండా, అంతర్మనసు లోనికి ప్రవేశించి, అక్కణ్ణించి ఊర్ధ్వగతి చెంది, బుద్ధి లోకముల లోనికి ప్రవేశించి, బుద్ధి అనే ఆత్మ యొక్క వెలుగులో తాను స్థిరపడితే వాణ్ణి 'విజయుడు' అంటారు. భగవద్గీత ఎందుకు చదువుకోవాలంటే మానవుడు నరుడవ్వాలి. అందుకు భగవద్గీత చదువుకోవాలి. మానవుడు నరుడవడానికే ఆత్మసాధన అంతా కూడా. ఎందుకంటే నరుడంటే నశింపనివాడు. నారాయణాంశ.

"నర" అంటే నశింపు లేనివాడు. అంటే మనందరం సహజంగా అక్షరులం. కానీ క్షరత్వంలో పడిపోతూ ఉంటాం

ఎప్పటికప్పుడు. ఎందుచేతంటే మనం కూర్చున్నటువంటి చోటు అలాంటిది. ఈ శరీరరూపంలో భగవంతుడు మనకి ఏడంతస్తులమేడ ఇస్తే , మనం పైనుంచి మూడు అంతస్తులూ వదిలేసి, మధ్యస్థం అయిన అంతస్తూ వదిలేసి, అంతకన్నా కింద కూర్చుంటూ ఉంటాం. సహస్రారంలో కూర్చోవచ్చు, ఆజ్ఞలో కూర్చోవచ్చు. అనాహతంలో కూర్చోవచ్చు, విశుద్ధిలో కూర్చోవచ్చు. ఇవన్నీ కాకుండా మణిపూరకంలో కూర్చుంటాం. కూర్చుని ఏవో అవిఇవి ఇవిఅవి ఏవో చాలా వాటి గురించిన ఆలోచనలు ఎక్కువగా ఉంటాయి. అందుచేత ఈ నేర్చుకున్నది ఏమీ నిలబడదు. నిలబడకపోవటానికి కారణం ఒక్కటే. మనస్సులో ఉంటే నిలబడదు. బుద్ధిలో ఉంటే ఎప్పటికీ నిలబడుతుంది. ఎప్పుడో చదువుకున్నది కూడా బాగా నీకు జ్ఞప్తియందు ఉంటుంది. అలా పిలిస్తే పలికేట్టుగా ఉంటుంది. అంతేగానీ ఎప్పుడూ బుర్రగోక్కునేట్టుగా ఉండదు. ఏదో విజయవాడలో మనం ఉన్నాంట అంటే దానికో బాధ్యత ఉంది అని నా ఉద్దేశం. నేను విజయవాడలో పుట్టాను. అందుకని నాకది ఒక బాధ్యతగా పెట్టుకున్నాను. అక్షరమైన విషయములు మర్చిపోకూడదు, క్షరమైన విషయములు ఎన్నైనా మర్చిపోవచ్చు. అంటే ఇప్పుడు మనకి ఏది క్షరమో, ఏది అక్షరమో తెలుసు. అందుచేత క్షరమైన విషయముల యందు ఆసక్తి తగ్గించుకుంటూ అక్షరమైన విషయములయందు ఆసక్తి పెంచుకుంటూ వెళ్ళాలి. ఈ దేహం చాలిస్తే ఆతర్వాత మనతో ఏదైనా వచ్చేది ఉంటే అది అక్షరం అండి. మనందరం కూడా అక్షరులమే. మన చుట్టూ ఏర్పడినవి మనతో మరణం తరువాత

రాలేనివి క్షరములు. నిర్వర్తించిన ధర్మం, కర్మం, నేర్చిన జ్ఞానం మనతో వస్తుంది. ఆస్తులు, పాస్తులు, ధన ధాన్యాలు, స్థితిగతులు, బంధుమిత్రులు, శత్రువులు రాలేరు.

అక్షరుడు తనతో ఏమి పట్టుకెళ్ళాలి? ఎందుకొచ్చాడు ఇక్కడికి? అనుభూతి పట్టుకెళ్ళాలి. ఆ అనుభూతి ఎలాంటి అనుభూతి, శాశ్వతమైన అనుభూతి అయి ఉండాలి. అది పొద్దున్న తింటే మధ్యాహ్నానికి మర్చిపోయే విషయం కాదుకదా! అక్షరమైన విషయం. రేపొద్దున్న, నిన్న మధ్యాహ్నం ఏమి తిన్నాం అంటే వెంటనే గుర్తురాదు కదా! అలా క్షరము, క్షవరము అయిపోయే విషయాలు అనేకం ఉంటాయి ఈ ప్రపంచంలో కదా! ఈ క్షర విషయములందు కాక అక్షరమైనటువంటి విషయము ఈ లోకంలోనే గోచరిస్తుంది. అనుభూతి చెందవచ్చు. దాని యందు మనసు లగ్నం చేయటమనేది మనకి ప్రధానమైనటువంటి విషయం. సాధన అంటే ఇంక అంతకన్నా వేరే ఏంలేదు. చిల్లర విషయములందు ఆసక్తి తగ్గి, పెద్దనోట్ల విషయములందు ఆసక్తి పెంచుకోవాలి. ఇప్పుడంతా నోట్లేకదా మనకి! ఇప్పుడు ప్రపంచం అంతా నోట్ల గోలలో ఉంది (Demonetisation).

నోటంటే ఏమిటీ ? సూచన అని అర్థం కూడా ఉంది కదా! అన్నిటికన్నా పెద్దదైన నోట్. మనకి మూలమైనటువంటివాడు ఒకడు ఉన్నాడు కదా! *"ఆత్మభవున్దిదలంతున్"* అందుచేత అలాంటివాడి గురించి తెలుసుకునే విషయములందు ఆసక్తి కలిగి ఉండి ఇతర విషయములందు ఆసక్తి తక్కువగా ఉంది అనుకోండి,

బుద్ధిలోకి పెరిగే అవకాశం ఉంటుంది. పెరుగుదామనే ఆసక్తి ఒకటే కాదు రుచికూడా ఉండాలి. రుచి లేకపోతే లాభం లేదు.

ఈరోజు ఉదయం నేను ప్రార్థన చేస్తున్నపుడు నా మనసుకి చాలా ఎక్కువగా భీష్మపితామహుడు గుర్తుకు వచ్చాడు. ఎందుకంటే పొద్దున్నే లేవంగానే ఈరోజు తిథి ఏమిటి అని చూసుకునే type కాదు నేను. తర్వాత చూసుకుంటా. లేచిన తర్వాత నాకు ప్రార్థన ముఖ్యం. ప్రార్థన అంటే మనలో ఉండేటటువంటి ఈశ్వరుడితో అనుసంధానం చెందటమే నాకు తెలిసి! అదే ఈశ్వరుడు బయట రూపు గట్టుకుని గురువుగా మనకు దర్శనం ఇచ్చి మార్గం చూపిస్తాడు. నా దృక్పథం ఎప్పుడూ కూడా ఆయన చూపించిన మార్గంలో మనం ఈశ్వర అనుసంధానం చెందటమే తప్ప ఇతరమైన విషయములందు, గురు రూపమునందు కూడా ఆయన ఆసక్తి చూపించవద్దని చెప్పి రాసేశారు శంఖారావం చదువుకుంటే. ఎందుచేతంటే నీలోనే ఉన్నటువంటి ఈశ్వరుడినే నీకు పరిచయం చేయడంకోసం నేను వచ్చాను, అని చెప్పినటువంటి వాడిని, ఆయన ఎవర్ని పరిచయం చేసుకో అని మనకి చెప్పాడో ఆయన్ని పరిచయం చేసుకోడానికి ప్రయత్నం చెయ్యాలి కదా! మీరు రోజూ ఫలానా పద్యం చదువుకోండి అని చెప్పాం అనుకోండి! బోలెడు పద్యాలున్నాయి భాగవతంలో. ఈ పద్యం చదువుకోండి అని చెప్పే ఆయన గుర్తువచ్చి, మాటిమాటికీ ఆ పద్యం చదువుకోండి అని చెప్పిన ఆయనే గుర్తువస్తున్నాడనుకోండి, పద్యం చదువుకోవడం ఉండదు కదా! ఉంటుందా? ఉండదు. ఆయన ఏమి చెయ్యమన్నారో అది చెయ్యాలి.

ఈ సృష్టి మొత్తం అంతా ఏర్పాటు  చేసి భగవంతుడు, ఈ జీవులని అన్ని లోకాలలోనూ ప్రవేశింప చేసిన తర్వాత, వీళ్ళందరూ తన దగ్గరకి వచ్చే మార్గానికి కూడా ఒక ప్రణాళిక ఆయనే ఏర్పాటు చేసుకున్నాడు. ఓ మహత్తరమైన గురుపరంపర ఏర్పాటు చేసుకున్నాడు. ఒరేయ్! వీళ్లందరూ మళ్లీ వెనక్కివచ్చే మార్గం మర్చిపోతారురా, అందుచేత వీళ్ళందరికీ మీరు మార్గం చూపించండని అన్ని లోకాలలోకీ పంపించేశారండీ గురువులని. ఏది? సత్యలోకం నుండి భూలోకం వరకూ వ్యాప్తి చెందిన గురుపరంపర ఒకటి ఉన్నది. అందుకని ప్రతి లోకంలోనూ గురువులుంటారు. local branch ఉన్నట్లుగా, local Post office ఉన్నట్టు.

వాళ్ళ పనేమిటయ్యా అంటే వాళ్ళకి ఒకటే పని. నిజమైన గురువు పని ఏమిటంటే, జీవుడు ఈశ్వర స్వరూపుడే. ఈశ్వరుడే జీవుడిగా గుణములతో సంబంధం ఏర్పరుచుకుని ఉన్నాడు కాబట్టి, ఆ జీవుడిగా ఉన్నటువంటివాడికి ఈశ్వరుడిని గుర్తు చెయ్యాలి. నీవు ఈశ్వరుడవే, జీవుడని నిన్ను నువ్వు పరిమితం చేసుకున్నావు, ఈశ్వరుడిగా నువ్వు అపరిమితుడవు అని తెలియచేసి, అలా తెలియచేయడమే కాకుండా నీలోని ఆ ఈశ్వరుడిని నువ్వు దర్శనము, శ్రవణము, స్మరణము ద్వారా ఏవిధంగా పొందవచ్చు. ఇలాంటి విషయాలన్నీ చెప్పేవాళ్లు గురువులండీ, మిగతావాళ్ళు గురువులు కాదు.

అందుకనే మనకి ఎప్పుడూ ఆ పద్యం చెప్తూనే ఉంటా *"కుంభినీధవు చెప్పెడి గురుడు గురుడు". "తండ్రి! హరి*

*చేరుమనియెడి తండ్రి తండ్రి"* అంటే ఇద్దరే మనకి పనికి వచ్చేవాళ్ళు. బాగా డబ్బు సంపాదించరా, అమెరికా వెళ్ళరా, డాలర్లు పట్రారా అనే తండ్రి తండ్రికాదు. మార్కులు బాగా రావాలి, నువ్వు EAMCET pass అయిపోవాలి, MBBS కాని, Engineering కాని చదవాలి, డబ్బులు సంపాదించాలి. పొలాలు, స్థలాలు కొనాలి, ఇల్లు కొనుక్కోవాలి. పెళ్లి చేసుకోవాలి. పిల్లల్ని కనాలి అనేటువంటి తండ్రి, తండ్రి కాదు. వాడేం తండ్రి? వాడేం నాన్నమ్మా? అన్నట్లుగా ఉంటుంది. ఎవడు తండ్రి అంటే *"తండ్రి..హరి చేరుమనియెడి తండ్రి తండ్రి"* పుట్టంగానే అసలు మనం ఎవరి నుండి దిగి వచ్చామో, వాణ్ణి చేరమని చెప్పేవాడు తండ్రి. అలాంటి తండ్రి దొరికితే అదొక అదృష్టం. అంతేగానీ ఈ డబ్బులు గోల, ఈ పిచ్చిగోల, ఈ ప్రపంచంలో ఉండే అశాశ్వతమైన విషయముల యందు ఆసక్తి గొనమని చెప్పేవాడు తండ్రి కాదని భాగవతం చెప్తోంది. అలాగే గురువు కూడా!

ఈ మొత్తం విశ్వమునకు ఆధారమైనటువంటి తత్త్వమేదైతే ఉన్నదో ఆ తత్త్వమును నీకు తెలియపరిచి, దాన్ని నీకు పరిచయం చేసి, అది నీయందు ఎట్లా ఉన్నదో నీకు తెలిపి, దానియందు నువ్వు ఏ విధంగా అనుసంధానం చెందాలో, తెలిపేవాడు గురువు. నీయందే అంతా ఉన్నది, సమస్తం ఉన్నది. ఈశ్వరుడు నీయందే ఉన్నాడు. అందుచేత గుణములకు ఆవల నీవు ఈశ్వరుడవే, గుణములకు ఈవల నీవు జీవుడవే. అందుచేత నీవు మనసు నుండి అంతర్లోకములలోకి ప్రవేశించి గుణములకు అతీతమైన, దివ్యమైన, శుద్ధమైనటువంటి, సత్ చిత్ తత్త్వముతో కనుక మనం

మనసు లగ్నం చేశామనుకోండి, అది ఈశ్వరానుసంధానము అంటారు. ఎందుకంటే ఆయన ఈశ్వరుడు, ఆవిడ ఈశ్వరి. ఇద్దరూ వేరుకాదు, ఒకటే. అది అవినాభావముతో కూడినటువంటి సత్ చిత్ చైతన్యం. సత్యము, చైతన్యము. చైతన్యము సత్యము లోనికి ఇమిడిపోతూ ఉంటుంది, సత్యము లోంచి బయటకి వస్తుంది, అందుకని సత్యము లోనికి ఇమిడిపోయినప్పుడు ప్రళయము అయిపోతుంటుంది. సత్యము లోనుండి బయటకి వస్తే క్రమంగా ఆ శుద్ధచైతన్యము నుండి అష్టప్రకృతులతో కూడిన సృష్టి ఏర్పడుతూ ఉంటుంది. అది మనకి ప్రతినిత్యం జరుగుతూ ఉంటుంది.

పొద్దున్నే లేవంగానే చైతన్యము వికసించడం చేత మనకి మనం ఉన్నాం అని తెలుస్తోంది. లేకపోతే ఏమీ తెలీదు. మనం ఉంటాం గానీ ఉన్నాం అని తెలీదు కదా! నిద్రలో ఉంటాం గానీ ఉన్నాం అని తెలీదు. ఉన్నాం అని తెలీదు కానీ నిద్రపట్టకపోతే చాలా పీకులాడుకుంటాడు జీవుడు, కదా! పదకొండు అయిపోయింది నిద్రపట్టలేదు. పన్నెండు అయిపోయింది నిద్రపట్టలేదు. ఒంటిగంట అయిపోయింది నిద్రపట్టలేదు. ఆందోళన వచ్చేస్తుంది. నిద్రపట్టలేదే అనే ఆందోళన ఎందుకు వస్తుందంటారు జీవుడికి? ఎందుకంటే నిద్రలో తన స్వస్థానానికి వెళ్ళిపోతాడు. ఈ మనస్సు, ఇంద్రియములు దాటి, బుద్ధి దాటి ఆత్మకూడా తన మూలమైనటువంటి పరమాత్మలో ఐక్యం చెందేటువంటి ఒక సన్నివేశం నిద్రలో ఉంది కాబట్టి నిద్ర కోసం తపన చెందుతుంటాడు జీవుడు. నిద్ర కల్పించేది కాని, నిద్ర నుండి మేల్కొల్పేది కాని మధ్యలో ఒకటి ఉన్నది, జీవుడికీ దేవుడికీ మధ్య! దాన్నే చైతన్యము అన్నారు. తల్లి, అమ్మవారు అన్నారు.

చైతన్యము బాగా కదలిక కలిగి ఉన్నప్పుడు నిద్రలోకి వెళ్ళలేరు. నువ్వు చైతన్యం అనుగ్రహిస్తేనే నిద్రలోకి వెళ్తావు. చైతన్యం అనుగ్రహిస్తేనే నిద్రలోంచి బయటకు వస్తావు. నిద్రలో ఉన్నప్పుడు ఎట్లా ఉన్నావో నీకు తెలియదు. చైతన్యవంతుడ వయినప్పుడు, నీవు చైతన్యవంతుడవు అవగానే అప్పటికే నీయందు రెండు గోచరించాలి నీకు. ఏది? నేనున్నాను, నేను మేల్కొంచి ఉన్నాను. నేనున్నానని తెలియడానికి ఒక ఎరుక ఉండాలి కదా! ఉండడం బట్టి కదా నేనున్నానని తెలుస్తోంది. అందుచేత ఆ ఎరుకనే మనం చైతన్యము అంటూంటాం. మనం లేవంగానే మనం ఎక్కడ నుండి లేచాం అనే ప్రశ్న. అసలు మనం ఉన్నాం అని మనకు ఎవరు చెప్పారు. ఒకడు చెప్పాలా మనకు మనం ఉన్నాం అని? మరి నిద్రలో నువ్వు లేవుగా! ఉన్నట్టు అనుభూతి లేదుగా! అందుచేత ఈ రెండూ కలిగిస్తున్న వాళ్ళే మనలో ఉన్న ప్రకృతిపురుషులనండి, రాధాకృష్ణులనండి, శివశక్తులనండి, లక్ష్మీనారాయణులనండి, ఏదో పేర్లు ఎలా అయినా పెట్టుకోండి, అది male – female principle. మనకు సృష్టిలో దైవం అంటే వీరిద్దరూ కలిసి ఉన్నటువంటి స్థితియే దైవం! సృష్టిలో దైవం, అది ప్రకృతి కాదు, పురుషుడు కాదు, రెండూ కలిసి ఉన్న స్థితి. ఆ రెండూ ఏకకాలంలో కలిసి ఉండడం చేత అక్కడి నుండి సమస్త సృష్టి ప్రకృతి నుండి ఏర్పడుతూ వస్తూ ఉంటుంది. అందుచేత మనకి ఇలాంటి ప్రకృతి నుండి ప్రతినిత్యం మేల్కొంచుతూ ఉన్నాం కాబట్టి, మనలో ఉండే ఈశ్వరుడితో మనం అనుసంధానం చెందడానికి ప్రయత్నం చెయ్యాలి.

ఆ ప్రకృతి పురుషతత్త్వం నుండే త్రిమూర్తులేర్పడ్డారు. ఆ త్రిమూర్తులు, త్రిశక్తులు ఆధారంగానే సృష్టి అంతా ఏర్పడి పోయింది. ఇది, ఏడు లోకాలకి ముందు ముగ్గురున్నారు. వాళ్లను కూడా కలుపుకుంటే పది. వాళ్లకు పైన ఇంకో జంట ఉంది. వాళ్ళకి మీరు పేర్లు ఏది పెట్టుకున్నా, సత్ చిత్ స్వరూపం అది. అందుకనే గురు మార్గంలో, యోగ మార్గంలో, సచ్చిదానంద స్వరూపుడు అంటారు. ఆ సత్ చిత్ స్వరూపం సదా ఆనందంగానే ఉంటుంది. అలాంటి స్వరూపం మనకి ప్రాతిపదికగా (foundation) ఉంది. అది మన foundation. ఇప్పుడు ఈ building foundation అంటే తవ్వి చూస్తే కనిపిస్తుంది కదా! మనిషికి foundation సహస్రారము నందు ఉంది. అందుకనే లలితా సహస్రనామం చిట్టచివరికి ఏం చేస్తారంటే అక్కడికి చేరిపోయింది అమ్మవారు అని చెప్పేస్తాం కదా! *"శ్రీశివా శివశక్త్యైక్యరూపిణీ లలితాంబికా"* అంటాం కదా! ఇక్కడిదే. అంటే ఇదంతా తానే వ్యాప్తి చెంది ఇన్ని లోకాలను ఏర్పాటు చేసి, పరిపాలిస్తూ, ఎక్కడా ఆయనతో విడిపడకుండా అన్నిచోట్లకీ ఆయన్ని తెచ్చుకుంటుందిటండీ! ఆవిడతో పాటే ఆయన దిగి వచ్చేస్తాడు. కాబట్టి, మనం ఉదయం నిద్ర లేవంగానే అక్కడ ఉన్న పార్వతీపరమేశ్వరులు అదే! అక్కడెక్కడో కైలాస పర్వతం మీద శివపార్వతులు కూర్చుని ఉన్నారంటే.... నీ కైలాస పర్వతం నీ నెత్తిమీదే ఉందనుకోవాలి. వాళ్ళిద్దరూ తలోపాదం అలా కిందకు పెడతారు, రెండు పాదాలుగా దిగివచ్చినట్టుగా దర్శనం చేసుకున్నావనుకో, పేర్లు పెట్టుకుంటే ఒక ఇబ్బంది ఉందండి.

నేను గమనించిందేమిటంటే, నేను వైష్ణవపరంగానూ చదివాను, అమ్మవారిపరంగానూ చదివాను, శైవపరంగానూ చదివాను, తత్త్వపరంగానూ చూశాను. జ్వాల్‌కూల్ మహర్షి ఒకమాట చెప్పారు. ఇవన్నీ ఇన్ని పేర్లు పెట్టుకుంటే తికమక అయిపోతావురా, అసలు విషయం గ్రహించు అన్నాడాయన. అందుకనే ఆయన పేర్లు పెట్టడం మానేసి కొత్తపేర్లు ఇచ్చాడు. అవీ పేర్లైపోతాయి మళ్ళీ. కాలక్రమంలో ప్రతీదీ పేరైపోతుంది కదా! కానీ పేర్లు పట్టుకుని తత్త్వం వదిలెయ్యకూడదు. పేర్లు ఆధారంగా తత్త్వం తెలుసుకుని, తత్త్వం పట్టుకుని పేర్లు వదిలెయ్యాలి. లేకపోతే లక్ష్మీనారాయణులు వేరు, ఉమామహేశ్వరులు వేరు ఇలా అనిపిస్తుంటుంది కదా! వాణీహిరణ్యగర్భులు, శచీపురంధరులు, సీతారాములు, అరుంధతీవశిష్ఠులు, అదే తత్త్వం అలాగే! అదే ఇక్కడా దిగి ఉంది. అదే ఇది. అంతా వ్యాప్తి చెంది ఉంది. నీలో ఉనికి, ఎరుక మొత్తం వ్యాప్తి చెంది ఉందండి. ఉనికిని శివుడంటాం. శివుడంటే మరి నారాయణుడు కాదా అనవచ్చు. నారాయణుడంటే, అదే ఇలా దిగివచ్చి, ఇలా పైకి వెళ్ళిపోతుందని చెప్పారు అర్థం. సరే మనకి పేర్లు వద్దులెండి. విషయం ఏమిటంటే నీలో నీవు ఉన్నావు, అనేటువంటిది నీకు సత్యం.

నువ్వున్నావా లేదా అని మనం ఎవర్నన్నా అడిగితే అదేం ప్రశ్నండీ? అని అడుగుతారు ఎవరైనా, అంతేనా! నువ్వున్నావా? అని అడిగావనుకోండి, విన్నాడా? వింటాడు కదా! దేనివల్ల వింటున్నాడండీ? నిద్రపోతున్న వాడినడిగితే వింటాడా? నిద్రపోతున్నవాడిని ఏరా నువ్వున్నావా? అంటే ఉన్నాడో లేడో

వాడికే తెలీదు కదా! మేల్కొనివున్న వాడిని ఉన్నావా అంటే వింటున్నాడా? దేనివల్ల వింటున్నాం? చెవివల్ల వినటంలేదు. చైతన్యము వల్ల వింటున్నాం. చెవి ఉండి చైతన్యము లేదనుకోండి ఉపయోగం ఏం ఉంది? దేనిద్వారా సమస్తం దర్శిస్తారో ఆ కన్నుకి దర్శనం ఇచ్చేటటువంటి దాన్ని దర్శనం చెయ్యలేదని చెప్తుంటాం. నీలోంచి చూచేవాడిని నిన్ను నీకు చూపించలేదు కన్ను, అని చెప్తుంది ఉపనిషత్తు. కన్ను చూపించ లేదు. చెవి తనను తాను గ్రహించలేదు కదా! అందుచేత ఇవన్నీ ఉపకరణములుగా మనకి ఇక్కడ పనికి వస్తూ ఉంటాయి. ఏం సార్ బావున్నారా! అంటే అలా నవ్వుతాడు ఒకసారి. ఆ నవ్వులో వెయ్యి అర్థాలు ఉంటాయి కదా! మీరూ నవ్వేస్తారు. ఎందుకంటే మీకూ తెలుసు. మీకూ బాగోలేదు, వాడికీ బాగోలేదు. ఇద్దరికీ బాగోలేదు. బాగుండే కాలం కలికాలం ఎందుకవుతుందండి? అవ్వదు కదా! కాలధర్మం తెలిస్తే ఇలాగే ఉంటుందని నిర్ణయం చేసుకున్నారనుకోండి, అప్పుడు బాగుంటుంది. కాలధర్మం ఒకటి ఉంటుంది కదా! ఈ కాలంలో బాగుంటుందిటండీ? బాగుండడం అనేది ఏం ఉండదు అని తెలిసిందనుకోండి, అప్పుడు బాగుంటాడు వాడు. అంటే పరిస్థితులతో సంబంధం లేకుండా బాగుండటం అనేది ఎవరికి ఉంటుందంటే కాలధర్మం తెలిసినవాడికి. ఈ లోపల వయోపరిమితి ఒకటి వచ్చేస్తూ ఉంటుంది. దానికో ధర్మం ఉంటుంది. ఇట్లా కాలధర్మం, దేహధర్మం, దేశధర్మం– ఇవన్నీ మనకి తెలిశాయనుకోండి, ఉన్నంతలో చాలా బాగుందనిపిస్తుంది. అసలు ఎందుకిదంతా వచ్చింది, ఈశ్వర అనుసంధానం.

ఈశ్వరుడికి englishలో పేరు ఏమిటో తెలుసా? Master అని. Namaskaram Master అన్నాం అనుకోండి. ఎవర్ని పిలిచినట్టు నువ్వు? ఏమో మనకి తెలీదు. ఎవర్ని పిలుస్తున్నామో తెలియకుండా పిలవటం చేత వాడు పలకడు. వీడు నన్ను పిలవట్లేదు అనుకుంటాడు వాడు, కదా! “Master Namaskaram” అని కదా మంత్రం ఇచ్చారు Master CVV గారు. ఆ తర్వాత “Master EK Namaskaram”, “Master MN Namaskaram” అన్నీ పలుకులు పలికేస్తాం. చిలక పలుకులు కదా! అసలు ఈ “Master Namaskaram” ముందు ఎందుకు వచ్చింది? దేని గురించి వచ్చింది? దేన్ని ఉద్దేశించి వచ్చింది అది? చెప్పండి? దేన్ని ఉద్దేశించి ఇచ్చారండీ Master CVV గారు? దేన్ని ఉద్దేశించి దాన్ని మన మాస్టరుగారు మనకందించారు? దాని గురించి ఎప్పుడన్నా ఆలోచించారా? అస్సలు బొత్తిగా ఏం ఆలోచించకుండా అలా మనం routine గా నడిపిస్తూంటాం అన్ని విషయాలు కదా! అందుకని మన మాస్టరుగారు ఈశ్వర అనుసంధానం ఇచ్చారా లేదా? ఇవ్వకపోతే సద్గురువు కాలేడు. గుర్తుపెట్టుకోండి. *“శ్రీకైవల్యపదంబు చేరుటకునై”* కదా యిదంతా! మనలో ఉండేటటువంటి దైవాన్ని మనం చేరడం కోసమే ఈ ప్రయత్నం అంతా. మనలో ఉన్న దైవాన్ని మనం చేరితే ఆ దైవం సమస్తం వ్యాప్తి చెంది ఉన్నాడు కాబట్టి, యింకేముంది? సమస్తం చూపించేస్తాడు మనకి కదా! మనలో ఉండే దివ్యకేంద్రం మనం చేరుకున్నామనుకోండి అక్కడి నుండి ఆయన దివ్యత్వం అంతా మనకి అనుభూతి అవుతూ ఉంటుంది.

చేసుకున్నవాడికి చేసుకున్నంత అంటాం కదా! అలా అనుభూతి అద్భుతంగా జరుగుతూ వుంటుంది. అనుభూతి అలా రోజుకొక రకంగా చూపిస్తూ వుంటాడు దైవవిలాసం, దివ్యానుభూతి.

కారాగారంలో వున్న దేవకీ–వసుదేవులకి రోజూ రకరకాల అనుభూతులు కదా! ఏదీ, అష్టమ గర్భం ఆవిర్భవించి వుండటం చేత ఆ సందర్భములో! వాళ్ళకి జైలులో వున్నామే అన్న ఏడుపు లేనేలేదు. ఎన్ని దివ్యానుభూతులండీ? అన్నీ రాయలేరు కదా, కొన్ని మనకి రుచి కలుగుతుందని రాసిచ్చారు. అద్భుతంగా వుంటాయి, అందులో ఏమీ సందేహంలేదు. చదువుకుంటే ఈనాటికి, ఎంత బావుంటుందో. మరీ మనకి చికాకుగా వుందనుకోండి, దేవకి అష్టమగర్భం ధరించినప్పుడు కలిగిన అనుభూతులు, ముందు మాస్టరుగారు 'పురాణ పురుషుడు'లో ఇచ్చినవి చదువుకోవాలి. అటుపైన దశమ స్కంధం 'భాగవతం'లో పోతనామాత్యుడు బాగా రుచిగా వర్ణించి ఇచ్చినవి చదువుకోవాలి. అలా చదువుకుని వాటిమీద మనం బాగా మనస్సును లగ్నం చేశామనుకోండి, అప్పుడు మనకి అనుభూతికి కొంత అవకాశం మనసులో ఏర్పడుతుంది.

అందువలన ఈశ్వరానుసంధానం అనేటువంటిది ప్రతినిత్యం మనకు జరిగి, ఆ ఈశ్వరుడే మనయొక్క సమస్త కోశములందూ వ్యాప్తి చెందియున్నాడు పురుష, ప్రకృతి ప్రజ్ఞగా. స్త్రీ పురుష ప్రజ్ఞగా. మొత్తం అతనే వ్యాప్తి చెందియున్నాడు. మనం వున్నామనుకోవటం చేత అనుకోనిస్తున్నాడు. ఎందుకంటే

మనయందాయనకి ఆ వాత్సల్యం వున్నది. మనయందు, జీవుల యందు దేవునికి ఉన్న వాత్సల్యం ఇంతా అంతా కాదు. ఇదంతా ఆయనదే, అంటే ఏమిటి? ఈ శరీరమంతా, ఇందులో వున్న సమస్త కోశములూ ఆయనవే! సమస్త ప్రజ్ఞలూ ఆయనవే! అన్నీ ఆయనవే! అవి మనవి అని మనం అనుకుంటే? తల్లి తండ్రులు ముచ్చట పడతారు కదా! తండ్రి కారు ఇంటికి పట్టుకొస్తే, కొడుకు నాదీ కారు అన్నాడనుకోండి. తండ్రి, నీది కాదు నాది, అంటాడా? అంటే వాడు మూర్ఖుడు, ఏమీ సందేహంలేదు. వాడు చిన్నపిల్లాడు, వాడికి తెలీక అంటున్నాడు. పెద్ద అయితే వాడికే తెలుస్తుంది. ఈ కారు వాడిది కాదు అని, అంతేగా! కానీ మనం పెద్ద అవ్వట్లేదు– అదే వచ్చిన గొడవ. మనం అలా వుండిపోయాం. పెద్ద అయితే మనకి ఏమి తెలియాలంటే, ''ఏదీ మనదికాదు, అంతా వాడిది'' అని తెలియాలి. మనం అన్నీ మనవే అనుకుంటున్నామంటే, బాగా అంతకంతకీ, అంతకంతకీ, అంతకంతకీ చిన్న అయిపోతూ వుంటాం. అందుచేత వీళ్ళందరికీ ఎవరో ఒకరు చెప్పేవాళ్ళు వుండద్దండీ? వుండాలా? ప్రతిదీ నాది, నాది, నాది అనుకునే వాడికి చెప్పేవాడు లేకపోతే పాడైపోతాడు వాడు.

అందుకనే ఆయనే చెప్పేవాళ్ళని కూడా కొంతమందిని తయారుచేసి పంపించేశాడండి. వాళ్ళే సనకసనందనాది మానస పుత్రులు, నారద మహర్షి, సప్తఋషులు– ఇలా ఒక పరంపర ఏర్పడింది కదా! ఈ సప్తఋషులే మళ్ళీ గోత్ర ఋషులు కూడా చాలా మందికి. వాళ్ళే ప్రజాపతులు. వారినుంచే ఇదంతా పుట్టుకొచ్చింది కదా! *"ప్రజాతంతుం మా వ్యవచ్ఛేత్సీః"* అని చెప్పేశాడుట

బ్రహ్మదేవుడు. ఇంక అదే పనిగా పంపించేశారు బయటికి. మనుష్యులందరం ఎంతోమంది వచ్చేశాం మనం. అందుచేత ఇలా వచ్చినవాళ్ళందరికి ఎవళ్ళో ఒకళ్ళు చెప్పాలికదా. అందుకే చిన్న పిల్లల్ని ఐదేళ్ళకల్లా ఇహ వీడికి చెప్పటం మొదలుపెట్టాలనే, స్కూళ్ళు పెట్టారు. అప్పటి నుంచి అక్షరవిద్య. అంతకుముందో? వాడేమి అడిగితే అది. ఐదేళ్ళు వచ్చేసరికి వాడికి క్రమముగా ఏది నీది, ఏది నీది కాదు. తెలుసుకోవడం మొదలు పెడితే, ఏదీ మనదికాదు అని తెలుస్తుంది. ఏదీ మనది కాదు. అంతా ఇచ్చినదే. నువ్వూ వాడే! వాడే నువ్వుగా ఉన్నావు. ఇలాంటి సత్యాలు ఎవరు చెప్తారండి? అలాంటి సత్యం దర్శనం చేసినవాడే చెప్పగలడు. అందరూ చెప్పలేరు కదా! అలాంటి సత్యదర్శనం చేసిన వాడిని పంపిస్తాడు.


వాళ్ళేం చెప్తారు? నీలోనే ఈశ్వరుడున్నాడు! “May the light in me be the light before me.” మనలో light వుందనేది కూడా మనకి తెలీదు. ఎప్పుడూ వేసుకోం. Switch ఎక్కడుందో తెలీదు. Switch వేసుకోవాలి కదా! Switch వేసుకుంటే light వెలుగుతుందని మనకి ఇప్పుడు తెలిసింది. ఏదైనా దీపం వెలిగించుకోవాలిగా! అసలు దీపం నీలో సహజంగా వున్నది. బయట దీపాలు ఎన్ని వెలిగిస్తే ఏమి లాభం. అది వెలిగించినప్పుడు లోపల ఎప్పుడు వెలుగుతావ్? అని అడగాలి దానిని. నువ్వు బయట వెలిగావు బావుంది, లోపలకూడా వెలిగించే అవకాశం, ఆ ప్రయోజకత్వం నాకు కలిగించు అని

కోరుకుంటూ వుండాలి. *"ఉద్దీప్యస్వ జాతవేదో"* అని మనం ఎంత "ఉద్దీ" అని గట్టిగా ఒత్తిపట్టి పలికినా, చదివేస్తే అయిపోయిందా లోపల వెలగాలికదా! చదవకపోయినా లోపల వెలిగితే? ఇన్నిసార్లు చదివినా వెలగకపోవటం ఒకటి, చదవకుండానే అలా తలుచుకుంటే లోపల వెలిగిందనుకోండి దీపం, వుండచ్చు. ఇలా నీలో వుందని చెప్పేవాడొకడు కావాలి కదండి! వాడు "గురువంటే!". వాడి వెంటపడి పొమ్మని ఎక్కడా చెప్పలేదు! మీరు మన ఋషుల కథలన్నీ చూసుకోండి, ఒక ఋషి దగ్గరి నుంచి ఒక ఋషి విషయం పొందిన తరువాత ఆయన తపస్సు చేసుకుంటాడు. ఇహ ఈ ఋషి వెంట తిరుగుతూ ఈయన చంకలో ఆయన సామాను పట్టుకుని తిరుగుతూ వుండటం అంటూ ఏమీ వుండదు. ఈ పిచ్చి గోలంతా ఈ ప్రపంచంలో మొదలైంది. అయిపోయింది. ఎందుకనీ? ఏమి చెప్పాడు గురువు? నీలో వుండే ఈశ్వరుడిని దర్శనం చేయమన్నాడు. నా కాళ్ళ మీద పడక, నీ కాళ్ళమీద నిలబడ మంటే అర్థం ఏమిటి? ఆయన చుట్టూ తిరిగితే ఏమి వస్తుంది? ఏమీ రాదు. ఆయన చెప్పినది చేస్తే వస్తుంది.

అందుచేత ఆవిధంగా మనకి లోరుచి ఏర్పడటానికి ఒక మార్గాన్ని మనకు గురుపరంపర ఇచ్చింది. మాస్టరు సివివి గారు, ''నీ లోతట్టున ఏమేమి జరుగుచుండునో గమనించుము'' అని చెప్పినట్లుగా వేటూరి ప్రభాకరశాస్త్రి గారు రాశారు. అది సత్యం. ఆయన ఆయనకేమి చెప్పారో వేటూరి ప్రభాకర శాస్త్రిగారు 'ప్రజ్ఞా ప్రభాకరం' నందు మనకి కనిపిస్తుంది. నీ లోతట్టున

ఏమేమి జరుగుచుండునో గమనించు చుండుము. గమనిస్తూ వుండటమనేది మనకు మార్గమైపోయింది. అంతే! గమనించడమే! అన్నీ, బయట విషయాలూ గమనించడమే, లోపల విషయాలూ గమనించడమే. అంతర్లోకములూ, బహిర్లోకములూ రెండిటినీ గమనించేటటువంటి వాడు సాక్షిగా మిగిలిపోయి తదతీతంగా వుంటాడు. వాడే బ్రహ్మము! బ్రహ్మము అంతర్లోకములకూ అతీతమే! బహిర్లోకములకూ అతీతమే! రెండూ ఒక దానికి ఒకటి పోటీగా పెట్టి వుంచాడని చెప్తుంది విష్ణు సూక్తము. *"పరోమాత్రయా తన్వా వృధాన"* అంటూ అట్లా వెలుగు లోకాలు, ఇట్లా మట్టి లోకాలు రెండూ, ఒక దానికి ఒకటి పోటీగా పెట్టి వుంచి నడిపించేస్తున్నావు నువ్వు, ఎంత మహిమ అయ్యా నీదని మొదలవుతుంది విష్ణు సూక్తము.

మనకి compass ఇస్తారు చిన్నప్పుడు. దానికి రెండు కాళ్ళు వుంటాయి. రెండు కాళ్ళకి పైన ఒక తలకాయ వుంటుంది. ఈ తలకాయ రెండు కాళ్ళనీ అధిష్ఠించి వుంటుంది. ఒక కాలు అంతర్లోకాలు. ఇంకో కాలు బహిర్లోకాలు. రెండిటినీ అధిష్ఠించి వున్నాడు. అందుచేత, నిన్ను బ్రహ్మన్ని చేరుస్తానని మాస్టరుగారు అన్నారంటే, నువ్వు బహిర్లోకముల లోంచి అంతర్లోకముల లోకి ప్రవేశించి అంతర్లోకములనుకూడా గమనిస్తూ... గమనిస్తూ వుంటే, గమనిస్తున్నవాడిగా వాటి నుంచి నువ్వు విడిగా చూస్తూవుంటావ్, సినిమా చూస్తున్నట్టు. అలా అనేకానేకమైన లోకములు దర్శనం చేయవచ్చు.



కాని ఏమి జరుగుతుందంటే చిట్ట చివరికి గమనించేవాడివిగా బహిరంతర లోకములనుండి కూడ విముక్తడవై అక్షరమైన బ్రహ్మముతో కూడి ఉంటావు. నీ చుట్టూ జరిగే events నిన్ను ముట్టుకోవు. వాటిని నువ్వు గమనిస్తూ వుంటావు. అందులో నీవు నిర్వర్తించ వలసినటువంటి కర్తవ్యకర్మ ఒకటి వుంటుంది, అది నువ్వు నిర్వర్తిస్తూ వుంటావు, నువ్వు అలానే వుంటావ్. అది లోపలైనా అంతే, బయటైనా అంతే. ఇహ ఆయనేమీ ముట్టుకోడు. మడి అంటే అది. పనివుంటే అలా పనివరకు చూసేసి మళ్ళీ లోపలికి వచ్చేస్తాడు. పనిలేని చోట ఊరికే చేతులెయ్యడం వుండదు. ఇప్పుడు ఒక పువ్వు వుందనుకోండి, మొక్కంతా పాడుచేయ నక్కరలేదు కదా పూవుని తీసుకోవడానికి. సున్నితంగా ఆ పూవు మేరకు తీసుకోవచ్చు. అలా ప్రతి సన్నివేశంలోనూ నీవు నిర్వర్తించవలసినది సున్నితంగా నిర్వర్తిస్తూ, సుకుమారంగా నిర్వర్తిస్తూ, తదనుభూతి పొందుతూ, మళ్ళీ తాను తనలోకి వెళ్ళిపోయి.... చెప్పారుకదా "Horizontal meet verticles, verticles reach you to the truth levels. The pole is solar soul is lunar" ఏవో చాలావున్నాయి అద్భుతమైనవి ధ్యానానికి. As souls we are lunar but as poles we are solar. నీలో ధ్వజస్తంభం వుంది పైనుంచి కిందవరకు. దానిలోకి వెళ్ళిపోయావనుకో అప్పుడు అర్థముందండి. అపుడు నీవు ముక్తుడవు.

ఆయన లోపలికి వెళ్ళిపోయారండి ఇప్పుడు రారు అంటారు కదా! ఇంతసేపూ ఇక్కడే వున్నారు, గురువుగారు లోపలికి వెళ్ళిపోయారు ఇంక రారు, చెప్పండి సార్! అంటే, తిడతారని

చెప్తారు. లోపలికి వెళ్ళిపోవటంలో అర్థమేంటీ? ఇంక బయట ఏమీ లేదాయనకి. మళ్ళీ ఆయనే బయటకి వస్తారు. అప్పుడు బయట అంతా పూసుకుంటాడు. ఆ పూసుకున్నదంతా బయటే వదిలేసి, లోపలికి వెళ్ళిపోతాడు. ఈ బయట పూసుకున్నదంతా లోపలికి పట్టుకుపోతే లోపలంతా పాడైపోతుంది కదా! అందుకేగా చెప్పులు బయట వదిలేస్తాం. చెప్పులు వదిలేసినట్టు వదిలేయాలండి బయటనుంచి లోపలికి వెళ్ళేటప్పుడు, బయట విషయాలు. ఇలాంటివన్నీ నేర్పే సద్గురువు ఒకడు వున్నాడనుకోండి. మరి అంతకన్నా కావలసింది ఏముందండి? లేదుకదా! అందుచేత ఆయనేం చెప్పాడంటే "ఈశ్వరనుసంధానం" అని చెప్తాడు. ఏ సద్గురువైనా ఇంకొకటి చెప్పటానికి లేదు. శుకమహర్షి అంతటివాడు భాగవతం చెప్పాలన్నా *"ఈశ్వరానుసంధానము కల్పించుకొని",* అని మొదలుపెడతాడు. అంతేకానీ మా father వేదవ్యాసుడు అట్లా చెప్పుకోలేదు. వేదవ్యాసుడేమిటి? father ఏమిటి? రెండూ ఏమీలేవు. జీవుడికి ఒకడే మొగుడు. వాడే తండ్రి. వాడే సమస్తం. వాడే స్వామి, వాడు దేవుడు. ఇంక మిగతా వాళ్ళందరూ జీవులే. అందుకనే Father-hood of God and brother-hood of souls అన్నాడు.

అలా కల్పించుకుంటే ఏమి జరుగుతుందంటే, ఈశ్వరుడు సరాసరి, నీకు ఈరోజు నువ్వు నిర్వర్తించు కోవలసిన కార్యక్రమాన్ని, నీకు తెలియపరిచే అవకాశం వుందండి. ఎందుకని అంటే, ఆయన చేతుల్లోనే అంతా. ఈశ్వరుడంటే చెప్పారు, "సత్

చిత్ స్వరూపము" అని. ఆ సత్-చిత్ స్వరూపము ఆధీనంలోనే, బ్రహ్మ – విష్ణు – మహేశ్వరులు, సరస్వతి – లక్ష్మి – పార్వతులు వుంటారు. ఈ త్రిభుజం, ఆ ద్వయం. ద్వయం కాదు అది ఏకమే. ఒకటే మూడవుతుంది. ఒకటే అది. మన అవగాహన కోసం రెండుగా చెప్పుకుంటాం కాని, అది ఒక్కటే. ఆ ఒక్క దానిని, దానితో అనుసంధానం చెందటానికే మరి ఆ ప్రార్థన. అక్కడి వరకూ పట్టుకుపోతాడు గురువుగారు మనని. చాలా గొప్ప విషయం. అక్కడ కూర్చోపెడతాడు. మాస్టరు సన్నిధి అంటే అది. నీలోని మాస్టరు సన్నిధికి నీవు జేరితే, ఆ మాస్టరు నీకు ఒక్కడికే మాస్టరుకాదు, సృష్టి మొత్తానికీ మాస్టరే.

సృష్టి అంటే, మన రాష్ట్రం, మన దేశం, మన గోళమే, మన సూర్యమండలమే అనుకోబోకండి. ఏది ఇన్ని సూర్యమండలాలకీ మూలమో అది. మన పెద్దలేం చెప్తారు? 5 junior సూర్య మండలాలు, 7 senior సూర్యమండలాలు – 12 సూర్యమండలాలు ఒక గుంపు అని చెప్పారు. అది group life. పన్నెండు. దానిని అధిష్ఠించి ఒకడు వుంటాడు, పదమూడు. పదమూడు bad అనుకోకూడదు. అది దురదృష్టమైన అంకె అనుకుంటారు. అది కాదు. మన వాఙ్మయములో పదమూడు అత్యద్భుతమైన సంఖ్య. మన తరువాత ఈ రహస్యం తెలిసింది ఒక్క jewsకే! యూదులకే! "The arc of coven" అని పెట్టుకుంటారు అక్కడి వాళ్ళు. పన్నెండు మంది శిష్యులతో ఒక గురువు కూర్చుంటాడు. ద్వాదశాదిత్యులు, దానికి ఒక మూలం

అట్లా! అట్లా పన్నెండు సూర్యమండలాలకి ఒక సవితృ మండలం. పన్నెండు సవితృ మండలాలకి ఒక భర్గోదేవ మండలం, దానికి మూలం. ఆ మొత్తం నుంచి ఇదంతా ఏర్పాటుచేసిన వాడు ఎవడైతే వున్నాడో, వాడక్కడెక్కడో వున్నాడనుకోవక్కర్లేదు. ఇక్కడ కూడా వున్నాడనవచ్చు. అది గొప్పతనం.

మామూలుగా మనకి ప్రపంచంలో అట్లా పైకి వెళ్ళిపోతుంటే వాడు చాలా దూరమైపోతాడు మనుషులందరికి! కదా Pyramidical structure కదా! మనము అనుకుంటాం. కాని దైవము అక్కడినుంచి అన్నిట్లోకి వ్యాప్తి చెంది ప్రతి చిన్న విషయంలో కూడా వుంటాడు. అది కదా గొప్ప విషయం. "సర్వవ్యాపి" అంటే, అన్నిట్లోనూ వ్యాప్తి చెంది వుంటాడు. మరి అతనికి తెలియనిది ఏముంటుందండి? సర్వవ్యాపి, సర్వజ్ఞుడు, సర్వ శక్తిమంతుడు – మూడు లక్షణాలు చెప్తారాయనకి. అలాంటివాడి చేతిలోనే వుంటాయి. ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులు. అమ్మవారు అధిష్ఠించి వుండగా అవన్నీ పనిచేస్తాయని కదా! అమ్మవారు, అయ్యవారిది. ఉత్త అమ్మవారు కాదు. ఎందుకంటే, అయ్యవారు లేని అమ్మవారు లేరు, అమ్మవారు లేని అయ్యవారికి పనే లేదు. అందుచేత అది అయ్య–అమ్మ. అమ్మయ్య అనాలన్నమాట.

నాకొక స్నేహితుడుండేవాడు అమ్మయ్య అని. తెనాలి వెళ్ళినప్పుడల్లా ఆయనే నాకు ఏర్పాట్లు చేస్తూవుండేవారు. అమ్మయ్య గారు. అమ్మ–అయ్య. లేకపోతే అయ్యమ్మ. ఎట్లా పిలిచుకుంటే ఏమిటండి? మనం ఎవరిని అయ్యమ్మ, అమ్మయ్య అంటున్నామో

వాళ్ళనే యూదులు యెహోవా అన్నారు. ఎవడికీ తెలీదు యెహోవా అంటే ఏమిటో. మనకి తెలీదు ఎలాగూ, వాడు ఆటో మీద రాసుకున్నవాడిని అడుగుతూంటాడు ఏంటి యెహోవా అంటే అని. ఏమో సార్! వాళ్ళుచెప్పారు రాసేశాను.... యెహోవా అంటే అర్ధనారీశ్వర తత్త్వం. "యెహోవా నా కాపరి" అని రాసుకుంటారు. సత్యమది. అందరినీ ఎవరు రక్షిస్తున్నారు, కాపాడుతున్నారు, పరిపాలిస్తున్నారు? ఆ స్త్రీ–పురుష శక్తే! అర్ధనారీశ్వర తత్త్వమే కదా! అందుకనే మనం "శివా" అంటే, అమ్మవారు, అయ్యవారు కలిసి. "శివ" అంటే అయ్యవారు. ''శివ" అని ఎప్పుడూ అనం మనం. ''శివా" అంటాం కదా! అట్లానే అన్నింటిలోనూ కూడా చూడచ్చులెండి.

ఏది మనకు ముఖ్యమంటే, అది మనయందు వుంది. దానిని మనకి దర్శనం చేయించటానికి సద్గురువు మన మధ్యకి వస్తాడు. మనం ఆయనని ఎలాంటి చొక్కాలు కొనుక్కోవాలి, ఎలాంటి లాగూలు వేసుకోవాలి, ఏమి చదువుకోవాలి? ఏమి తింటే బావుంటుంది? ఏ ఊరు వెళితే బావుంటుంది? మా అమ్మాయికి పెళ్ళి యెప్పుడవుతుంది? మా అబ్బాయికి ఉద్యోగమెప్పుడు వస్తుంది? ఇలాంటివి అడుగుతూవుంటాం. ఆయన ఏమి ఇద్దామనుకుని వచ్చాడో!!! అందుకనే, *"ఒక్కండున్ నీ మొరాలకించడు కురుష్వనాథ వీక్షింపంగన్"* అంటే, ఇలానే వుంటుంది. ఏది గురువుగారికి. ఒకడు కాకపోతే ఒకడు, ఒక్కడైనా అడగడే! పైగా చెప్తూ వుంటాడాయన సభల్లో. ప్రవచనాలన్నీ దానిగురించే చెప్తూవుంటాడు. దానిని చేరే మార్గాన్ని చెప్తూ వుంటాడు. అడిగేవన్నీ పిచ్చివే కదా!

అదలావుండగా అసలు విషయమేమిటంటే, ఆవిధంగా పొద్దున ప్రార్థన చేసుకుంటున్న సమయంలో, ఈ రోజున భీష్ముడి గురించి చెప్పుకుందామని ఒక భావన వచ్చింది. భీష్ముడి గురించి చెప్పుకుందామని భావన ఎందుకు వచ్చింది? అని అలోచిస్తే, ఇవాళ భీష్మ అష్టమి అని తెలిసింది. ఇప్పుడు చూడండి, మనకి భీష్ముడు, భీష్మ అష్టమి అని మనకి తెలియకపోయినా, మనలోని ఈశ్వరుడు మనకి భీష్ముడి గురించి చెప్పుకోమని చెప్పినట్టే కదా! అందుకని ఎవరైనా సరే, తమలోని ఈశ్వరునితో అనుసంధానం చెందితే, ఆ ఈశ్వరుడి నుంచే మనకి వలసినటువంటి సందేశములు వస్తూ వుంటాయి. నా programme, daily నాకు మాస్టరుగారి దగ్గరి నుంచే వస్తుందని మా మాస్టరుగారు అంటూ వుండేవారు. అట్లా అంటే మనం అనుకుంటాము, ఆయనకి M.N గారో, C.V.V. గారో చెప్తూవుంటారు రోజూ రాత్రి అని. మనకి అట్లా చెప్పే fecility లేదు కదా, కాబట్టి మనం ఇట్లానే వుందాం అనుకుంటాం. అట్లా M.N. లూ, C.V.V. లూ, ఇంకోళ్ళు, ఇంకోళ్ళు, చెప్పిరావడానికి వాళ్ళ పనులు వాళ్ళకు వుంటాయి. ఎందుకని? వాళ్ళు ఈశ్వరానుసంధానంలో వుండటం చేత వారికి ఈశ్వరుడు నిర్దేశించిన కార్యక్రమాలు వుంటూ వుంటాయి. ఆ కార్యక్రమాలు ఈశ్వరుడు వారి ద్వారా నిర్వర్తింపజేస్తూ వుంటాడు. అందుకని, ఒక శిష్యుడికి సద్గురువేమి చెప్తాడంటే 'నువ్వు కూడా ఈశ్వరానుసంధానం పొందు' అని. ఈ ఈశ్వరానుసంధానం పొందడానికే మనకి ఈ ప్రార్థన ఇచ్చారు. మరి ఆ ప్రార్థన మనం చేసుకోవడంలో భక్తి, శ్రద్ధ, ఒక నిష్ఠ, ఒక నిరంతరత్వం

ఇలాంటివి వుంటే లోపలి విషయాలు ఒక్కొక్కటీ, ఒక్కొక్కటీ, నేనే నేర్పుకుంటానని చెప్పారు కదా, గురువుగారు. సత్యం అది.

నాబోటి charted accountant ప్రపంచమంతా ఇన్ని విషయాలు చెప్పి– ఇంకా చెప్పు, ఇంకా చెప్పు అనే పరిస్థితిలో వుండడు కదా! లోపలి నుండి ఆవిధంగా ఏర్పాటు జరగబట్టి కదా చెప్తుంటే వింటున్నారు. వినకపోతే నేను మాత్రం ఎందుకు చెప్తాను? ఎవడివలన? వాడివలన కదా! మరి ఇవన్నీ ఎవడు నేర్పుకున్నాడు? వాడే నేర్పుకున్నాడు. మనదేం పోయింది? నేర్పుకుంటే నేర్చుకుంటా. నేర్పితే నేర్చుకుంటాము. అలావుంది మన పరిస్థితి ఇప్పుడు. నువ్వు చెప్పుకో నేను కూర్చుంటా అనే పరిస్థితిలో పెడతాడండి. నిర్లక్ష్యంగా కాదు. నేను మొన్న విశాఖపట్టణం నుంచి బయల్దేరి వచ్చినప్పుడు గొంతు లేదు. ఇంట్లోవాళ్ళు అడిగారు, గొంతు లేకుండ తణుకు వెళ్ళి ఏమి చెప్తారు అని. గొంతు వుంటే మాట్లాడతాను లేకపోతే మాట్లాడను. నేను బయలుదేరి వస్తాను అని చెప్పాను కాబట్టి వెళ్తాను. ఆ పైన దైవమొక్కడు లేడే! అంటాడు వసుదేవుడు. ఈ పూటకి నీకు పుట్టిన పిల్లలందరినీ ఇచ్చేస్తాను, చంపేసుకో అంటాడు. అంటే ఈ పూటకి ఆమెని వదిలేస్తాడు కదా! ఆ తరువాత దైవమొకడు లేడా? చూసుకుంటాడు కదా! అందుకని గొంతులేకుండానే తణుకు కూడా వచ్చేశాం. Almost గొంతు వుండీ వుండనట్టుగా ప్రార్థన చేశాం. తరువాత ప్రవచనం అన్నారు. చాలా మంది వచ్చేశారు. వచ్చేస్తే గొంతు కూడా వచ్చేసిందండి. దాని timeకి అది వచ్చేసిందంతే. మనం కావాలనుకుంటే రాదు

అది. మన గొంతు కాదు కదా! ఇది మన గొంతు కాదు అనేటువంటి విషయం మనకి ఎప్పుడో తెలిసిపోయింది.

1975వ సంవత్సరము, ఏప్రిల్ నెలలో అవధూత సరస్వతీ స్వామివారు మా ఇంటికి వచ్చారు రాధామాధవంలో వున్నప్పుడు. అప్పుడే ఒక రామాలయం ప్రతిష్ఠచేసి నేనూ, మా ఆవిడ ఇంటికి వచ్చాం. అక్కడికి వెళ్ళారాయన. ఎవరు ప్రతిష్ఠ చేశారంటే ఫలానా వారన్నారు. అమ్మమ్మమ్మ అని ఆయన మా ఇంటికి వచ్చేశారు. ఎందుకంటే మా నాన్నగారంటే ఆయనకి చాలా ఇష్టం. నువ్వు రామాలయం ప్రతిష్ఠ చేశావా, నాకు చాలా ఆనందంగా వుందయ్యా అంటూ వచ్చేశారు. సరే మేము చేయాల్సిన సపర్యలు చేశాం. ఆయనే నాకు హనుమంతుడి దీక్ష ఇచ్చారు చిన్నతనంలో. సరే అక్కడ మా పూజామందిరంలో మాస్టరుగారు కనిపించారు. Master E.K, Master M.N, Master C.V.V. ఆహా! ఈయన సాన్నిధ్యం లభించిందా అన్నారు. అంతేగాని ఈ మతం పుచ్చుకున్నావా అనలేదు. అవును అన్నాను. చాలా సంతోషించారు. నేను చాలా వింటున్నాను ఈ కృష్ణమాచార్యులవారిని గురించి అని అన్నారు ఆయన. మాస్టరుగారి కన్న ఆయన పదిహేనేళ్లు పెద్దవారు. ఆయన ఎలాంటి వ్యక్తి అంటే ఆయన పాడితే అట్లా దైవం అవతరిస్తాడు. గంటల తరబడి కీర్తన చేసి మనుష్యుల్ని స్ఫూర్తివంతం చేసి, అలా ఆరు దశాబ్దాలు జీవించారాయన. అద్భుతమైనటువంటి కంఠం. ''వీరిని చూద్దామనుకుంటున్నాను నువ్వు ఏమన్నా తీసుకొని వెళ్ళగలవా'' అని అడిగారాయన.

ఎవరు? అవధూతేంద్ర సరస్వతిస్వామి. మాస్టరుగారి దగ్గరికి నన్ను తీసుకువెళ్ళమని అడిగారు. తప్పకుండానండి, ఇప్పుడే వెళ్దాము పదండి అని అన్నాను. ఎప్పుడిది? మధ్యాహ్నం ఒంటిగంట. ఇప్పుడు ఫరవాలేదా అంటే, ఏదో మనకో ధైర్యం! ఫరవాలేదు. వెళ్ళాం. తీసికెళ్తే మాస్టరుగారు ఇంట్లో వున్నారు.

మనం వెళ్ళినప్పుడు మాస్టరుగారు ఇంట్లో వుండడం అనేటువంటిది మన అదృష్టం, అంతే కదా! ఆయన వుండవచ్చు, వుండకపోవచ్చు. ఆయన వెయ్యిగుళ్ళ పూజారి. చాలా మందికి దొరకరు కూడాను. కాని నేను గమనించింది ఏమిటంటే నీపని యొక్క ఆవశ్యకతను బట్టి ఆయన దొరకడం దొరకకపోవడం ఉంటుంది. ఆయన time పాడుచేద్దామని వెళ్ళామనుకోండి, ఆయన దొరకరు. వచ్చినాయన మహాత్ముడు, మాస్టరుగారిని చూద్దామనుకుంటున్నాడు. తీసికెళ్తే వున్నారు. వారిని వరండాలో కూర్చోబెట్టి లోపలికి వెళ్ళి, మాస్టరుగారూ ఇలా అవధూతేంద్ర సరస్వతి స్వామిగారు వచ్చారు అంటే ఆశ్చర్యపోయారు. హా! అన్నారు. అలాగా, ఏరి ఎక్కడవున్నారు? వరండాలో వున్నారన్నాను. వెంటనే వచ్చేశారు. వచ్చేసి మాస్టరుగారు సరాసరి ఆయన పాదాలకు దణ్ణం పెట్టేశారు. దణ్ణం పెడితే, ఆయనేం తక్కువవాడు కాదు, ఆయన మహాభక్తుడు, మహాయోగి. వెంటనే ఆయన మాస్టరుగారి పాదాలకు దణ్ణం పెట్టేశారు. దణ్ణం పెడితే మాస్టరుగారు అన్నారు "మీరు నాకు దణ్ణం?" అది ఈశ్వర స్వరూపం అన్నారు. పరిపూర్ణంగా ఈశ్వర స్వరూపం కనిపిస్తోంది.

ఇలా వచ్చారేంటి, అని అన్నారు మాస్టరుగారు. "మిమ్మల్ని చూద్దాం అనిపించింది, వచ్చాను" అన్నారు. చాలా సంతోషం అన్నారు, కొంచెం పాలు తెప్పించారు మాస్టరుగారు. ఆ తరువాత ఇంకొక చిన్నవిషయం అని అడిగారు అవధూతేంద్ర సరస్వతి. ఆయన ఏడేళ్ళ వయసు నుండి ఆయనకు 70 ఏళ్ల వయసు వచ్చేంత వరకు అలా గానం చేస్తూనే వున్నారు. ఏకాహాలు సప్తాహాలు.

*"హరేరామ హరేరామ రామరామ హరేహరే, హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణకృష్ణ హరేహరే."* ఈ కలిసంతారక మంత్రాన్ని ఎన్నిరకాలుగా పాడేవారో 24 గంటలూ. కొద్దిగా పాలు తీసుకోవడం, పాడేస్తూ వుండడం. అద్భుతంగా పాడేవారు. పాడటం మొదలుపెడితే ఒక ఐదునిమిషాల్లో ఇక ఆయన వుండేవారు కాదు. ఆయన నుండి అలా వస్తూ వుండేది గానం. ఆయన అడిగారు మాస్టరు గారిని, ఈ గాత్రం ఇప్పుడిప్పుడే కొంచెం ఇబ్బంది పెడ్తోంది, అన్నారు. అంటే మాస్టరుగారు ఏమీ మాట్లాడలేదు. నేను చూస్తున్నాను. మీరేదైనా హోమియో మందు వేస్తారేమో! అన్నారు. అంటే మాస్టరుగారు నవ్వారు.

మీ గాత్రం రాముడిది, మీది కాదుగదా! అది మీకు తెలుసు, నాకు తెలుసు. ఆ గాత్రానికి మందేమిటి? కృష్ణమాచారి ఆ గాత్రానికి మందు వేయటమేంటి? అలా ఏం ఉండదే, అన్నారు మాస్టారు. భక్తుల కథలు మీరు చదువుకోండి. ప్రభుదత్త బ్రహ్మచారి అనే ఆయన భాగవత కథలన్నీ రాసేశారు. అందులో "విదుర–మైత్రేయ సంవాదం" వుంటుంది. చదువుకుంటే

అలా మన మనస్సు కరిగిపోయి, హృదయస్థులు అవుతాము. అలా వుంటాయి ఆ సంభాషణలు. అంతలా మనకు కనబడదు పోతన రాసినటువంటి భాగవతం. భక్తి పారవశ్యంలో నుంచి అనేక విషయములు అలా పెల్లుబికి వస్తూ వుంటాయి. అలా మాస్టరుగారు, మీ గాత్రానికి హోమియో మందు వేసేటటువంటి వైద్యుడిగా నన్ను నేను గుర్తించడం లేదు అన్నట్టుగా మాట్లాడారు. వూళ్ళో అందరికీ మందులు వేస్తుంటారని పేరు వుంటుంది, హోమియో వైద్యం, సుప్రసిద్ధ వైద్యులు. ఇంతటి మహాత్ముడు కూడా నాచేత మందు వేయించుకున్నాడు... ఇలా వుంటాయి పిచ్చిపిచ్చి ఆలోచనలు కదా!

మన dispensaryకి వచ్చి ఎవరన్నా ప్రముఖుడు మందు వేయించుకున్నాడనుకోండి, వేయించుకుంటే ఆ వైద్యుడు ఇంక వూరంతా చెప్పుకుంటాడు. So వైద్యుడు చెయ్యాల్సింది ఏమిటంటే మొట్టమొదట ఎవరికీ చెప్పకూడదు. వైద్యుడు, ఆడిటర్, బ్యాంకరు– ఈ ముగ్గురు ఎవ్వరితోను ఏమీ చెప్పకూడదు. వాళ్ళది professional ethics. మాస్టరుగారికి తాను హోమియో వైద్యుడు అనే భావనే లేదు అసలు. నేను ఇది అని నిర్వచించుకొనిన వాడు జ్ఞాని కానే కాదు. నేను కవి అనుకుంటే జ్ఞాని కాదు. నేను రచయితను అనుకుంటే జ్ఞాని కాదు. నేను భక్తుడను అనుకుంటే జ్ఞాని, తెలిసినవాడు కాదు. నేను జ్ఞాని అనుకుంటే జ్ఞాని కాదు. నేను యోగిని అనుకుంటే నేను కాదు. ఏదనుకున్నా కాదు. **నీగురించి నీకు ఒక నిర్వచనం మిగిలివుంటే, నీవు తెలిసినవాడివి కాదు. మరి**

**నీవెవరవు? నేను నేనైన నేను. అంతే, అది ఒకటే సత్యం.** నేను నేనైన నేను, ఆ నేను ఎన్నిరకాలుగానైనా పనిచేయవచ్చు. అది సత్యం. మరి ఏమవుతుందంటే ఎప్పడూ ఒకేరకంగా పనిచేస్తూ వుంటే మనం అది అయిపోతూ వుంటాము ఊసరవెల్లి వలే. ఊసరవెల్లి కదా! అలాగ జాతకాలు చూస్తూ వున్నాం అనుకోండి, Astrologer అయిపోతూ వుంటాము. ఏమండీ మీరు Astrologer అంటే అవునేమో అనిపిస్తుంది కదా!

మాస్టరుగారి దగ్గరికి ఒక ఆయన నాయొక్క chart చూస్తారా అంటే, నేను Astrologer కాదు అని చెప్పారాయన. అదేమిటి మా friend చెప్పాడు అంటే, వాడు చెప్తే నాదికాదు కదా బాధ్యత. నా గురించి వాడు చెప్పేది సత్యమా, నా గురించి నేను చెప్పేది సత్యమా, అని అన్నారు. ఇంకేం మాట్లాడతారు? I am sorry. I am not an astrologer అని చెప్పారు గురువుగారు. గురువుగారంటే గురువుగారు మరి, కదా! Who am I ? అంటే I am That I am. నేనెవరంటే? నేను నేనైన నేను, ఇంకొక నేను సత్యం కాదు. అందుచేత మాస్టరుగారికి వ్యామోహం లేదు.

మనం హోమియోమందు వెయ్యాలి ఈయనకి, ఈయన బాగుపడ్తాడు అన్నట్టుగా, అనలేదు ఆయన. కానీ ఆ గాత్రానికి మందేమిటి? అసలు మీకు మందేమిటి? అన్నారు. అంటే ఆయన నవ్వారు. ఎలా వుందంటే ఆ నవ్వు? ఆహా! ఆయన వుండాల్సిన పద్ధతుల్లోనే వున్నాడని, కదా! అప్పుడు ఆయన అన్నారు, ఎంత మాటన్నారో తెలుసా? ‘అయినప్పటికీ మీచేత వేయించుకోవడం

ఒక ముచ్చట' అన్నారు. గొప్ప విషయం. అది అసలు నాకు ఒళ్ళు గగుర్పొడుస్తుంది ఈరోజుకీ తలచుకుంటే! అందుచేత ఆయన ఆ గొంతు ఆయనది కాదు, అనుకొన్నారు. అది ఆయనకు తెలుసు, అది ఆయన గొంతు కాదు. రాముడు ఎన్నాళ్ళు పాడిస్తే అన్నాళ్ళు పాడతాడు. ఆయన రామభక్తుడు. రాముడంటే మనం పెట్టుకునే చిత్రపటం కాదు, రాముడు తెలిసినవాళ్ళకి. ఆయన విశ్వాత్మరాముడు. సమస్తము వ్యాప్తి చెందినటువంటి వాడు కదా! తత్త్వదర్శనం చేసిన వాళ్ళే తెలిసిన వాళ్ళండి. *"జ్ఞానినః తత్త్వదర్శనః"* అన్నారు. ఏదో ఒక పేరు, ఒక రూపం పెట్టుకొని అలా గుద్దుకొంటూ, గుద్దుకొంటూ వుండే వాళ్ళకి తత్త్వదర్శనం ఎలా అవుతుంది? అందుచేత ఏదీ మనది కాదు. ఇటు నా గొంతు గురించి ఏదో గుర్తువస్తే ఆ గొంతు గుర్తువచ్చింది. ఏది తణుకులో మన చిల్లరగొంతు గురించి మాట్లాడాం కదా! దేవుడి గొంతు, దేవుడే కాపాడుకుంటాడని తెలియాలి. అంతేకాని మనకి వుండేటటువంటి పిచ్చిబుర్రతో ఆలోచించకూడదు, కదా!

అందుకని నాకు ఒంట్లో బాగోలేదు కదా, నేను అలా గురుపూజలకు ఎలా వెళ్తాను? దైవకార్యక్రమానికి ఏదీ బాగుండ నక్కర్లేదు! నీకు దైవం మీద విశ్వాసం వుంటే చాలు. నడిపించుకునేటువంటి వాడు దైవం కదా! మనం తిరగాలంటే నానా బాధలు. వాడు తిప్పుతాడంటే బాధే లేదు. వాడు తిప్పితే తిరగడం వేరు. మనం తిరుగుదాం అనుకోవడం వేరు, లేక మనం తిరుగుతున్నాం అనుకోవడం కూడా వేరు. మనం తిరుగుతున్నాం

అనుకుంటే ఎప్పుడూ రొప్పు ఆయాసం, రొప్పు ఆయాసం, వాడు తిప్పుతుంటే ఇంకో రకంగా వుంటుంది. అందుచేత ఆవిధంగా గొంతు లేకుండా ఉపన్యాసం చెప్పేసి వచ్చేశాం. ఈ ఊరొచ్చేసాం. ప్రొద్దున ప్రార్థన చేస్తుంటే ప్రార్థన నుంచి భీష్మాచార్యులవారిని గూర్చి ప్రవచించమని లోపల వినిపించింది. తీరా చూస్తే ఈ రోజు భీష్ముడు పుట్టినరోజు కనుక భాగవతమూర్తి అయినటువంటి భీష్మాచార్యులవారిని గూర్చి శ్రవణం చేసుకుందాం. యిదే ఈ గురుపూజలలో ప్రచవనాంశం!

# ౨. మాఘ మాస ప్రజ్ఞ

ఈ రోజు భీష్మాష్టమి. భీష్ముడు పుట్టినరోజు! ఇంకో మూడురోజుల్లో భీష్మఏకాదశి వచ్చేస్తుంది. మాఘ శుక్ల అష్టమి ఆయన పుట్టినరోజు. మాఘ శుక్ల ఏకాదశి ఆయన పరమపదించిన రోజు. భీష్ముడిని మనం ఆంగ్లభాషలో చెప్పుకోవాలనుకుంటే– He is an extra–terrestrial being. అంటే, మన భూమిపై పుట్టవలసిన వాడు కాదు. ఊర్ధ్వలోకాలలో వసించేవాడు, వసించవలసిన వాడు. మనమధ్య జరిగితే మనలాంటివాడే అని అనుకుంటూవుంటాం మనం. భాగవతంలో ఉద్ధవుడు విదురుడికి కృష్ణుని గూర్చి విపులంగా వివరిస్తాడు. కృష్ణుడిని తెలుసు అనుకుంటాడు విదురుడు. తనకు తెలిసిన కృష్ణుడు అణువంతే! అసలు కృష్ణుడు పరమ పురుషుడు, పురాణపురుషుడు, సనాతనుడు. ప్రతివాళ్ళు తెలుసనుకుంటారు కృష్ణుని గూర్చి. ఋషులకు, మహర్షులకు, దేవఋషులకు, దేవతలకు, ఆఖరికి చతుర్ముఖ బ్రహ్మగారికి కూడ అంతుపట్టనివాడు కృష్ణుడు. విదురుడు కృష్ణుడిని గురించి ఉద్ధవుడిని అడిగితే, ఉద్ధవుడు చెప్తూ వుంటే, విదురుడికి మతిపోతుంది. తనకు తెలిసిన కృష్ణుడికి మించి ఉంటాడు శ్రీకృష్ణుడు. ఎంతమాత్రమున ఎవ్వరు తలచిన అంతమాత్రమే దర్శనమిచ్చే పరతత్త్వం. ఎంతలా చెప్తాడంటే

ఉద్ధవుడు, విదురుడికి కృష్ణుడి గురించి, (మనం తప్పకుండా చదువుకోవాలి) విదురుడికి లోపల ఒక రకమైనటువంటి దుఃఖం వచ్చేస్తుంది. ఇంత తెలిసి ఏం చేసుకోను? మన దగ్గర తిరుగుతున్న వాడిని, గమనించలేకపోయామే అనే దుఃఖం వచ్చేస్తుంది. చాలా దుఃఖపడతాడు. వున్నప్పుడు గుర్తించక కళ్ళ ఎదుట లేనప్పుడు బాధపడడం జ్ఞానులకైనా తప్పలేదు. అంతేకాదు, కృష్ణుని ముందు ఎవరికివారు వారి ప్రతాపాలు చూపారు. వారి జ్ఞాన ప్రదర్శనలు చేశారు. హనుమ ముందు కుప్పిగంతులు వేసినవారిలా, ఎవరి వికారాలు వారు చూపారు. వారి ప్రదర్శన ఆయన ముందు, కదా! ఇప్పుడు కృష్ణుడి ముందు ప్రదర్శించని వాడెవడున్నాడు? అందరూ ఎవరెవరి పద్ధతుల్లో వాళ్ళు ప్రదర్శనలు చేశారు కదా! శ్రావస్తి గుహలలో మైత్రేయుడు, లోకంలో భీష్ముడు తప్ప ఇంకెవరికీ తెలియలేదు. ఇది సత్యం.

భీష్ముడికి కృష్ణుని గురించి తెలిసినంత ఆ సమకాలికుల్లో లోకంలో వుండే వాళ్ళెవరికి కృష్ణుని గురించి తెలియదు. గోపికలకి అనుభూతి తప్ప, ఆ మహత్తరమైనటువంటి తత్త్వము తెలియదు. మహత్తరం అంటే మహత్తుకన్నా ఇంకా ఉత్తమమైనటువంటిది, అది పరతత్త్వము. ఆ పరతత్త్వము చక్కగా అలా సరదాగా ఒక చొక్కా తగిలించుకొని వచ్చినట్లుగా వచ్చేశాడని చెప్తాడు భీష్ముడు. మాయాంగీకృతదేహుడై అంటూ మొదలుపెడ్తాడు భీష్మస్తుతి. భాగవతం చదువుకుందాం. ఎందుకు చెప్తున్నానంటే భీష్ముడు ఈభూమికి సంబంధించిన వాడు కానేకాదు, కదా! అది ఎలా

చెప్తుందంటే భాగవతం, అంపశయ్య మీద ఆయన పడుకొని వుంటే, ఏదో నింగి నించి ఒక దేవత వచ్చి నేలమీద పడుకున్నట్టుగా వుందిటండి. నింగినించి ఒక దేవత వచ్చి, అలా నేలమీద పడుకొని స్వచ్ఛంగా కనిపిస్తుంది. ఒకసారి మనం దానిమీద ధ్యానం చేశామనుకోండి! అంటే ఇంత భయంకరమైనటువంటి మన మున్సిపాలిటీల మధ్య ఒక అద్భుతమైనటువంటి, ఒక సహజమైనటువంటి కమలములు కనిపించినాయి అనుకోండి, ఎట్లా వుంటుంది? వీటి place ఇదికాదు అనిపిస్తుంది. ఇప్పుడు ఇలాంటి బాహ్యావరణం వున్నటువంటి ప్రదేశంలో ఒక దివ్య కమలం వెలుస్తుందని ఊహించగలమా? వుంటుందని మనం ఊహించగలమా? కొండ గుట్టలలో ఒక జ్యోతిర్లింగం వెలిసినట్లు, అడవిలో ఒక శ్వేతమగు అర్జున వృక్షం ఏర్పడినట్లు, పురుషులలో ఒక దేవత అవతరించినట్లు, రాళ్ళ మధ్య రత్నం ఉన్నట్లు, మట్టిలో ఒక మాణిక్యం ఉన్నట్లు, కొలనులో ఒక చంద్రబింబం ప్రతిబింబించినట్లు, భీష్ముడు కౌరవులలో ప్రత్యేకంగా, విశిష్టంగా గోచరిస్తాడు. ఊహించలేం కదా! ఆయన మహానుభావుడు. అష్టవసువులలో ఒకడు. ఈభూమికి సంబంధించిన వాడే కాదు. ఇప్పుడు అలాంటి వాడిని ఈశ్వరుడు ఎన్నుకున్నాడు కథ నడిపించడానికి.

ద్వాపర కలిసంధిలో వుండేటువంటి ధర్మ అధర్మ ఘర్షణము నకు ఒక పనిముట్టుగా భీష్మని దైవం వినియోగించినట్లుగ గోచరిస్తుంది. మహాజ్ఞాని. ఎంత జ్ఞాని అంటే మూడులోకములు

ఆవరించినటువంటి నీలకాంతిగా కృష్ణుని చూడగలిగినవాడు ఆయన ఒక్కడే! అదేకదా "*త్రిజగన్మోహన నీలకాంతి తనువుద్దీపింప*" అని భీష్ముడు అన్నాడంటే? భీష్ముడు అలా చూశాడు కృష్ణుడిని. కృష్ణుడిని అందరూ చూశారు. రకరకాలుగా చూశారందరు కదా! ఈయన దర్శనం ఏమిటి? ఈయన దర్శనం మొత్తం వ్యాప్తిచెందినటువంటి తత్త్వమే! మూడు జగములూ మోహనం చెందేటటువంటి కాంతి అది. ఎవరైనా పడిపోవాల్సిందే ఆ కాంతికి. అలాంటి కాంతికి, ఒక బంగారుపంచె కదా! పట్టుదట్టి అని అంటూ వుండేవాళ్ళము చిన్నప్పుడు. ఒక బంగారు ఉత్తరీయము మీద వేశారనుకోండి అంటే ఏమిటీ నీలము, బంగారము వర్ణము ఆధారంగా ఓహో కృష్ణుడున్నాడని తెలిసినది. అది తెలియగలిగిన విషయం కాదు కాబట్టే కృష్ణుడు అన్నారు.

కృష్ణుడు అంటే కనబడనివాడు! పరిపూర్ణంగా తెలియబడని వాడు! మనచే తెలియబడనివాడు! మనం ఎంత తెలుసుకున్నా కృష్ణుని పూర్తిగా తెలుసుకోవడం అంటూ వుండదు. అందుకనే సూతమహర్షి అంటాడు ఆకాశం గురించి ఎంత చెప్పినా ఇంకా ఆకాశం వుంటుంది. అనికదా! భాగవతం మొదట్లో కృష్ణుడిని గురించి చెప్పమని వైశంపాయనాది మునులు అడుగుతారు. అంటే కృష్ణుడి గురించి ఎంత చెప్పగలం? ఎంత చెప్పినా ఇంకా వుంటుంది, అది కృష్ణుడు. ఆకాశం గురించి ఎంత చెప్తావు? నీకు కనబడ్డంత వరకు చెప్తావు. దాని తరువాత వెళ్ళావనుకో ఇంకా ఆకాశం. అక్కడకి వెళ్ళావనుకో ఇంకా ఆకాశం వుంటుంది.

అదేమిటది ఆకాశం, మహదాకాశము, పరాకాశము మూడు స్థితులు. దానికి అంతులేదు. నీకు అంతు వుంది. ఎందుకంటే నువ్వు అందులోకి వెళ్లిపోవచ్చు. నీకు నువ్వు లేని స్థితి కల్పించే వాడు కృష్ణుడు. అలా ఆ లోకాల్లోకి ప్రవేశింపచేసి మనము లేక తానుండిపోయాడు కదా! అలాంటివాడు ఇలా భూమిమీద సరదాగా తిరగడానికి వచ్చినట్టుగా గుర్తించిన వాళ్ళలో, చెప్పాకదా, శ్రావస్తి గుహలలో మైత్రేయమహర్షి ఒకరు, లోకంలో సంచరిస్తున్న వారిలో భీష్ముడు ఒకరు. వీరిద్దరూ సమకాలికులు. కాశీరాజు కుమారుడుగా మైత్రేయులు దేహం ధరిస్తారు. ఆయన కూడ విష్ణుతత్త్వము రూపు కట్టుకున్నటువంటి వారుకదా! అదికూడా వేదవ్యాసమహర్షే వ్రాస్తారు. భూమిమీద విష్ణువు చరిస్తున్నాడట అంటే అది మైత్రేయమహర్షి రూపంలో చరిస్తున్నాడని చెప్తారు. తృతీయస్కంధము చదువుకుంటే ఒక పద్యం వుంటుంది అందులో. ఆ పద్యం ఏంచెప్తుందీ అంటే, సాక్షాత్తు విష్ణుతత్త్వమే రూపుకట్టుకొని భూమిమీద సంచరిస్తున్నది, ఆయనే మైత్రేయుడు అని. అలాంటి మైత్రేయుడికి కృష్ణుని గురించి తెలుసు, ఆయన ఏమిటో! అలాగే భీష్మపితామహులు అంటూ వుంటాం కదా! ఆయనకు తెలుసు.

భీష్మపితామహుడి అసలు పేరు దేవవ్రతుడు. భీష్మ పితామహుడు అని ఎందుకు అన్నామంటే చాలా భీషణమైనటువంటి ప్రతిజ్ఞ చేశారు. భీష్మమైన ప్రతిజ్ఞ అంటే పంచభూతాలు తల్లడిల్లి పోయేటువంటి ప్రతిజ్ఞ చేశారు. పంచభూతాలు తల్లడిల్లినాయి అంటే, అంత శక్తివంతమైనటువంటి వాక్కు ఆయన ఉచ్చరించడం

జరుగుతుంది. ఆయన దేవవ్రతుడు. ఎవరికి జన్మిస్తాడు? శంతనుడు – గంగాదేవి వారిద్దరికీ జన్మిస్తాడు. గంగాదేవిని శంతనుడు దర్శించి ప్రేమిస్తాడు, అప్పటికి ఆయన కురుచక్రవర్తి. ఎందుచేత? వాళ్ళన్నయ్య రాజ్యం పుచ్చుకోకపోవడం చేత. వాళ్ళన్నయ్యే మనమెరిగిన దేవాపి మహర్షి. ఆయన పేరు దేవాపి. ఆయన పుట్టడం క్షాత్రకులంలో పుట్టినప్పటికీ, లక్షణం బ్రాహ్మణ లక్షణం చాలా ఎక్కువగా వుంది. బ్రాహ్మణ లక్షణం వుండేవారికి ఇతరులను పరిపాలించేటటువంటి విషయాలలో బొత్తిగా ఆసక్తి వుండదు. అందుకనే బ్రాహ్మణ లక్షణం అంతా కూడా పరబ్రహ్మ తత్త్వమందు ఎక్కువ లగ్నమై వుంటుంది. పరిపాల ననేది మూడు కర్తవ్యాలలో ఒకటి. సృష్టి, స్థితి, లయ. ఈ స్థితి కారకుడు పరిపాలకుడై వుంటాడు. అన్నీ సవ్యముగా వుండాలి అంటే పరిపాలన వుండాలి.

ఈ దేవాపిమహర్షికి పరిపాలించడం అనే విషయమునందు ఆసక్తి వుండదు. ఎంతసేపూ లోపలికి వెళ్ళిపోయి అక్కడి నుండి బ్రహ్మతత్త్వంలోకి వెళ్ళిపోయి, ఆ బ్రహ్మమును ఆస్వాదిస్తూ, ఆ బ్రహ్మం యొక్క విలాసముగా ఈ సృష్టినంతా దర్శనం చేస్తూ, అలా వుండడం అనేది సహజ లక్షణంగా వుంటుంది. పుట్టడం, క్షత్రియ కులంలో పుట్టినా! అందుచేత ఆయన పరాశర మహర్షి దగ్గరికి వెళ్ళిపోతాడు, విద్యాభ్యాసానికి. వెళ్ళిపోయి తిరిగి వచ్చిన తరువాత పట్టాభిషేకము అంటే, నేను దీనికి సంసిద్ధుడిగా లేను, నా లక్షణము దీనికి పనికిరాదు అని చెప్పాడు. అంటే దానికి చాలా సంస్కారం

కావాలి. మనకి ఈ లక్షణం మనం చేస్తున్న పని మన స్వభావానికి కుదరకపోతే అది ఎంత గొప్పపని అయినా మనది కాదనుకొని ప్రక్కన పెట్టాలంటే చాలా దమ్ముండాలి కదా! లేకపోతే ఈరోజుల్లో ఏంటంటే ఏది బాగుంటే అదల్లా పూసుకుందాం అని అనిపిస్తుంది కదా! బాగున్న పని, పదిమంది గొప్పగా చూసేపని చేద్దామని అనుకోవడంవంటిది, సంస్కారం కాదు. నీ స్వభావానికి నీకు ఏది ఆనందాన్ని ఇస్తుందో దాని యందు నీవుండడమే, నీస్వభావం.

మాస్టరుగారు నా జాతకం రాస్తూ ఒక మాట రాశారు. కేవలం 'లెక్కలు కట్టడం వలన జీవప్రయోజనం నెరవేరదు' అని రాశారు. జీవ లక్షణం అంతా భక్తిమార్గములో తేలిపోవడానికి అనుగుణంగా వుందని రాశారు మొదటి వాక్యమే. అది సత్యం. చిన్నతనం నుండి అదే మన గోల, భక్తి. అందుచేత లెక్కలు కట్టుకుంటూ కూర్చుంటే అవుతుందా? లెక్కలు కట్టుకుంటూ వుంటే బోలెడు డబ్బు రావచ్చు, కీర్తి రావచ్చు, ప్రతిష్ఠ రావచ్చు. అది కాదు మార్గము. మనకు ఏది ఆనందాన్ని ఇస్తుందో ఆ మార్గము పట్టుకెళ్లి పోవాలి. కొన్నికొన్ని చోట్ల మనం కూర్చొని పని చేస్తుంటే దానివల్ల ఏ ఆనందము కలగకపోతే దాన్ని అలా వదిలేయాలండి. ఇది మన పని కాదు. పొరపాటున కూర్చున్నాం. ఈ కుర్చీ మనది కాదు. కుర్చీకి చాలా విలువ వుంది. వుంటే వుండనీ, నాకు కాదు. మనకి విలువ లేదు. స్వధర్మాన్ని అనుసరించమని శ్రీకృష్ణుడు భగవద్గీతలో తెలుపుతాడు. నీ స్వభావాన్ని అనుసరించి నీవు వృత్తిని ఎన్నుకుంటే అది నీకు ఆనందాన్నిస్తుంది. అలాకాకపోతే ఘర్షణనిస్తుంది.

కురుసామ్రాజ్యం చాలా పెద్దసామ్రాజ్యం, దేవాపిమహర్షి ఆ సామ్రాజ్యానికి చక్రవర్తి అవ్వాలి. పురోహితులు అడిగితే, నా లక్షణం రాజ్యపరిపాలనకు అంగీకరించడం లేదు. అంటే సంస్కారములు బాగా ఉత్తమోత్తమముగా పెరుగుతూ వుంటే ఆ మనిషికి ఇతరులను పరిపాలించా లనేటువంటి వ్యామోహం అలా పడిపోతుంది. తనను పరిపాలించే వానితో అనుసంధానం చెందడం తప్ప, ఇంకొకరిని పరిపాలించడం అనేది వుండదు. అందుకనే మహర్షులు, బ్రహ్మ ఋషులు, దేవ ఋషులు– ఈ ఋషులు అందరూ కూడా పరిపాలనకు ఒప్పుకోరు. అందరినీ పరిపాలించేవాడు ఒకడు వున్నాడు. వాడి అంశగా వస్తూ వుంటారు. మనం చెప్తూ వుంటాం కదా! విష్ణు అంశ లేనిదే పృథివీపతి కాలేడని. *'నవిష్ణో పృథివీపతిః'* అని అంటూ వుంటాము. విష్ణు అంశ వుంటే కానీ కనీసం కలెక్టరు ఆఫీసులో బిళ్ళ జవానుగా కూడా వుండలేమండి. ఇదీ పద్ధతి. దేవాపిలో లేదు అది. వసుదేవుడిలో కూడా లేదు. చూడండి గొప్పతనం. మనం నేర్చుకోవలసిన విషయాలు వీళ్ళ చరిత్రలో చాలా వుంటాయి. వసుదేవుడి దృష్టి ఎంతసేపూ తత్త్వం మీదే వుంటుంది. అది తత్త్వదర్శనం. తత్త్వార్థి. అది వుండడం చేత అతను ప్రజల్ని పరిపాలించడ మేమిటి, వాళ్ళతో మనం కలిసిమెలిసి వున్నాము కదా అని అనుకున్నాడు. వసుదేవుడు వీళ్ళని నేను పరిపాలించలేను, వీళ్లలో కలిసిపోతాను అన్నాడు. వాళ్లే నిజమైన పరిపాలకులు. ఎందుకంటే వాళ్లే హృదయాల్ని పొందుతారు. హృదయాల్ని పొందితే పరిపాలన సులభంగా అదే జరిగిపోతుంది. ఈ పరిపాలించాలని చేసేదంతా కూడా ఒక ఆంక్షగా వుంటుంది.

పరిపాలన నుంచి ఎప్పుడు తప్పించుకుందామా అనుకుంటూ వుంటారు మనుష్యులు.

అందుచేత దేవాపి మహర్షి ఆ మాట చెప్తే, మరి ఎలా అని అడిగితే, ఆయనే చెప్తాడు పరిష్కారం, తనను బహిష్కరించమని. నన్ను బహిష్కృతుణ్ణి చేయండి, సమాజం నుండి. అట్లా బ్రాహ్మణుల చేత తనను తాను బహిష్కరింప చేసుకొని హిమాలయాలకి వెళ్ళిపోతాడు అన్నగారు. అందుకని శంతనుడికి రాజ్యం వస్తుంది. శంతనుడు మహాజ్ఞాని. కాకపోతే వీటిమీద మోజు వున్నది. ఏది? రాజ్యము నందు మోజు వున్నది, వివాహము నందు మోజు వున్నది, సకల గుణములు వున్నాయి, చక్కని రూపం వుంది శంతనుడికి. పేరే చాలా బాగుంటుంది, శంతనమ్! అందుచేత గంగాదేవి ఆయనకి కనిపిస్తుంది. కనిపిస్తే వరిస్తాడు. సరే love storyకి ఏమిటండీ? చాలా చెప్పుకోవచ్చు. వరించినప్పుడు ఆమె చెప్తుంది. నేను ఫలానా, నేను భూలోకవాసిని కాదు. నేను మూడు లోకాల్లోనూ సంచరిస్తూ వుంటాను, మూడు లోకాలను కదా! ఆవిడకు ఆకాశగంగ, వియద్గంగ, మందాకిని, భోగవతి చాలా పేర్లు వున్నాయి కదా! మనలో కూడా అన్ని దశలు వున్నాయి. అందుచేత నేను ఆసాంతం వుండి పోలేను కానీ వుంటాను, అంగీకరిస్తాను. నీద్వారా సంతానం కలుగుతుంది. కానీ సంతానాన్ని నేనేం చేసుకుంటానో నా ఇష్టం, అంది.

నా ఇష్టం. అదేమిటండీ, రాజుగారికి సంతానం కలిగితే ఆ రాజుగారి సంతానం మీద హక్కు ఎవరికి వుంటుందో

తెలుసా! రాజ్యానికి వుంటుంది. అది ధర్మం. ఎందుకంటే రాజు పరిపాలకుడు. అతనే మళ్ళీ తన పుత్రుడిగా దిగి వస్తాడు. కాబట్టి ఆయన ప్రజ్ఞే, వాళ్ళు పరిపాలకులే. వాళ్ళకి బాధ్యత వుంటుంది. It is not a privilege. రాజ్యపరిపాలన ఒక బాధ్యత తప్ప హక్కు కాదు, తెలిసిన వాళ్ళకి. అందుచేత నేనిలా చేసేస్తాను, అంది. నాకు పుట్టిన వాళ్లని ఏంచేస్తానో నువ్వు నన్ను అడక్కూడదు. సరే! ఎందుకు సరే అంటాడండి, ఇంత తెలిసినవాడూ? వ్యామోహం కదా! మరి వ్యామోహం వుంటే ఎంత అయినా లొంగిపోతామండి. ఎన్ని కథలు లేవు భార్యా వ్యామోహానికి గురి అయిపోయి తన్ను తాను పరిపూర్ణంగా పతనం గావించుకున్న కథలు ఎన్నో ఉన్నాయి. మన జీవితాలలోనూ, పురాణాల్లోనూ వున్నాయి. వాల్మీకి కథ, అజామీళుడు. వాళ్ళ వరకు ఎందుకండి, మనలో లేరా? లేరా? ఇంటి ఆవిడ కోసం ఏపనైనా చెయ్యడానికి సిద్ధంగా వుండేవాళ్లు వుంటారు. ఇది శుద్ధం ఇది బద్ధం అని ఏం లేకుండా అశుద్ధమైనా, అబద్ధమైనా అలా పశువల్లే కట్టబడి చేస్తూ వుంటాడు. ఇలాగ వచ్చిన వాళ్లందరినీ మరునాడు అమ్మగారు తీసికొని వెళ్ళిపోయి గంగలో కలిపేస్తుంది. ఏడుగురు వరకు అట్లా పుట్టడం, వెళ్లిపోవడం అవుతుంది. ఇంక రాజపురోహితులు, they step in. వాళ్ళు జోక్యం కలిగించుకుంటారు. ఏంటయ్యా నీకథ అని?

రాజ్యానికి ఉత్తరాధికారి కావాలి కదా! నువ్వు కన్నవాళ్లందరినీ ఆవిడకి ఇచ్చేస్తే ఆవిడేదో మాయం చేసేస్తూంటే,

ఇక్కడ కథ ఎవరు నడుపుతారు? ఇంకోటి గుర్తుపెట్టుకో. అసలు నీవు వివాహం మమ్మల్ని అడక్కుండా చేసుకోవడమే తప్పు, అని చెప్తారు. ఎందుకంటే రాజుకి personal life అనేది వుండదు. ఒక చక్రవర్తికి లేక ఒక ప్రభువుకి personal life ఉండదు. He is for the people. ప్రజల కోసం బ్రతికేవాడు రాజు. అది చక్కగా నిర్వర్తించినటువంటి వాడే రాముడు. రాముని కథ! రాజంటే రాముడే. ఇక రాజు ఎవరయ్యా అంటే రాముడే రాజు. ఇంకెవరూ కాదు. అలాంటి రాజు వుండడు. అందుకని రాముడే రాజు – రాజా రాముడు – అతనికి సాటి సృష్టిలో ఎవరూ లేరు. అంతా ప్రజల కోసమే. అందుచేత నీకు పుట్టినటువంటి ఈ పిల్లల్ని మాటిమాటికి ఆవిడ పట్టుకుపోయి గంగలో కలిపేస్తోంది. సంతానం మీద నీకే హక్కుంది, నీ భార్యకే హక్కుంది అనుకోబోకు అని పురోహితులు హితబోధ చేస్తారు.

మనం కూడా మన సంతానం మీద మనకే హక్కు ఉందనుకోకూడదు. ఎందుకో తెలుసా? మన సంతానం మీద మన ముందు మూడు తరాల పూర్వీకులకు, అలాగే మూడు తరాల తరువాత వరకు కూడా వాళ్ల మీద హక్కు వుంటుంది. గొలుసు కట్టులో నువ్వొక గొలుసువి. అందుచేత నువ్వు ఇలా పట్టుకెళ్ళిపోయి అక్కడెక్కడో ఇచ్చేస్తే కుదరదు. అంటే ఈసారి సంతానం కలిగితే, నువ్వు అడ్డుపడి ఆ పిల్లవాడిని రక్షించాలి అని కోరతారు పురోహితులు. ఎందుకంటే ఇప్పటికే నీవు చాలా అతిక్రమించి ప్రవర్తిస్తున్నావు అని చెప్తారు పురోహితులు.

గుర్తుపెట్టుకోండి, రాజులందరినీ రాజపురోహితులు నడిపిస్తుండే వాళ్ళు. వాళ్ళు ధర్మమెరిగి రాజుకు సలహాలు ఇస్తుండేవారు. అలా చెప్తే, శంతనుడు అలాగే ఈ సారి సంతానం కలిగితే నేను ఆమెను అడ్డగించి సంతానాన్ని రక్షించుకుంటాను అని చెప్తాడు.

సరే, యథావిధంగా ఎనిమిదోసారి సంతానం కలిగింది. అతడే దేవవ్రతుడు, భీష్ముడు. అందుకని కృష్ణుడి లాగానే భీష్ముడు కూడా అష్టమ గర్భుడే! సంతానం ఎప్పుడు కలిగిందీ? మాఘమాసంలో కలిగింది. గొప్ప విషయం కదా! మాఘమాసం ప్రజ్ఞ ప్రత్యేకమైన ప్రజ్ఞ. ఇప్పుడు Aquarian age, Aquarian age అంటున్నాం కదా! మహత్తు అంటే ఉండీ లేనట్టు , లేక వున్నట్టు. కనిపిస్తున్న సత్యం. మహత్తు అంటే కనపడీ కనపడక ఉంటుందండీ. నీకు ఏది తోస్తే అది నీకు గోచరిస్తుంది తప్ప అక్కడ ఉన్నది గోచరింపబడదు. అందుకని మాస్టరు గారు చెప్తుండే వారు "జగత్ మిథ్య కాదు. నీవు చూసే జగత్ మిథ్య." మన దృష్టి ఎలా ఉంటే మనకు అలా కనిపిస్తూంటుంది ప్రపంచం. అంతే కదా! అందుచేత మహత్తు కలిగినటువంటి మాసం మాఘమాసం. అందుకనే సంకేతం కూడా ఎలా వుంటుందంటే, ఒకావిడ కుండ పట్టుకొని వుంటుంది. అట్నుంచి నీళ్ళేం ప్రవేశించవు. ఇట్నుంచి నీళ్ళు వచ్చేస్తుంటాయి. అటు నీళ్ళు లేవు, ఇటు నీళ్ళు అలా జలావతరణం అంటాం కదా, అనంతంగా అలా వస్తూనే ఉంటాయి. అంటే ఏమిటీ? అదృశ్యం నుండి దృశ్యము లోనికి అన్నీ పట్టుకొని వస్తుంది. అటు ప్రక్క ఏమీ లేవు. *"ఏమి లేనట్టి*

*గగనాన నిమిడియుండి అన్ని యున్నట్టి భూమిని నవతరింతు"*
అని అన్నారు మాస్టరుగారు 'గోదావైభవం'లో.

ఏమీ లేనట్టుగా ఉంటుంది, అన్నీ వుంటాయి. అన్నీ ఉన్నట్టుగా వుంటుంది, ఏమీ ఉండదు అందులో, కదా! అన్నీ ఉన్నట్టుగా కనిపించి ఏమీ లేనివాళ్ళు చాలా మంది ఉంటారు. అంటే జ్ఞానం లేదని అర్థం. అన్నీ ఉండి ఏమీలేనట్టుగా ఉంటారు. అంటే ఏమిటంటే జ్ఞానం వుంది, మిగతావి లేవు వాడికి. జ్ఞానికి ఇది లేదే అనే బాధ లేదు. లేకపోవడం వల్లే వాడు జ్ఞాని. బయట వాడికి ఏమీ ఉండక్ఖర్లా, అయినా వుంటాడు వాడు. ఈ అన్నీ వున్నవాడి కన్న బాగా వుంటాడు. అందుకని భీష్ముడు ఈ మహత్తు, అంటే ఈ మాఘమాసంలో పుట్టినవాడు కాబట్టి, సమస్త జ్ఞానము కలిగిన వాడు ఆయన. అష్టమి నాడు పుట్టాడు. పుట్టంగానే ఆవిడ మామూలుగానే తువ్వాలులో చుట్టేసి గంగానదిలో పడవేయటానికి పట్టుకెళ్తుంటే శంతనుడు ఆపుతాడు. ఈసారి నేను ఒప్పుకోను అంటాడు. ఒప్పుకోను అంటే గంగాదేవి Thank You! అని చెబుతుంది. ఎందుకంటే అంతవరకే ఆవిడ ఒప్పందం. ఈయన ఎప్పుడు అడ్డు పెడితే అప్పుడు ఆవిడ వెళ్ళిపోవచ్చు. అందుకని ఈరోజు నుంచి నీకు నాకు భార్యాభర్తల సంబంధం ఏమీలేదు, అయిపోయింది నువ్వు నాకు అడ్డుపెట్టావు గాబట్టి, అంటుంది.

ఎందుకిలా జరుగుతుంది అంటే అష్టవసువులకు శాపం ఉంటుంది. ఆ శాపానికి ఒక కథ వుంది. సత్యలోకంలో వుంటాడు ఎవడైతే మనం శంతనుడు అని చెప్పుకుంటూ వుంటామో

ఆయన. సత్యలోక వాసి. సత్యలోకం అంటే మన సహస్రారం అనుకోండి. సృష్టికి ఇక అదే. ఆ పైన త్రిమూర్తులు వుంటారు. అందుచేత అక్కడ సత్యలోకంలో బ్రహ్మ దేవుడి దగ్గర ఉంటాడండి ఈయన. ఎంతటివాడండీ? సత్యలోక వాసి, సత్యవంతుడు, సత్యమే రూపముగా కలిగినటువంటి వాడు. ఆ ప్రక్కనుంచి అలాగ గంగ ప్రవహిస్తూంటుంది. గంగా ప్రవాహాన్ని చూస్తూ వుంటాడు. ఈయనకి అదొక hobby అయిపోతుంది. గంగ విష్ణులోకం నుండి, విష్ణువు పాదాలనుండి, బ్రహ్మ (సత్య) లోకం ద్వారా క్రింది లోకాలకు ప్రవహిస్తూ ఉంటుంది (మనలో ఇడ నాడివలె).

అలా చూస్తూ ఉంటే, ఒకరోజున గంగాప్రవాహం లోపల ఒకసారి గంగాదేవి కనిపిస్తుంది. కనిపించేసరికి శంతనుని మనస్సు తేడా పడిపోతుంది. అమ్మో, చాలా బాగుంది గంగాదేవి. అంతే కదా! Love at first sight అంటారు. ఇంక గంగను చూడాలి అనే తపన పెరుగుతూ వుంటుంది. సత్యలోకంలో కూర్చుని ఇంక గంగ ఎప్పుడు కనిపిస్తుందా అని ప్రవాహంలోకి చూడడం ఎక్కువై పోతుంది. ఇంక ఈయన (బ్రహ్మ) ఉంటాడు కదా! పాపం సినిమాలో చూపించేటట్టుగా మనకి ఏదో చిత్రీకరణ చేశారు. గడ్డం పెంచుకొని పద్మంలో కూర్చుని, అలా జపమాల పట్టుకొని, ప్రక్కన ఆవిడ వీణా వాయిద్యం చేస్తూవుంటే , ఇంక చేసే పనేం లేదు. సృష్టి చేసేశాడు ఆయన కదా! ఈ సినిమా చూస్తాడు. వీడేంటి ఇట్లా తయారు అయిపోతున్నాడు అని. వీడు బాగుపడాలి అంటే ఏమి చేయాలి? ఒకసారి గంగా సంగమం కలగాలి వాడికి,

అంతే అంతకన్నా మార్గం లేదు. అందుకని శపించేస్తాడు. నీవు వెళ్ళి భూలోకంలో పుట్టు అని. గంగకు కూడా చెప్తాడు. ఎందుకని నీ వల్ల ఆయన, ఆయన వల్ల నీవు ఇద్దరు కొంచెం చిన్న చిత్తభ్రమలో పడ్డారు, కాబట్టి అదేదో పూర్తి చేసుకోమని చెప్తాడు. అది శాపం కాదు. వరమే! పెద్దలిచ్చే శాపాలన్నీ వరాలేనండి. మనలో వుండే కొన్ని కొన్ని అక్కడక్కడా మిగిలిపోయినవి కూడా ఏరేయడానికి వాళ్ళు శాపం యిస్తారు. అందుచేత ఈయన వచ్చి భూలోకంలో పుట్టాల్సిన పరిస్థితి వస్తుంది. భూలోకంలో పుట్టడంకోసం ఈ శంతనుడు పుట్టుకొస్తాడు. శంతనుడి కథ అది. ఆ శంతనుడికి ఈ గంగాదేవికి అష్ట వసువులు పుట్టుకొని వస్తారు. నిజానికి అష్ట వసువులకు వశిష్ఠ మహర్షి శాపం యివ్వడం వలన వారందరు భూమిపై పుట్టవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. అది ఇంకొక కథ.

**వసువులకు శాపం :**

ఒక సమయంలో అష్ట వసువులు వశిష్ఠ మహర్షి ఆశ్రమానికి పత్నీ సమేతంగా వెడతారు. వశిష్ఠ మహర్షి అష్ట వసువులను, వారి భార్యలను ఆదరించి, అన్ని సత్కారములు చేసి, ఆతిథ్యమిస్తారు. అష్ట వసువులకు, వారి భార్యలకు వశిష్ఠుని వైభవం ఆశ్చర్యం గొలుపుతుంది. ప్రత్యేకించి ఆయన ఆశ్రమంలోగల కామధేనువు నందు ఆకర్షణ కలుగుతుంది. ఆ దివ్య గోవు వలననే వశిష్ఠ మహర్షికి అంత వైభవం కలిగిందని భావిస్తారు. నిజానికి వశిష్ఠ మహర్షి తపస్సు వలననే సమస్త వైభవము అతనికి ఏర్పడి వుంటుంది. వసువులలో పెద్దవాడైన ప్రభాసుడు అనే వసువు భార్యకు ఆ

గోవుమీద ఇచ్ఛ పుడుతుంది. దానిని దొంగలించమని ప్రభాసుని ప్రోత్సహిస్తుంది. ప్రభాసుడు యితర ఏడుగురు వసువులతో ఆ గోవును దొంగిలించి, వశిష్ఠుని ఆగ్రహానికి గురి అవుతారు.

వసువుల నందరిని మానవజన్మ ఎత్తవలసినదిగా వశిష్ఠుడు శపిస్తాడు. వసువులు పశ్చాత్తాపము చెంది మహర్షిని ప్రార్థించగ మిగిలిన ఏడుగురు వసువులు ప్రభాసుని కారణంగా దుష్కార్యానికి తలబడటం చేత వారికి వశిష్ఠుడు శాప ఉగ్రతను తగ్గిస్తాడు. వారు మానవ జన్మమెత్తి, ఒకరోజు అనుభవించి, మరల తిరిగి వసులోకం చేరవచ్చని, ప్రభాసుడు మాత్రం దీర్ఘకాలం మానవుడై భూమిపై బ్రతుకవలెనని శాసిస్తాడు. ప్రభాసుడు మరల వేడగ, అతడు భూమిపై అత్యంత కీర్తివంతుడిగ, ధీమంతుడిగ, పూజనీయుడుగ జీవిస్తాడని, కాని జీవితమంతా నిరాశ, నిస్పృహలతో గడుస్తుందని తెలుపుతాడు.

అందుకని ఏడుగురు వసువులను పంపివేసి ఎనిమిదవ వాడిని భూమి మీద ఉంచాలి కాబట్టి గంగాదేవి సరిగ్గా ఆ timeకి శంతనుడికి ఇక ఆపేయ్ అందామనే ఆలోచన వచ్చింది. అన్నీ అట్లా synchornize అవుతాయి, కాలము నందు, దేశము నందు. దాని వల్ల ఏమి జరుగుతుంది? ఆగిపోయింది. అప్పుడు నువ్వు నాకు ఇన్నాళ్ళు పతిదేవుడిగా చక్కగా ప్రవర్తించావు, నీతో నేను అనుభూతి పొందాను, నాతో నీవు అనుభూతి పొందావు. ఈ పిల్లవాణ్ణి నేను చక్కగా దేవలోకంలో సుశిక్షితుణ్ణి చేసి నీకు అప్పగిస్తాను అంటుంది. అందుచేత భీష్ముడి చిన్నతనం

అంతా భూలోకంలో జరగదు. దేవలోకంలో సుశిక్షితుడై 18 సంవత్సరముల తర్వాత గంగాదేవి శంతనుడికి అందిస్తుంది భీష్మణ్ణి. అలాంటి మహాత్ముడు భీష్ముడు. సామాన్యుడు కాదు.

అతను భూమికి సంబంధించిన వాడు కాదు, ఒకటి. రెండు, శాపవశాత్తు భూమి మీద వున్నటువంటివాడు. మూడు, ఆయనకు శిక్షణ ఇవ్వడానికి భూలోకంలో ఎవ్వరూ లేరు. ఆయన బృహస్పతి వద్ద ఉండి, దేవతలందరి దగ్గరా అన్ని విద్యలూ నేర్చుకుంటాడు.

బృహస్పతి (దేవగురువు) వద్ద దండనీతి, రాజనీతి, పాలనా విధులు, సర్వశాస్త్రములు అభ్యసిస్తాడు.

శుక్రుని వద్ద రహస్య విద్యలు, అంతర్విశ్వ విద్యలు అభ్యసిస్తాడు.

వశిష్ఠ మహర్షి వద్ద వేదవేదాంగాలు, పురాణ, ఇతిహాసములు అభ్యసిస్తాడు.

సనత్కుమారుని వద్ద అష్టాంగయోగము, బ్రహ్మజ్ఞానము, మనో బుద్ధి తత్త్వములు అభ్యసిస్తాడు.

మార్కండేయుని వద్ద మరణ రహస్యం మరియు శాశ్వత యౌవనత్వమున నుండు విద్యలు అభ్యసిస్తాడు.

పరశురాముని వద్ద యుద్ధవిద్యలన్నీ నేరుస్తాడు.

ఇంద్రాది దేవతల వద్ద దివ్యాస్త్రాలు గ్రహిస్తాడు.

త్రిమూర్తుల కృపతో ఇచ్ఛ, జ్ఞాన, క్రియా శక్తుల ఆనుకూల్యతను, అజేయ స్థితిని పొందుతాడు.

అష్టమ గర్భుడైన దేవవ్రతుడు తల్లి గంగాదేవి సహకారంతో అష్ట గురువుల వద్ద సమస్త విద్యలు నేర్చి పూర్ణుడై, అజేయుడై నిలుస్తాడు. ఇది అనన్య సామాన్య విషయం. 18 సంవత్సరములలో సమస్త విద్యలను నేర్చి శంతనుని చేరుతాడు.

ఏ విద్య యందైనా పరిపూర్ణుడు. అలాంటి పరిపూర్ణుడైనటువంటి అతను ఎప్పుడూ దైవము, దేవలోక చింతనలో వుంటాడు. దేవవ్రతుడు అతడు. ఆయన కథ మనం, ఆయన పుట్టినరోజు ఈరోజు, చెప్పుకుంటున్నాం. అటువంటి మహాత్ముడు ఈ సృష్టి అంతా కూడా దగ్గర వుండి దర్శనం చేస్తూ వుంటాడు. అంతే! దర్శనం చేయడమే!

నేను వివాహము చేసుకోను. నేను రాజకుమారుడిగా వుండను, రాజ్యానికి ఉత్తరాధికారిగా వుండను. అంటే రాజ్యానికి ఉత్తరాధికారిగా వుండక పోయినా నీకు కలిగే సంతానం నీ అంత పరాక్రమం కలిగి యుంటారు కాబట్టి, వారి వల్ల మా సంతానానికి ఇబ్బంది కలుగుతుందో ఏమోనని ఆ చేపలవాడు అడిగిస్తాడు. బెస్తవాడు కదా! అంటే మీకు ఆ సందేహం కూడా అక్కరలేదు. నేను వివాహమే చేసుకొను అన్నాడు కదా! ఎందుకని అలా అన్నాడంటారూ? మామూలుగా మనం ఏమనుకుంటామంటే తప్పు చేశాడు భీష్ముడు, అని చెప్పుకుంటూవుంటాం కదా! అంటే

మన ప్రక్కనుంచి చూస్తే తప్పే! ఎప్పుడూ మనం మన కోణంలో నుంచి చూస్తూ వుంటాము కదా! ఆయన కోణంలో నుంచి కూడా చూడొచ్చు. ఆయన కోణం ఏమిటి? ఈ భూమి మీద ఆయనికి ఏదీ అవసరం లేదు. ఈ భూమి మీద వుండాలి, అంతే, ఆయన పని. ఈ భూమి మీద ఏమీ అవసరం లేదు. ఆయనకు. రాజ్యం అక్కరలేదు. ఎందుకంటే ఆ లోకాలలో వుండేవాడికి ఇదేం రాజ్యం? ఆయన ఎక్కడి వాడు? ఎక్కడికి వచ్చాడు? దేనికోసం వచ్చాడు? ఆయనకు ఒక కర్తవ్యం వుంది. అందుకని ఆయన కర్తవ్యాన్ని అనుసరించి ఉంటాడు. ఆయనకు వివాహం లోపల, జీవలక్షణంలో అసలు లేదు. జీవలక్షణంలో వివాహము గురించి ఏ మాత్రం లేనివాడు భీష్ముడు. ఎందుకని? ఆయన దేవవ్రతుడు. ఆయన వీర్యం అంతా ఎంతసేపూ ఊర్ధ్వముఖంగా పోతూవుంటుంది. అతడు ఊర్ధ్వముఖుడు.

ఈయన వేరే లోకాల్నించి వచ్చినటువంటి వాడు. అసలు వ్యక్తే విశిష్టంగా వుండేవాడు, మిగతా వాళ్ళతో పోలిస్తే! ఆ రూపమే చాలా విశిష్టంగా వుండేది. ఎప్పుడూ శ్వేత వస్త్రధారణమే. స్వచ్ఛం! గంగ వలే స్వచ్ఛమైనటువంటి దేహం కలిగినవాడు. అసలు ఆయన దేహమే కాంతివంతంగా వుండేది. ఆయన వేసుకొనేటువంటి దుస్తులు అలాగే వుండేవి. ఆయన ధరించే నగలు కూడా అన్నీ ముత్యములే. ఆయన నుంచి భావములు కూడా అన్నీ శ్వేత భావములే. మరొక భావం రాదు! ప్రయత్నించినా వేరే భావము రాదండీ ఆయనకు. ఆయన జీవలక్షణంలో వివాహం లేదు

అసలు. వివాహం చేసుకుంటాడేమో అనేటువంటి భయం ఇంక ఎందుకూ? అనవసరం కదా! నేను వివాహమే చేసుకోను కదా! తన అంతర్గతమైన విషయం ఆరోజు బహుశా బహిర్గతం చేశాడు, అంతే! ఏమిటీ? రెండు విషయాలు చెప్పాడు. నేను ఈ భూమిని పాలించడానికి రాలేదు అని. నువ్వు రాజ్యాన్ని పరిపాలించడానికి వచ్చావా, నీ రాజ్యమేది? అని అడుగుతాడు రోమను న్యాయాధికారి ఏసుక్రీస్తుని. అంటే , ''నా రాజ్యం వేరే వుంది. ఈ రాజ్యం ఏమిటి It is not of earth, It is of light'' అంటాడు ఆయన. నేను వెలుగు రాజ్యాన్ని ఏలడానికి వచ్చినటువంటి వాడిని తప్ప ఈ మట్టి రాజ్యం ఏలడానికి రాలేదురా, అని చెప్తాడు, ఏదీ? ఏసుక్రీస్తు అంతటివాడు. మరి అసలు ఈయనకు దీని మీద దృష్టియే వుండదు. చాలా చిన్న విషయం ఆయనకు.

ఈ భూమి మీద పరచుకు పోదామనేటువంటి బుద్ధి మనది. ఈ భూమి మీద పరచుకుపోవడం కాదు, వీలుంటే కూరుకుపోదామని అనుకుంటూ వుంటాం కదా! పని అవంగానే వెళ్లిపోవాలి. దిగివచ్చిన వాడు పని అవంగానే వెళ్లిపోవాలి. ఇప్పుడు గురుపూజలకి వచ్చినవాళ్ళు అందరూ వెంటనే వెళ్ళిపోతామని అనుకోరూ? ఇంకో పూట వుండవయ్యా అన్నా ఒక్కడు కూడా ఉండడు. తుపాకీ గుండుకు కూడా దొరకరు, పారిపోతారు. ఇలా అవగానే బండి ఎక్కేస్తారు కదా! ఎందుకనీ వేరే వ్యాపకాలు వున్నాయి కదా! మామూలుగా ఇల్లు, ఇల్లాలు, పిల్లలు, సంసారం, సమస్యలు– అవన్నీ పిలుస్తూ వుంటాయి కదా! ఏదో వాటికి

చెప్పుకొని, పులికి చెప్పుకొని ఆవు వచ్చినట్లుగా, వస్తూవుంటాం గురుపూజలకి. పులికి ఆవు చెప్పుకుంటుంది బాబ్బాబు టైమ్ ఇవ్వరా, దూడకు పాలిచ్చుకొని వస్తానంటుంది కదా, అట్లా ఏదో మనం కష్టపడి మొత్తానికి మన జీవితం అనే పులి నుండి తప్పించుకొని మాస్టర్ అనేటువంటి ప్రజ్ఞలో కాసేపు కూర్చోవడానికి వస్తూ వుంటాము. ఇక్కడ కూర్చోవడం భీష్మునికి ముళ్ళకంపలో కూర్చున్నట్టుగా వుంటుంది. ఎప్పుడూ కూడా పెద్దల గూర్చి ఆలోచన ఎలా చెయ్యాలంటే, ఆ ప్రజ్ఞను మనము బాగా ఉపాసన చేసి, అందులో మనం ప్రవేశిస్తే, ఆయన ఏ దృష్టితో ప్రవర్తించారు అనేది తెలుస్తుంది. అంతేకాని మనకు వుండే standards, మన parameters పెట్టి, మన ప్రమాణాల ఆధారంగా, అలాంటి ధర్మాత్ముల గూర్చి నిర్ణయం చేయకూడదు. తప్పు అది. చాలా తప్పు.

ఇవాళ అదే తెలుసుకున్నాను ప్రార్థనలో. ఎందుకంటే ఎవడికి తోచినది వాళ్ళు మాట్లాడతాము కదా! మనకు నోరు ఇచ్చాడు దేవుడు, పిల్లి బుర్ర ఇచ్చాడు. ఈ బుర్రతో ఆయన్ని అంచనాలు వేసేస్తున్నాము. వేసేసి భీష్ముడు తప్పు చేశాడు, అలా చేయకుండా వుండాల్సింది అంటే ఎలా వుంటుంది చెప్పండి? మహాత్ముడు ఆయన. మన లోకంలో తిరుగుతున్నవాడు తప్ప, మనలో సంచరించిన వాడే కానీ, మనవాడు కాదు ఆయన. ఇదే విషయం ఉద్ధవుడు విదురుడికి చెప్తాడు, శ్రీకృష్ణుని గూర్చి. చేపపిల్లలు బోలెడు తిరుగుతూ వుంటాయి సరస్సులో.

పూర్ణచంద్రుడు వచ్చి నప్పుడు, ఆ చంద్రబింబం సరస్సులో పడుతుంది. సరస్సులో పడితే ఆ పూర్ణబింబంకూడా ఇట్లా ఇట్లా అల్లల్లాడుతూ వుంటుంది కదా! లోపల తిరుగుతున్న చేపలు, మనలాంటిదే ఇదీ ఒక చేప అనుకుంటాయిట. మనలాగే ఇదీ ఒక చేప, కొంచెం దీనికి ఒక రవ్వ తేడాగా వుంది, మనలాగా తోక లేదు, ఇలా ఏవేవో అనిపిస్తాయి. అలా అనుకుంటాయి కదా! అలా అనుకున్నాము మనం అంతా కృష్ణుడు గురించి అని విదురునికి ఉద్ధవుడు చెప్తాడు. నిజానికి ఆ బింబం చంద్రుడు కాదు కదా! చంద్రుడు ఎక్కడ వున్నాడు? ఆయన అక్కడ అల్లల్లాడుతున్నాడా? లేదు. ఇట్లా అష్ట వంకరలు తిరుగుతున్నాడా నీళ్ళలో? లేదు. ఆకాశంలో వున్న చంద్రబింబం నీటిలో ప్రతిబింబించిందే కాని, నీటిలో మునగలేదు. నీరు అంటలేదు. అందుకని భూమి మీద వున్నప్పటికీ భూమి ప్రజ్ఞ ఆవరించనటువంటి మహాత్ముడు భీష్ముడు. అది గుర్తు పెట్టుకోవాలి.

మనం మరొక విషయంగా చెప్పుకోవాలనుకుంటే, సమస్తమును స్థిరచిత్తంతో అలా గమనిస్తూ, గమనిస్తూ కాలమును దేశమును బట్టి తన కర్తవ్యాన్ని నిర్వర్తించినటువంటి వాడండీ భీష్ముడు. అలా తన కళ్ళముందు అంతా జరుగుతూ వుంటే, తను ఏమిటి ఇందులో, తన కర్తవ్యం ఏమిటి, తన కర్తవ్యం ఏది కాదు, అని స్పష్టంగా తెలిసినటువంటి మహాత్ముడు భీష్ముడు. సామాన్యుడు కాదు. అందుచేత తెలియక అట్లా వుండలేదు. కాలమెరిగి, దేశమెరిగి, ధర్మమెరిగి– ఈ మూడూ తెలిసి తన

కర్తవ్యమెరిగి తదనుగుణంగా వుండిపోయాడు. అందుకని ఆయన చిట్టచివరికి వెళ్ళడం కూడా, మళ్ళీ మాఘమాసంలో ఏకాదశి నాడు స్వచ్ఛందంగా తను కోరిన పద్ధతిలో తను వెళ్లిపోయాడు. అలా వెళ్లిపోతున్నవాడి దగ్గరకి చతుర్భుజుడై శ్రీకృష్ణుడు వస్తాడు. శ్రీకృష్ణుడు చతుర్భుజుడై దర్శనమిస్తాడు అక్కడ. ఏదీ? భౌతికంగా! భౌతికంగా ఆయనకి స్పష్టంగా కనిపిస్తుంది, అలా కృష్ణుడు చతుర్భుజుడై కనిపించడం. అందులో ఆయనకు ఆశ్చర్యం లేదు. ఎందుకనీ? ఆయన ఎప్పుడూ అలాగే చూస్తుంటాడు. ఎప్పుడూ పూసుకొని తిరిగే అర్జునుడికి తెలియదు ఆయన చతుర్భుజుడని, తెలుసా? ధర్మరాజాదులకీ తెలియదు. మనకు బాగా చాలా close అండీ, మనకి చాలా close అండీ అంటుంటాం కదా! ఈ close గాళ్లకు ఏం తెలియదు. తెలియాలంటే లోపల్నించి తెలియాలి. close అని claim చేసుకోవడమే తెలుస్తూ వుంటుంది. అక్కడ చూస్తాడండి, తన కోసం వచ్చాడని. ఏదీ? తను నిర్ణయం చేసుకొన్నాడు దేహం వదిలేయడానికి. తనకోసం వచ్చాడండి వెళ్లిపోతుంటే!

ఎవడికోసం వెళ్లాడండి వెళ్ళుతున్న వాళ్ళకోసం కృష్ణుడు, చెప్పండి! వెళ్లిపోతున్నవాళ్ళ దగ్గరికి ఎవరి దగ్గరికైనా ఈయన వెళ్ళాడా? ఈ పాండవులు వాళ్ళంతట వాళ్లే వెళ్ళిపోయిన వాళ్ళేగా, అంతేనా? తోడువెళ్లి పంపించాడా? లేదుగా! పోనీ ధృతరాష్ట్రాదులు వీళ్ళు, ఇంకొక charecter చెప్పండి తోడుండి పంపించింది? తను సొంత కుమారుడిగా పెంచిన అభిమన్యుడిని

కూడా తోడుండి పంపించాడా? తన మేనల్లుడు. తనే స్వయంగా విద్యలు నేర్పాడు. ఆయన ఏమీ మోహం లేనివాడు. అలాంటి వాడు భీష్ముడి విషయంలో అందరినీ పట్టుకొని వస్తాడు. అంతటివాడు భీష్ముడు. అంటే ఈయన రాకపోతే ఆయనకు తేడా పడ్తుందా? పడదు. ఈయన ఎంతటివాడో తెలియాలి కాబట్టి కృష్ణుడు వస్తాడు. ఎంత చెప్పినా తెలియదు కదండి! అలా ఒకడు నాలుగు తరాలు చూస్తాడండి. తండ్రి తరం చూస్తాడు, తన తరం చూస్తాడు. తన తమ్ముల సంతానం తరం చూస్తాడు. ధృతరాష్ట్రాదులు, పాండవుల తరం చూస్తాడు. ఉపపాండవులు కూడా అప్పటికి పెద్దవాళ్ళయి పోతారు. మరణిస్తారు. అది వేరే విషయం. ఐదు తరాలు చూసినటువంటి వాడు. చూస్తూ వున్నాడండీ. అన్నీ తెలిసి, సర్వ సమర్థత కలిగీ, కాలము ధర్మము కర్తవ్యం తెలిసి, తను చేయవలసిన పని మాత్రమే చేసి, తన దారిన తాను ఎంత అద్భుతంగా వెళ్లిపోయాడంటే, భీష్ముడి కన్నా గొప్పగా వెళ్ళిన వాళ్ళెవరూ భారత కాలంలో కనిపించరు.

ఎలాంటి ఎలాంటివాళ్ళు వచ్చేస్తారో తెలుసా భీష్ముడు వెళ్లిపోతుంటే? ముందు కృష్ణుడు ధర్మరాజాదులను తీసుకొని వస్తాడు. అంతే గంధర్వులు దేవతలు అందరూ వచ్చేస్తారు. వస్తే చాలా సంతోషిస్తాడు భీష్ముడు, కృష్ణుని చూసి. ఎందుకనీ? అతని మనసెప్పుడూ, కృష్ణుడి మీదే! ఏ కృష్ణుడు? ఇట్లా చొక్కా లాగు తొడుక్కున్న కృష్ణుడు కాదు. సర్వ వ్యాపి అయినటువంటి కృష్ణుడు. ఆయనకు కాంతి దర్శనం ఎప్పుడూ కలుగుతూనే వుంటుంది.

ఆయన విశ్వవ్యాపకత్వం ఎప్పుడూ చూస్తూనే వుంటాడు. అందుకని ఆ పద్యాలలో చాలా గంభీరమైనటువంటి విషయాలు వున్నాయి. మనకు ఎంత వస్తే అంత చెప్పుకుంటాం. అయినప్పటికీ ఈ రోజు భీష్మాష్టమి కాబట్టి, మనం కొంత భీష్ముని యొక్క స్మరణ చేయటం వలన, మనలో కొంత కల్మషహరణం జరుగుతుంది. సందేహం లేదు. ఎందుచేతనంటే కృష్ణుడు మన్నించిన వాళ్ళలో భీష్ముడు అగ్రగణ్యుడు మళ్ళీ. ఇలా ఇంకెవరి దగ్గరకు వెళ్ళలేదు. అంతేకాదు ఆయన చక్రం పట్టడం కూడా భీష్ముడి కోసమే పడతాడు యుద్ధంలో. ఇంకెవరికోసం పట్టడు. అది కూడా నేను చెప్తూవుంటా, అర్జునుని కాపాడడం కోసం చక్రం పట్టడం కాదు, భీష్ముడి మాట చెల్లించడం కోసం చక్రం పడతాడు శ్రీకృష్ణుడు. కృష్ణుడు తలచుకుంటే ఏ రకంగానైనా పని కానివ్వగలడు. ఆయన ఘటనాఘటన సమర్థుడు. కానీ భీష్ముడు ఓమాట అంటాడు. "ఆయుధం ధరించనన్నాడా" నేను శ్రీకృష్ణుడిచేత ఆయుధం ధరింపచేస్తాను అన్నాడు. ఆయన అంటే కృష్ణుడు చెయ్యాలా? ఎందుకు చేశాడు? తన భక్తుడు కాబట్టి. భక్తుల మాట కోసం రోలు కట్టుకొని చెట్ల మధ్య నుంచి వెళ్ళిపోయి నానా బాధలు పడ్డాడు కదండీ, నారదుడు చెప్తే నలకూబరుల విషయంలో! అలాగే భీష్ముడు అన్న మాట చెల్లించడంకోసం చక్రం పట్టుకుంటాడు. ఆ పద్యం రెండు రకాలుగానూ చెప్పుకోవచ్చు.

*"తనకున్ భృత్యుడు వీని గాచుట మహాధర్మంబు వొమ్మంచు"* అంటే ఎవడా భృత్యుడు? ఆయన భృత్యుడు. వాని మాట చెల్లించడం. అతనిని బ్రోవడం అంటే, అతను అన్న మాట

చెల్లించడం. నా చేత ఆయుధం పట్టిస్తానన్నాడు భీష్ముడు, అతను అన్న మాట నేను చెల్లించాలి, కాబట్టి ఆయుధం పడ్తున్నాను అంటాడు. అందుకని ఆయన ఆయుధం పట్టగానే దణ్ణం పెట్టేస్తాడు. ఎందుకు దణ్ణం పెడ్తావు? ఎందుకు వచ్చాడు? తన మాటకు అంత విలువ ఇచ్చాడు. దైవమునకు మోకాలు మీద నిలచి దణ్ణం పెట్టేస్తాడు భీష్ముడు. ఇవన్నీ అర్జునునికి అర్థం అవదు కదా! మనకు అర్జునుడు మహా పెద్దవీరుడు కదా! కానీ వారందరి ముందు వీడు పిల్లకాయ. దణ్ణం పెడ్తే కృష్ణుడు నవ్వుతాడు, భీష్ముడిని చూసి. అంటే ఇంక చాలని చెప్పడం అన్నమాట! ఇక నువ్వు యుద్ధం చేయక అని చెప్పడం. వాళ్ళలో వాళ్ళు మాట్లాడుకొనే language వేరే వుంటుంది. యిలాంటి మహాత్ముడు భీష్ముడు.

ఆ కాలంలో భీష్ముడి కన్నా మించిన వాడు మరొకరు లేరు. లోకం అంతా కీర్తించింది. కాని భీష్ముడికి ఒక్కడికే తెలుసు తన కన్నా మించినవాడు ఒకడు ఇక్కడ వున్నాడని, అది కదా రాజసూయం. అందరు రాజులు, విద్వాంసులు, ఋషులు, మహాత్ములు కలిసి ఎవరికి అగ్రపూజ చేయాలి రాజసూయంలో అంటే, అందరూ కలిసి ఏకగ్రీవంగా భీష్ముడు అని తేల్చేశారు. భీష్ముడిని తాతా! నీకు అగ్రపూజ చేసుకుంటాము, చిట్టచివరిగా అంటే, తప్పు! అంటాడు భీష్ముడు. అందరికన్నా పెద్దాయన ఒకాయన వున్నాడు, ఆయనకు చేయాలంటాడు. అందరికన్నా పెద్దాయన ఎలా అంటే, ఆయన ఏదీ కానట్టుగా వుంటాడు. అదీ ఆయన గొప్పతనం. అది అంత సులభమైన విషయం కాదు.

**గొప్పవాళ్లు గొప్పగా కనిపిస్తే గొప్పేముందండి? గొప్పవాడై, గొప్పగా కనిపించకుండా వుండేవాడు గొప్పవాడు కదా!** అందుచేత ఎవరూ గుర్తించలేదు! ఇంత పాండవులూ గుర్తించలేదు, ఇక మిగతావాళ్ళు గుర్తించేది తక్కువ. సన్నిహితులగు పాండవులే గుర్తించలేనపుడు ఇక యితరులేమి గుర్తిస్తారు. మునులు, ఋషులు కూడ గుర్తించలేకపోయారు. భార్యలు కూడ అంతే, రుక్మిణీదేవి తప్ప! ఎవరూ గుర్తించలేదు. భీష్ముడు గుర్తించాడు. ''మనందరికీ పెద్ద ఒకడున్నాడు, అతడే కృష్ణుడు! ఆయనకి అగ్రపూజ చేయండి'' అని చెప్పాడు. భీష్ముడు చెప్పడం వల్ల కృష్ణుడు కూర్చున్నాడు. అయితే తను కూర్చోకుండా భీష్ముడు కూర్చున్నాడనుకోండి, కృష్ణుడు ఏమీ అనుకోడుగాని, భీష్ముడికి మంచిది కాదు, అంతే! కృష్ణుడికి అన్నీ ఒకటే. అది మహాతత్త్వము. ఆ తత్త్వము అవగాహనకు తెమిలే తత్త్వము కాదు. అందులో మునిగిపోవడమే. అలాంటి తత్వము నెరిగినవాడు భీష్మపితామహుడు. అందుకని, అలాంటి భీష్ముని పుట్టినరోజు ఈ రోజు. ఉత్తర భారతదేశంలో ఈ భీష్మాష్టమి చాలా బాగా చేసుకుంటూ వుంటారు. ఈ భీష్మాష్టమినాడు పిల్లలు పుట్టనివారు పిల్లలు పుట్టే వ్రతం కూడ చేసుకుంటారు.

# ౩. అమ్మవారి శిక్షణ

మన సంతానం మీద అంతా మనదే హక్కు అనుకోకూడదు. మన పూర్వీకులకీ హక్కుంటుంది. తరువాత రాబోయే తరాలకీ హక్కుంటుంది. ఇవన్నీ మనకి తెలియవు కలియుగంలో ఉన్నాం కాబట్టి. అందుచేత నీ సంతానం నీ సంతానమే అనుకోబోక, వాళ్ళు ఉత్తరాధికారులీ రాజ్యానికి, అలా ఇచ్చేయకూడదని రాజ పురోహితులు చెప్పటంచేత, శంతనుడు ఆ మాట గంగాదేవితో చెప్తాడు. అలాగే తప్పకుండా మీరు కోరినట్లుగానే మీ సంతానాన్ని మీకే అప్పచెప్తాను, కానీ ఈ రోజు నుంచి మన ఒప్పందం ప్రకారం ఇంక మనకి భార్యాభర్తల సంబంధం ఉండదు, అని చెప్తుంది. దానికి శంతనుడు కూడా అంగీకరిస్తాడు. ఎందుకంటే అప్పటికే ఏడుగురు సంతానాన్ని కన్నాడంటే, ఇక ఒకరి మీద ఒకరికి ఇదే అనురాగం వేరొక రకంగా మారుతుంది తప్ప కేవలం ఒకరినొకరు పొందాలనేటువంటి బుద్ధి ఇంక తగ్గిపోతూ వస్తుంది. అలాగే అంటాడు శంతనుడు కూడా. అందుచేత అమ్మవారేం చేస్తుందంటే, ఈ పిల్లవాడికి నేనే శిక్షణ ఇచ్చి సుశిక్షితుణ్ణి చేసి పంపిస్తాను అని, దేవలోకం తీసుకెళ్లి బృహస్పతి దగ్గర సమస్త విద్యలు నేర్పుతుంది.

శాపమిచ్చిన వశిష్ఠాది బ్రహ్మర్షులు, దేవర్షులు, ఇంద్రాది దేవత లందరు కూడా విద్యలు నేర్పుతారు. ఆయనకి

విద్య నేర్పటానికి చాలామంది ముచ్చట పడతారు. అలా పద్ధెనిమిది సంవత్సరములు దేవలోకములో వసించి, విద్యలు నేర్చుకున్నటువంటి వాడు, భూలోకానికి తీసుకొస్తే, ఆయనకెట్లా ఉంటుందండీ? అది మనం ఆలోచించద్దూ? ఆలోచించాలి కదా! ఎంతసేపూ మన పిచ్చిగోలే మనకుంటూ ఉంటుంది. అంటే మన ప్రమాణాలు, మన పరిస్థితులు, వీటిలోకి పూర్తిగా కూరుకొని పోలేడుగా! కూరుకు పోగలడా? పద్ధెనిమిది సంవత్సరాలు, చిన్న తనం నించి దివ్యలోకాల్లో సంచరించిన వాడికి భూలోకంకి వస్తే ఎట్లా వుంటుంది? భూలోకంలోకి పోనీ రాజుగారింట్లోకే వచ్చాడు. అయినప్పటికీ ఎట్లా ఉంటుంది భూలోకం? మనకి తెలియదు. ఆయన తెలిసొచ్చాడు ఇందులోకి. అది చాల పెద్ద త్యాగమని చెప్తారు. దివ్యలోక వాసులు భూలోకంలో ఉండడమంటే, ఆ మాట వాడకూడదు కానీ మరి వాడాలి. పాయిఖానాలో ఉన్నట్టుగా ఉంటుంది. మన ఇంట్లో మనం పాయిఖానాలో ఎప్పుడూ ఉండగలమా? అలా ఉంటుంది. ఎందుకని? భూలోకంలో ఉండేటువంటి పరిస్థితికీను, దివ్యలోకాల్లో ఉండే పరిస్థితికి అంత తేడా ఉంది. ఇందులో కూడా దైవాన్ని చూడగలగటం సామాన్యమైన విషయం కాదుకదా! అయినప్పటికీ మరి నీ తండ్రి అక్కడ ఉన్నాడు, నేను మాట ఇచ్చాను, నువ్వు ఫలానా వాడి కుమారుడివి కాబట్టి వచ్చేయమంటే వచ్చేశాడు.

పదునెనిమిది సంవత్సరముల రాజకుమారుడిని చూస్తే రాజ్యంలో ప్రజలందరూ కూడా చాలా ఆనందపడిపోతారు,

అబ్బబ్బబ్బబ్బా వర్ణించ అలవి కానటువంటి అందము, ఠీవి, శౌర్యపరాక్రమములు. ఎంత పరాక్రమము? రామాయణంలో రాముడి గురించి అయోధ్యలో ఎలా తలుచుకునేవారో, అలాగే కురు సామ్రాజ్యంలో భీష్ముడి గురించి అలా అనుకుంటూ ఉండేవారు ప్రజలు. రోజూ ఆయన కథలు చెప్పుకోవడమే. ఆయన గుఱ్ఱమెక్కినా అద్భుతంగా ఉంటుంది, రథమెక్కినా అద్భుతంగా ఉంటుంది, నడిచినా అద్భుతం. ఇలా ఉండే ఒక వ్యక్తి, అంటే మనలో ఒక దివ్యపురుషుడు తిరుగుతున్నాట్ట అంటే ఇక దాన్ని ఊహించలేమండీ! ఆ మధురాష్టకం ఉందే మనం చదువుకుంటూ ఉంటాం, అధరం మధురం, నయనం మధురం, అది మధురం, ఇది మధురం, ఏది పడితే అదే మధురం. ఆయనేం చేసినా మధురంగా ఉంటుంది. అలా ఉండే రాజకుమారుడండి.

శంతన మహారాజు ఇచ్చేస్తే ఇచ్చేశాడు ఏడుగురిని, ఎలాంటి వాడిని తెచ్చుకున్నాడు! ఎలాంటి కుమారుడు? రాముని యందు దశరథుడికెంత వ్యామోహం ఉంటుందో అంతటి వ్యామోహం శంతనునికి కలుగుతుంది భీష్ముడి మీద. ఎందుకని? అతడు మనలో ఉన్నాడు తప్ప మనలోని వాడు కాదు. మనలో మసలుతూ ఉన్నవాడు తప్ప, మనలాంటి వాడు కాదతను. అలాంటివాడు. అప్పటికీ లోకమర్యాదని ఆచరించడంకోసం భూమి మీద ఒక శిష్యరికాన్ని అంగీకరిస్తాడు. పరశురాముడి దగ్గర మళ్ళీ విద్యకి చేరతాడు. పరశురాముడి దగ్గరకు కూడా వెళ్లి విద్య నేర్చుకుంటాడు. పరశురాముడు సాక్షాత్తు విష్ణు అవతారమే.

పరశురాముడు పర్వతం ఉంటుంది సహ్యాద్రి పర్వతాలకు మీరువెళితే! సహ్యాద్రి పర్వతాలు తప్పక భారతీయులు అందరూ చూడాలి. అక్కడున్న అద్భుతాలు ఇన్ని అన్నీ కాదు, ఎన్నెన్నో. అక్కడే సప్తశృంగి అనే అద్భుతమగు పర్వతముంది. అందుమీద అత్యద్భుతమగు దుర్గ ఆలయం వుంది. అమ్మవారు ఉంటారు. అక్కడే పరశురాముడు తపస్సు చేసిన పర్వతం– పెద్ద గంట వలె ఉంటుంది. నున్నగా ఉంటుంది. నల్లరాయి పర్వతం. ఎవరు చూసినా ఫోటోలు తీయడం తప్పదు. అట్లా ఉంటుంది. తపస్సు చేసుకుంటూ ఉంటాడాయన. ఆయన దగ్గరికి వెళ్లి భీష్ముడు శిష్యరికం చేసి వస్తాడు. ప్రజలందరూ రాముడికి పట్టాభిషేకం చేస్తే బాగుంటుంది అని ఎట్లా అనుకుంటూ వుంటారో, అలా ఈ భీష్ముడికి ఎప్పుడు పట్టాభిషేకం చేస్తారా అనే పరిస్థితి. ఇప్పుడు చెప్తుంటారు చూడండి చాలా expectation ఎక్కువైపోతూ వుంటుంది. రాముడి విషయంలో అలా expectations చాలా ఎక్కువై పోతాయి గదా! భీష్ముడి విషయంలో కూడా expectations చాలా ఎక్కువ. శంతనుడే చాలా ఆకర్షణీయమైనటువంటి మహారాజు. ఆయన కుమారుడు ఆయన్ని మించిపోయినాడు. ఎన్నిరకాలుగా మించి పోయినాడో ఊహించలేము. అందుకనే ప్రజలు ఆయన్ను కోరుకోవడం మొదలుపెట్టారు.

ముందు నాకు అనిపించింది. ఈ భాగవతాది గ్రంథములు మనకు సంస్కృతము నుండి బాగా తెలుగు పద్యములు అవగాహన వుండే సమయములో పద్యరూపములో తెలుగులో వచ్చినాయి.

పద్యాలు చదువుకుంటే ఇప్పుడు ఎవ్వరికి అర్థంకావు. పద్యము ఇప్పుడు ఎవ్వరూ ముట్టుకోరు కదా. అందుకని ఇప్పుడేమి చేశారంటే మనకు వచనమే తెలుసు కాబట్టి వచనములోకి వచ్చింది, మాస్టర్ ఇ.కె. గారి ద్వారా వివరంగా వచ్చింది. ఇప్పుడు తెలుగు వవచనం కుడా అర్థంకాని రోజులు కనబడుతున్నాయి. వాళ్లేమంటారంటే (మాస్టరుగారి పుస్తకాలు చదివిన వాళ్ళు) ఆయన భాష కంటే మీ భాష సులువండి అంటారు. అంటే నాకు ఏమనిపిస్తుందో తెలుసా? ఆయన భాష కంటే మీ భాష నాసి అని. ఎందుకంటే ఎంత నాసిగా వుంటే అంత అర్థం అవుతుంది ఈ రోజుల్లో! ఇంతకన్నా అది ఉత్తమమైన భాష. అంతకన్నా పద్యంలో ఎక్కువ భావం ఇముడుతుంది.

అందుకని ఇప్పటి భాషలో చెప్పాలంటే over expectation అయిపోయింది, భీష్ముడిని గురించి. అంత over expectation తట్టుకోలేకపోతున్నాను బాబోయ్! అంటారు. అట్లా తట్టుకోలేనంత ఆసక్తి. ఎప్పుడు యువరాజైన భీష్ముడు, రాజు అవుతాడా అని! ఆయనకు అసలు ఆ దృష్టి లేదు. రామునికి కూడా రాజు అయ్యే దృష్టి లేదు. విచిత్రం. ఎప్పుడూ అంతే. దానికోసమే చొంగలు కార్చుకుంటూ ఉంటారు కొందరు. వారికేమో ప్రకృతి ఇవ్వనే ఇవ్వదు. దాని దృష్టి లేనివాడికి తగిలిస్తుంది ప్రకృతి. అదే ఆవిడ తమాషా. రాజ్యదృష్టి లేదు. ఈలోపల తండ్రిగారికి అలా గంగాతీరం వెళ్ళడం అలవాటు అయిపోయింది. ఎందుకని? గంగాతీరానికి వెళ్ళడం వలనే తనకి గంగాదేవి దర్శనం ఇస్తుంది.

ఎందుకని వెళ్ళాడు? అంతకు ముందు సత్యలోకంలో చూశాడు గంగను. ఇప్పుడు మళ్ళీ కనపడ్డది. సరే ఆమెతో కాలక్షేపం చేశాడు. కాపురం చేశాడు. అయిపోయింది. ఆవిడ వెళ్లిపోయింది. వెళ్లిపోతే మాత్రం గంగాతీరానికి వెళ్ళే అలవాటు మారిపోతుందా మారదు కదా! గంగాదేవి యందు అనురాగం పోతుందా? పోదు కదా! మానవ శరీరంలో వున్నంత కాలం శంతన మహారాజుకు గంగ గుర్తుండిపోతుంది. అటుపైన దేహ త్యాగానంతరం తాను సత్యలోకం చేరినపుడు ఈ పూర్వ స్మృతులు నశిస్తాయి.

# 4. వ్యాస మహర్షి జననం

గంగకు వెళ్ళే అలవాటు మొదలు పెట్టాడండి శంతనుడు. ఈయన అలా మాటిమాటికి గంగాతీరానికి వెళ్ళుతుంటే ప్రకృతి ఇంకొక సన్నివేశము ప్రవేశపెట్టింది. ఏమిటది? అదే గంగాతీరములో నావ నడుపుతుండే మరియొక అతిలోక సౌందర్యవతి అయిన కన్య కనిపించడం. ఎంత విచిత్రంగా ఉంటుందో చూడండి. ఆవిడే సత్యవతీ దేవి కదా! సత్యవతీదేవి అంటే ఆవిడ సత్యలోకవాసే. పరిశుద్ధాత్మ అంటుంటాం కదా! తను చాలా పరిశుద్ధమైనటువంటి జీవచైతన్యము. ఆవిడను ఆ పైలోకాల నుండి పట్టుకొస్తారు. ఈ కథలన్నీ ప్రకృతి ఏర్పాటు చేసింది. ఏదో నీళ్లల్లోకి దిగడం అలా వర్షం రూపంలో ఓ చేపలోనికి ప్రవేశించడం, ఆ చేపను ఓ బెస్తవాడు తీసుకెళ్లడం, ఆ బెస్తవాడు దాని పొట్టకోస్తే ఆ పొట్టలోంచి ఈ కన్య రావడం– అందుకనే ఆవిడను మత్స్య కన్య, మత్స్యగంధి అనడం అవన్నీ కాకతాళీయం. అయితే ఆవిడ దగ్గర చేపల వాసన ఏముండదు. అందులో ప్రవేశించిన దివ్యప్రజ్ఞకి అలాంటి వాసన ఏముండదు. సుగంధముగానే ఉంటుంది. అందుచేత ఆవిడ దివ్య చైతన్యము కలిగిన వ్యక్తి కనుకనే శంతనుడికి మళ్ళీ ఆకర్షణ కలిగింది. ఎవరు నువ్వు? ఇలాంటి ప్రశ్నలన్నీ అవుతాయి కదా! చెప్తుంది నా

address ఇదీ అని. ఏమిటీ address అంటే జాలరిపేట అని చెప్పేస్తుంది. అక్కడ మా నాన్న ఉంటాడు. జాలర్లకు మా నాన్న అధిపతి. అంటే లోపల కొంచెం ఒక beat miss అయిపోతుంది శంతనునికి. అంటే మట్టిలో మాణిక్యం అంటుంటా చూశారా, అలాంటి వాళ్ళు చాలామంది దిగారు భారత కథ అప్పుడు.

సత్యవతీదేవి ఈవిధంగా శంతనుడికి కనిపించే లోగా పరాశరమహర్షికి కూడా కనిపించింది. ఏవిటి ఆవిడ పని? వాళ్ళ నాన్న ఏదో boat యిచ్చాడు, అటుఇటు గంగను దాటించు తల్లీ! అని. ఈ సత్యవతీదేవిని చూసిన పరాశరుడు (అప్పటికి ఆయనే జగద్గురువు). ఈమె పరిపూర్ణమయిన కన్య. పదహారు కళలతో వుండి, నిర్మలమైనటువంటి కన్య. అలాంటి కన్య తత్త్వము నందు తన దగ్గర ఉన్న సమస్తమైన విద్యలు ప్రవేశింపజేసి ఒక రూపాన్ని కల్పించాలంటే, ఒక జీవుణ్ణి ఆహ్వానించాలంటే, ఇంతకన్నా మంచికన్య తత్త్వం లభించదని పరాశరునికి నిర్ణయమై పోతుంది. అంతటి కన్య ఆమె! సత్యవతీదేవి! సామాన్యమైన విషయం కాదు. సత్యవతి అంటే సత్యమే రూపుకట్టుకున్న నిర్మలమూర్తి. అత్యంత ప్రకాశవంతమగు ప్రకృతి. మూల ప్రకృతికి మచ్చుతునక. పరాశర మహర్షి కూడ పరాకాశ తత్త్వమునందు వశించు యుండు జగద్గురువు. ఆమె సత్యరూపిణి, ఆయన పరతత్త్వము. ఆయన పరావాక్కు, ఆమె పశ్యంతి వాక్కు. అప్పుడు సత్యవతీ దేవిని పరాశరుడే కోరుతాడు. ఒక జగద్గురువు, లోకకళ్యాణార్థం ‘‘నీనుండి నేను ఒక జీవిని అవతరింప చేస్తాను’’. దాని వలన

మొత్తం కలియుగాంతము వరకు కూడా, కావలసిన వెలుగును పంచేటటువంటి ఒక పరా, పశ్యంతీ తత్త్వము వ్యక్తిగా వస్తాడు. దానికి నీవు సహకరిస్తావా, అని అడిగాడు. అంటే మామూలుగా ఒక జాలరి వాళ్ళ పిల్లయితే నాకేటి తెలియదు బాబు, అంటుంది. అంతేకదా! నాకేటి ఎరుక? అంటుంది కదా! అలా అనలేదు ఈవిడ. సహకరిస్తానని చెప్పింది. సహకరిస్తే అప్పటికప్పుడు సద్యోజాతంగా పరాశరమహర్షి వేదవ్యాసుడి జననం కల్పిస్తాడు. అదీ! ఎంత గొప్ప విషయం? ఆ పుట్టినవాడు సామాన్యుడు కాదు. ఆరోజు వైశాఖపూర్ణిమ. పూర్ణిమ ఘడియలలో, ఆకాశములో చంద్రుడు చక్కగా పూర్ణకాంతితో వున్న సందర్భంలో, ఈ తారకలూ అవీ చూచుకొని, ఇది సరియైన సమయం ఒక జీవుని దింపడానికి అనుకున్నాడండి పరాశరమహర్షి. ప్రకృతి నావలో ఈ కన్యను ఇచ్చింది. ఆయన సమస్తమును ఎరిగిన వాడు. కాలమును, దేశమును, ధర్మమును, కర్తవ్యమును ఎరిగినవాడు అయివుండడము చేత సందేహించకుండా ఆమె ద్వారా ఈ జీవుని లోకానికి అందించాలనుకొని, ఒక యజ్ఞార్థమూ ఆ కార్యాన్ని నిర్వర్తించాడు ఆయన. లోక మేమనుకుంటుదో అని చూసేవాడు చేయలేదు అలాంటి పనులు. అదికూడా చెప్తాడు. నీ కన్యాత్వమునకు ఏవిధమైనటువంటి లోపము లేకుండా ఒక జీవుణ్ణి నీద్వారా పొందుతాను అని. అలాగే అంటే, అప్పుడు వస్తాడు వేదవ్యాసుడు.

పుట్టంగానే అలా ఐదేళ్ళ బాలుడుగా అయిపోతాడండి. పుట్టీపుట్టంగానే క్యార్ క్యార్ మనకుండా మనలాగా! ఇద్దరూ

చూస్తారు. చూస్తే నమస్కారం చేస్తాడు. మీరు ఎప్పుడు పిలిస్తే అప్పుడు వస్తానంటాడు. మీరు ఎప్పుడు పిలిస్తే అప్పుడు వస్తా! అలా వుంటుందండీ ఎక్కడైనా? పుట్టడం ఏమిటి? వాడు ఐదేళ్ళ కుర్రాడుగా అయిపోవడం ఏమిటి? అయిపోయినవాడు తల్లితండ్రులకు నేనెప్పుడును విధేయుడనే, అని చెప్పాడండి! దివ్య ప్రజ్ఞల అవతరణం విశేషంగా వుంటుంది. సరే, తండ్రి ఆయన్ను బాగానే వినియోగించుకున్నాడు! పురాణములన్నీ వివరింపచేశాడు. వేదములన్నీ వర్గీకరింప చేశాడు. అన్నీ తండ్రి ఆజ్ఞ ప్రకారమే చేశాడు ఆయన. తల్లికీ అదే మాట. నువ్వు ఎప్పుడు పిలిస్తే అప్పుడు వస్తాను తల్లీ! అంటాడు.

ఇప్పుడు ఆవిడ, అదే కన్య శంతనుని వివాహం చేసుకొంది. ఆ చేసుకొంటున్న సందర్భంలో బెస్తవాడు తనదైన మార్గంలో కొన్ని కోరికలు కోరుతాడు. వాళ్ళకొక ప్రణాళిక వుంటుంది. బడుగువర్గాలు అన్న సమస్య మనకు ఎప్పుడూ వుంది. ఇప్పుడే కాదు. అది కొత్తగా వున్న సమస్య కాదు. అందుకని బడుగు వర్గం నుండి మనవాడొకడు రాజైపోతే.... ఇంక మనదే కదా అంతా! పెత్తనం అంతా మనదే అయిపోతుంది అనే వుద్దేశంతో, ఆంక్షలు పెడతాడు బెస్తరాజు – దాశరాజు.

శంతనుడు మీ అమ్మాయిని చేసుకుంటాను నేను అంటే, మహారాజు వచ్చి అడిగాడు, అంతకంటే ఆనందం ఏమిటి అని అనుకోకుండా, ఏదో ఆ కొంత యవనుల ప్రలోభానికి లోనై, ఆ బెస్తరాజు మా అమ్మాయికి పుట్టిన సంతానానికి రాజ్యం యిస్తావా?

అన్నాడు. ఊరికే భోగవస్తువుగా ఇవ్వలేను నా కూతుర్ని. నా కూతురికి కలిగే సంతనానికి నీవు రాజ్యం సంక్రమింప చేస్తావా? అని అడిగాడు. అంటే ఏమి చెప్పాడు శంతనుడు. మౌనం వహించాడు. ఎంచేత? అప్పటికే తన కుమారుడు భీష్ముడు వున్నాడు కదా! ఎలాంటివాడు భీష్ముడు? భీష్ముడులాంటి వాడు ఇంకొకడు లేడు ఆ రోజుల్లో. అలాంటి ఒక కుమారుణ్ణి పెట్టుకొని కలగబోయే సంతానం ఎలా వుండబోతుందో తెలియదు గదా! అందుకని A bird in the hand is better than two in the bush. ఏ సంతానం ఎలా వుంటుందో మనకు తెలియదు. పైగా భీష్ముడు ఉండగా ఇంకొకరికి రాజ్యం ఎలా ఇవ్వగలడు? రాజపురోహితులు ఎలా ఒప్పుకుంటారు? ఒప్పుకోరు. అందుచేత మౌనంగా వెనక్కి వచ్చేస్తాడు ఆయన. వచ్చేస్తాడు కాని శంతన మహారాజుకు అదొక పెద్ద జాడ్యం అయిపోతుంది మనస్సులో. జాడ్యం అంటే పీడ. అలా రోజూ పగలూ రాత్రి, కనులు తెరచినా నీవాయే కనులు మూసినా నీవాయే, అన్నట్టుగా అయిపోయింది. ఎప్పుడూ సత్యవతీదేవి గుర్తొస్తుంటుంది. ఆమెను ఎలాగూ తాను పొందలేడు. అలా వుంటే మనసు మళ్లించుకోవాలి. ఆ విద్యలన్నీ వాళ్ళ అన్నయ్యలా నేర్చుకోలేదు ఈయన. వాళ్ల అన్నయ్యకు ఆ విద్యలన్నీ వచ్చు కాబట్టి వెళ్లిపోయాడు ముందే, కదా! వద్దురా నాకీ రాజ్యం, ఏలుకోమన్నాడు. ఏలుకోమంటే relief feel అయ్యాడేమో మన శంతనుడు. మనకు తెలీదు. అమ్మయ్య ఈ అన్నయ్య గొడవ తప్పిపోయింది మనకి అని అనుకున్నాడో, అదేమీ రాయలేదు మనకు. రాయలేదు కాబట్టి మనము అలా అనకూడదు.

అందుచేత ఆయన బాధపడుతూ వుంటాడు. అన్నం సహించదు. సరిగ్గా నిద్రపోడు. ఉల్లాసంగా ఉండడు.

ఇంట్లో పెరిగిన కుమారుడు వుంటాడు. చూస్తాడు. ఏమిటి నాన్నగారు ఇలా అయిపోతున్నారని. కొన్నాళ్ళు పోయిన తరువాత ఆయనకొక అనుమానం వస్తుంది. ఏదో ఈయనకు లోపల పీడిస్తోంది మనసులో. ఈ వ్యాధి ప్రారంభం అవడానికి ముందు ఏమి జరిగిందో తెలుసుకోవటానికి ఈ వేగులవాళ్లని పంపిస్తాడు, గత ఆరునెలలుగా మా నాన్నగారు ఎక్కడెక్కడ తిరిగారో విచారణ చేయండిరా అని. వాళ్ళలా విచారణ చేస్తే ఈ జాలరిపేటలో ఇలాంటి event ఒకటి జరిగిందని తెలుస్తుందండి. తెలిస్తే వాళ్ళు వచ్చి భీష్ముడికి ఆ మాట చెప్తారు. ఇలా జరిగింది. వాళ్లిలా అన్నారు. అప్పటి నించి ఈయన మౌనం వహించేశారు అని. అంటే భీష్ముడికి అర్థమయిపోతుంది. నాన్నగారికి ఆ కన్యయందు తిరుగులేని వ్యామోహం కలిగిందని. తిరుగులేని వ్యామోహం కదా! అది వ్యామోహమే! సందేహంలేదు. ఆయన బాధపడిపోతున్నారు.

# 5. భీష్మ ప్రతిజ్ఞ

తండ్రియందు తన కర్తవ్యం ఏమిటి అని ఆలోచించుకున్నాడు ఆయన. తండ్రి కోరలేదు. ఎందుకంటే తండ్రికి తెలుసది, తను కోరితే అది అధర్మం. తనకే భీష్ముడి యందు అపరిమితమైన వాత్సల్యం. అందుచేత భీష్ముడే పూనుకుంటాడు. పూనుకొని ఆ పల్లెకు వెళ్తాడు. వెళ్తే వాళ్లు చెప్తారు, ఇలా వచ్చారు నాన్నగారు. చెప్పాం, ఇలా విషయం, అప్పటి నుండి మాకు ఏమీ కబురులేదని చెప్తాడు ఆయన. అందుకే నేను వచ్చానని, తప్పకుండా ఆమెకు కలిగిన సంతానమే ఉత్తరాధికారి అవుతాడు. ఆయన తరువాత ఉత్తరాధికారి అవ్వవలసింది నేనే కదా! నేనే మీకు మాట ఇస్తున్నాను అంటాడు భీష్ముడు తండ్రి కోసం. తండ్రి కోసమే కాని, రాజ్యం తన బాధ్యత అనుకోలేదు ఆయన. ఎందుకనీ? అసలు ఆయనకు ఆ దృష్టి లేదు. ఏదో ఒక రోజు ఈ రాజ్యం పరిపాలించవలసి వుంటుంది అన్న భావం లేదు ఆయనకు.

రాముడి విషయంలో అలా వుంది. అయినప్పటికీ మిగతా వాళ్ళు ఉన్నారు కదా, చూసుకుంటారులే అనుకున్నాడు. దేవాపి మహర్షి వెళ్ళిపోయినప్పుడు కూడా, తమ్ముడు సమర్థవంతుడు ఉన్నాడు కాబట్టి ఆయన వెళ్ళిపోయినాడు. ఇంకొక సమర్థవంతుడు లేకపోతే తన బాధ్యతలు తను వదిలివేసి వెళ్ళిపోవడానికి వీలులేదు

సృష్టిలో. అదొక ధర్మం ఉంది. దేవాపి మహర్షికి శంతనుని యందు సమర్థత కలిగిన రాజు కనిపించాడు. అందుచేత నాకింక ఈ రాజ్యం అక్కర్లేదు, తమ్ముడు చూచుకుంటాడు, నేను వెళ్లిపోతా నన్నాడు. వెళ్లిపోయాడు కదా ఆయన. ఈయన రాజ్యపరిపాలన చేస్తూ ఇట్లా ఒక విశేషము, దివ్యము అగు సంతానం కలిగిన తరువాత ఇంక సంతానం కోరడమనేది శంతనుని నుండి జరిగిందంటే అది విధి విలాసమే. సంతానం కోరటం కోసమే వివాహం. ఎందుకనీ? నీ పూర్వీకులకు నీవు ఋణపడి వుంటావు. పితృఋణం! అందుచేత కలిగిన తరువాత ఇంక మోహమేమిటి? కలిగింది. అది మరి ప్రకృతి కలిగించినటువంటి ఒక తంత్ర మంటారు. భాగవతంలో మంచి పదాలు వాడతారు. *''దైవతంత్రంబగు పనికి వగవం పనిలేదు''* అంటారు. దైవతంత్ర మొకటి మనని మించి నడుస్తూ వుంటుంది మన మీది నుంచి. మనకెంత తెలిసినా అది ఉపయోగపడదప్పుడు. ఎందుకంటే అది దైవ నిర్ణయం.

ఆ విధంగా భీష్ముడు రాజ్యం చేయను అంటే వాళ్ళు ఇంకొంచెం అడుగుతారు. మీరు మాటంటే మాటే. మీ గురించి మేము విన్నాము. కానీ రేపు మీకు సంతానం కలిగితే, మీ సంతానం ముందు మా సంతానం ఎలా వుంటుందో! వీడెంతసేపూ వీడి పిల్ల, అనుకుంటాడు కదా! తనకు దొరికిన పిల్ల. తన పిల్ల కాదు. మనకు దొరకకపోయినా, మనకు పుట్టినా, మన పిల్లలు మనవాళ్ళు కారని తెలిసి ఉంటే అది కొంత జ్ఞానం. మనకు పుట్టిన వాళ్ళే తప్ప, మన వాళ్ళు కాదని తెలిసి వుండాలి కొంత. వాళ్ళ

పనిమీద వాళ్ళు వచ్చారు, మన ద్వారా. అంతే కదా! అందుచేత వాడు తనపిల్ల అనుకొని, వాళ్ళ సంతానం ఎలా వుంటుందో....? ఈయన సంతానం! ఈయనను చూస్తేనే అసలు వేరుగా వుంటాడు మనిషి! ఆ రోజుల్లో వుండే మనుషులను చూస్తే భీష్ముడు వేరుగా కనిపిస్తాడండి. అలాంటి వాడాయన. మరి మా సంతానానికి రేపు ప్రొద్దున రాజ్యం కావాలనుకుంటే మా వాళ్ళని ఎలా? భీష్మని సంతానం తోసిరాజనవచ్చు కదా! వాడు ఎంత ఆలోచించాడో చూడండి. ఏదైనా లౌక్యం తెలిసిన వాడి ముందు ఈ ధర్మ స్వభావం కలిగిన వాళ్లకు చాలా కష్టంగా వుంటుంది. దాని కేముంది? నేను పెళ్లి చేసుకోను అని చెప్పాడండి ఆయన. ఒక శాప కారణంగా దిగి వచ్చాడు. సంసారం పెంచుకుంటాడా? త్వరగా వసులోకం చేరాలనుకుంటాడు.

ఆయన పెరిగింది 18 సంవత్సరముల పాటు దైవలోకంలో. ఆయన ఈ భూమిమీద నుండి ఎప్పుడు వెళ్లిపోదామా అనుకుంటూ వున్నాడు. ఇలా అనుకుంటే ఎక్కువ రోజులు ఉంచేస్తారు. అదో తమాషా ఉంది. వుందామనుకొనే వాళ్ళను పట్టుకుపోతూ వుంటుంది ప్రకృతి. నేను వెళ్లిపోతాను అనుకునేవాణ్ణి వుంచుతూ వుంటుంది. ఎందుకని అంటే నీ ఇష్టం కాదు అని తెలియడానికి. ఉండడమూ నీ ఇష్టం కాదు. వెళ్లిపోవడమూ నీ ఇష్టం కాదు. నాయిష్టం. అందుకని ప్రకృతి ఎలా నిర్ణయం చేస్తే అలా నేను వుంటాను అనుకునే వాడు జ్ఞాని. ఒక్కొక్కళ్ళని ఒక్కొక్కచోట పెడుతుంది. ఒక్కొక్క సమస్యల్లో ఉంచుతుంది. అందుచేత ఆయన

ఆవిధంగా మాట్లాడాడు. నాకు ఈభూమి మీద వుండే ఉద్దేశ్యమే లేదని చెప్పడు. ఏం చెప్తాడు? నేను రాజ్యం చేయను. నేను రాజు కాను. నేను వివాహం కూడా చేసుకోను. ఎందుకంటే ఆయనకు ఆ దృష్టిలేదు. అందుచేత ఈ రెండు మాటలూ చెప్పేస్తాడు. చెప్పేస్తే తండ్రి సంతోషించాలా, దుఃఖించాలా? తనకోసం తన కుమారుడు ఇలాంటి పని చేస్తే ఆ తండ్రి సంతోషించాలా, దుఃఖించాలా? ఆ రెండూ ఉంటాయి శంతనుడిలో. అదా ఇదా అంటే రెండూ అంటాం కదా! రెండు కలిపి సత్యం అన్నట్లు, శంతనుడికి సత్యవతీదేవి కావాలి. సందేహం లేదు. భీష్ముడు కూడ ఉత్తరాధికారి కావాలి.

మరి భీష్ముడో? అంటే శంతనుడు సత్యవతిని పొందడంలో భీష్మణ్ణి కోల్పోయినట్లే. అందుకని వివాహం చేసుకుంటే సగమానందమే. పూర్తి ఆనందం లేదు. భీష్ముని చూస్తే గుండె కోసుకుపోతూ వుంటుంది. ఈ మోహం చేత ఆమె ద్వారా సంతానాన్ని కంటాడు. కంటే, ఒకడేమో ఎప్పుడూ అడవుల్లోపడి, జంతువులను వేటాడే type. వాడు మహావీరుడు. ఈయనలో వుండేటటువంటి పరాక్రమమంతా ఒక కొడుకుగా పుట్టుకు వచ్చింది. ఈయనలోని స్త్రీ కాముకత్వము మరొక కొడుకుగా పుట్టుకు వచ్చింది. చిత్రాంగదుడు, విచిత్రవీర్యుడు అని ఇద్దరు వస్తారు. ఒకడు ఎంతసేపూ గుఱ్ఱము వేసుకొని ఆయుధాలు పట్టుకొని, అడవులలోకి వెళ్ళిపోవడం, అలా వేటాడుకుంటూ ఉండడం. ఇదే పని. ఇంకొకడేమో పెరిగి పెద్దవాడయి నప్పటి నుండీ ఏ విద్యా నేర్చుకోలేదు సరికదా అంతంత మాత్రమే! నాసి!

చూడండి. అదే సత్యవతి! అదే సత్యవతీ దేవికి ఆమె నుండి, అదే పరాశరుడు, ఎటువంటి ప్రజ్ఞను పొందాడు? శంతనుడు ఎటువంటి ప్రజ్ఞలు పట్టుకు వచ్చాడో చూడండి. ఇది చూడాలి మనము.

నీ దృష్టిబట్టి, సంకల్పములో ఉండే సంస్కారము, లేక శుద్ధత. దానిని బట్టి నీ సంతానము. పూర్తి కామంతో సంతానము పొందామనుకో, వాడూ అలానే వుంటాడు కదా! నీవు పితృదేవతల యొక్క అనుగ్రహంతో, ఆశీర్వచనంతో, దైవానుగ్రహంతో, ఒక సత్పురుషుని పొందాలన్న భావముతో, తదనుగుణమైన దీక్షలు వహించి సంతానము పొందామనుకో. అది ఇంకొక రకముగా వుంటుంది. సంతానము కలగడానికి కొంత జ్ఞానం కావాలి. ఊరికే కోరుకుంటే రారు. కోరుకుంటే వస్తాయా? నీకు స్త్రీ మీది వ్యామోహంతో సంతానం పొందితే ఒక రకంగా వుంటుంది. స్త్రీ యందలి దివ్యత్వాన్ని చూసి సంతానం పొందాడు, ఎవరు? పరాశరమహర్షి. ఎందుకని? ఆమె చక్కని పంట పొలము వంటిది, సత్యవతీదేవి.

మన గుంటూరు, విజయవాడ మాగాణి భూములు. మాగాణి భూములలో ఇదివరకు మనము చక్కని ధాన్యము పండించుకునేవారము. ఇప్పటికీ ఇక్కడ పండే కూరలకు ఉండే రుచి మిగతా ప్రాంతములలో పండిన కూరలకు ఉండదు. ఏమీ సందేహం లేదు. మీరు తిని చూడండి కావాలంటే. ఎందుకని? ఈ భూమి అలాంటిది. అలాంటి భూమిలో పొగాకు వేశామనుకోండి. వేశాముగా! పొగాకు వేస్తే ఏమయ్యింది? మనుషులు

పాడయిపోవడానికి కావలసినవన్నీ వచ్చేశాయి. అలాగ, సత్యవతీదేవి ఒక నల్లరేగడి మాగాణి అనుకుంటే అందులో నుండి పరాశరుడు ఎలాంటి పంట తీసుకున్నాడు? శంతనుడు ఎలాంటి పంట తీశాడండీ?

వేట కెళ్ళిన కుమారుడు అలా వేట కెళ్ళుతూ అక్కడే చచ్చిపోయాడు. ఏదో ఒక పులి మింగేసింది. ఇంకొకడు మిగిలాడు. వాడికి ఇదే పని. పొద్దున లేచింది మొదలుకొని సాయంత్రం వరకు స్త్రీ కామం. వీడికి పిల్లను ఎవరిస్తారండి? కురు సామ్రాజ్యానికి ఉత్తరాధికారి. మొత్తము భరతభూమి యందు వీడికి పిల్లను ఇవ్వడానికి ఎవ్వరూ అంగీకరించ లేదు. ఎవరిస్తారు పిల్లను? వాడు ఎలాంటివాడో తెలిసిపోయింది ప్రపంచం అంతటికినీ. అలాంటి వాడికి తీరి కూర్చొని ఎవరన్నా పిల్లనిస్తారా? ఇవ్వరు. చూడండి, కుత్సితమైన మనస్సుతో బెస్తరాజు అడిగినప్పటికీ, తన కూతురికి కలిగే సంతానానికి రాజ్యం కట్ట బెట్టాలని అడిగినా, అది ఎలాంటి సంతానం వచ్చిందండీ? అక్కడే తేడా పడిపోయింది. రాజ్యానికి తేడా పడిపోయింది కదా! అసలు ఈయనకు ఆ మోహము కలగడమే తప్పు. దానికి తగ్గట్టు గానే సంతానం కలిగింది. మరి అదే శంతనునికి గంగాదేవి వలన ఎటువంటి సంతానం కలిగింది?

మరి తేడా ఎక్కడ పడ్డది? అదే శంతనుడు కదా! భావ నైర్మల్యంలో తేడా. పరిశుద్ధ భావంతో స్త్రీ పురుషులు దీర్ఘకాలం జీవిస్తూ సంతానం పొందితే సంస్కారవంతులైన సంతానం కలుగుతుంది. కామంతో సంభోగిస్తే కాముకులు పుట్టుకు వస్తారు.

మున్సిపాల్టీ నీరు వెండి గ్లాసులో పోసుకుంటే గంగనీరు అవుతుందా? శంతనుని ప్రథమ సంతానం అత్యత్తుమ సంస్కారాలతో ఉత్పన్న మయింది. శంతనుని కామ మోహములనుండి కలిగిన సంతానం మరొక విధముగ పరిణమించింది. భావనుసారం భవములు (అంటే జన్మలు) కలుగుతాయి.

గంగాదేవి ప్రభావం చాలా అద్భుతమైనటువంటి ప్రభావం కనుక, ఆమె ప్రభావం చేత శంతనుడు అలాంటి కుమారుడిని పొందాడు. అందుకనే ఆయన గాంగేయుడు కదా! భీష్ముడికి గాంగేయుడను పేరే ఎక్కువ తెలుసు. శాంతనవుడు అన్న పేరు చాలా తక్కువ తెలుసు. పురాణాలు రాస్తున్నప్పుడు కూడా వాళ్ళు ఏమి రాస్తారు అంటే శాంతనవా, శాంతనవా! అని పిలవరు. గాంగేయా! గాంగేయా! అంటారు. ఎందుకు అంటారు అండి? అంటే నాకు అది తలచుకుంటేనే ఆనందం వస్తుంది. ఎంత గంభీరమైన విషయం. ఏదో పిచ్చి పిచ్చిగా రాయటం కాదు. ఋషి దర్శనాలూ, ఋషి వచనం ఎలా ఉంటాయి అంటే, అక్కడ ఆ పదమే correct, ఇంకో పదం రాదు. ఒక్కోసారి అర్జునుడు మరీ మట్టి బుర్రలాగా కనిపిస్తే కృష్ణుడు "పార్థా!" అంటాడు. "పార్థివం" అంటే మట్టి. "పార్థా!" అంటే, ఇప్పుడు వీడు మట్టి బుర్రతో ఉన్నాడు అని అర్థం. "కౌంతేయ!" అంటాడు ఇంకోసారి. అంటే మరి కుంతి ఎలాంటిది? కౌంతేయ ఏమిటి, పార్థ ఏమిటి? "విజయ" అని ఎప్పుడూ పిలవడు కృష్ణుడు, ఎందుకంటే వాడికి ఇంకా నేర్చుకోవలసింది చాలా ఉందిగా! చూడండి ఎన్ని రకాలుగా

సంబోధిస్తాడో! పాండునందనా! అంటాడు ఒక్కొక్కసారి. అందుకని గాంగేయుడు భీష్ముడు కదా! వ్యాసుడిని సాత్యవతేయ అంటారు. అంటే ఎంత గొప్పది అండీ ఆమె, సత్యవతీ దేవి. తల్లి పేరున ప్రసిద్ధి చెందాడు అంటే ఆ తల్లి ఎలాంటి తల్లి? ఈ తల్లి ఎలాంటి తల్లి? ఇప్పుడు ఈ విచిత్రవీర్యుడు, చిత్రాంగదుడు వీళ్లెవరిని సాత్యవతేయ అనటానికి వీలులేదుగా! అందుకని వాళ్ళు అలా అయిపోయారు, ఒకడు పోనే పోయాడు. ఒకడికేమో పెళ్లే అవ్వట్లేదు. ఎన్నాళ్ళకీ పెళ్లి అవదు. మరి ఎట్లా?

తండ్రి వెళ్లిపోయే ముందు, భీష్ముడిని ఒకటి కోరతాడు. ‘‘ఈ రాజ్యాన్ని నువ్వు మరి ఏలనంటున్నావు కాబట్టి, దీనికి కాపుగా ఉంటావా’’ అని అలా ప్రకృతి ఆ రాజ్యానికి కాపలా దారుడుగా ఏర్పాటు చేసేస్తుందండి భీష్ముడిని. అప్పటికి అర్థం అయిపోతుంది భీష్ముడికి, మనం ఇక్కడ కేవలం నిమిత్తమాత్రులం అని. అసలు నిమిత్తమాత్రం అనే అనుకున్నాడు, రాజ్యం అక్కర్లేదు అని అనుకున్నాడు, పెళ్లి అక్కర్లేదు అని అనుకున్నాడు అంటే, ఎప్పుడు పిలిస్తే అప్పుడు వెళ్లిపోదాము అనుకున్నాడు. అదీ పరిస్థితి. సమస్త విద్యలూ వచ్చినటువంటివాడు. తండ్రి మాట మేరకు ఉండిపోయాడు. అలా ఉండిపోయినందుకు, ఆ శంతనుడు ఎంత తపస్సు చేశాడో! ఒక వరం ఇస్తాడు కుమారుడికి, ‘‘నీవు ఎంత కాలం ఉందాము అనుకుంటే అంత కాలం ఈ శరీరంలో ఉండేట్టుగా’’ నేను వరం ఇస్తున్నాను అన్నాడాయన. భీష్మునికి స్వచ్ఛంద మరణం అనే ఒక వరం ఉన్నది. తండ్రి ఇస్తాడు. నువ్వు,

ఇహ ఇప్పుడు వెళ్లిపోతే ఫరవాలేదు అనుకున్నపుడు వెళ్ళిపోతావురా నాన్నా! అని చెప్పాడు ఆయన. శంతనుడు వెళ్ళిపోతూ కొడుకుకి వరం ఇచ్చాడు. రాజ్యం కాపాడు. నువ్వు ఎప్పుడు సరైన సమయం అనుకుంటే అప్పుడు వెళ్ళిపోమన్నాడు. ఆ సరైన సమయం చాలా కాలం వరకు రానేలేదు!

# ౬. నిమిత్త కారణం

ఒక రోజున విచిత్రవీర్యుని వివాహం గురించి భీష్ముని అడిగింది తల్లి, ఎవరు సత్యవతి దేవి. అడిగితే ఈయన ఎక్కడ ఉన్నారు రాజకుమార్తెలు అని చూస్తే, కాశీ రాజ్యంలో ముగ్గురు ఉన్నారుట. ముగ్గురు రాజకుమార్తెలు. అన్ని కళలూ కలిగినటువంటి వారు. కాశీరాజు కుమార్తెలు అంటే మరి చెప్పనక్కర లేదు. ఆ కాశీ రాజు కూడా దివోదాసుడు ఆయన. ఆయనకి ఒక కొడుకు కూడా ఉన్నాడు. ఆయనే మైత్రేయ మహర్షి. కాశీరాజు మైత్రేయుడనే కుమారుని (మైత్రేయ మహర్షి), అంబ, అంబిక, అంబాలిక అనే ముగ్గురు కుమార్తెలను కలిగి ఉంటాడు. సరే మైత్రేయుడి కథ వేరుగా నడిచి వెళ్ళిపోయింది, ఆయన తండ్రి అనుజ్ఞ తీసుకొని, వేరే కారణం మీద వచ్చాను, ఆ కారణం మీద నేను వెళ్ళిపోతున్నాను, మీరు అనుజ్ఞ ఇవ్వండి అంటే తెలిసినవాడు కాబట్టి రాజు అనుమతి ఇచ్చాడు, ఈయన వెళ్ళిపోయాడు. ఇహ వీళ్ళు ముగ్గురూ ఉన్నారు.

భీష్ముడు కాశీ రాజ్యం మీద యుద్ధానికి వెళ్తాడు, కన్యల కోసం. కన్యల వేట. వెళ్తే సాళ్వాది రాజులు అందరూ కూడా, యుద్ధంలో అటు పక్క ప్రత్యర్థులుగా ఉంటారు. వారు అందరూ యుద్ధానికి వస్తారు. భీష్ముడి ముందు ఎవరు ఆగగలరు. ఎవరూ ఆగలేరు. సరే సాళ్వునితో సహా అందరూ ఓడిపోతారు. సాళ్వుడు

ఎందుకు యుద్ధానికి వస్తాడు అంటే, ఆయన అంబ, అంబిక, అంబాలికలలో అంబని ప్రేమించి ఉంటాడు. అంబ కూడా ఆయనను ప్రేమించి ఉంటుంది. సరే భీష్ముడు వెళ్లి యుద్ధం చేసి అందరినీ గెలిచి, ముగ్గురు కన్యలను పట్టుకుని వచ్చేస్తాడు.

వాళ్ళకి సకల మర్యాదలూ చేసి, నా ఉద్దేశం ఒక్కటే, మీరు మా తమ్ముడిని వివాహం చేసుకోవాలి. మిమ్మల్ని మేము గెలుచుకుని తెచ్చుకున్నాము కాబట్టి మా సొత్తు అని చెప్తాడు. అంటే అందులో అంబ అంటుంది, నా మనస్సు ఇదివరకే ఇంకొకళ్ళకి ఇచ్చేశాను, ఇప్పుడు మీ తమ్ముడిని వివాహం చేసుకోవటం ధర్మమేనా! అని అడుగుతుంది. అంటే మనస్సు ఒక చోట, మనువు ఒక చోట కుదరదు కదా? అలా చెయ్యకూడదు కూడా! అందుకని భీష్ముడు అంటాడు, ఆ మాట నువ్వు నేను తీసుకొచ్చే లోపలే చెప్పి ఉంటే బాగుండేది. అంటే, మీరు మాకు time ఇస్తేగా అంటుంది. ఈయనేం time ఇవ్వలేదు, పట్టుకొచ్చేశాడు. సరేలే పొరపాటు అయిపోయింది, నువ్వు తప్పకుండా వెళ్లి సాళ్వుడిని పెళ్లి చేసుకోమని చెప్తాడు. అంటే అంబ సాళ్వుడి వద్దకు వెళ్ళి భీష్ముడు నిన్ను వివాహం చేసుకోమని పంపించాడు, విషయం తెలిసిన తరువాత అంటుంది సాళ్వునితో. మనం వివాహం చేసుకోవచ్చు అంటే, ఆయన ఒప్పుకోడు.

విచిత్రంగా ఉంటాయి పరిస్థితులు కదా? అదేమిటి ఎందుకు ఒప్పుకోవు, మనం ఇద్దరం బాగా పరస్పరం గాఢంగా ప్రేమించుకున్నాం కదా అంటుంది. ప్రేమించుకున్న మాట

వాస్తవమే, నీ మీద నాకు మనసు ఉన్నమాట వాస్తవమే, కానీ నేను నిన్ను కోల్పోయాను కదా! అంటాడు. నిజమైనటువంటి పతి అంటే, పత్నిని రక్షించుకోగలిగి ఉండాలి కదా! నేను నిన్ను రక్షించుకోలేకపోయాను కదా! నీ కోసమే కదా నేను యుద్ధానికి వచ్చాను, యుద్ధంలో నిన్ను పొందలేని వాడిని, ఇప్పుడు భీష్ముడు సమ్మతించడం వలన నిన్ను పొందుతూ ఉంటే నాకు కొంచెం చిన్నతనంగా ఉంటుంది. అందుకని నేను పెళ్లి చేసుకోను, అని చెప్పాడండి! మరి క్షాత్రం అది. ధర్మం ఉంది అందులో. సత్యం అదే. నిన్ను గెల్చుకుంది భీష్ముడు, నిన్ను వివాహం చేసుకోవడం నాకు ఎందుకనో అంత సమ్మతం అనిపించడం లేదు. నిజమే మనిద్దరి మధ్య మనస్సు ఉన్న మాట వాస్తవమే, అయినప్పటికీ నాకుగా నేను నిన్ను రక్షించుకోలేని నాడు నేను నీ భర్తగా తగను, అని చెప్పాడండి.

ఇలాంటి ధర్మాలు భారతంలోనే దొరుకుతాయి, ఇంకెక్కడా దొరకవు. మనం ఒక్కొక్క సన్నివేశం మీద బాగా విశ్లేషించుకోవాలి కూర్చుని. విమర్శించ కూడదు. వివరించుకోవాలి. వివరించుకుంటే తెలుస్తాయి. అంటే, సత్యమే అనిపిస్తుంది అంబకి. భీష్ముడు కదా నన్ను గెలుచుకున్నాడు, మరి ఈయన అన్నమాట నిజమే కదా అని మళ్లా భీష్ముడి దగ్గరకి వెళ్తుంది. ఈ లోపల భీష్ముడు అంబికని, అంబాలికని విచిత్రవీర్యుడికి ఇచ్చి పెళ్లి చేస్తాడు. సరే ఈమె వస్తుంది, వచ్చి నన్ను నువ్వు వివాహం చేసుకోవాలి అని అడుగుతుంది. అది ధర్మము అని చెప్తుంది. ఎందుకంటే? నువ్వే నన్ను గెల్చుకున్నావు

కాబట్టి అంటుంది. శ్రీకృష్ణుడు నరక సంహారం చేసినప్పుడు, నరకుడి చెరలో పదహారు వేలమంది రాజకుమార్తెలకు స్వేచ్ఛను ప్రసాదిస్తాడు. అప్పుడు వాళ్ళు అందరూ వచ్చి శ్రీకృష్ణుని అడుగుతారు, అప్పటికి కన్యలు కారు వాళ్ళు అందరూ, auntyలే! ఇప్పుడు మేము ఇంటికి వెళ్ళడానికి లేదు, మా ఇంట్లో మా అమ్మా నాన్నా కూడా ఉండి ఉండరు, ఇప్పుడు మేము వెళ్లి అన్నదమ్ముల ఇంట్లో చేరాలి, మాకు ఇప్పుడు గతి ఏమిటి? అని అడిగారు. అంటే ఆయన, ఒక సమస్య పరిష్కరిస్తే ఇంకో సమస్య వచ్చింది అందులో నుంచి, కదా! నువ్వే కదా మమ్మల్ని చెర నించి విడిపించి మాకు స్వేచ్ఛా జీవితం ఇచ్చావు. అందుచేత, నువ్వే మాకు పతియు, గతియు నిజముగ కృష్ణా! అనేశారు అంతే. నువ్వే మాకు గతి, నువ్వే మాకు పతి, కాబట్టి మమ్మల్ని అంగీకరించి status ఇచ్చెయ్యమని అడిగారు, అంతే! The status of being the wife of Krishna. అప్పుడు ఊళ్ళో వాళ్ళు ఎవ్వరూ వాళ్ళ జోలికిరారు కదా! వాళ్ళకి సంఘంలో ఒక స్థితి ఏర్పడుతుంది. అలా మరి శ్రీకృష్ణుడు చేశాడు.

అలాగే ఇప్పుడు అంబ అడుగుతుంది నువ్వు నన్ను గెలుచుకున్నావు కాబట్టి నువ్వు నన్ను వివాహం చేసుకో, మరి ఇంతకన్నా ధర్మం లేదు, నేను కన్యను, మనసు ఇచ్చాను, మనసు ఇచ్చిన వాడితో వివాహం కాకపోవటానికి కారణం నువ్వే. నువ్వు గెలుచుకొని వచ్చేశావు. నువ్వు గెలుచుకున్న దానిని నేను ఎందుకు చేసుకోవాలి అని ఇప్పుడు వాడు అంటున్నాడు. ఇప్పుడు నేను

ఏమి చెయ్యాలి? అని అడిగింది. అడిగితే, అప్పుడు భీష్ముడు చాలా వినయంగా చెప్తాడు, తల్లీ! నాకు వివాహదృష్టి లేనే లేదు, నా తమ్మునికోసం చేశాను అంటాడు . కాదు నువ్వే చేసుకో అంటే, నా వల్ల కాదు అంటాడు. ఒకటి– అసలు అలాంటి దృక్పథమే లేదు మనిషిలో. జీవ లక్షణంలోనే లేదు. రెండు– మాట ఇచ్చాడు. అందువల్ల నేను ఇప్పటికే బద్ధుడిని, నేను వివాహం చేసుకోలేను, నేను ధర్మబద్ధుడిని అని చెప్తాడు. మరి నేనూ ధర్మం గురించే కదా నీ దగ్గరకి వచ్చాను అంటుంది. దణ్ణం పెట్టేస్తాడు.

క్షత్రియ కన్యలకు సంకల్పబలం చాలా ఉంటుంది. పట్టు ఉంటుంది, సాధించేటువంటి శక్తి ఉంటుంది. అందుకని అప్పుడు అంబ అలా అలా ముని ఆశ్రమాలకు వెళ్లి, నాకు ఇలా జరిగింది, ఏమి చెయ్యమంటారు అని అడిగితే, వాళ్ళు అందరూ ఒక సలహా ఇస్తారు, నువ్వు భీష్ముడిని పెళ్లి చేసుకోవాలి అంటే ఆయన గురువుగారు ఉన్నారు, పరశురాముడు, ఆయనని పట్టుకో అని. అంటే, ఇంకెవరి మాటా వినడానికి ఆస్కారం లేదు, గురువుగారి మాట వింటాడేమో అని గురువుగారిని ఆశ్రయించమని చెప్తారు. అంటే ఈ అంబ ఆ గురువుగారిని (పరశురాముడిని) ఆశ్రయిస్తుంది. ఆయన తపస్సు చేసుకుంటూ ఉంటాడు. ఎప్పుడైతే రాముడు దర్శనం అయ్యిందో పరశురాముడికి, అప్పటి నుండి ఇంక పరశురాముడు బయట ప్రపంచంలో తిరగడం మానేసి కొండ ఎక్కేస్తాడు. కొండ ఎక్కేసి ఎప్పుడూ తపస్సులోనే ఉంటాడు ఆయన. ఆ తపస్సులో ఉండే ఆయన దగ్గరకి అంతకు ముందు

భీష్ముడు వెళ్ళాడు విద్య నేర్చుకోవడానికి. ఇప్పుడు ఈమె వెళ్ళింది. వెళ్ళి సపర్యలు చేయటం మొదలు పెట్టింది. ఏమిటమ్మా నీ విషయం, అని అడిగితే చెప్పింది.

భీష్ముడు చాలా సజ్జనుడు, చాలా ధర్మాత్ముడు, నా మాట వింటాడు పద వెళదాము, అంటాడు పరశురాముడు. బయలుదేరి వస్తే భీష్ముడు అంగీకరించడు. ఆయన భీష్ముడు కదా! దేవవ్రతుడు భీష్ముడు ఎందుకు అయ్యాడు అంటే, ఇంక అంతే, పాటిస్తే ఇంక అంతే, దాన్ని కదల్చడానికి ఏం లేదు. గురువుగారు వచ్చి చెప్తారు ధర్మమేరా చేసుకో అంటారు. నిజమే! అంబ ఒక ధర్మం. ఈ ధర్మం ఇప్పుడు వచ్చింది. తన ధర్మం ముందు నుండీ ఉంది. ఏది ముందు? ఏది వెనక? తాను వివాహం చేసుకోనని, ఆజన్మ బ్రహ్మచారిగా వుంటానని భీషణమైన ప్రతిజ్ఞ దాశరాజువద్ద పంచభూతముల సాక్షిగా రెండు దశాబ్దాల వెనుక చేసేశాడు. అందుచేత నేను వివాహం చేసుకోలేను అని చెప్తాడు. చెప్తే పరశురాముడిలో ఉండే ఒక లక్షణం ఏమిటి అంటే, మాట వినకపోతే కోపం వస్తుంది. జమదగ్ని కుమారుడు. యమా అగ్ని ఉంటుంది అన్నమాట అక్కడ. తల్లి తలకాయ తీసెయ్యరా అంటే తీసేశాడు ఆయన. పరశురాముడు సామాన్యుడు కాదు కదా! ఏం, నా మాట వినవా, అన్నాడు. దణ్ణం పెట్టాడు. వినను అనకుండా నమస్కారం పెట్టాడు. మరి వినకపోతే నేను నిన్ను సహించను అంటాడు. మళ్ళీ నమస్కారం! నిన్ను సంహరించేస్తాను అన్నాడు. నమస్కారం! సరే యుద్ధానికి ready అయిపోయాడు. Ready అయిపోతే, ఒక్కసారి తల్లికి దణ్ణం పెట్టుకుంటాడు భీష్ముడు.

కొంతమందికి మార్గదర్శకులుగా తల్లులు ఉంటారు. కొంత మందికి మార్గదర్శకులుగా తండ్రులు ఉంటారు. తల్లికి దణ్ణం పెట్టాడు. ఇదెక్కడి విపత్కరమైన పరిస్థితి, గురువుతో యుద్ధం. గురువుతో యుద్ధం అంటే ఎలా ఉంటుందండీ? అది కూడా one to one. ఆయన అవతార పురుషుడు. ఆయనతో యుద్ధమా! ఇలాంటి పరిస్థితి వచ్చింది ఏమిటి అని, తల్లికి దణ్ణం పెట్టుకుంటే, తల్లి దర్శనం ఇస్తుంది. దర్శనం ఇచ్చి ధర్మం నీ పక్కే ఉంది నాన్నా యుద్ధం చెయ్యమని చెప్తుంది. ఎంత గొప్ప విషయం? అతడు పరశురాముడు కావచ్చు, మరొకటి కావచ్చు, మరొకటి కావచ్చు. ధర్మానికే విజయం, అంతే, భీష్ముడు ముందుగా రెండు నమస్కార బాణాలు వేస్తాడు. ఇక యుద్ధం చేస్తూ ఉంటాడు. ఓ ఓ.... పరశురాముడు అలా, ఎప్పుడో కొన్ని యుగాల ముందు రాజుల తలకాయలు కొట్టేసేటప్పుడు ఎంత భీకర స్వరూపం ధరించాడో, అంత భీకర స్వరూపం ధరించి, యుద్ధం చేస్తూ ఉంటాడు. చేస్తుంటే ఈయన వినయంగా అన్నిటికీ సమాధానాలు చెప్తాడు. గురువుని నొప్పించకుండా ఆయనని నిర్జిస్తూ ఉంటాడు. ఆయన పేట్రేగిపోతూ ఉంటాడు. బాగా దెబ్బలు తగులుతూ ఉంటాయి భీష్ముడికి. కానీ కొట్టడు. కొట్టకపోతే మళ్ళీ తల్లి వస్తుంది. ఎందుకు ఉపేక్షిస్తావు ధర్మం, కానిచ్చెయ్యి అంటుంది. అని, ఈయన అష్ట వసువులలో ఒకడు కాబట్టి, మిగతా వసువుల బలం కూడా ఇచ్చేస్తుంది, కొట్టెయ్యమని.

రాముడికి అగస్త్య మహర్షి ఇస్తాడు చూడండి. ఎందుకు అట్లా ఉపేక్షిస్తావు వాడిని చూసి, వాడు వధార్హుడు అని చెప్తాడు

అగస్త్యుడు. ఈ రాముడికి కరుణ, ఒక పట్టాన చంపలేడు ఆ రావణాసురుడిని! బ్రాహ్మణుడు కదా! అంటాడు. బ్రాహ్మణ ఆకృతిరా, బ్రాహ్మణుడు కాదు అని చెప్పినా కొట్టడు. ఒక్క బాణంతో కొడితే పోయేవాడిని, అంత దూరం తెచ్చుకుంటాడు రాముడు. దానివల్ల మనకి 'ఆదిత్యహృదయం' లభించింది, అది వేరే సంగతి. అలాగ, అమ్మవారు మళ్ళీ వచ్చి చెప్తుంది, కొట్టెయ్యి నాన్నా! ఇంక ఆగక. వధించమని చెప్పటం లేదు, ఓడించు. అంటే ఇంక అప్పుడు భీష్ముడు తన సహజమైన పరాక్రమం అంతా చూపిస్తే, పరశురాముడు ఓడిపోతాడు. అప్పుడు దేవతలు అందరూ దిగి వస్తారు. దిగి వచ్చి చెప్తారు, ధర్మం భీష్ముడు వద్దే ఉన్నది, నువ్వు ఎందుకు ఇలా అనవసరంగా జోక్యం కల్పించుకున్నావు అని పరశురాముడికి. మరి మాటి మాటికీ నువ్వు లోకంలోకి రాబోకు సుమా! అని చెప్తారు. అంతకు ముందు ఒకసారి వచ్చాడు. ఏది రాముడు విషయంలో, అప్పుడూ అలాగే అయిపోయింది.

మన time అయిపోయిన తరువాత మనం ఉండకూడదు, అదొకసత్యంఉంది.ఇవన్నీనేర్చుకోవాలి,ఎప్పుడునేర్చుకుంటాము? మన time అయిపోయిన తరువాత ఉంటే ఇంకెవ్వరూ మనల్ని చూడరండి, గుర్తుపెట్టుకోండి! ఇదేంటి ఇలా ఇన్నాళ్ళు ఇంత బాగా చూసినవాళ్ళు, ఇప్పుడు ఒక్కడూ పలకరించడేమిటి అనిపిస్తుంది. నీ time అయిపోయింది. అదో సత్యం. విచిత్రంగా ఉంటాయి సత్యాలు. మరి సుమతి పద్యం చెప్పినట్టు కాదు. నిజం అది. ఏది, *'ఎప్పుడు సంపద కలిగిన'*, ఇది సంపద సంబంధం కాదు. ప్రకృతి సంబంధం. పనైపోయిన తరువాత, ఒక్క day over stay చేస్తే,

ఇంక finish. **పని ఉన్నంత వరకే పరువు అనేటువంటి జ్ఞానం ఉండాలి.** ఈ పరశురాముడిని తపస్సు చేసుకోమని ఇదివరకే చెప్పారు. తపస్సులో నుండి ఈవిడ (అంబ) పిలిచింది. ధర్మం కదా అని, ధర్మ సంరక్షణార్థం అనుకున్నాడు ఆయన. లేదమ్మా, ఏదో మీరూ మీరూ చూసుకోండి అని వదిలేయాల్సిందేమో, మనకి తెలియదు. మరి ఆయనను శరణు వేడితే సహాయం చెయ్యాలి కదా! ధర్మం లేకపోతే వస్తాడా? వచ్చాడు. అయిపోయింది. నువ్వు పోయి తపస్సు చేసుకో, మరి రాబోకు అని చెప్పేస్తారు పరశురాముడికి. అసలు ఈ భూమి అంతా పరశురాముడిదేనండీ, తెలుసా? అంతా ఆయనదే! ఆయనే అంతా జయించేశాడు, జయించేసి దానం ఇచ్చేసి వెళ్ళిపోయాడు అంతే! నాకు ఎందుకు ఇది అంతా అని. కాని మరల వచ్చాడు, సరే ఇలా అయిపోయింది, మళ్లీ వెళ్ళిపోయాడు. ఈ అంబ మళ్లీ మిగిలిపోయింది.

చూడండి వేసిన తోడు అలా మిగిలిపోతూ ఉంటుంది ఎప్పుడూ, మళ్లీ తోడుకి పనికి వచ్చేట్టుగా! అవును మరి నా సంగతి? ఇప్పుడు నన్ను ఏమి చేయమంటావు? అని అడిగింది. ఎలా ఉంటుంది అప్పుడు పరశురాముడికి? అంటే ఆవిడ వలన పరశురాముడికి ఒక రకమైనటువంటి అంతరాయం కలిగింది, అంతే కదా! పరశురాముడు అంబని చూసి చాలా బాధపడతాడు. తల్లీ! నేను ఏమీ చెయ్యలేక పోయాను, నా చాతనైనది నేను చేశాను చూశావు కదా, మరి ధర్మం అతని పక్కనే ఉన్నది. మరి నా ధర్మం ఏమిటి? నేను ఇలా ఉండి పోవాల్సిందేనా? అంటే, శివుని గూర్చి తపస్సు చేయమని చెప్తాడు. ఆవిడ తపస్సుకి వెళ్తూ, లోపల

మనస్సులో ఈ భీష్ముడి వల్ల కదా నాకు ఇన్ని కష్టాలు వచ్చాయి, అని పెట్టుకుంటుంది. అంతేగా పాపం, ఏదో హాయిగా సుఖంగా బ్రతికేయక! రాజకుమార్తె. ఏ అవలక్షణాలూ లేని మనిషి. ఎలా వచ్చేసిందో చూడండి, జీవిత ఘట్టం. చాలా ఆశ్చర్యంగా లేదూ? ఆవిడ దృష్టిలో, ఇవన్నీ కూడా.

నేను ఒకటే చెప్తా, ఒక పాత్రను మనం బాగా అవగాహన చేసుకోవాలి అంటే పరకాయ ప్రవేశం చెయ్యాలి. అంటే మనమే ఆమెలా ఉన్నట్టుగా భావన చేసి. ఆమె చిన్నప్పటినుంచీ ఎలా పెరిగింది, ఎలాంటి సన్నివేశాలలో పెరిగింది, ఎలాంటి విద్య నేర్చుకుంది, ఎలాంటి రాజ్యంలో ఉంది, ఎలాంటి సోదరుడు తనకు ఉన్నాడు, ఇవన్నీ ఆలోచిస్తే ఎలా ఉంటుంది అంబ కథ! అలాంటిది ఇలా అయిపోయిందే, ఎటో వచ్చేసింది కథ, అడవిలోకి వచ్చేసినట్టు వచ్చేసింది, అగమ్యగోచరం అయిపోయింది కదా! దీనికి అంతటికీ ఎవరు కారణం? ఆవిడ కారణం భీష్ముడు అనుకుంది, అంతే! దైవం అనుకోవడం ఒక పద్ధతి. భీష్ముడు అనుకుంది. అందుకని ఈ భీష్మునికి నేను విరుగుడై ఉండాలి అని తపస్సు చేస్తుంది. ఈ భీష్ముని ఏ రోజునైనా సరే నేను జయించాలి అనేటువంటి ఒక పంతం వచ్చేస్తుంది. తపస్సు చేస్తుంది, వరం పొందుతుంది. అటుపైన దిగి వచ్చేస్తుంది, అగ్ని ద్వారా దిగి వచ్చేస్తుంది. ఆవిడే శిఖండి.

శిఖండిగా దిగి వచ్చేస్తుంది. భీష్ముడికి తెలుసు. శిఖండి, ఆమెగా పుట్టి ఆయన అవుతాడు. అలాంటి వాళ్లతో నేను

యుద్ధం చెయ్యనూ అంటాడు భీష్ముడు. ఎందుకంటాడు అంటే ఇందుకంటాడు. ఎందుకంటే, ఆమె చేతిలో తాను మరణించడానికి సంసిద్ధమే. కారణం ఏమిటంటే, మరి ఆమెకి అన్యాయం జరిగిన మాట వాస్తవం. అదే చిట్టచివర రహస్యంగా చెప్తాడు, శిఖండిని పట్టుకొచ్చి కూర్చోపెట్టుకోండి రథంలో, నేను అన్నీ పక్కన పడేస్తాను కొట్టేసుకోండిరా, అని కదా! ఒక జ్ఞానికి తెలియకపోవడం అంటూ ఏమీ ఉండదు. కాకపోతే ఎవరు జ్ఞాని? **తెలిసినవన్నీ చెప్పనివాడే జ్ఞాని, చెప్పేవాడు జ్ఞాని కాదు, డబ్బా!** జ్ఞానులు మౌనంగా ఉంటారు, అజ్ఞానులు మాట్లాడుతూ ఉంటారు. అందుకని ఎవరు తెలిసినవాడుట అంటే, నాకు తెలీదు అని తెలిసినవాడు, తెలిసినవాడు. అంత కన్నా జ్ఞాని ఎవరు అంటే, నాకు తెలీదు అని కూడా తెలియని వాడుట. నాకు అంతా తెలుసు అనుకున్న వాడు పూర్ణ అజ్ఞాని. ఈయనకి తెలుసు. కృష్ణుడికి తెలుసు. ఇంకెవ్వరికీ తెలీదు. అందుకని ఆయనని తీసుకురమ్మని భీష్ముడే చెప్తాడు చిట్టచివరికి. ఎందుకనీ? ఆమె తృప్తి చెందుతుంది. మరి ఆమెకి కూడా న్యాయం జరగాలి కదా! అప్పుడూ ధర్మం!

ఎంత నువ్వు చెట్టు వెనుక నుండి బాణంతో కొట్టి దాని గురించిన ధర్మశాస్త్రం చెప్పినా వాలి విషయంలో, మళ్ళీ అవతారంలో అలాగే చెట్టు చాటు నుండి ఒకడు బాణం వేస్తే, తనకు తగిలి, తన శరీరాన్ని వదిలేశాడు శ్రీకృష్ణుడు, కదా! అందుకని ధర్మానికి అసలు తిరుగే లేదు. ధర్మం నిర్వర్తింపబడవలసిందే ఎవరి విషయంలోనైనా సరే! తప్పించుకు తిరగడానికి వీలులేదు. ఇప్పుడు కాకపోతే పై జన్మలో. అలా ఉంటుంది. అందుకని

తెలిసినవాడు కాబట్టి భీష్ముడు ఆమెను అంగీకరిస్తాడు. తన వల్ల తప్పు జరిగింది కానీ, తాను కావలసి చేసినటువంటి తప్పు కాదు. తాను కావాలని అంబ మీద ఏ విధమైనటువంటి ద్వేష భావం లేనటువంటి వాడు, పరిస్థితులు అలా వచ్చేసినాయి. కానీ తాను నిమిత్త కారణం అయ్యాడు. అందుకని ఆమెను నిమిత్త కారణంగా చేసుకుని తను మరణించడానికి సిద్ధపడ్డాడు. అందువలన భీష్ముడు అంబను ఆ విధంగా తిరస్కరించడం వలన తనకి మృత్యు కారణం అయ్యింది ఆమె. సంతోషంగా అంగీకరించాడండీ, అదీ గొప్ప విషయం. ఎందుకంటే ప్రకృతి తత్త్వం! మనం వెళ్లిపోవటానికి ఒక మార్గం. జ్ఞాని ఎప్పుడూ కూడా దర్శనం చేస్తాడు, ఇది మనల్ని పట్టుకెళ్ళిపోవడానికి మార్గంగా వచ్చింది అని చూస్తాడు తప్ప, ఇంకోటి పెట్టుకోడు.

రామకృష్ణ పరమహంసకి throat cancer వచ్చింది. Throat cancer వస్తే, శిష్యులు అందరూ అమ్మమ్మమ్మా 60 ఏళ్ళే! అలా throat cancer వస్తే, అందరూ గురువుగారూ, గురువుగారూ తగ్గించుకుంటారా, తగ్గించమంటారా అని అడుగుతారు కదా! అంటే మీరు దీని గురించి ఏ విధమైనటువంటి పరిశ్రమ చెయ్యద్దు. ఇది నేను వెళ్లిపోవడానికి ఒక మార్గం అని చెప్పాడు ఆయన, అంతే! తెలిసినవాడు అలా ఉంటాడు. ఇప్పుడు 60 ఏళ్ళకి sugar వచ్చింది అనుకోండి, బాధ పడకూడదు. మనల్ని తీసుకెళ్లడానికి ఒక మార్గం అనుకోవాలి. ఇంకా ఏం చేస్తాం ఉండి? అలా అనుకోములెండి, కలియుగంలో మానవులము. ఎంత కాలం

వీలు ఉంటే అంత కాలం ఉందాం అనుకుంటాం. మనకి స్వచ్ఛంద మరణం ఇవ్వరు. ఎందుకంటే, ఇలాగే ఉండిపోదాం అనుకుంటాం కదా! అందుచేత. సరే ఆవిడ కథ అయిపోయింది.

# 7. వేదవ్యాసుని ప్రజ్ఞ

తమ్ముడు విచిత్రవీర్యుడు వాడు అప్పటికే spent force. వాడి వీర్యం అంతా ఎప్పుడో పారపోసేశాడు, అయిపోయింది. అక్కడ ఏమీ లేదు. వాడికన్నీ రోగాలు, ఆ పెళ్ళి చేసుకున్న అంబిక, అంబాలికలకు వీడివల్ల ఏ సుఖమూ లేదు. వీడు చచ్చిపోయాడు. చూడండి, ఎలా ఉందో కథ. అంటే శంతనుడు నుంచి అంతవరకూ ఉన్న కురు సామ్రాజ్యం అక్కడ నుంచి line మారింది. ఇక్ష్వాకు వంశం line మారకుండా వచ్చింది. ఇది చంద్ర వంశం, line మారింది. ఇట్లా కొన్ని కొన్ని వంశ కథలు అట్లా line మారుతూ ఉంటాయి. ఒక చోట, ఒక ఘట్టం ద్వారా ఆ వంశం ఇంక వక్రగతిలోకి వెళ్ళిపోతుంది. అయిపోయింది. ఇహ అక్కడ నుండి కథ కంచికే! అందుకని ఈయనకి (భీష్మునికి) ఏమైందీ, ఆ సింహాసనం కాపాడటం అనేటువంటి ఒక duration, ఒక term ఉంది కదా అది extend అయిపోయింది. తమ్ముడు నపుంసకుడు. వాడి వల్ల ఏం కాదు. కాబట్టి ఇంత సామ్రాజ్యాన్ని ఎవరు పరిరక్షించాలి? తనే పరిరక్షించాలి. నెత్తికెక్కింది సామ్రాజ్యం. అప్పుడు కూడా సత్యవతీదేవి అడుగుతుంది, పోనీ నువ్వేదయినా ఒక మంచి సంతానాన్ని కనివ్వచ్చు గదా అని. ఒప్పుకోడు! standard అది. ఇంక దాన్ని కదల్చడానికి ఏమీ లేదు. అంటే

అప్పుడు సత్యవతీదేవే ఉపాయం ఆలోచించి వేదవ్యాసుడిని పిలిస్తే, వస్తాడు. ఏం తల్లీ! ఏమిటి ఆజ్ఞ అంటే, ఇదిరా పరిస్థితి అబ్బాయి. ఇద్దరు కోడళ్ళు. ప్రస్తుతం white dress లో ఉన్నారు. ఇప్పుడు ఎలా సామ్రాజ్యం? అంటే వాళ్ళకి సంతానం కలిగించే ప్రజ్ఞ వేదవ్యాసుడు ప్రవేశింపపెట్టాడు. అందువల్ల ఒక గుడ్డివాడు, ఒక పాండురోగి బయటికి వస్తారు.

వేదవ్యాసుడు గదిలో కూర్చుని, పద్మాసనాసీనుడై ఒక్కొక్కరిని లోపలికి పంపించమని అడుగుతాడు. ఎందుచేత? తన ప్రజ్ఞను ఆజ్ఞ నుండి అలా ప్రసరింప చేస్తే, ఎదుటివారి లోపలికి ఆ ప్రజ్ఞ ప్రసరించి, ఆమెయందు గర్భధారణ జరిగేటట్లుగా చేయగల శక్తివంతుడాయన. అందుచేత అలాగే కలిగిస్తాను తల్లీ! నీ మాట నేను కాదనలేను కదా అని కలిగిస్తాడు. కలిగిస్తే అంబిక ఆయన్ను చూడంగానే ఆ తేజస్సుకి కళ్ళు మూసేసుకుంది. మూసేసుకోవడం వల్ల గుడ్డివాడు పుడతాడు. ఇంకొకావిడ లోపలికి వస్తుంది, అంబాలిక. ఆవిడ లోపలికి వచ్చి ఈయనను చూడంగానే, ఈయన తేజస్సుకి తెల్లబోతుంది. అందుకని పాండురోగి పుడ్తాడు. ఇద్దరూ బయటికి వెళ్ళిన తరువాత, వాళ్ళ అమ్మ వస్తుంది. ఏమి నాన్నా, ఏమిటి పరిస్థితి అని అడిగితే, లాభం లేదు తల్లీ! ఇలా ఒకళ్లకి గుడ్డివాడు, ఇంకొకళ్ళకి పాండురోగి పుడ్తారు. మరి ఎలా అంటే నేనేమీ చేయలేను. దైవలిఖితం అలా ఉంది మరి ఈ రాజ్యానికి, అని చెప్తాడు.

కురు సంతానమంతా వ్యాసుడి పరంపరే కదా! కానీ

వ్యాసుని యొక్క ప్రజ్ఞ నిలబెట్టుకోలేకపోయారు వాళ్ళు. అందుచేత సత్యవతీదేవి మరొక్కసారి పంపిస్తాను అంబికను అంటే, నవ్వుతాడు వేదవ్యాసుడు. ఎందుకలా వ్యామోహపడ్తావు? అమ్మా! జరగవలసినది జరుగుతుంది. మనం చేసేదేమీ లేదు అని, కాని వీళ్ళందరికీ ఏదో ఒక కర్తవ్యం అంటూ ఒకటి ఉంటుంది. మనమేమీ పూర్తిగా చేయలేదేమో సరిగ అని. ఆయనేమో వెళ్ళిపోయాడు. తనొచ్చి ఇక్కడ కూర్చుంది. తనకిద్దరు తోడయ్యారు. ఇప్పుడు ముగ్గురు అక్కడ. Apart from Bhishma ఆ palace లో ముగ్గురు widows అక్కడ. అందుకని ఇంకొకసారి పంపిస్తానురా! అంటే, తల్లి మాట కాదనలేక, అలాగే, అంటాడు. అందుకని మళ్ళీ అంబికకు చెప్తుంది ఇంకొకసారి వెళ్ళు తల్లీ అని. ఆవిడ అప్పటికే భయపడిపోయి ఉంటుంది. షాక్ లో ఉంటుంది. 'ఇగ్నేషియాలు' లాంటివి ఏవి వేసినా పనికొచ్చేటటువంటి పరిస్థితి లేదు. అందుచేత అలాగే అని, ఆవిడేం చేస్తుంది తన దాసిని పంపించేస్తుంది. అది చూడండి తమాషా! ఆ దాసిలో స్థిరచిత్తం ఈ రాజకుమారిలో లేదు. విచిత్రం కదూ! చాల విచిత్రం.

అంటే ఎవరిలో స్థిరచిత్తం ఉన్నది, ఎవరిలో సంస్కారం ఉన్నది జాతి చేత నిర్ణయం చేయగలరా? చేయలేరు. ప్రవర్తన చేత నిర్ణయం చేయగలరు. సంస్కారం చేత నిర్ణయం చేయాలి. అది కదా భగవద్గీతలో చెప్పిన విషయం. భారతంలో చెప్పిన విషయం. సంస్కారం చేత నిర్ణయం చేయాలి తప్ప, ఇంకొకరకంగా చేయకూడదు. ఆమె వచ్చి కూర్చుందండి ఎదురుగుండా. నిశ్చలంగా

కూర్చుంది. ఎంత ఆశ్చర్యం అండి? మనం ఆశ్చర్యపడొద్దూ? ఇద్దరు రాజకుమార్తెలు, పైగా కాశీరాజు కుమార్తెలు. వాళ్ళిద్దరూ వేదవ్యాసుని ప్రజ్ఞను తమలోనికి అందుకోలేకపోయారు. ఒకరు కళ్ళు మూసేసుకుని వణికిపోయారు. ఇంకొకరేమో తెల్లబడిపోయారు. ఎందుచేత భోగముల చేత. రాజకుమార్తెలవడం చేత భోగములకు లోనైనపుడల్లా ప్రజ్ఞ బాగా సన్నగిల్లి పోతుంది. అందుకనే యోగమునందు ఉన్నటువంటి వారు భోగాసక్తులై ఉండకూడదు అని చెప్తారు. ఎందుకంటే భోగము ప్రజ్ఞను సన్నగిల్ల చేస్తుంది. ఈ దాసి మరి ఏమిటో, ఆవిడ పూర్వపుణ్యము ఏమిటో, ఆవిడ కథ ఏమిటో, మనకు భారతంలో ఎక్కువగ లేదు. ఉంటుంది ఏదో కథ లేకుండా అలా, అంతలా వేదవ్యాసుని ప్రజ్ఞను అందుకునేటటువంటి అదృష్టం ఆమెకు ఎలా లభించిందో! అప్పటికే భారతం విస్తారం అయిపోయింది కదా! అందుకని అది క్లుప్తంగ అలా ఉంచేశారు. మరి ఆమె నుండి సాక్షాత్తు యముడే దిగి వస్తాడు. యముడికి శాపకారణం చేత ఈమె నుండి దిగి రావలసి వస్తుంది. చూడండి, ఎలా ఉందో! యముడంటే ఎంతటి వాడండీ? సాక్షాత్తు విష్ణుమూర్తే! సృష్టిని యమించేటటువంటి వాడు. నియమము లేర్పరచి, యమించేటటువంటి ఆయన, దిగి వస్తాడండి ఈ దాసీకన్య ద్వారా. అప్పుడు మళ్ళీ తల్లి అడుగుతుంది వ్యాసుడిని. నీ కోడలు రాలేదు తల్లీ! ఎవరినో పంపించింది. కాని మహాత్ముడు వస్తాడని చెప్తాడు.

# ౮. ధర్మనిర్ణయం

మహాత్ముడొస్తే ఉపయోగమేముంది? పుట్టింది దాసీకన్యకి కదా? వాళ్లిద్దరికి ఒక గుడ్డివాడు, ఒక పాండురోగి. ఇద్దరూ బాగా యోగాభ్యాసం చేసినవాళ్ళు. ధర్మనిష్ఠ కలిగినవాళ్ళు. గుడ్డివాడికి రాజ్యం కట్టకూడదు. పాండురాజుకు రాజ్యాన్ని అప్పచెప్తారు. ఆయనకి తాతగారి పోలికలన్నీ దిగి వస్తాయి. వేట, వేట! చాలా విస్తరిస్తాడు రాజ్యాన్ని. ధర్మాత్ముడు. ధృతరాష్ట్రుడికి కూడ ఒక్క వ్యామోహం/మమకారం తప్ప, మిగతా ధర్మం అంతా తెలుసు ఆయనకి. ధర్మరాజుకు ధర్మం ఎంత తెలుసో ధృతరాష్ట్రుడికీ అంతే తెలుసు. తక్కువేం తెలియదు. కాని ఒక్కటే minus point మమకారం. *"మామకాః పాండవాశ్చైవ కిమకుర్వత సంజయ"* అంటాడు. నాది అనే గోల ఎక్కువ ఈయనకి. అదొక్కటే గోల. ఈ పాండురాజు రాజ్యమేలతాడు, ఫరవాలేదు, ఇంక మనం వెళ్ళిపోవచ్చు అని భీష్ముడు అనుకొనే timeకి, పాండురాజు వేటకి వెళ్తాడు. వేటకి వెళ్ళి శాపానికి గురైపోతాడు. ఆ శాపానికి గురైపోవటంవల్ల పాండురాజు నేనింక రాజ్యంలోనికి రాను, నేనిక్కడే ఉండిపోతాను అని నిర్ణయం చేసుకుంటాడు. అట్లా వనంలో పుట్టినవాళ్ళే ఈ పాండవులందరూను. దివ్య కారణాలతో పుట్టుకొస్తారు వాళ్ళు. ఇక్కడ ఇహ మిగిలిపోయిన వాడు గుడ్డివాడే. గుడ్డిరాజు పరిపాలనకి మరి రక్షకుడు ఉండాలిగా! అంటే

ఏమైందీ, తమ్ముడికి రక్షణగా ఉండేవాడు. తమ్ముడి కొడుకు కాదు, తమ్ముడి భార్య కొడుకు కదా! ఇలాంటివి తెలియాలంటే మనం పాశ్చాత్యదేశాలకు వెళ్లాలి. అక్కడికి వెళ్తే బాగా తెలుస్తాయి ఇలాంటివి. అంటే ఇంకొకరి ద్వారా పొంది, వీళ్ళ దగ్గర ఉంటూ ఉంటారు. అంటే కోడలి కొడుకు. అందుచేత వాడు గుడ్డివాడు. రాజ్యం వీడికి అప్పచెప్పి వెళ్ళిపోతే, తండ్రికి ఇచ్చిన మాట నెరవేరదు. అందుకని భీష్ముని ఊడిగం continue అయిపోయింది. ధర్మం కోసం! విచిత్రం కాదూ?

అలా వుండగా వీళ్ళు వచ్చేస్తారు. మనవాళ్ళు. మనవాళ్ళంటే దుర్యోధనాదులు. వాళ్ళేగా మనవాళ్లు! గుడ్డిరాజు సంతానం వందమంది, పాండురాజు సంతానం, అదెప్పుడూ ప్రశ్నార్థకమే! నిజంగా పాండురాజు పుత్రులు కాదు కదా వీళ్ళు. అదే గదా ధర్మసంకటం అక్కడ. కుంతీదేవి ముగ్గురు దేవతల ద్వారా ముగ్గురు కుమారులను పొందుతుంది. ఇంద్రుడి ద్వారా అర్జునుడిని, వాయుదేవుడి ద్వారా భీముడిని, ధర్మ స్వరూపమైన యముని ద్వారా ధర్మరాజుని పొందుతుంది. అశ్వినీ దేవతల ద్వారా నకుల, సహదేవులను మాద్రి పొందుతుంది. అందుకని వీళ్ళు పాండురాజు సంతానం ఎలా అంటారు? అని ప్రశ్న. పాండురాజు సంతానం కాదు కదా అంటే, ధృతరాష్ట్రుడు విచిత్రవీర్యుడి సంతానమేనా? కాదు కదా! మరి ఆయనకి ఎలా సంక్రమించిందో వీళ్ళకీ అలాగే సంక్రమించాలి రాజ్యం. ధర్మం భారతంలో చాలా అద్భుతమైన విషయం. అందుకని దుర్యోధనుడు వాళ్ళు, పాండురాజుకు పుట్టలేదు కదా, మా బాబాయికి పుట్టలేదు కదా అంటూ ఉంటారు. ఎప్పుడూ

వాడికదే point. నీ పుట్టుకేమిటిరా, నువ్వూ అలాంటివాడివే. దొందూ దొందే! రెండూ, రెండు రకాలుగా తమాషాగా వచ్చేసింది అక్కడ. కాలం అలా పట్టుకొచ్చేసింది. ఇలాంటి సందర్భంలో మన నాయకుడు భీష్ముడు అలా ఉండిపోవలసి వచ్చిందండీ! అది చాల విచిత్రమైన విషయం కదూ?

ఉత్తరాధికారి సరైనవాడు దొరికితే వెళ్ళిపోదాం అనుకునే భీష్ముడికి ఉత్తరాధికారి కనపడలేదు చివరివరకు. ధర్మరాజు కనిపిస్తాడు. వాడికి రాజ్యం ఇవ్వరు కదా! చిట్టచివరికి కదా, తనకు తెలుసు. ఇంక ఈలోపల యుద్ధం వచ్చేస్తుంది. భీష్ముడు అలా వేచి వేచి వేచి, దురాగతాలన్నీ అలా చూస్తూ ఉంటాడు. అంటే నిమిత్తమాత్రం అని బాగా తెలిసిపోతుంది. ఇక మన వల్ల కాదు, వేరే కారణం ఏదో ఉంది, మనం దీన్ని శ్రద్ధతో పరిరక్షిస్తూ ఉండాలి అని తెలుస్తుంది. ధర్మరాజు గోచరించిన తరువాత ఆయనకు ఆశ పుడ్తుంది. జ్యేష్ఠుడు. కాని, చాలా కాలం ఆయనకు రాజ్యం దక్కనివ్వరు. శతాబ్దం పాటు ఆయనకు రాజ్యమే దక్కదు. శతాబ్దం! అప్పటికి భీష్ముడు వచ్చేసి రెండు శతాబ్దాలు అయిపోతుంది. అందుకనే ఆయన వృద్ధుడు యుద్ధంలో. వృద్ధుడంటే శరీరమే, ప్రజ్ఞ కాదుగా! అయినప్పటికి ఆయన తేజోవంతుడు, పరాక్రమవంతుడు. ఆయనతో ఎవరూ యుద్ధం చేయలేరు.

ఉత్తర గోగ్రహణం అప్పుడు భీష్ముడు అర్జునుడికి కావాలనే లొంగిపోతాడు. మన్నిద్దామని. ధర్మం ఉంది. ధర్మం ఉంది కాబట్టి మన్నించడమే సత్యం అని పెట్టుకుంటాడు. కర్ణుడికి కూడా అదే

చెప్తాడు. మనం గెలవటం అనేది కల్లో మాట. కల్ల. ఊరికే కలలు పెంచుకోబోకు అని చెప్తాడు. నువ్వు చాలా పరాక్రమవంతుడివే నేను కాదనను. ఆయనను అర్ధరథు డంటారు, మహారథు డనకుండ. కర్ణుడిని అర్ధరథుడని పక్కన పెట్టేస్తాడు భీష్ముడు. ఇంతమంది కలిసి ఏం పడతాంలే వాళ్ళమీద అని. పడినా పోతుంది. అందుకని కర్ణుడు వచ్చి అడుగుతాడు. ఎందుకిలా చేస్తున్నారు మీరు? అని. ధర్మం మన పక్కన లేదు, మనం ఓడిపోతాం. మనలో సత్యం లేదు, అక్కడే ఉంది సత్యం. నీకు తెలియదా, ఆత్మావలోకనం చేసుకో! అని చెప్తాడు. దుర్యోధనుని కొమ్ము కాస్తూ కూర్చుంటే అందరం పోతాం. కాని వీడికి మనం ఋణపడి ఉన్నాం, కాబట్టి అందరం పోవలసిన వాళ్ళమే! అని చెప్పేస్తాడు భీష్ముడు. అని ఉదాహరణ కూడా చెప్తాడు.

నువ్వు అర్జునుడి కన్న పరాక్రమ వంతుడివని నీకు తెలుసు. అర్జునుడి కన్న నీవు చాలా పరాక్రమ వంతుడివని నాకు తెలుసు. ఎందుకనీ? నీవు సూర్యపుత్రుడవు. అర్జునుడు ఇంద్రపుత్రుడు కదా! తన శక్తి సామర్థ్యములు తనకు పరిపూర్ణంగా తెలిసినవాడు కర్ణుడు. తనకి లోపల అంతఃశ్చేతనలో తెలుసు అర్జునుడు తనకన్న తక్కువ వీరుడని. కాని యుద్ధం చేస్తే అర్జునుడే గెలుస్తాడు. అదేమిటి? ద్రుపదుడిని అడుగుతాడు ద్రోణుడు గురుదక్షిణగా. అడిగినప్పుడు కర్ణుడూ వెళ్తాడు, అర్జునుడూ వెళ్తాడు, అందరూ వెళ్తారు. అర్జునుడే గెలుస్తాడు ద్రుపదుడిని. అప్పుడు నువ్వు ఓడిపోయావు కదా! ఓడిపోయావు. ఆ తరువాత అరణ్యంలో వాళ్ళున్నప్పుడు వాళ్ళనేదో పట్టుకోవాలని నువ్వు ప్రయత్నం చేస్తే, ఒక గంధర్వుడి చేతిలో

మీరందరూ ఓడిపోతే అర్జునుడేగా రక్షిస్తాడు. అక్కడా నువ్వే ఓడిపోయావు, ఆయన గెలిచాడు. అంతే కాదు ఉత్తర గోగ్రహణం అప్పుడు మనందరం వెళ్తే మనం ఓడిపోయాం కదా! అతడే గెలిచాడు కదా! అదే, ఎందుకు? అని అడుగుతాడు కర్ణుడు. అదే ఎందుకు? సరే మీ సంగతి నాకు తెలుసు, వాళ్ళ పక్షపాతం మీకు ఉంది. నా సంగతి ఏమిటి అంటాడు.

నీ సంగతి, నా సంగతి ఒకటే, అంటాడు. ఏమిటంటే అక్కడ మన పరాక్రమములు కాక మరొక విషయం ఉందన్నాడు. ఏమిటి అంటే, ధర్మము. ధర్మం అటుపక్క ఉంది. అందుచేత నువ్వు ఆయనకన్నా పరాక్రమవంతుడ వైనప్పటికి కూడా నువ్వు గెలవలేవు అర్జునుడిని. నీకన్నీ అడ్డంకు లొచ్చేస్తాయి. నీకన్నీ అంతరాయా లొచ్చేస్తాయి. దైవానుగ్రహం ఎక్కడుంటుంది? ధర్మం ఉన్నచోట ఉంటుంది. ధర్మం ఉన్నచోట అంతరాయాలన్నీ వీడిపోతూ ఉంటాయి. విఘ్నాలన్నీ పోతూ, దారి దొరుకుతూ ఉంటుంది. ధర్మం లేని చోట ఒకదాని మీద ఒకటి, ఒకదాని మీద ఒకటి పడిపోతూ ఉంటాయి. ఎన్ని తీసినా ఇంకా పడిపోతుంటాయి. ఎంత తేడా ఉందీ? అందుకని మనది ధర్మం కాదు. దుర్యోధనుడు నిర్వర్తిస్తున్నది ధర్మం కాదు. ధృతరాష్ట్రుడు మమకారి, అంతే! అతనిలో ఆ ఒక్కటి తీసేస్తే, అతడు మహాజ్ఞాని. అందుకనే సులభంగా అలా కూర్చొని వదిలేస్తాడండీ శరీరం. అందువల్ల నువ్వేదో మోహపడకు. వాళ్ళమీద మనం జయం సంపాదిస్తామని, అవన్నీ అయ్యే పనులు కావు అని చెప్పేస్తాడు కర్ణుడికి భీష్ముడు, కర్ణుడు అడిగితే!

తెలుసు తనకి! అందుచేతే కర్ణుడు ఈ కవచకుండలాలు అడిగితే ఇచ్చేస్తాడు. కుంతి అడిగితే వరం ఇచ్చేస్తాడు. ఎలాగూ పోతాం గదా, నాలుగు మంచి పనులు చేసి పోదాం అని. కొన్ని జీవితాలు అలా పండబోయి పుచ్చిపోతాయండి, తమాషాగ. పంటకొచ్చి పాడైపోతుంది చూడండి చేను, అలా అయిపోతూ ఉంటుంది. కర్ణుడి జీవితం అలాంటి జీవితం. సామాన్యమైన జీవితం కాదు. ఇంద్రుడు వచ్చి కవచకుండలాలు అడిగేస్తాడు. ముందే సూర్యుడు వచ్చి చెప్తాడు, నాన్నా వాడు ఇలా వస్తాడురా, వాడాపని మీదే ఉన్నాడు సుమా! అని. ఎప్పుడు వచ్చి అడిగితే ఇవ్వాలో అప్పుడు వచ్చి అడుగుతాడు ఇంద్రుడు, బ్రాహ్మణ రూపంలో. వచ్చినవాడు ఇంద్రుడని తెలిసి ఇస్తాడండి. ఇందులో ఎవ్వరూ సామాన్యులు కారు. ఆ తరువాత కుంతి వస్తుంది. కుంతి ఎందుకు వచ్చిందో అర్థమౌతుంది. అలాగే తల్లీ! ఎవరినీ ముట్టుకోను, ఒక్క అర్జునుని తప్ప, అంటాడు. అర్జునుడి మీద మరి అలా ఉంది ఆయనకి. అందుకనే వీళ్ళ నలుగురూ దొరుకుతారు ఆయనకి సంహరించడానికి. ఒక్కళ్ళనీ ముట్టుకోలేదు. ఎందుచేత, ఆయనా ధర్మాత్ముడే! కొంత అసూయ అర్జునుడంటే! ఆ కర్ణుడూ పరశురాముడి శిష్యుడే. ఈ భీష్ముడూ పరశురాముడి శిష్యుడే. పరశురాముడి వద్ద వరాలు పొందినవాడు భీష్ముడు. పరశురాముడి వద్ద శాపం పొందినవాడు కర్ణుడు. మన భారతం భారతమేనండి! అందుచేత ఈయన చెప్తాడు. మనవల్ల అవ్వదు ఇదీ, మనం గెలవమూ, ఊరికే మోహం పెంచుకోకు అని చెప్తాడు. అందుకనే యుద్ధం ముందు వీళ్ళందరూ వచ్చి అడిగితే, తాతా! అని కాళ్ళమీద పడతాడు ధర్మరాజు తమ్ముళ్లతో వెళ్లి.

అక్కడో గుడారం ఉంటుంది. ఇక్కడో గుడారం ఉంటుంది. మధ్యలో play ground ఉంటుంది. దండం పెట్టుకోడానికి వస్తారు. దండం పెట్టుకోవడానికి వెళ్ళమని కృష్ణుడు చెప్తాడు. ఎందుకనీ? ఆయన ధర్మాత్ముడు. ఆయన ఆశీర్వచనం కావాలి. భీష్ముడంటే కృష్ణుడికి చాలా ఎక్కువ. ఏం! ద్రోణుడి దగ్గరకి వెళ్ళమని చెప్పలేదుగా! చెప్పాడా? ద్రోణుడు గురువుగారు కదా, దండం పెట్టుకొమ్మని చెప్పాడా కృష్ణుడు? చెప్పలేదు! వెళ్ళి తాతకు దండం పెట్టండి అని చెప్తాడు. తాత దగ్గరికి ఎందుకంటే తాతకి దండం పెట్టడం ముఖ్యం. తాతకి దండం పెడితే ఏమంటాడో కృష్ణుడు వినాలి. అది ఆయనకు కావాలి. అంటే ఆయుష్మాన్ భవ! అంటాడా, విజయోస్తు! అంటాడా? ఏమంటాడనేది కదా! ఎదురుగా యుద్ధం చేస్తున్నటువంటి వాడు నిన్ను చంపను అని చెప్తే, ఆయుష్మాన్ భవ! నువ్వు గెలవాలి అంటే, గెలుస్తాం. భీష్ముడు నువ్వు గెలవాలి అనకపోతే, వీళ్ళు గెలిచే ప్రశ్న లేదక్కడ. అందుకని పంపిస్తే 'విజయోస్తు!' అని ఆశీర్వదిస్తాడు. ఆ ఆశీర్వచనం చాలా ముఖ్యం కృష్ణుడికి. అందుకని వెళ్ళి కలిసివచ్చిన తరువాత, కృష్ణుడు అడుగుతాడు. భారతం చదువుకుంటే బాగుంటుంది. ఏమన్నాడు? తాత ఏమన్నాడని. విజయోస్తు! ఆ.... ఇంక ఫరవాలేదు మనకి. ఆయన విజయోస్తు! అన్నాడట అంటే, మనకి విజయం కలిగేటట్లు సహకరిస్తాడు. అంతే కదా, ఇంకొకటి చేయడు కదా!

# ౯. భీష్ముని యుద్ధము

ఎనిమిది రోజుల యుద్ధం అవుతుంది. ఏదో అలా సాదాసీదాగ చేస్తుంటాడు భీష్ముడు. ఈలోపల అర్జునుడు చాలా మందిని ఏరేస్తాడు. అర్జునుడు గెలవడానికి కావలసినటువంటి సదుపాయమంతా పద్దెనిమిది రోజుల యుద్ధంలో ఎనిమిది రోజులు భీష్ముడి సహకారంతో అయిపోతుంది. వ్యతిరేకంగా యుద్ధం చేస్తున్నట్లు గోచరిస్తున్నప్పటికి నిజానికి భీష్ముడు ధర్మం వైపే మొగ్గి వుంటాడు. అంటే కృష్ణుడి వైపే వుంటాడు. అటు 13 అక్షౌహిణులు, ఇటు 5 అక్షౌహిణులు అవన్నీ తగ్గుకొచ్చేస్తాయి. సరే, దుర్యోధనుడికి కొంచెం అప్పుడు తెలుస్తుంది. వాడు మొదట్నించి అనుమానం పిశాచి! అందుకని వాళ్ళందరూ కలసి నిర్ణయం చేసుకుంటారు, ఈయనకి కొంచెం మనం ఎక్కించాలి, లేకపోతే మొత్తం మనకే సున్నం పూసేస్తాడు అని. అందుకని వాళ్ళు వెళతారు గుడారంలోనికి ఎనిమిదవ రోజు సాయంత్రం. గుడారంలోకి వెళ్ళి, తాతా! నీ గురించి ఏదో అలా చేశావు ఇలా చేశావు అని బోలెడు విన్నాం. అవన్నీ మేము చూడలేదు. పరశురాముడిని గెలిచినపుడు నేను పుట్టలేదు కదా! అవన్నీ కాకమ్మ కథలేమో అని చాలా మాట్లాడ్తాడు. అంతేకాదు బోల్డు చెప్తాడు. ముసలాడివైపోయావు. నిన్ను పెట్టుకున్నాను నేను. నీ వల్ల ఏదీ కావడం లేదు..... అట్లా

మాట్లాడితే ఆయనకు పౌరుషం ఉండదా! వీళ్ళెన్నడూ చూడలేదు భీష్ముడి పౌరుషం. అంటే దుర్యోధనుడితో చెప్తాడు నీ కోసం రేపు చూపిస్తాను నా పౌరుషం చూడు అని.

ఇంక ఆ రోజు యుద్ధం తొమ్మిదవ రోజు. ఆ రోజు భీష్ముడి యుద్ధం అండీ, పిచ్చి కుక్కల్ని కొట్టినట్లు కొట్టేస్తాడు అందరినీ. ఆశ్చర్యపోతారు అందరూ పిచ్చెక్కిందా ఏమిటీ, భీష్ముడేమిటి ఉన్నట్లుండి ఇలా మారిపోయాడని. ఏమైంది ఈయనకి? ఇన్ని రోజులు చాలా సంసార పక్షంగా చేశాడు యుద్ధం. తొమ్మిదవ రోజు తన సహజమైనటువంటి పరాక్రమం చూపించాడు భీష్ముడు. కృష్ణుడు లేదు, అర్జునుడు లేదు, ఎవరైనా సరే ఫెడీ ఫెడీ ఫెడీమని కొట్టేస్తాడు. కృష్ణుడికి కూడ తగిలేస్తుంది. అలా కొడ్తాడు. మొత్తం పాండవుల సైన్యమూ, పాండవులూ depression లోకి వెళ్ళిపోయేటట్లు కొట్టేస్తాడు. సాయంత్రం celebrations, ఏదీ, ఆ గుడారంలో. ఈ గుడారంలో అంతా mourning. దుఃఖపడుతూ ఉంటారు. ఎట్లా, ఈ తాత ఏమిటి ఇట్లా అయిపోయాడేమిటి అని. ఆ తాత ముందు మరి ఎవరూ నిలబడలేరు. అజేయుడే ఆయన. అప్పుడు కృష్ణుడు అంటాడు, బాధపడవద్దు. ఆయనేంటో మీకు కూడా తెలియాలి కదా! ఆయనేంటో ఎప్పుడైనా చూశారా మరి! ఎన్నడైనా చూశారా మరి ఆయన్ని? నాకు తెలుసు అని, మళ్ళీ పొమ్మంటాడు. అలా బిక్క మొహాలు వేసుకొని వెళ్ళిపోతారు ఇంత పాండవులూనూ ఆయన దగ్గరికి. అంతా మహారథులే గదా! తొమ్మిదవ రోజు సాయంత్రం వెళతారు వీళ్ళంతా. వెళితే

అప్పుడు, తాతా! ఎలా మరి! విజయోస్తు! అని నువ్వు ఆశీర్వచనం ఇచ్చావు. మరి నీ ఆశీర్వచనం సత్యం కావాలి కదా! అంటే ఆయన అడుగుతాడు 'ఆయన' పంపించాడా మిమ్మల్ని అని ఎవరు? శ్రీకృష్ణుడు.

భీష్ముడు తెలియని వాడు కాదు. తెలిసిన వాడు. నువ్వు మమ్మల్ని అంగీకరిస్తే మేము ముందుకు వెళతాం, లేదంటే మరి అంతే సంగతులు అని దండం పెడ్తారు. దండం పెట్టడంలో ధర్మరాజుకు మించినవాడు మరొకడు లేడు కదా! ఇంకా భీముడు, అర్జునుడు అంతలా వంగరు కానీ, మనవాడు పూర్తిగా వేసేస్తాడు సాష్టాంగ నమస్కారం. దండం పెడితే, సరే రేప్పొద్దున్న శిఖండిని పట్రండి. కూర్చోపెట్టుకోండి ఎదురుగా రథంలో. నేను ఇక విల్లు ధరించను అని చెప్తాడు. ఈ తొమ్మిదవ రోజు ఏం జరుగుతుందో అది మధ్యాహ్నం చెప్తాను. ఎనిమిది రోజులు యుద్ధం అయిపోయింది. తొమ్మిదవ రోజు యుద్ధంలో కృష్ణుడు ఆపేస్తాడు కదా, ఎందుకంటే అంతలా చెలరేగి అందరినీ చంపుతుంటే ఇంక కథ అయిపోతుంది. అందువల్ల తాను లంఘించి చక్రాన్ని ధరిస్తాడు. చక్రం పడతాడు. పడితే అప్పుడు భీష్ముడు ఆగుతాడు. ఆయనకు గుర్తొస్తుంది ఇంక మరి ఇంతకన్న ఎక్కువ వెళ్ళబోకు అని కృష్ణుడు చెప్పడం. చంపడం కాదు ఉద్దేశ్యం. కానీ అతని మాట నెగ్గించాలి. భీష్మడి మాట నెగ్గించాలి. ఏమిటీ? చక్రం పట్టిస్తానన్నాడు. చక్రం పట్టించాడు. చక్రం పట్టుకున్నాడు తాను అతని మాట నెగ్గడానికి. అదీ *"తనుకున్ భృత్యుడు, వీనిన్ గాచుట*

*మహాధర్మంబు వొమ్మంచు''* అలా కూడ అవగాహన చేసుకోవచ్చు. ఆయనా భృత్యుడే. అర్జునుడు భృత్యుడే ఆయన్ని కాపాడినట్టు, ఈయన్నీ కాపాడినట్టు. ఈయన్ని కాపాడటమంటే ఈయన మాట చెల్లించాలి. ఈయన మాట చెల్లించడానికి రథం మీదనించి దూకి చక్రం పట్టగానే, రథం దిగేసి దండం పెట్టేస్తాడు తొమ్మిదో రోజు, భీష్ముడు దండం పెట్టేసిన తరువాత సాయంత్రం పాండవులను పంపిస్తాడు శ్రీకృష్ణుడు. ఆ దండం పెట్టడంలో ఉద్దేశ్యం ఏంటీ? నువ్వే చంపేస్తే అయిపోతుంది గదా, అన్నట్లుగా! కాని అలా ఉండదు.

చంపగలం కాబట్టి చంపేయడం అనేటువంటిది తెలియని వాడు చేస్తాడు. ఎవరికి ఎలా మరణం సంభవించాలో వారికి ఆ విధంగానే సంభవించాలి. మరి అంబ? అంబ కోరిక ఒకటుంది కదా! అంబ కోరిక తీర్చవద్దా? ఎన్నుంటాయండీ పరమాత్మకి? అందుచేత వదిలేసి నీ కోరిక తీర్చాను. నువ్వు చూస్తుండగా చక్రం పట్టాను. ఇంక చాలు నీ ప్రతాపం. నీవెంతటి వాడవో అందరికీ అర్థమయింది అన్నట్లుగా సందేశం. సరే యుద్ధం ఆ రోజుకి అయిపోతుంది. సాయంత్రం పాండవులు వెళ్తారు. వెళ్తే, శిఖండిని తెచ్చుకోమని భీష్ముడు చెప్తాడు. మర్నాడు శిఖండిని తెచ్చుకుంటారు. తెచ్చుకుంటే అలా నిర్దాక్షిణ్యంగా అర్జునుడు బాణం వేసేస్తే ఆయన ఒరిగిపోతాడు. మరణించడు. ఒరిగిపోతే యుద్ధం ఆ రోజుకు ఆపేస్తారు. ఆయనకు అంపశయ్య ఏర్పాటు చేస్తారు. ఇప్పుడప్పుడే వెళ్ళను నేను, అంటాడాయన. యుద్ధం

అంతా అయిన తరువాత వెళ్తానంటాడు. స్వచ్ఛంద మరణం కదా! ఎందుకంటే He wants to make sure, ఆయన రూఢి చేసుకోవాలి ఎవరు ఆ సింహాసనాన్ని ఆక్రమిస్తారో! ఇలాంటి ఒక కథ వెనకాల నడుస్తుంటుందని మనం ఆయన్ని అనుసరించుకుంటూ వెళితే కనిపిస్తుందండీ! అందుకే నేను మరణించను. నేలమీద పడుకోను నేను, అనగానే తాతగారికోసం అంబులతో శయ్య ఏర్పాటు చేసి, అర్జునుడు భూదేవికి నమస్కరించి, భూజలం (గంగాజలం) ఏర్పాటు చేసి, పాదాలకు నమస్కారం చేస్తాడు. భీష్ముడు సంతోషించి ఆశీర్వదిస్తాడు. దేవతా స్వరూపుడు భీష్ముడు. అమిత తేజోవంతుడు, నిరుపమానమగు వీరుడు. స్వచ్ఛందంగా తనను తాను ధర్మానికి, దైవానికి సమర్పించుకొని యుద్ధం నుండి వైదొలగుతాడేకాని, మరణించడు.

ఈయన నన్ను నేలమీద పడుకోబెట్టద్దు, అని అంటాడు. దేనిమీద పడుకోబెట్టాలీ? అంపశయ్య! అర్జునుడు ఏర్పాటు చేస్తాడు, ఏడుస్తూ. అర్జునుడికి తాతగారి మీద ఉండేటువంటి ప్రేమ, గౌరవం, అభిమానం, ఒక విధమైన భక్తీ..., అబ్బో చాలా ఎక్కువ. ఆయనకీ అంతే! ఈయనమీద. అర్జునుడంటే ప్రాణం భీష్ముడికి. అర్జునుడిని చూస్తేనే కరిగిపోతాడు భీష్ముడు. అంతే మరి! అర్జునుడి కథ వేరు మరి. పిల్లవాడు. తనలాంటి వాడు. సకల గుణములు కలిగినటువంటివాడు. ధర్మం కలిగినటువంటివాడు. అర్జునుడి రూపవర్ణన చేస్తే అద్భుతంగా ఉంటుంది. అతనంటే ఎంతో ముచ్చట ఈ తాతకి. అందుకనే నువ్వే ఏర్పాటు చెయ్యిరా

నాన్నా! అంటే అర్జునుడే ఏర్పాటు చేస్తాడు, అదీ ఏడుస్తూ. దాహం వేస్తోందంటే ఒక్క బాణం కొడితే నీళ్ళు, గంగ నోట్లోకొచ్చి పడతాయండి సరాసరి. అలా నా నోట్లో పడకుండా గంగను నువ్వు తీసినట్లైతే, నేను నిన్ను శపించేవాడిని అని చెప్తాడు. ఎందుకంటే తల్లి! వృథా కాకూడదు. అలాంటి అర్జునుడు! అంపశయ్య మీద పడుకోబెట్టాడు. పడుకోబెట్టేసి యుద్ధం కొనసాగిస్తారు. కొనసాగిస్తే ఎంతవరకు ఉన్నాడండీ? ధర్మజుడు పట్టాభిషేకం చేసుకున్న తరువాత, ఉత్తరాయణం వచ్చిందని, ఏకాదశి రోజున వెళ్ళిపోదాం అని నిర్ణయం చేసుకుంటాడు, స్వచ్ఛంద మరణం ఉన్నవాడు కాబట్టి. అయితే ధర్మరాజు పట్టాభిషేకం అయిపోయిన తరువాత సంబరాల్లో పడిపోతారు అందరూ. మనమైనా అంతే! మన వాడెవరో అక్కడ I.C.U. లో ఉన్నాడు. మనం ఇక్కడ celebrations చేసుకుంటూ ఉంటాం కదా! అక్కడ ఆయన అంపశయ్య మీద ఉన్నాడు. ఇక్కడ ఈ రాజ్యం గెలిచిన సంబరాల్లో ధర్మరాజుకి పట్టాభిషేకం! ఓహో! హడావుడి అంతా అయిపోతుంది.

# 10. భీష్మని యుపదేశము

ఒక రోజు ధర్మరాజు, కృష్ణుడికి దండం పెట్టుకుందామని వస్తాడు. Out of sight, out of mind అంటాం కదా! కృష్ణుడు అలా ధ్యానంలో ఉంటాడు. ధర్మరాజు వస్తే అస్సలు కదలడు, మెదలడు, ఉలకడు, పలకడు. అలా ఉంటాడు. చాలా గంభీరమైనటువంటి మూర్తి! అంటే కృష్ణుడు ధ్యానం చేయడం ఎవరూ చూసి ఉండరు ఎప్పుడూ కూడ. ఎప్పుడూ నవ్వుతూ కనబడడం తప్ప. చూసి ధర్మరాజు అప్రమత్తుడౌతాడు. దగ్గర చేరి పాదాల దగ్గర కూర్చొని, స్పర్శించి, దండం పెట్టుకుంటే, కళ్ళు తెరుస్తాడు శ్రీకృష్ణుడు. కళ్ళు తెరిస్తే, ఏమిటీ ఇలాంటి సమయంలో ఇలా ఉన్నావేమిటి అని ధర్మజుడు అంటే, భీష్ముడు నిష్క్రమించడానికి సంకల్పం చేసుకున్నాడు. ఈ భూమి మీద అలాంటి వెలుగు మళ్ళీ దిగుతుందని మనం అనుకోలేము. అక్కడ సమస్త శాస్త్రములు ఉన్నాయి. సమస్త ధర్మములు ఉన్నాయి. సమస్త వేదములు ఉన్నాయి. అక్కడ లేనిది లేదు. నువ్వు తెలుసుకోవలసినది చాల ఉన్నది. అలాంటి వాడు వెళ్ళిపోతున్నాడు. తన మనస్సులో నన్ను అనుజ్ఞ కోరుతున్నాడు. నేను వెళ్ళిపోతాను. వెళ్ళిపోనా అని అడుగుతున్నాడు. అదీ పరిస్థితి. పద పోదాం, అంటాడు. అంటే కృష్ణుడు గుర్తు చేస్తే తప్ప గుర్తు రానంత మత్తులోకి వెళ్ళిపోయారు

ధర్మరాజుదులు. చూడండి ఎలా ఉందో! అందుకని కృష్ణుడు పాండవులందరినీ భీష్ముని వద్దకు తీసుకొని వెళ్ళాడు.

భీష్ముని పూర్వ వృత్తాంతమంతా మనకి బాగా తెలిస్తే, అప్పుడు భీష్ముడు పలికిన పలుకుల్లో ఉండేటటువంటి లోతులు మనకి బాగా తెలుస్తాయి. ఏదో మనం సినిమాల్లో చూసిన భీష్ముడితో సరిపెట్టుకుంటే ఎక్కువ తెలియదు. ఎంత కాలం వేచి ఉన్నాడండీ తండ్రికిచ్చిన మాట కోసం? తండ్రి తరం, తమ్ముడి తరం, ధృతరాష్ట్రుని తరం, దుర్యోధనుని తరం చూచినవాడు. అక్కడ మళ్ళీ రాజ్యము ధర్మరాజు చేతిలో సుభిక్షంగా ఉంటుందనేది స్థిరపరచుకున్న తరువాతే దేహం వదిలాడు. అదీ భీష్ముని కథ. భీష్మ పితామహుడు అంటాం! భీష్మాచార్యులు అంటారు! ఆయన ప్రవర్తన కానీ, ఆయన ధర్మం కానీ, ఆయన యొక్క పరాక్రమము కానీ, ఆయన జ్ఞానము కానీ నిరుపమానము. అందుకనే కృష్ణుని తరువాత కృష్ణుడంతటి వాడు భీష్ముడు. అలాంటి మహాత్ముని కథ మనమేదో పుణ్యవశం చేత, అనుకోకుండ చెప్పుకోవడం జరుగుతోంది.

మహాత్ముడైనటువంటి భీష్ముడు, అంపశయ్య యందు పరుండి దేహత్యాగం చెయ్యడానికి సంసిద్ధుడై, ఏ దైవమును తాను చేరదా మనుకుంటున్నాడో, ఆ దైవము భూమిపై మాయా దేహమును ధరించి ఉన్నాడని గుర్తించినవాడవడం చేత, ఆయన అనుజ్ఞ కోరటం మొదలుపెట్టాడు. ఆయన అనుజ్ఞ కోరి, దేహాన్ని వదలాలనేటువంటి ఒక సంకల్పంలోకి భీష్ముడు ప్రవేశించడం,

హస్తిన యందు సంబరములతో కూడినటువంటి ఒక రాజప్రాసాదము నందున్న శ్రీకృష్ణుడు తన ప్రాతఃకాల ధ్యానము నందు గమనించి, యుధిష్ఠిరుడు తన దగ్గరకి రాగా, ఆ విషయాన్ని తెలియపరుస్తాడు. అది భారతంలో అలా ఉంటుంది. సమస్త లోకములకు సంబంధించినటువంటి సమస్త జ్ఞానము, దివ్యత్వము పొంది ఉన్న ఒక మహాపురుషుడు భూమి నుండి నిష్క్రమించే ఒక సందర్భమది. అందుచేత ఈ సందర్భంలో మనమంతా ఆయన దగ్గరికి వెళ్ళాలని కృష్ణుడు నిర్ణయం చేస్తాడు. కృష్ణుని అనుసరించి పాండవులు కూడా బయలుదేరుతారు.

*"పాండవులును, ధర్మజునితో బయలుదేరి రథమునెక్కి పోయి భీష్ముని పాదము లాశ్రయించిరి. కృష్ణార్జునులు ఒక రథమున వెడలిరి. ఇందరూ తన నాశ్రయించుకొని ఉండగా, నడుమనున్న భీష్ముడు యుద్ధరంగమున పడియున్ననూ, యక్షులచే పరివేక్షింపబడిన కుబేరుని వలె వైభవముతో నొప్పెను."*

శరీరమైతే అంపశయ్య మీద ఉంది తప్ప, ఆయన కుబేరుడిలా ఉన్నాట్టండి. కుబేరుడంటే, యక్షులకు ఆయన రాజు. ధనమంటే సూక్ష్మలోకమైన సంపద. అందుకే ధనమంటే నిజమైన ధనమదే! దానికాయన రాజు. యక్షులంటే సూక్ష్మసంపద కలిగిన వారు. రక్షస్సులంటే భౌతిక సంపదను పరిరక్షించే వాళ్ళు. సూక్ష్మసంపదను పరిరక్షించేటువంటి వాడు కుబేరుడు. అందుచేత ఒక దివ్యమైన కాంతి భీష్ముని చుట్టూ అలా వ్యాప్తి చెంది ఉందండీ! బంగారు కాంతి! ఈ కుబేరుడు యక్షులతో వచ్చాట్ట

అంటే అర్థమేమిటంటే, ఎక్కడైతే భీష్ముడు శయనించి ఉన్నాడో ఆ ప్రాంతమంతా కూడా ఒక చక్కని వెలుగుతో నిండిపోయి ఉందిట.

వీళ్లంతా busyగా యుద్ధం చేసుకున్నారు కదా! భీష్ముడు నిష్క్రమించగానే ద్రోణాచార్యుని మహాసేనానిగా పెట్టుకుని యుద్ధం కొనసాగించారు. పది రోజులు యుద్ధం భీష్ముడితోనే అయిపోయింది. తరువాత ఐదు రోజులు యుద్ధం ద్రోణుడితోనే అయిపోతుంది. ఓ రెండు రోజులు యుద్ధం కర్ణుడితో అయిపోతుంది. ఒక రోజు యుద్ధం మిగతా వాళ్ళందరూ చేస్తారు. పద్దెనిమిదోరోజు యుద్ధం అయిపోతుంది. అయిపోయిన తరువాత పట్టాభిషేకం. అందరూ వెళ్ళిపోయి సంబరాలు చేసుకున్నారు. తిరిగొచ్చారు. ఈ లోపల ఈయన అలా పడుకుని ఉన్నాడు. పడుకుని ఉండి, ధర్మజుడు రాజ్యాభిషిక్తుడైన తరువాత, అప్పుడు తన దేహాన్ని వదలడానికి సంకల్పం చేసుకోవటమనేది భారతంలో కనిపిస్తుంది. అందువలన ఆ సంబరాల్లో ఉన్న వారికి భీష్ముని గూర్చిన మరుపు వస్తుంది. కృష్ణుడు గుర్తు చేస్తాడు, ఇంకా అక్కడే ఉన్నాడాయన, అని.

వాళ్లకేం గుర్తుంటుందండీ? ఏం గుర్తుండదుగా! కలిసి వెళ్తారు. కృష్ణార్జునులు ఒక రథంలో వెళ్లారుట. మిగతావారంతా వారి వారి రథాల్లో వచ్చారని భాగవతం చెప్తోంది. అలా వచ్చి చూస్తే దూరంగా, అక్కడంతా మారిపోయి ఉంది. scene మారిందంటాం చూశారా, అలా అక్కడ దృశ్యమంతా మారిపోయింది. అక్కడ ఎలా ఉన్నదంటే ఒక వెలుగు ఆవరణలో

భీష్ముడున్నాడు, పరిరక్షింపబడుతూ. ఒక వైభవంగా ఉందిటండీ చూట్టానికి. ఏదో చచ్చిపోయే వాళ్ళు కాసేపట్లో చచ్చిపోతారుట అంటే, అక్కడ వాతావరణం ఎలా ఉంటుంది మామూలుగా. అదృష్టం కొద్దీ ఎవరూ చుట్టూ లేకపోవటం వల్ల భీష్ముడికి, ఏడ్చేవాళ్ళు, మొత్తుకునేవాళ్ళు లేరు. అందుకనే మహాత్ములెవ్వరూ కూడా అందరూ చూచే చోట చచ్చిపోరుట. అదొకటుంది. ఎవరూ లేకుండా చూసి వెళ్లి, దేహం వదులుతారుట. వాళ్ళందరూ అలాగే వదిలారు, ఈ భారతంలో వాళ్ళందరూ కూడా. ఏనుగు కూడా అంతేట. శరీరం వదలాలంటే పది జంతువులు చూస్తున్న చోట వదలదుట అది. ఎవరూ లేని చోట, ప్రశాంతమైన వాతావరణంలో దేహం వదుల్తుంది. అందుకనే మరణించే వారికి మిగతావారు చేయవలసిన సహకారం ఏమిటంటే, అక్కడ ప్రశాంత వాతావరణం ఏర్పరచడం. ఆయన్ని ఊరికే కంగారు పెట్టేసి, ఆయన ముక్కుల్లో గొట్టాలు పెట్టేసి, గొంతు కోసి గొంతులో గొట్టాలు పెట్టేసి, చేతులకి కాళ్ళకి కూడా అవి ఇవి గుచ్చేసి పెట్టేశారనుకోండి. రెండు కాళ్ళకీ రెండు, రెండు చేతులకి రెండు–నాలుగు, ముక్కులో రెండు–ఆరు, గొంతులో రెండు–ఎనిమిది దింపేసి కూర్చోపెడితే, మనం వాడికి ఉపకారం చేస్తున్నామా అపకారం చేస్తున్నామా మనమే చూసుకోవాలి.

“స్వర్గము నుండి దెబ్బ తిని, నేలకూలిన ఒక వింత దేవత వలె, యుద్ధభూమిలో భీష్ముడు పడియుండెను” అన్నారండీ! స్వర్గంనించి ఓ దేవత నేలమీద పడిపోతే దానియొక్క దివ్యత్వం

దానికెలాగూ ఉంటుంది సహజంగా, కదా! ఆ దివ్యత్వం ఉండడం చేత అక్కడంతా కాంతివంతంగా ఉంటుంది. ఇప్పుడందరూ హజ్, హజ్, హజ్ అని పోతూ ఉంటారు కదా! అది పైలోకాల నుంచి పడ్డ ఒక శిల. ఆ శిల చుట్టూ చాలా తిరుగుతూ ఉంటారు. ఆ శిలకి వేరే కథ ఉన్నది. ఇప్పుడు ఆ కథ లోకి మనం వెళ్ళక్కర్లేదు, అది కూడా ఒక దివ్య శిలే. దివ్యశిల ఉన్నచోట అలా చేరిపోతూ ఉంటారు. ఏడుకొండల మీదున్నటువంటిది కూడా దివ్యశిలే అది మొదట్లో. ఆ శిలని ఒక రూపంగా చెక్కారు. చెక్కి బాల అని, బాలాజీ అని పేరు పెట్టుకున్నారు. ఆ బాలను నెమ్మదిగా ఇంకొకాయన వచ్చి వేంకటేశ్వరుడిగా తీర్చిదిద్దారు. అందుకని ఆయన బాలాజీ, వేంకటేశ్వరుడు. శంకరులు వచ్చి బాల స్వరూపంగా మార్చారట, ఆ శిలని. ఎందుకనీ? ఆ శిల భూమికి సంబంధించింది కాదు. భూమి మీద పడ్డది. అట్లా మన భూమి మీద పడుతుంటాయి అప్పుడప్పుడు. మనకి తెలిసేట్టు పడవు. తరువాత తెలుస్తాయి. తెలియడం చేత అక్కడికి వెళ్తే మనకి అంతా వైభవమే. ఇలా ఈ భీష్ముడు నిజంగా దేవలోకాల్లో వాడే కదా, అక్కడి నుండి దిగి వచ్చాడు, కదా! అందుచేత, "అలా స్వర్గమునుండి దెబ్బతిని నేల కూలిన ఒక వింత దేవతవలె యుద్ధభూమిలో భీష్ముడు పడియుండెను. అతని పాదములకు నమస్కరించి, పాండవులు వానిని ఆశ్రయించిరి." చుట్టూ చేరిపోయారు.

కౌరవులు లేరుగా! కురుసామ్రాజ్యపు crowd ఇంకేం లేదు. ఐదుగురే ఉన్నారు. ఉపపాండవులూ లేరు. అభిమన్యుడూ

లేదు, కదా! ఇంకా పరీక్షిత్తు రాలేదు. ఇది కథ. అచట పరమ ధర్మములు చెప్పబడునని తెలిసి అదే సమయమునకు బృహదశ్వుడు, భరద్వాజుడు, పరశురాముడు (గురువుగారు), కశ్యపుడు, అంగీరసుడు, విశ్వామిత్రుడు, ధౌమ్యుడు, సుదర్శనుడు, శుకుడు, వ్యాసుడు, వశిష్ఠుడు, నారదుడు తమ తమ శిష్యులతో కదలి వచ్చారండీ! ఇలా ఎవరికీ జరగదు మామూలుగా, అంటే అప్పటికున్న ఋషులందరూ వచ్చేశారు. దేవర్షి నారదుడొచ్చేశాడు. నారదుడొచ్చాట్ట అంటే ఇంక మరి, చాలా పెద్ద విషయం. అంటే ఎంత వైభవోపేతమైన సమయమిది? కృష్ణుడు వీళ్లందరినీ తీసుకుని వచ్చాట్ట అంటే, తప్పక ఇక్కడేదో దివ్య సందేశం ఉంటుందని తెలిసి, అది వినాలనే కుతూహలంతో వీళ్ళందరూ చేరారుటండీ! పరమ ధర్మములు చెప్పబడునని తెలిసి. వారందరి దర్శనమునకు సంతోషపడి, దేశము, కాలము, వాని విభాగములు చక్కగా తెలిసిన భీష్ముడు, వారి యందు పూజ్య భావము వహించెను. అంటే తన యందు వాళ్లందరికీ ఎలాంటి వాత్సల్యమున్నదో, ఎలాంటి భక్తి భావమున్నదో, ఎలాంటి అవగాహనున్నదో, అదంతా ఒక్కసారిగా చూశాడు. అంటే దేవర్షి వచ్చాడంటే ఇంక అంత కన్నా చెప్పాల్సిందేముంది? అన్నిటికీ మించి కృష్ణుడొచ్చాడు. కృష్ణుడు రావటం బట్టి వీళ్లంతా వచ్చారు, లేకపోతే రారు కదా! కృష్ణుడు రావడం బట్టే!

మా గురువుగారు కూడా ఎవరన్నా చనిపోతే ఊళ్ళో, ఆయన వెళ్ళేవారు ముందు స్మశానానికి. ఎందుకంటే, ఆయనే

వెళ్తే మరి మిగతా వాళ్లంతా ఇంట్లో కూర్చుంటారా? కూర్చోలేరు. కూర్చుంటే మర్నాడు వాయించేస్తారేమో అన్న భయం చేత కూడా వెళ్లేవారు. ఏరా నిన్న కనపడలేదు స్మశానంలో, అని అడుగుతారాయన. ఎందుకంటే అది ఒక పుణ్యమైన సన్నివేశం. జీవుడు దేహం వదిలి వెళ్ళడం అనేటువంటిది, ఓ పుణ్యఘట్టంగా భావించవచ్చు. దాంతో మనం సహకరించాలి. అలాగే మనకీ సహకారం లభిస్తుంది. అంతేగాని వాడు వెళ్ళిపోతే, మనం సర్లే అని మన పనుల్లో మనం ఉండిపోకూడదు. ఎవరైనా మన తోటివారు ఒకరు వెళ్లిపోయారని తెలిస్తే అప్పుడు కార్యక్రమాలన్నీ మూసేసి, ఇక ఆయన్ని హృదయపూర్వకంగా సాగనంపి, తరువాత మళ్ళీ స్నానం చేసి, మళ్ళీ కార్యక్రమాలు ప్రారంభం చేసుకోవడమే! అది మాస్టర్ ఇ.కె గారు ఇచ్చినటువంటి సంప్రదాయం, జగద్గురుపీఠం సభ్యులం అనుకునేవాళ్ళకి.

ఇక్కడ భీష్ముడు వెళ్లిపోతుంటే కృష్ణుడొచ్చేసరికి వీళ్ళందరూ వచ్చేశారు. వాళ్ళందరి యందు పూజ్యభావం వహించాట్ట భీష్ముడు. ప్రత్యేకముగా కృష్ణుని చూచి, ఇతడు మాయచే దేహము అంగీకరించి వచ్చిన సర్వేశ్వరుడు. "మాయచే దేహము నంగీకరించినటువంటి సర్వేశ్వరుడు. నా భాగ్యవశమున, మానవు డుగా దర్శనమిచ్చెను" అన్నాడండీ. ఆ పద్యం మనం బట్టీ పట్టు కోవాలి.

**"మాయాంగీకృత దేహుం**
**డై యఖిలేశ్వరుండు మనుజుడైనాడని, ప్ర**

**జ్ఞాయత్తచిత్తమున గాం**
**గేయుడు పూజనము చేసె కృష్ణున్ జిష్ణున్."**

మాయాంగీకృత దేహము. ఇది కూడా అంతే. మాయ ఏర్పరిచిన దేహమే. అదే నేనన్నాను. రాయలసీమలో వేసుకునే చొక్కాని అంగీ అంటూ ఉంటారు. అంటే చొక్కా వేసుకున్నట్టు ఈ శరీరాలు వేసుకున్నాం మనం. మనం ఇదే అనుకుంటాం. అది మన దురదృష్టం కదా! మన శరీరమే మనమని కదా భావిస్తూ ఉంటాం. మన శరీరమే మనమనుకున్న వాడికి దానితోనే సరి. ఆయన తన శరీరం తాను అనుకోవట్లేదు. ప్రజ్ఞాయత్తచిత్తుడై అన్నాడు. ఆయన చిత్తము నందు అసలు దేహాత్మ భావనే లేదు. అందుకని పద్యం చదువుకోవాలి ఎప్పుడూ. *"మాయాంగీకృత దేహుండై యఖిలేశ్వరుండు మనుజుడైనాడని, ప్రజ్ఞాయత్తచిత్తమున"* అంటే పరిపూర్ణముగా ఆత్మ ఆవరించి ఉన్నటువంటి చిత్తమది. ఇంక దానికి దేహాత్మ భావనేం లేదు. ఎప్పుడో పోయింది. అందుకనే వదిలేయడానికి రెడీ అయిపోవడం వల్లే యక్షులు కనిపిస్తారు. లేకపోతే కనిపించరు. శరీరమును దాటి, అంటే విడిపడి, స్వచ్ఛందంగా బయలుదేరుదా మనుకున్న వాళ్ళకే యక్షలోక దర్శనం ఉంటుంది. యక్షులంటే సూక్ష్మలోక ప్రజ్ఞలవి. రక్షస్సులంటే భౌతికలోక ప్రజ్ఞలవి. నైరుతిలో మనకి రక్షస్సులు ఉంటారు. ఉత్తరంలో కుబేరస్థానం అంటాం కదా! అక్కడ యక్షస్సులు ఉంటారు. ఎక్కడో ఎందుకు ఉత్తరం ఇక్కడుంది శిఖ. అంటే ఇక్కడ వాళ్లని దర్శనం చేయాలట. అంటే? మనం అక్కడికి చేరినటువంటి

వాళ్ళం అయి ఉండాలి. లేకపోతే అవదు. వాళ్ళందరూ పరివేష్ఠిస్తూ ఉండగా, ఈయన కేవలం ఆత్మ స్వరూపుడుగా ఉంటూ, ఇక ప్రయాణం చేద్దామనేటువంటి ఉద్దేశంతో ఉండి, కృష్ణుని అనుమతి కోరటం చేత, వీళ్ళింతమందీ చేరినా అందరినీ పూజ్యభావంతో ఒక్కసారి చూచి, కృష్ణుడి పక్క చూచి ఈ మాట అన్నాడండీ ఆయన. పూజించాడు అంటే పూజంటే అప్పుడు? మానసికమైన పూజే!

*"మరియు గంగానందనుండు వినయప్రేమసుందరులైన పాండునందనులను కూర్చుండ నియోగించి, మహానురాగజనిత భాష్పసలిల సందోహ సమ్మిళిత లోచనుండై యిట్లనియె."*

ఈ పాండవులు, మనవళ్లు కదండీ అందరూ! కూర్చోండి నాన్నా! అని చెప్పాడు. వీళ్లు ఎందుకందరికీ నచ్చారు? ఎందుకు కృష్ణుడు వాళ్ళ పక్షము వహించాడంటే, వాళ్లకి మహత్తరమైన వినయమున్నది. వారి యందు దివ్యప్రేమ ఉన్నది. వారి యందు ధర్మమున్నది, కదా! *"వినయప్రేమసుందరులైన పాండునందనులు కూర్చుండ నియోగించి, మహానురాగజనిత భాష్పసలిల సందోహ సమ్మిళిత లోచనుడై"* అన్నాడు. ఎలా ఉంది చెప్పండి? వాళ్లని చూడంగానే ఆయనకీ ఆనందం. ఎందుకనీ? వాళ్లకి పట్టం కట్టాలని ఎప్పటి నుంచో ఉన్నది. వాళ్లు బావుండాలని. ఎందుకనీ? వాళ్ళయందు ధర్మమున్నది. వాళ్ళు రాజులైతే నాలుగు కాలాల పాటు రాజ్యం బావుంటుంది. వాళ్ళ యందు తనకటువంటి వాత్సల్యమున్నది. అందుచేత వాళ్లని చూడంగానే మహా

అనురాగం జనియించిందిటండీ! దాంతో *"సలిల సందోహం."* కన్నీళ్లొచ్చినాయిట. ఏడుపు వల్ల కాదు, ఆనందం వల్ల. *"సమ్మీళితలోచనుఁడై"* యిట్లనియె.

**"ధరణిసురులు, హరియు ధర్మంబు దిక్కుగా**
**బ్రతుకన్దలన్చి, మీరు బహువిధముల**
**నన్నలార! పడితి రాపత్పరంపర**
**లిట్టి చిత్రకర్మ మెందున్ గలదు?"** అన్నాడు.

ధరణిసురులు అంటే బ్రాహ్మణులు. బ్రాహ్మణులంటే బ్రహ్మతత్త్వ మెరిగినవారు. బ్రహ్మమునందే చరించేటువంటివారు. మనం బాగా చదువుకుంటే భారతంలో, సంస్కారవంతులు, శిష్టాచారులైన బ్రాహ్మణులందరు ధర్మరాజుతో పాటు వనవాసానికి వచ్చేశారు అని రాస్తారు తెలుసా? సినిమాలో వాళ్ళందరిని చూపించరు మనకి. సినిమా చూసిం తరువాతైనా పుస్తకం చదువుదాం అనిపించాలి కనీసం, కదా! ఎన్ని బ్రాహ్మణ సంఘాలొచ్చేస్తాయో తెలుసా? ఎందుకంటే వాళ్లందరికీ ధర్మం తెలుసు. ధర్మం లేని చోట మనమెందుకు ఉండాలని వెళ్లిపోయారు. అంతేగానీ మనకి ఇల్లుంది ఇక్కడ, మనకి medical facilities ఉన్నాయి.... ఇప్పుడదే కదా, ఊళ్లు దాటరు, ఎవడూ! వానప్రస్థానానికి వెళ్లకపోవడానికి కారణం ఏమిటి? మనకి ఇల్లుంది, పక్కనే మార్కెట్టు, ఈ పక్కనే మెడికల్ షాపుంది, ఎదురుగా పోతే డాక్టరుగారు దొరుకుతాడు, ఆ మూల హాస్పిటల్ ఉంది. అక్కడ కదా మనం చచ్చిపోవాలి. అలా కదా అనుకుంటాం.

ఈ బ్రాహ్మణులు మొత్తం హస్తిన వదిలేశారండీ. వదిలేసి, వాళ్ళంతట వాళ్లు వచ్చేశారు. అలా సందోహం, సందోహం అదీ ధర్మరాజు. వచ్చేస్తే, ఆయన చాలా బాధపడిపోయాడు. ఇంతమంది నన్నాశ్రయించి వచ్చేశారు, ఆశ్రయించిన వారిని పోషించాలి కదా! రాజు కదా ఆయన. ఈ ధౌమ్యుడిని అడుగుతాడు, ఇంతమంది బ్రాహ్మణులు, వీరికి నేను నియమిత సమయంలో ఆహారం ఇవ్వకపోతే ఆ పాపం నాకు చుట్టుకుంటుంది కదా! నేనేవిధంగా వీరిని పోషించాలి? ఇప్పుడేమీ లేనివాడి నయిపోయాను కదా అనడిగితే, ధౌమ్యుడు సలహా చెప్తాడు. ప్రార్థన చేయమంటాడు. చేస్తే, అక్షయపాత్ర వస్తుంది. మరి అక్షయపాత్ర వస్తే ఇంకేముందండీ. ఎంతమందికైనా పెట్టవచ్చు, వీళ్లూ తినవచ్చు. అదొకటి చేత్తో పట్టుకుని అన్ని చోట్లకీ వెళ్లిపోయారు. మహాత్ములకు వనవాసంలో రకరకాల సహకారం లభిస్తూ ఉంటుంది. ఎందుచేత? ధర్మంలో ఉండటంచేత. ధర్మంలో ఉండేటువంటి వాడు అరణ్యంలో ఉన్నా, వాళ్ళనేమీ పులి, పుట్రా ముట్టుకోవు. ధర్మం లేనివాడు ఊళ్ళో ఉన్నా ఆపదలొచ్చేస్తాయి, కదా! అందుచేత, ఆయన ధర్మంలో నిలబడ్డ వాడు. అలాంటివాడు ధర్మరాజు. ఆయన అలాంటి ధర్మ మొనర్చాడు కదా! అందుకని ఈ బ్రాహ్మణు లందరినీ పోషిస్తూ ఉంటాడీయన. ధర్మరాజు కదా! పెద్ద వరమేమిటంటే, ఇంతమంది బ్రాహ్మణులను పన్నెండు సంవత్సరాలు వనవాసంలోనే పోషిస్తాడండీ! అజ్ఞాతవాస మప్పుడు, మరి మీరు నా చుట్టూ ఉంటే నేను తెలిసిపోతాను కదా ఎక్కడుంటానో, అందుకని నా కోసం మీరంతా మీ మీ ప్రదేశాలకి వెళ్ళిపొమ్మంటే, వెళ్ళిపోతారు.

మనకి సినిమా పరిజ్ఞానమే ఉండడం వల్ల, మనమీ ఐదుగురే అడవిలో కలిసి తిరిగారనుకుంటాం. ధౌమ్యుడూనూ. Five+one+one. ఏడుగురి గురించి చెప్తూ ఉంటారు. వెనకాల బ్రాహ్మణ సమూహాలుంటాయి. ధౌమ్యుడు రోజూ ఏవో పురాణాలు వినిపిస్తూ ఉంటాడు. పుణ్యక్షేత్రాలు చూపిస్తూ ఉంటాడు వీళ్ళందరికీ. పన్నెండేళ్ళు గడవాలి గనక? పుణ్యక్షేత్రాలన్నీ అడవుల్లోనే ఉన్నాయి. అన్నీ చూపించేస్తూ ఉంటాడు. ఇలా బ్రాహ్మణులను పోషించాడు ధర్మరాజు. ఊరికే చదివేసుకుంటే ఏం లాభం? మరి వాళ్ళు పోషింపబడ్డవాళ్లు ఊరికే ఉంటారా, వాళ్లు ఆశీర్వదిస్తూ ఉంటారు కదా! బ్రాహ్మణ ధర్మమేమిటంటే ఆశీర్వదించడమే! అంటారు. తాను భోజనానికి తృప్తి చెంది, అద్భుతమైన ఆశీర్వచనాలు అందిస్తూ ఉండాలి. అదీ ధరణి సురులైతే, అంటే భూమ్మీద తిరుగుతున్న దేవతల్లాంటి బ్రాహ్మణులు కొంతమంది ఉంటారు. ఇప్పుడు కాదు, అప్పుడు. ఇప్పుడేముందిలెండి, అక్కడక్కడ అలా ఉంటారు. అలాంటి వాళ్ళందరినీ నువ్వు పోషించావు కదా, అంటున్నాడండీ భీష్ముడు.

*"ధరణిసురులు, హరియు."* సాక్షాత్తు కృష్ణుడు కదా! సాక్షాత్తు శ్రీ మహావిష్ణువే మీ దగ్గర చేరాడు. బ్రాహ్మణులు మా ఊళ్ళోంచి వెళ్లిపోయారు కదా! భీష్ముడు చూశాడు కదా! ఈయన వెళ్ళిపోగానే ఊళ్ళో బ్రాహ్మణులందరూ ఆయనతో పాటు వెళ్లిపోయారు. మరింక ఆ ఊరికేం ఆశీర్వచనముంటుంది? హస్తినకి? ఏం బలముంటుంది? మనక్కూడా చెప్పారు కదా–

*"అప్పిచ్చువాడు వైద్యుడు ఎప్పుడు నెడతెగక పారునేరున్, ద్విజుడున్"* అన్నారు చివరికి. అన్నారా? అనలేదా? Importance కలియుగంలో ఏంటి? అప్పిచ్చువాడు. వాడొకడుండాలి మనం అప్పు చేయటానికి. అప్పిచ్చువాడు, రోగాలోస్తే వైద్యుడు! తాగటానికి శుభ్రమైన నీళ్లు. ఎప్పుడు నెడతెగక పాఱు ఏరును, ద్విజుడున్, అన్నారు. ద్విజుడంటే, రెండోసారి పుట్టిన వాడని అర్థం. రెండవసారి పుట్టినవాడిని ద్విజుడంటారు. అందరు బ్రాహ్మణులు ద్విజులు కారు. అందుకే మనం ఉపనయనం చేస్తూ ఉంటాం కదా! మనకి ఉపనయనాలన్నీ పెళ్ళికి వీసాలే. అంతకన్నా ఏముంది? ద్విజుడంటే వాడు మళ్ళీ పుడతాడు దేహంలో! అంటే తనలో బంగారు శరీరాన్ని ఏర్పాటు చేసుకుని మళ్ళీ అందులో జన్మిస్తాడు. వాడూ ద్విజుడు. రెండవ సారి వెలుగులో పుట్టినవాడు. అలాంటివాడుండే ఊళ్ళో ఉండమన్నారు. అలాంటి వాళ్లు ఈయన చుట్టూ ఎంతోమంది ఉన్నారంటే ఈయనకెంత ఆశీర్వచనమండీ? ఎంత బలమండీ? అది కాక సాక్షాత్తూ శ్రీమహావిష్ణువే పక్కన కూర్చున్నాడు. *"ధరణిసురులును, హరియు, ధర్మంబు."* ధర్మమే లేకపోతే ఇదంతా ఏం లేదుగా! వీళ్ళ దగ్గర ధర్మము ఉండడం చేత బ్రాహ్మణులు చేరారు. వీళ్ళ దగ్గర ధర్మము ఉండడం చేత విష్ణుమూర్తి చేరాడు. ఏది ఉండడం చేత చేరారో అది చెప్పారు. *"దిక్కుగా బ్రతుకతలచి,"* అలా బ్రతుకుదా మనుకున్నారుటండీ వాళ్ళు.

వాళ్ళు పుట్టిందే వనంలో, ఈ పాండవులందరు, కదా! అందరూ హిమాలయ ప్రాంతాల్లో పుట్టినవాళ్ళే. హస్తినలో

పుట్టినవాళ్లెవరూ  లేరిందులో. వాళ్ళు పెరిగిందే బ్రాహ్మణుల మధ్య. వాళ్లకి తెలిసిందంతా కూడా ధర్మము. అందుకని, ఈ ధర్మమాధారంగా బ్రాహ్మణ సమూహంలో పెరిగినటువంటి ఈ పాండవులు, బ్రాహ్మణులే మనకి దిక్కనుకున్నారండీ! ధర్మమే దిక్కనుకున్నారండీ! కాబట్టి అక్కడ శ్రీమహావిష్ణువు కూడా చేరాడండీ! వీళ్ళే మన దిక్కనుకుని బ్రతికారుటండీ పాండవులు. అయినప్పటికీ మీకు చాలా కష్టాలొచ్చినాయి. *"మీరు బహువిధముల, పడితిరి ఆపత్పరంపర"* అంటే దీన్ని బట్టి మనకేం తెలియాలంటే, ధర్మము నాచరిస్తున్నాం కదా మనకెందుకు ఇన్ని కష్టాలు? అనుకోకూడదు. కష్టాలు ఇదివరకు చేసిన పనులబట్టి వస్తూ ఉంటాయి. అంతమాత్రం చేత ధర్మాన్ని అనుసరించడం మానకూడదు. అలాగే మహాత్ములను దర్శనం, స్పర్శనం, సేవనం అంటూ ఉంటారు. అవి అవకాశం మేరకు చేసుకుంటూ ఉండాలి. అటుపైన దైవమును ఆరాధన చేసుకుంటూ ఉండాలి. పాండవులు అది చేశారని చెప్తున్నారు.

పాండవుల విశిష్టత ఎక్కడి నుండి వచ్చిందంటే, ధర్మంలోంచి వచ్చింది. వారు ధర్మాన్ని ఊతకర్రగా పెట్టుకున్నారు. ధర్మమే ఆధారంగా బ్రతికారు. బ్రహ్మధర్మం తెలిసియున్న బ్రాహ్మణుల యొక్క ఆశీర్వచనము వారిని పోషిస్తూ పొందారు. అది కారణంగా విష్ణువు దగ్గరయ్యాడు కృష్ణుడి రూపంలో. అంతమాత్రం చేత ఏం జరుగుతుంది? మనకి ఉత్తరగతులు కలుగుతాయని తెలియాలి తప్ప, ఇప్పుడు నాకీ కష్టమొచ్చిందేంటి అంటే, పాండవుల

కొచ్చినన్ని కష్టాలు ఎవరికీ రాలా! నిజానికి భక్తుల కొచ్చినన్ని కష్టాలు మిగతావాళ్ళెవరికీ రాలేదు కదా! వాళ్లకి ఎందుకలా వస్తాయంటే పూర్వకర్మ వల్ల వస్తూ ఉంటాయి. అందుచేత వాటియందు మనసు పెట్టక, ధర్మమునందే మనసు పెట్టి, దైవము నారాధనచేస్తూ, మహాత్ముల యొక్క ఆశీర్వచనం పొందుతూ జీవిస్తూ వచ్చారు మీరు, మిగతావేమీ పట్టించుకోలేదంటున్నాడు భీష్ముడు. *"ధరణిసురులు హరియు ధర్మంబు దిక్కుగా బ్రదుక దలచి"* అలా బ్రతుకుతాం అనుకున్నారట.

మనం అలా బ్రతుకుతాం అనుకుంటున్నామా? ఈ మూడూ కరువే. దైవారాధన కొంత ఏదో చేస్తుంటాము. ధర్మాచరణము ఎవరికి వాళ్ళు చూసుకోవాలి చేస్తున్నామా, లేదా అనికదా! తర్వాత మహాత్ముల సమాశ్రయము, సంసేవనము, శ్రవణము, స్పర్శ ఇలాంటివి ఏమాత్రం పొందుతున్నాము? చూసుకోవాలి కదా! ఈమూడూ వుంటే పాండవుల లాగా ఎంత భయంకరమైన ఆపదలలో నుంచి అయినా రక్షింపబడతారు. ఇక్కడ ఈయన చెప్తున్నాడు చూడండి, మీకు ఇలాంటి విశేషమైనటువంటి గుణసంపద, సద్గుణ సంపద ఉన్నప్పటికీ కూడా, కష్టం మీద కష్టం, కష్టం మీద కష్టం వచ్చింది. ఈ కష్టం తీరిందంటే ఇంకో కష్టం, ఆ కష్టం తీరిందంటే మరో కష్టం, అట్లా చిట్టచివరి వరకు కష్టాలే. అన్నీ తీరిపోయేసరికి ఉత్తర కడుపులో వుండే శిశువు అది కూడా ఆపదే! దాన్నించి కూడా రక్షింపబడతారు కదా! ఇన్ని రకాలుగా రక్షింపబడడానికి ఈ మూడూ వాళ్ళకి బలమై నిలిచినాయి.

అందుచేత వాళ్ళు స్వచ్ఛందంగా మహాప్రస్థానమే చేయగలిగారు. అందుచేత *“మీరు బహువిధముల పడితిరి ఆపత్పరంపరలు ఇట్టి చిత్రకర్మమెందు కలదు?”* అన్నారు. ఇది చిత్రం అన్నారు. ఇప్పుడు భీష్ముని కథ తీసుకున్నా అంతే! ధర్మమే ఆయనకు ఆధారం. దైవమే ఆయనకు ఆధారం, కదా! ఈ రెండు ఆధారంగానే జీవించినటువంటివాడు. ఆయనకు మాత్రం అలా నల్లేరు మీద బండిలాగా వెళ్లిపోయిందా? లేదుకదా!

**“సంతస మింతలేదు; మృగశాపవశంబున బాండుభూవిభుం**
**డంతము నొంది యుండ మిము నర్భకులం గొనివచ్చి కాంక్షతో**
**నింతలవారిగా బెనిచె; నెన్నడు సౌఖ్యముపట్టు గాన దీ**
**గొంతి యనేక దుఃఖములన్ గుందుచు నుండును; భాగ్యమెట్టిదో?”**

కుంతీదేవి! మనం భారత, భాగవత, రామాయణాలు చదువుకోకపోవడం వల్ల మనలో లోతులు లేక, చిన్నచిన్న విషయాలకే దుఃఖపడిపోతుంటాం. ఈ కథలో ఒక్కొక్క లోతులు చూస్తుంటే వాళ్ళతో పోలిస్తే, మనకు వచ్చిన కష్టం ఒక కష్టమా అనిపిస్తుంది. మనకు అన్నీ కష్టాలే. ప్రతిదీ కష్టమే. గట్టిగా జలుబు చేస్తే కష్టము, గురుపూజలలో మనం సరిగా భోజనం చేయలేని పరిస్థితి వస్తే కష్టమే! మనం బుల్లిబుల్లి కష్టాలని పెద్దవిగా ఊహించేసుకొని బ్రతుకుతున్నాం. వాళ్ళు పెద్దపెద్ద కష్టాలన్నీ దాటేశారు. ఇక్కడ చూడండి, *“సంతస మింతలేదు”* కుంతీదేవికి ఏం సంతోషం? కురుసామ్రాజ్యానికి పట్టపుమహిషిగా ఉండవలసిన ఆమె, అట్లా అరణ్యములో పడివుంది భర్తతో.

ఆయనా సంతానాన్ని ఇవ్వగలినటువంటి స్థితిలో లేడు. శాపం గలిగియున్నాడు పాండురాజు. అందువల్ల సంతానంకోసం తనకు దుర్వాసమహర్షి ఇచ్చిన వరాన్ని ఆధారం చేసుకొని సంతానాన్ని కన్నది. ఇలా కనంగానే భర్త చచ్చిపోయాడు. చచ్చిపోతూ పాండురాజు ఏమన్నాడు? ఈ పిల్లలని చక్కగా బుద్ధిమంతులుగా పెంచి, తీసుకెళ్ళి అక్కడ (హస్తినలో) అప్పచెప్పు. అక్కడ భీష్మాచార్యుల వారు వున్నారు. ఆయన ధర్మం తెలిసినవారు, ఆయన పరిరక్షణలో నీకు, నీపిల్లలకు బాగుంటుంది అని చెప్పి వెళ్లిపోయాడు పాండురాజు.

నిజానికి వాళ్ళిద్దరూ సహగమనం చేద్దాం అనుకుంటారు కుంతీదేవి, మాద్రిదేవి. నేనంటే నేను అని పోటీపడతారు. అప్పుడు పాండురాజే చెప్తాడు, నీకున్న సమర్థత మాద్రికి లేదు. అందుచేత పిల్లలను పెంచాలన్నా, రేపొద్దున అక్కడ రాజ్యంలో ప్రవేశపెట్టాలన్నా, వాళ్ళని సుస్థిరం చేయాలన్నా, నీకే వీలుపడుతుంది. మాద్రికి వీలుపడదు. మాద్రిని నాతో సహగమనం చెయ్యనీయి. నీవు నీ పిల్లలని, మాద్రి పిల్లలని ఇద్దరినీ నీవే పోషించి, పెంచి, పెద్దచెయ్యి. *"సంతస మింతలేదు."* ఎంత పెద్ద పని పెట్టాడండీ? *"మృగశాప వశంబున బాండు భూవిభుండంతము నొందియుండ మిము నర్భకులం గొనివచ్చి కాంక్షతో నింతలవారిగా బెనిచె"* మిమ్మల్ని ఇంతవాళ్ళుగా చేసిందిరా మీతల్లి. మామూలుగా అయితే ఆవిడ సహగమనం చేసేసేదే పాండురాజుతో. కానీ అన్ని కష్టాలు నష్టాలు ఓర్చుకుంటూ

ఆ హస్తినలో, ఆ ధృతరాష్టుని పాలనలో అలా ఉన్నది. చిన్నతనం నుంచి ప్రతిరోజు ఏదో ఒకరకంగా పాండవులను మట్టుపెట్టాలనే ప్రయత్నాలు కదా! వాటన్నిటి నుంచి విదురుడి సలహా, భీష్ముని సలహాలు తీసుకుంటూ జాగ్రత్తగా కాపాడుకుంటూ, వాళ్ళకు కూడా విద్యలు వచ్చేటట్టుగా ఏర్పాటుచేసి, ఎన్ని తంటాలు పడ్డదో ఆ తల్లి. అలాంటిది ఇంత వాళ్ళని చేసింది.

*"నెన్నడుసౌఖ్యముపట్టుగానదీకుంతి"*ఎందుకంటేఎప్పుడూ దుఃఖమే అందుకని ఈపిల్లలు వాళ్ళకి 96 ఏండ్లు వచ్చేటప్పటికి యుద్ధం జరుగుతుంది. ఏది? ధర్మరాజుకు 96 ఏళ్లు. కృష్ణుడికే 90 ఏళ్లు అప్పటికి. అర్జునునికి 90 ఏళ్లు. భీముడు, ధర్మరాజు ఇంకా పెద్దవాళ్ళు. ఆ వయసులో కదా యుద్ధంచేసి గెలిచి, ఆతర్వాత కదా రాజులయ్యారు. ఇంతకాలం ఈవిడ అలా హస్తినలో వుండి వీళ్ళకు కాపుగా వున్నది. ఎందుకనీ? హస్తినాపురంలో భీష్ముడు వున్నట్లే, అంతఃపురంలో ఈవిడ వుంటుంది. ఆవిడ వెళ్ళదు కదా వనవాసానికి. అందుచేత మాటిమాటికి మరి భీష్ముడి దగ్గరకు వెళ్ళి ఎన్నిసార్లు మొరపెట్టుకుని వుంటుంది తన కొడుకుల గురించి? ఇలా అధర్మం జరుగుతూ వుంటే, ఎవ్వరూ ఏమీ చేయని పరిస్థితి వున్నప్పుడు, ఆ తల్లికి క్షోభ కలిగినప్పుడల్లా ఇది ఒక్కటే avenue. ఇంకెక్కడికి వెళ్తుంది చెప్పుకోడానికి? గాంధారి దగ్గరకు వెళ్లలేదు. ఆమె ధర్మమూర్తి అయినా ఆమె కొడుకుల వల్లే కదా ఈ ఆపద! గాంధారి దగ్గరకు వెళ్లలేదు. ఇంక ఎవరి దగ్గరకు వెళ్ళగలదు? భీష్ముడి దగ్గరకే వెళ్తుంది కదా! అందుకని ఆయనే చెప్పడం

correct ఇది, కదా! ఎంత దుఃఖము పొందిందో ప్రత్యక్షంగా చూచినటువంటి వాడు గాంగేయుడే!

*"గొంతి యనేక దుఃఖములన్ గుందుచునుండును భాగ్యమెట్టిదో"*కుంతిభోజుని కూతురు కుంతి. వసుదేవునికి సోదరి. కృష్ణుని మేనత్త కదా! అయినప్పటికీ అట్లా ఉంటుంది. ఎందుకు చెప్తున్నాడంటే భీష్ముడు, మనం చెప్పలేము. మంచివాళ్లం మనకు ఇన్ని కష్టాలు ఏమిటి? అని అడగవద్దు. ఇంతకన్నా మంచివాళ్లు ఎవరు వున్నారు? భరించు, భరించడం నేర్చుకో! ప్రకృతి ఎవరికి ఏది ఇవ్వాలో ఆమెకు తెలుసుట. అలాగే ఇస్తుంది. దాన్ని భరించి, దానియందు మన కర్తవ్యం నిర్వర్తించడమే తప్ప, ఇంకోమార్గం లేదు. అందుకని ప్రకోపించి ధర్మం నుంచి వ్యతిరేకంగా వెళ్లిపోతే ఇంకా పాడైపోతారు. పెద్దలను దూషిస్తే మరీ పాడైపోతారు. మనకు కష్టం వచ్చిందని ఊళ్ళో పెద్దలందరిని దూషించాం అనుకోండి, ఇంకా పాడైపోతాము. దైవాన్ని దూషించాం, ఇంకా పాడైపోతాము. ధర్మాన్ని విసర్జించాం, పూర్తిగా పోతాము. ఆమె అలా చెయ్యలేదు. అందుకే అంటాడు ఇక్కడ భీష్ముడు

**"వాయువశంబులై యెగసి వారిధరంబులు మింట గూడుచుం బాయుచు నుండు కైవడిన్ బ్రపంచము సర్వము గాలతంత్రమై పాయుచున్ గూడుచుండు నొకభంగిన్ జరింపదు కాల మన్నియుం జేయుచు నుండున్ గాలము విచిత్రము దుస్తర మెట్టివారికిన్."**

*"వాయువశంబులై యెగసి వారిధరంబులు"* అంటే నీటితో వున్నటువంటి మేఘాలు వాయువు వల్ల అటుఇటు ఇటుఅటు

కదలుతుంటాయికదా!అవిఎటుకదలుతాయోఎవరుచెప్పగలరు? గాలినిబట్టి కదులుతుంటాయి. అదుగో వచ్చేస్తోంది depression అంటూంటాం కదా! లేదులేదు ఇంకో చోటికి వెళ్లిపోయింది అంటూంటారు, రోజుకో రకంగా చెప్పుకుంటుంటారు. ఎందుకు చెప్పుకుంటారు? అవి ఎటుపోతాయో కాలము చేతిలో వుంది. కలియుగంలో వర్షము కావాల్సినచోట పడదు, అక్కరలేని చోట అలా కుండపోతగా కురిసి అక్కడ నష్టం కలిగిస్తుంది. అదీ కలియుగం. అకాల వర్షాలు కదా! ఈవాయుధరంబులు, అంటే నీళ్ళు వాయువుచే ధరింపబడి వుంటాయి. *"వాయువశంబులై యెగసి వారిధరంబులు"* వారి అంటే నీరు. *"మింట గూడుచుం బాయుచు నుండు"* కలుస్తుంటాయి, విడిపోతుంటాయి, అలా తిరుగుతుంటాయి. అవి ఎక్కడ పడతాయో ఎవ్వరికీ తెలియదు, అంటే కాలము నిర్ణయము చేస్తుంది. ఎక్కడ వర్షము పడాలి, ఎక్కడ వర్షము పడకూడదో, ఎవరికి నష్టం కలగాలి, ఎవరికి కష్టం కలగగూడదో ఇలా కాలము నిర్ణయము చేసుకుంటుంది. అలా కాలము చేతిలో తిరుగుతున్నటువంటి వాళ్ళము మనము, మనకు ఏమి తెలుస్తుంది, అని చెప్తున్నాడు భీష్ముడు. *"కాలము విచిత్రము దుస్తర మెట్టివారికిన్, నొక భంగి జరింపదు కాల మన్నియుం జేయుచునుండు."*

మనం జాతకాలు చూసుకొని ఇలా జరుగుతుంది అంటే అలా జరగకుండా ఇంకోరకంగా జరుగుతూ వుంటుంది కదండీ! ఏం గురువుగారు ఇలా జరుగుతుంది అన్నారు. ఇంకా అవలేదే అంటే ఆ..... అవుతుంది, అవుతుంది అంటారు. వాడికేం తెలుసు?

ఎవరికీ తెలియదు కాలము గురించి. ఎవరికీ ఏమి తెలియదు అని భీష్ముడు చెప్తున్నాడు. అంటే, మనం ఇంకెవ్వరి దగ్గరికి వెళ్ళి కాలము గురించి అడగక్కర్లా! వచ్చిన దాన్ని తలవంచి, అంగీకరించి మన కర్తవ్యము నిర్వర్తించడము ఒక్కటే సత్యము. ఇక మిగతావన్నీ ఊరికే. దాన్ని ఉత్సుకత అంటాము. బాగానే వుంటుందా అండీ, అంటే బాగానే వుంటుంది. వాడు బాగా లేదంటే ఒప్పుకుంటారేంటి? బాగానే వుంటుందమ్మా అని చెప్తారు. బాగానే వుంటుందంటే, నిర్ణయం చేసేది నువ్వు. అడిగినవాడు కాదు, చెప్పినవాడు కాదు. ప్రతి జీవుడికి ఒక కాలపట్టిక వుంటుంది. వాడి timetable ప్రకారం వాడికేం రావాలో వచ్చేస్తుంది. అంతా timetable ప్రకారమే! అందువల్ల *''కాలము విచిత్రము, దుస్తరము ఎట్టివారికిన్.''*

*''రాజట ధర్మజుండు''* యుధిష్ఠిరుని కన్నా ఎవరూ లేరు ధర్మంలో, అంతే! ధర్మంలో ఆయన king అండీ. రాజట ధర్మజుండు. ఈ ధర్మరాజే చూశారా! ఇటు విదురుడుగా వస్తాడు. ఇటు ధర్మస్వరూపంగా కూడ ఆయన అంశ దిగుతుంది. చిట్టచివరికి ధర్మస్వరూపుడైన యమధర్మరాజే యుధిష్ఠిరుడిని ఆశీర్వదిస్తాడు, చాలా బాగా చేశావని. అంటే యముడు మెచ్చుకొన్నటువంటి ఏకైక జీవి యుధిష్ఠిరుడు. ఇంతకన్నా ధర్మం ఎక్కడా లేదుకదా! అంత ధర్మం వున్నా కష్టం వచ్చిందేమిటీ? ఎంత ధర్మం! ఎవ్వరూ వూహించలేని ధర్మం! కృష్ణుడే చెప్తాడు, ఏం ధర్మం అయ్యా బాబూ! అని. ఎంతటి ధర్మరాజో అంటాడు, పాండవ ఉద్యోగ విజయాలలో. *''తాటంకట్టిరి నీటనోసి కాంతకున్ చేయగరాని ఎంతపనిచేసే''*

ఎన్నిచేసినా ఇంకా నువ్వు అట్లా శాంతంగ, ధర్మంగా వున్నావు. అదే అంటాడు, రాయబారంలో కూడా. ఆయనకు ఒక్కడికి కోపం రాలేదు కాబట్టి మీరంతా బ్రతికి వున్నారని, కదా! ఆయనకే కోపం వస్తే *"ఈకర్ణులు పదివేవురు అయిన అని నొత్తురు చత్తురు రాజరాజా!"* అలాంటి ధర్మరాజు, ఆయన రాజు.

*"సురరాజసుతుండట ధన్వి"* సాక్షాత్ ఇంద్రుడి కొడుకే, ఎవరూ? అర్జునుడు. ఆ ధనుస్సు కూడా ఏమిటి? అగ్నిదేవుడిచ్చిన ధనుస్సు. చూడబోతే ఆయన ఇంద్రపుత్రుడు. ఇంద్రుడిని మెప్పించాడు. శివుడిని మెప్పించాడు. ఇంతమందిని మెప్పించినా కష్టం పోలేదేమిటండీ? మనకి ఇది చదువుకుంటేనే గాని అవగాహన కాదు. ఆయన (ధర్మరాజు) చూడపోతే, ధర్మానికి మించి లోకంలో అంతకు మించి ఎవ్వరూ లేరు. ఈయనను (అర్జునుడు) చూడబోతే పరాక్రమానికి ఇంతకన్నా మించినవాడు, ధర్మాత్ముడు లేదు. *"సురరాజసుతుండట ధన్వి, శాత్రవోద్వేజక మైన గాండీవము విల్లట"* పైగా చేతిలో అదొకటి వుంటుంది, గాండివము! అగ్నిలోంచి వచ్చింది. అగ్నిదేవుడిచ్చినది. రథమూ అలాంటిదే. గాండీవము అలా మోగిస్తేనే చచ్చిపోతారుటండీ! అంత అద్భుతం. అంత భీకరమైనటువంటి శబ్దము ఇస్తుంది దాని నుండి బాణాలు వదిలితే! అందువల్లే అతడు వేసే బాణాలు ఎదుటి వాళ్ళకు గుచ్చుకోవడం కాదు, గుచ్చుకొని అలా వెళ్ళిపోయి తిరిగి వచ్చేసి, మళ్ళీ ఆయన అంబులపొదిలో చేరిపోతాయి. అలాంటివాడు ప్రక్కన వున్నాడు. *"సారథి సర్వభద్ర సంయోజకుడైన చక్రియట."*

మీకు సారథిగా వున్నటువంటివాడు ఎలాంటివాడు? మొత్తం సృష్టినే శాసించేవాడు కదా! ఎంత గొప్ప విషయం?

*"ఉగ్రగదాధరుడైన భీముడయ్యాజికి తోడు వచ్చునట"* నీవు చేసే యజ్ఞం వుందే, దానికి వీడొకడు ప్రక్కన వాయింపు. వాయువు కలిస్తే అగ్నితో ఏముందండీ? ఇక మండిపోవడమే కదా! భీమార్జునులు అంటే అగ్ని, వాయువు. రాముడు, హనుమంతుడు లాగా. ఒకరు అగ్నిస్వరూపులు, ఒకరు వాయుస్వరూపులు కదా! అందుచేత ఈయన ఒకడు ప్రక్కన మొత్తేయడానికి. ఎవరినైనా మొత్తేస్తాడు. ఆయన ఒక్కడిని చూసే చిన్నప్పుడు వాళ్ళు (కౌరవులు) ఆగారు, *"ఉగ్రగదాధరుడైన భీముడు అయ్యాజికి తోడువచ్చునట ఆపద కల్గుట ఇదేమి చోద్యము"* అన్నారు. నాకు అర్థం కావడం లేదు అంటున్నాడు భీష్ముడు. మిమ్మల్ని చూస్తే నాకేమీ అర్థం కావడం లేదురా. మీరు చూడపోతేనా భూసురులను నమ్ముకున్నారు, ధరణీశ్వరులను నమ్ముకున్నారు, ధర్మాన్ని నమ్ముకున్నారు, దైవాన్ని నమ్ముకున్నారు. దైవం మీకు తోడుగా వున్నాడు అని, ఒకమాట చెప్తాడు. ఆవిడ చూడపోతే ఆవిడా అంతే, కుంతీదేవి. మీకేమో ఈ కృష్ణుడు తోడా? ఈ వాయుపుత్రుడు ఒకడా, ఇంద్రుడి పుత్రుడు ఒకడా, వీనికి తోడు గాండీవమా? ఎన్నివున్నా ఇవేమిటి ఈ ఆపదలు, అని అడిగాడు. అవన్నీ వుంటే ఆపదలేమీ రాకూడదని ఏం లేదని చెప్తోంది భారతం కదా! అని, ఓమాట అంటాడు. ఈపద్యం మళ్ళీ మనం కంఠస్థం చేసుకోవచ్చు.

**"ఈశ్వరుండు, విష్ణుండెవ్వేళ నెవ్వని**
**కేమి సేయు, బురుషున్ డేమి యెఱున్ గు"**

నీకేం తెలుసు? తనకే తెలియలేదు. తను ఇలా అయిపోతాడని తనే అనుకోలేదు కదా? మొదట అంతా బాగానే జరిగిపోయింది కదా, పద్దెనిమిది ఏళ్ల వరకు. అక్కడ్నించి అన్నీ ఏం చేసినా, అన్నీ వంకరగా అయిపోయాయి. ఉద్దేశం మంచిదైనా పని వంకర అయిపోయింది కదా! అది చెప్పుకొచ్చాము కదా! మరి ఆయనకుండేటటువంటి తత్త్వజ్ఞానం ఇంకెవరికి వుంటుంది? అందుకని అంటున్నాడు, ఎవ్వరికీ తెలియదు ఈశ్వరుడు ఎప్పుడు, ఏవిధంగా, ఎవరిని అనుగ్రహిస్తాడో అది జీవుల కెట్లా తెలుస్తుంది? తెలియదు, అన్నాడు. అంతేకాదు–

**"నతని మాయలకు మహాత్ములు విద్వాంసు**
**లడంగి మెలగుచుందురు రంధులగుచు".**

ఈశ్వరుడు చేసే మాయ ఎవ్వరూ తెలుసుకోలేరు. మహాత్ములు కూడా తెలుసుకోలేరు. మహాత్ములే తెలుసుకోలేరంటే ఇక విద్వాంసులు ఏం తెలుసుకుంటారు? తెలుసుకోలేరు. కాబట్టి ఎవరు తెలుసుకుంటారు? ఎవ్వరూ తెలుసుకోలేరు. పడి వుండండి, అని చెప్తున్నారు. ఎందుకనీ? తను అలా పడివున్నాడు. తను అలా ఈ సింహాసనం కాచుకోవడం కోసం.... ఆయనకు ఎంత పనై పోయిందండీ? దాదాపు నూటయాభైఏళ్ల పని అయిపోయింది. రేపోమాపో వెళ్లిపోదాం అనుకునేవాడికి అలా దశాబ్దాలు వుంచేశారనుకోండి, ఎలా వుంటుంది? వుండిపోయాడు ఆయన. మన చేతుల్లో ఏం లేదబ్బాయి, అని చెప్తున్నాడండి. ఇలాంటి తత్త్వం ఉపదేశిస్తుంది భాగవతం. ఇదికాక ఈ తత్త్వబోధ అయినాక స్తుతి వుంటుంది. భగవంతుని స్తుతి.

ఈ భీష్మస్తుతిలో వుండేటువంటి ఈ విశేషమైన ధర్మం ఒకటి తెలుసుకోండి. ఆ పద్యాలు కంఠస్థం వస్తే మనకు ఏమన్నా చిన్నకష్టం వస్తే, పెద్ద complaints ఏమీ వుండవు. పడి ఉంటాం. నాకెందుకు ఇలా అయింది, అనకూడదు. నాకెందుకు ఇలా అయింది అంటే, దానికి మాస్టరుగారు  అవునురా నీకే ఎందుకు అలా అయింది? అనేవారు. ఎవడికైనా ఎందుకిలా అయింది అంటే, ఒకటే! వాడికి (దైవానికి) తెలుస్తుంది. ఇంకెవరికీ తెలియదు. నీకథ నీకు తెలియదు కదా! అందుకనే నాకెందుకు ఇలా అయింది అనడం కన్నా, నేను ఇప్పుడేం చెయ్యాలి అనేది ఉండాలి. మనకు బుద్ధి వుంటే అది చేస్తాం. ఇప్పుడు మనమేం చెయ్యాలి అని చూసుకోవాలి. భీష్మాచార్యులవారు తనని పరివేష్ఠించి ఉన్న మనుమలైన పాండవులను, అలాగే కోడలైన కుంతీదేవిని ఉద్దేశించి, వారు ఎంత ధర్మాత్ము లయినప్పటికీ, అమితమైన హరిభక్తి కలిగి ఉన్నప్పటికీ కూడా, వారు అనేకానేకమైన కష్టనష్టములు భరించవలసి వచ్చినదని ఇది దైవము యొక్క తంత్రమని చెప్తున్నారు. ఎప్పుడూ నాకిష్టమైంది, నేను చదువుకునేది, ప్రవచనాల్లో చదివేది అయినటువంటి పద్యం

**"ఈశ్వరుండు విష్ణుండెవ్వేళ నెవ్వని**
**కేమిసేయు బురుషుడేమి యెరుగు**
**నతని మాయలకు మహాత్ములు విద్వాంసు**
**లడంగి మెలఁగుచుందు రంధు లగుచు"** అని.

అందుచేత భగవంతుడి మాయ దాటరానిది. *“మమ మాయా దురత్యయా”* అంటాడు. నా మాయ నెవరూ దాటలేరు, నేనొక ప్రణాళిక ప్రకారం నిర్వర్తిస్తూ ఉంటాను. నా ప్రణాళిక ప్రకారం నేను నిర్వర్తిస్తున్నప్పుడు, నా ప్రణాళికకు బద్ధులై జీవించేవాళ్లకి మరికొంచెం కష్టనష్టాలుంటాయని చెప్తున్నారు, కదా! ఇప్పుడు భీష్ముడు ధర్మాత్ముడు. పాండవులు ధర్మాత్ములు. కుంతీదేవి ధర్మాత్మురాలు. వీరు ముగ్గురు ప్రస్తుతమైన విషయం. అందరికి కూడా చాలా కష్టనష్టాలు కలిగినాయి. అయినప్పటికీ వారు ధర్మపథాన్ని వదలలేదు. హరిభక్తిని విడువలేదు. అలా విడువక, హరిభక్తితో కూడి, ధర్మాన్ని నిర్వర్తిస్తూ కష్టనష్టములన్నీ భరించారు తప్ప, ఇంకొకటి లేదు. ఎందుకిలా జరుగుతుంది అంటే, దానికి తరువాత వచనం చెప్తారు, భీష్మాచార్యుల వారు.

*“కావున దైవతంత్రంబైన పనికి వగవం బనిలేదు”,* అంటాడు. ఇది దైవతంత్రం! కొంతమంది స్వతంత్రంగా వారు చేసినటువంటి ఆలోచనలు, మాటలు, పనుల వల్ల ఇబ్బందుల్లో పడుతూ ఉంటారు. ఇక ఈ ధర్మాత్ములు, వారు ఇబ్బంది పడడానికి కారణం దైవతంత్రం. దైవతంత్రం, స్వతంత్రం రెండిటికి తేడా ఉంది. మనం స్వతంత్రించి చేసిన పనుల వల్ల మనం చిక్కుకుపోతూ ఉంటాం. అలా కాకుండా ధర్మాన్నాచరిస్తూ, ధర్మబద్ధులై, ధర్మములకు లోబడి, జీవిస్తున్నటువంటి వాళ్లకి కూడా కష్టనష్టములు కలగటమనేది, అది దైవము యొక్క తంత్రము. *“ఈ దైవతంత్రంబైన పనికి వగవం బనిలేదు. రక్షకులు లేని ప్రజల*

*రక్షింప బుండరీకాక్షుండు, సాక్షాత్కరించిన నారాయణుండు".* ఈ కనపడుతున్నటువంటి కృష్ణుడు, సాక్షాత్తు నారాయణుడే అని చెప్తున్నాడండీ! *"తేజోనిగూఢుండు గాక, యాదవులందు గూఢుండై"* అలా నారాయణమూర్తి తేజస్సుతో కనిపిస్తుంటే అందరం వెంటపడిపోతాం కదా! అందరం వెంటపడే రీతిలో ఎందుకుంటాడు? ఎవరు వెతికి చూచి పట్టుకుంటారో వాళ్లకి కనిపించేట్టుగా ఉంటాడు దైవం.

అదెలా ఉంటుందంటే మన గురుపూజా వేదికలాగా ఉంటుంది, కదా! వెదికి పట్టి చూచాం కదా ఇక్కడ. నలభైయేళ్లకి మనకీ వేదిక మాస్టరుగారు ఏర్పాటు చేశారంటే ఆయన దృష్టి చాలా అమోఘం అనిపించింది నాకు. ఎందుకంటే మనం చాల చక్కని ప్రశాంత వాతావరణంలో గుట్టుగా, నిగూఢుండై అన్నాడు కదా! గుట్టుగా ఏదో పళ్ళ మార్కెట్ల మధ్యలో లోపల అందంగా ఉండేచోట, చక్కని అనుభూతి నిచ్చేటువంటి, ఈ భీష్ముని యొక్క ఉపాఖ్యానం మనం నిర్వచించుకోగలిగాం. అది మాస్టరుగారి తంత్రం! మనమేదో కిందా మీద, కిందా మీద పడుతూ ఉంటాం. మన తంత్రమది. ఆ తంత్రం చివరికి మాస్టరుగారి తంత్రంలో చేరేవరకు ఇబ్బందులుంటూ ఉంటాయి. మూడంచెల్లో ఇక్కడికి చేర్చారు, కదా! ఇలా ఉంటుందని గుర్తిస్తూ ఉండాలి దైవం. మన ప్రయత్నం మనం చేస్తూ ఉంటాము, కానీ దైవం యొక్క సంకల్పము అందేంత వరకు, మన సంకల్పము దైవసంకల్పంతో కూడే వరకు, పరిష్కారం లభించదు. అందుకని దైవమొక తంత్రం.

ఆయనకొక తంత్రముంది, ద్వాపరయుగ అంతంలో కలియుగ ప్రారంభంలో! దాన్ని నిర్వర్తించడానికి వచ్చినవాడు మొత్తం సృష్టికి చక్రం తిప్పేవాడే అయినప్పటికీ కూడా, మనలోఉన్నప్పటికీ కూడా, ఆయన చాల నిగూఢుండై ఉన్నాడు అని చెప్తున్నాడు.

*"యాదవులందు గూఢుండై తన మాయచేత లోకంబుల మోహాతిరేకంబు నొందించు,"* అందరికి రకరకాలుగా మోహం కలిగిస్తూ ఉంటాడు. అదికూడా యాదవులందు పుట్టడం వల్ల ఏమైందంటే, ఎప్పుడూ గుట్టుగా ఉండడానికి వీలుపడ్డది. ఏదో రకరకాలుగా ఊహించారు. అష్టమ గర్భమందు దైవము జన్మిస్తాడని, అందరు చాలా రకాలుగా ఊహిస్తే, ఎవరూ ఊహించని రీతిలో, ఆయన యాదవకులంలో పుట్టాడు. అంతేకాదు, అందులో కూడా చాలా నిగూఢంగా ఉన్నాడు. యాదవుల్లో ఒకడుగా ఉన్నాడు. సమకాలికులైన యాదవులు, కృష్ణుడా! మాలో ఒకడు అంటారు.

నేను ఇజ్రాయిలులో ఏసుక్రీస్తు సంచరించిన ప్రాంతాలన్నీ తిరుగుతున్నచోట, ఆయన యూదుకులంలో పుట్టాడు, యూదుజాతిలో పుట్టాడు అని. ఒక యూదు మాకు గైడుగా అన్నీ చూపిస్తున్నాడు. ఆయన్ని అడిగాను, ఏసుక్రీస్తు గురించి నువ్వు ఏమని భావిస్తావని. ఇదే మాటన్నాడండి, మాలో ఒకడు. యూదులకి అదీభావం ఏసుక్రీస్తు అంటే. యూదులకి తప్ప మిగతా వారందరికి ఆయన దేవుడు. కానీ యూదులకి మాత్రం మాలో ఒకడన్నాడు వాడు (గైడు). అది బావుందనుకున్నాను. అప్పుడే గుర్తొచ్చింది. అందుకని అదే భావం, అలాగే ఉంటూ ఉంటుంది.

అలా నిగూఢుండై ఉండడం చేత అతని రహస్య ప్రకారంబులు *"తన మాయచేత లోకంబుల మోహాతిరేకంబు నొందించు నతని రహస్యప్రకారంబుల, భగవంతుండైన పరమేశ్వరుం డెరుంగు".* ఇంకెవరికి తెలియదు. ఈ జరుగుతున్న దానికి, ఈ శ్రీకృష్ణుడిక్కడ దిగి ఏం చేస్తున్నాడనే దానికి పరమేశ్వరుడి కెరుక అంటూ ఉంటాం కదా, మనం! అలా *"పరమేశ్వరుం డెఱుగు మరియు దేవర్షియగు నారదుండును,"* నారదమహర్షికి, అంటే తెలియ చేస్తే తెలుసుకుంటూ ఉంటాడు నారదుడు. ఎందుకంటే కృష్ణుడు తెలియచేయకుండా, చాలామందిని చాలా రకాలుగా, వాళ్ళక్కూడా అర్థం కాకుండా, ఆయన నడకలుండేవి. ఎందుకీ స్వామి ఈ విధంగా ప్రవర్తించాడన్నది, ఎవ్వడికీ అర్థంకాదు. ఎంత మహాత్ముడికైనా ఉహకందదు. కాస్త, అసలందితే పరమేశ్వరుడికి అందుతుంది. తరువాత నారదుడికి అందుతుంది.

*"భగవంతుఁడగు కపిల మునియు నెరుంగుదురు."* ఆయన పాతాళలోకంలో ఉంటాడు. ఏది? భూమికి పాతాళంలో. ఆయనకన్నీ తెలుస్తాయట. ఆయన ఎవరికీ అందుబాటులో ఉండడు. నారదుడు, అంతంత మాత్రమే అందుబాటు. సరే పరమేశ్వరుడంటే చెప్పేదేముంది ఇంక. వీళ్ళ ముగ్గురికే తెలుసు, ఈయన చేసేటువంటి పనులు. మిగతా వాళ్లెవరూ తెలుసుకుందా మనుకుంటే అది తెలియగలిగే విషయం కాదు. అందుకని ఒక దైవతంత్రం తెలియటమనేది దైవానుగ్రహం వల్ల తెలియాలి, మరొక మార్గం లేదు. మైత్రేయమహర్షి అదే అంటాడు, నువ్వనుగ్రహిస్తే

కదా మాకు తెలుస్తుందంటాడు. నువ్వు అనుగ్రహించకపోతే, నువ్వు ఏం సంకల్పించావో మాకు తెలియదు కదా! అంటాడు. అలాంటి ఒక అద్భుతమైన విషయాన్ని భీష్ముడిక్కడ ఆవిష్కరిస్తున్నాడు. *"మీరు కృష్ణుండు దేవకీపుత్రుండగు మాతులేయుండని తలంచి"* కదా, మేనత్త కొడుకనుకున్నారు. కృష్ణుడు ఎంతసేపూ మేనత్త కొడుకుగానే కనిపిస్తూ ఉండేవాడు పాండవులకి.

*"దూత, సచివ, సారథి, బంధు, మిత్ర ప్రయోజనంబుల నియమింతు రిన్నిటం గొరంతలేదు."*

అట్లా మీరు నియమించా రాయనని. ఓ స్నేహితుడుగా చూశారు, సచివుడిగా చూశారు. సారథిగా వాడుకున్నారు, బంధువనుకున్నారు, మిత్రుడనుకున్నారు. ఇట్లా రకరకాల ప్రయోజనానికి మీరాయన్ని నియమించారు. *"ఇన్నిటం కొరతలేదు"* ఇలా మీరు చేయడంవల్ల తప్పేం లేదు, ఎందుకంటే ఆయనలా ఉంటాడు. మీకందదు. మీకందిన దాని ప్రకారం మీరు ప్రవర్తిస్తూ ఉంటారు అందుకని తప్పులేదు.

*"రాగాది శూన్యుండు, నిరహంకారుండు, నద్వయుండు, సమదర్శనుండు, సర్వాత్మకుండైన ఈశ్వరునకు, నత, ఉన్నత భావ మతి, వైషమ్యము లెక్కడివి?"* అన్నాడు ఆయన, అంటే భగవంతుని యొక్క గుణాలిక్కడ మనం బాగా గుర్తుచేసుకోవాలి. ఎందుకంటే భగవంతుని గుణవిశేషమును మనం బాగా ఆరాధన చేసుకుంటూ ఉంటే, మనకా అపరిమితమైన తత్త్వము,

మన యందు సాన్నిధ్యాన్నిచ్చేటువంటి అవకాశం ఉంటుంది. అందుచేత, అతడెవరు? రాగాతిశూన్యుడు, వీరియందు అనురాగము, వారి యందు విరాగము అటువంటివేం లేవు. అందరి యందు ఒకరకంగానే ఉంటాడు. శత్రుమిత్రులయందు ఒకరకంగానే ఉంటాడు. నిరహంకారుడు. నన్ను నువ్వు driverగా పెట్టుకుంటావా అనడు. అంటాడా? నేను నీ friend అనుకుంటున్నావా? అని అనడు. నీ cousin అనుకుంటున్నావా? అని ఎప్పుడూ అనడు. మీరెలా చెప్తే అలా, అట్లా ఉంటాడన్న మాట. ఎందుకని? నిరహంకారుడు. అద్వయుండు. అంతటా, అన్నిటా తానే నిండి ఉన్నాడు. వీళ్లందరి రూపంలో ఉన్నది తానే, అని తెలిసి ఉన్నవాడు శ్రీకృష్ణుడు. వివిధ పాత్రధారులుగా ఉన్నటువంటి వాళ్లు జీవులు. ఈ జీవులందరి రూపంలో ఉన్నది నేనే అని తెలిసినటువంటివాడు, అలా ఎవడు ఉండగలడో, వాడే అద్వయుడు. అద్వయుండును, సమదర్శనుండును, అందరిలో ఉండేటువంటి శుద్ధచైతన్యాన్ని దర్శనం చేస్తూ ఉంటాడు. సర్వాత్మకుడును, జీవాత్మలందరిగా ఉన్నటువంటివాడు అయిన ఈశ్వరునకు తక్కువ, ఉన్నతి, నత, ఉన్నత భావము వైషమ్యములు ఎక్కడివి? లేవు. *“భక్తవత్సలుండు గావున, ఏకాంత భక్తులకు సులభుండై ఉండును”* అన్నాడు. ఏకాంత భక్తుడంటే, తనలో ఉన్నటువంటి ఈశ్వరునితో అనుసంధానం చేసి, ఆ ఈశ్వరుడే సర్వరూపములయందు వ్యాప్తి చెంది ఉన్నాడని తెలిసి, ఇంతమందిగా ఉన్నది ఒక్కడే అని ఎవరైతే నిత్యమూ అనుభూతి చెందుతూ ఉంటూ ఉంటారో, అలాంటివాళ్లకు మాత్రమే ఆయన

సులభుడుటండి. కపిలు డలాంటివాడు. నారదు డలాంటివాడు అందుచేత వాళ్లకు సులభంగానే ఉంటాడు.

**"అతి భక్తి నెవ్వనియందుఁ జిత్తముఁ జేర్చి**

**యెవ్వని నామ మూహించి పొగడి,**

**కాయంబు విడుచుచుఁ గామకర్మాది ని**

**ర్మూలనుండై యోగి ముక్తి నొందు**

**నట్టి సర్వేశ్వరుం డఖిల దేవోత్తంసుఁ**

**డెవ్వేళఁ బ్రాణంబు లేను విడుతు**

**నందాఁక నిదె మహాహర్షుఁడై, వికసిత**

**వదనారవిందుడై వచ్చెనేడు"** అన్నాడండి.

ఎవరైతే అత్యంత భక్తి కలిగి తన యొక్క ప్రజ్ఞను మనసు నుండి బుద్ధిలోనికి, బుద్ధిలో నుండి పరతత్త్వంలోకి ప్రవేశింప చేసి, అతని నలా ఊహిస్తూ, ఆ తత్త్వాన్ని, దేహం విడిచే సమయానికి, ఈ శరీరానికుండే సమస్త కర్మలు నిర్మూలనమై, స్వచ్ఛమైన జీవుడిగా ఉంటాడో, అలాంటివాడు ఎవరిని కోరి, ఎవరితో కూడి ఉండడానికి దేహం విడుస్తాడో, అలాంటివాడు ఇప్పుడు నేను ఈ ప్రాణంబులు విడిచే సమయంలో *"మహాహర్షుడై వికసిత వదనారవిందుడై వచ్చె నేడు".* మనం ఎవ్వరి దగ్గరికి వెళదాం

అనుకుంటామో, ఆయనే వచ్చి అక్కడ పక్కన నిలబడ్డాడనుకోండి! మరి అందరికి జరగదలా కదా! అది సాధ్యమైన విషయం కాదు. ఇంత యోగసాధన చేసి, ఆ యోగం ద్వారా కర్మ అంతా దగ్ధం చేసుకుని, స్వచ్ఛందమైన స్థితిలో మరణకాల మాసన్నమైందని తెలిసి, ఈశ్వరుని చేరటానికి ప్రయత్నం చేస్తూండే యోగి ఎవరి గురించి ప్రయత్నం చేస్తూ ఉంటాడో, అది రూపు కట్టుకుని పక్కన నిలబడి ఉంది, అంటున్నాడు. అంటే ఇంక పాండవుల గురించి మాట్లాడడం ఆపాడు. పాండవులు, కుంతీదేవి, ఈ ధర్మనిష్ఠ, జీవులతంత్రము, దైవతంత్రము ఇలాంటివన్నీ తెలిపాడు. తెలిపేసి ఇంక వాటిని పక్కనపెట్టి, ఇటుపక్క తిరిగాడు. అక్కడ కృష్ణుడు నిలబడి ఉన్నాడు కదా! ఎలా వచ్చాడట కృష్ణుడు?

**“నాల్గుభుజములుఁ గమలాభనయనయుగము**
**నొప్పఁ గన్నులముందట నున్నవాడు,**
**మానవేశ్వర నా భాగ్యమహిమఁ జూడు**
**మేమి సేసితినో పుణ్య మితనిఁ గూర్చి.”**

ఎలా కనిపించాడు కృష్ణుడు? అందరికి కనిపిస్తున్నట్టుగా కనిపించట్లేదు భీష్ముడికి. అందరికీ రెండు చేతుల వాడిగా కనిపిస్తూ ఉంటాడు. ఏది? అక్కడ చేరిన వాళ్లందరికి. ఈయనకి నాలుగు చేతులు కలిగిన వాడుగా కనిపిస్తున్నాడండి. ఎందుచేత? ఈయన చూస్తున్నటువంటి కక్ష్య ఏదైతే ఉందో, plane of existence అంటామే, ఆయన బుద్ధి లోకాల్లోంచి చూస్తున్నాడు. చూస్తే, కృష్ణునికి నిజంగా నాలుగు చేతులు ఉంటాయి. కృష్ణుడికి

నాలుగు చేతులుంటాయని భాగవతం మొదట్లోనే చూపిస్తారు. రెండు చేతులతో కాపాడుతూ, రెండు చేతులతో అవతలి వాడిని బంధించడం, ఇలాంటివన్నీ అక్కడక్కడా చూపిస్తారు. అసలాయన చేసిన కార్యమంతా కూడా చతుర్భుజములతోనే చేయడం జరుగుతుంది. అందుచేత నాలుగు భుజములతో భీష్ముడికి దర్శనం ఇచ్చాడు. ఎలా దర్శనం ఇచ్చాట్ట?

*"నాల్గు భుజములు కమలాభ నయనయుగము నొప్ప"* అంటే పద్మముల వంటి కన్నులతో ఉన్నాట్ట. విచ్చిన కన్నులతో ఉన్నాట్ట. నాలుగు భుజములు కలిగి ఉన్నాట్ట.

*"కన్నుల ముందట నున్నవాడు మానవేశ్వర నా భాగ్య మహిమ చూడు ఏమి చేసితినో పుణ్యము ఇతని గూర్చి".* అంటే ఇలా పుణ్యం చేసుకుంటే ఈ విధంగా దర్శనమవుతుందని ప్రమాణమేం లేదు. గుర్తుపెట్టుకోండి. ఎవరిని ఎప్పుడు ఏవిధంగా అనుగ్రహిస్తాడు అనేది, అనుగ్రహించిన తరువాత తెలియవలసిన విషయమే తప్ప, ఇలా అనుగ్రహించాడని, ఇలా అనుగ్రహిస్తాడనేది ఎక్కడా కనపడదు.

*"అని యిట్లు ధనంజయసంప్రాపిత శర పంజరుండయిన కురుకుంజరుని వచనంబు లాకర్ణించి ముని లందరు వినుచుండ ధర్మనందనుండు,"* ఈయన అడిగేస్తాడిప్పుడు, ఎందుకంటే శ్రీకృష్ణుడు చెప్తాడు. ఇప్పుడా తేజం వెళ్ళిపోతే భూమి మీద మళ్ళీ అలాంటి జ్ఞానం లభించదు. ఇంకొకరు చెప్పలేనటువంటి

మహత్తరమైన జ్ఞానము ఆయన దగ్గర చాలా ఉన్నది. అందుకని అన్నీ నువ్వు తెలుసుకుంటే నీకు మంచిది, ఉత్తరోత్తరా రాజ్యపాలన చేయడానికి, రాజ్యాన్ని సుభిక్షం చేయడానికి. అందుచేత నువ్వు ఆయన దగ్గర అన్నీ అడిగి తెలుసుకో, అన్నాడండి. ఏది? ఈయన వెళ్లిపోదామనుకునే సమయంలో! మరణ సమయంలో ఇలా అవి ఇవి అడిగితే చెప్పే ఓపిక ఎవరికుందండి? భీష్ముడికి కాబట్టి ఉంది, కదా! అంపశయ్య మీద పడుకున్నాడు కానీ, దాని యొక్క ప్రభావం ఆయన మీద లేదు. వేరే కక్ష్యలో ఆయన వసించి ఉన్నాడు. ధ్యానము నందున్నాడు. కృష్ణుని అనుమతి కోరుతూ ఇక బయల్దేరుతానని చెప్పాడు. ఎందుచేతంటే ఉత్తరాయణ పుణ్యకాలం వచ్చేసింది అనుకున్నాడు. అంతకన్నా ముఖ్యంగా తన జీవన ప్రయోజనమొకటి పరిపూర్ణంగా నెరవేరింది కదా! అందువల్ల అలాంటి వాణ్ణి ధర్మరాజప్పుడు ఎన్నో అడుగుతాడండీ. అవే మనకి శాంతి, అనుశాశిక పర్వములుగా మహాభారతంలో వేదవ్యాసమహర్షి లిఖించి ఇచ్చాడు. ఎందుకనీ? వేదవ్యాసమహర్షి కూడా అక్కడే ఉన్నాడు. అందువల్ల మనం భీష్ముని యొక్క బోధలు తెలియాలంటే శాంతి, అనుశాసిక పర్వములను బాగా పఠించాలి. పఠిస్తే, ధర్మరాజు అబ్బో! చాలా విషయా లడుగుతాడు. అన్నిటికి మించి 'విష్ణు సహస్రనామం' కూడా భీష్ముని ముఖము నుండే వ్యక్తమవుతుంది కదా! *''కిమేకం దైవతంలోకే కింవాప్యేకం పరాయణం'',* అంటూ మనం చదువుతాం కదా. అలా ధర్మరాజు అడిగిన దానికి ఎన్నో విషయములను తెలియపరుస్తాడు.

*"కురుకుంజరుని వచనంబు లాకర్ణించి ముని లందరు వినుచుండ ధర్మనందనుండు మందాకినీనందనువలన"*- మందాకినీ నందనుడంటే? గంగాదేవి కుమారుడు, భీష్ముడు. *"నరజాతి సాధారణంబులగు ధర్మంబులును"*- నరజాతి ధర్మాలన్నీ కూడా, *"సాధారణ ధర్మంబులను, వర్ణాశ్రమ ధర్మంబులును, రాగ వైరాగ్య ఉపాధులతో కూడిన ప్రవృత్తి నివృత్తి ధర్మములును, దానధర్మంబులును, రాజధర్మంబులును, స్త్రీలధర్మంబులును, శమదమాదికంబులును, హరితోషణంబు లగు ధర్మంబులును,"* అంటే హరిని సంతోషపెట్టేటువంటి ధర్మములు. *"ధర్మార్థకామమోక్షంబులును, నానావిధోపాఖ్యాన ఇతిహాసంబులును, సంక్షేప విస్తార రూపంబుల నెరింగి,"* కొన్నికొన్ని సంక్షిప్తంగా చెప్పాట్ట, కొన్నికొన్ని విస్తారంగా చెప్పాట్ట. ఇలా ఇవన్నీ తెలుసుకున్నాడండి. అంటే తెలుసుకోవలసినవన్నీ తెలియపరిచాడు భీష్ముడు. మళ్ళీ ఒక్కసారి చదువుతాను వినండి. నరజాతి సాధారణ ధర్మములు, అవే మనం పాటించం. ఈ సాధారణధర్మములే, మనకి పెద్ద విషయాలైపోయి అమ్మో ఇవెలా పాటిస్తామండీఅన్నట్టుగాఉంటాంమనం.వర్ణాశ్రమధర్మంబులును, *"రాగవైరాగ్యఉపాధులతో కూడిన ప్రవృత్తినివృత్తి ధర్మములును".* రాగమున్నదనుకోండి, ప్రవృత్తి కొక ధర్మముంటుంది. ప్రపంచంతో పెనవేసుకుందామనుకున్నా తప్పులేదు. దానికొక ధర్మముంది, దాని ప్రకారం పెనవేసుకో! విరాగ అంటే దాన్నించి బయటపడదామని అనుకున్నావనుకో, నివృత్తి ధర్మ మొకటుంది. ప్రవృత్తికి, ప్రవృత్తి ధర్మమున్నది, నివృత్తి ధర్మమున్నది. బాగా

రాగము కలిగినటువంటి వాడు ప్రవృత్తి ధర్మములు. విరాగము కలిగినటువంటి వాడు నివృత్తి ధర్మములు. అవి రెండూ తెలియపరిచాడు. చాలా చిన్నచిన్న పిట్టకథలు కూడా మధ్యలో చెప్తూ ఉంటారు అందులో. ధర్మంబులును, దానధర్మంబులును, ఎలా దానం చేసుకోవాలి అనేటువంటి విషయం. రాజధర్మంబులును, ఎలా పరిపాలించాలి, అనేటువంటి విషయం. స్త్రీల ధర్మంబులును, స్త్రీలేవిధంగా జీవించాలి. అన్ని ధర్మాలు ప్రత్యేకంగా చెప్పాడు. స్త్రీల ధర్మంబులును శమదమాదికంబులును. ఇవన్నీ ఇలా ఉండగా, హరితోషణంబులగు ధర్మంబులును. హరి సంతోషించేటువంటి ధర్మములు. నువ్వు ఎలా ప్రవర్తిస్తే హరి సంతోషిస్తాడో ఆ ధర్మాలు చెప్పాడు. ధర్మార్ధకామమోక్షంబులును, నానావిధోపాఖ్యాన ఇతిహాసంబులును, సంక్షేప విస్తార రూపముల నెఱిఁగె, తెలుసుకున్నాడు, ధర్మరాజు. *"అంత రథికసహస్రంబులకు గమికాడైన భీష్ముండు, స్వచ్ఛంద మరణులైన యోగీశ్వరులచేత వాంఛితంబగు నుత్తరాయణంబు నను దెంచిన నది దనకు మరణోచితకాలంబని నిశ్చయించి,"* చెప్పాల్సినవన్నీ చెప్పేశాడు. తను ఇక వెళ్లే సమయమొచ్చిందని నిశ్చయం చేసుకుని,

**"ఆలాపంబులు మాని చిత్తము మనీషాయత్తముం జేసి, దృ**
**గ్జాలంబున్ హరి మోముపైన్ బరపి, తాత్కారుణ్యదృష్టిన్ విని**
**ర్మాలీభూతశరవ్యథానిచయుడై మోదించి భీష్ముండు సం**
**శీలంబొప్ప నుతించెన్ గల్మషగజశ్రేణీహరిన్ శ్రీహరిన్."**

అన్నాడు. అంటే పెద్దపెద్ద ఏనుగులంత కర్మములను, అలా

గజశ్రేణులంటే కొన్ని, అలా ఏనుగులు వరుసగా బారులు దీరి నిలబడ్డాయనుకోండి, అంతకర్మమున్నా కూడా, దాన్ని హరించేస్తాట్టండి హరి! ఎలా ఉందో చూడండి. *"కల్మషగజశ్రేణీహరిన్, శ్రీహరిన్".* ఆయన్ని నుతించాట్ట. *"ఆలాపంబులు మాని"* ఇంక భాషణం మానేశాడు. అలాగ రోదనం అటువంటివి వుండవు కదా! అయ్యో పోతున్నానే అన్న బాధేముండదు. అవన్నీ మనకి బాగా తెలిసిన విషయాలవి. ఇది తెలియని విషయం. ఎవరికీ ఇది మామూలుగా.... *"చిత్తము మనీషాయత్తముంజేసి"* చిత్తము పురుషోత్తముడి మీద, లగ్నం చేశాడు. *"దృగ్జాలంబున్ హరి మోముపై పరపి"*– అక్కడే ఉన్నాడు ఎదురుగుండా, అది పెద్ద సౌలభ్యమై పోయింది. *"హరి మోముపై పరిపి, తత్కారుణ్యదృష్టిన్ వినిర్మూలీభూత"*– అంటే, ఎప్పుడైతే హరిపక్క చూశాడో, హరి ఆయన్ని చూశాడో, చూచే సరికి, ఇంక ఈ అంపశయ్య, దీనిమీద గుచ్చుకున్న బాణాలు, ఇంకా వీటి గురించిన ఆలోచన, అంతకు ముందే చాలా మటుకు లేదు, ఆ ఉన్న కాస్త కూడా పోయిందండి. మోదించి, మోదం కలిగిందిటండి. బాధపోయి మోదం కలిగిందిటండి మరణ సమయంలో. *"మోదించి భీష్ముందు, సంశీలంబొప్ప నుతించె",* ఎంత అద్భుతంగ భీష్మాచార్యుల వారు శ్రీకృష్ణుని స్తుతి చేస్తారో?

*"పీతాంబరధారియున్ చతుర్భుజుండు నాదిపురుషుండున్ బరమేశ్వరుండు నగు హరియందు నిష్కాముండై విశుద్ధం బగు ధ్యాన విశేషంబుచే నిరస్త దోషుం డగుచు, ధారణావతి యైన*

*బుద్ధిని సమర్పించి, పరమానందంబు నొంది, ప్రకృతి వలన నైన సృష్టి పరంపరలన్ బరిహరించు తలంపున, మందాకినీనందనుం డిట్లనియె"*– పీతాంబరధారి, ఆయనెప్పుడూ పీతాంబరాలు ధరిస్తూ ఉండేవాడు, లేకపోతే ఆయన కనబడడు. ఆయన కనబడడానికా వస్త్రం కదా! *"పీతాంబరధారియు, చతుర్భుజుండును ఆది పురుషుండును",* అవన్నీ చెప్పక్కర్లేదు. ఆదిపురుషుడంటే మొట్ట మొదటిగా ఏర్పడినటువంటి విరాట్పురుషుడని అర్థం. *"అగు హరియందు నిష్కాముడై",* ఇంకాయనకవేమీ లేవు. నువ్వు ఎక్కడికి వెడదామనుకుంటున్నావ్, ఏ లోకానికి వెళ్తావ్, ఇలాంటివి కూడా ఏమీలేవు. మనమెక్కడి కెళ్తున్నామని కూడా! ఆయనలోకి వెళ్తున్నామంతే! *"నిష్కాముండై, విశుద్ధంబగు ధ్యాన విశేషంబు చేత".* ఆ ధ్యానం కూడా చాలా, చాలా శుద్ధంగా ఉందిట. విశిష్టమైన శుద్ధి కలిగినటువంటి ధ్యానం. *"నిరస్తదోషుండగుచు",* ఇంక మరి ఆయనకి అంతరాయం కలిగించేవి, ఆయన లక్షణంలో ఇంకేం లేవు. జీవలక్షణంలో అయిపోయాడు, అలా ఆయన *"ధారణావతియైన బుద్ధిని సమర్పించి",* అంటే విజ్ఞానమును ధరించేటువంటిది బుద్ధి. అందుకని దాన్ని ధారణావతి అంటారు. మనకి అమరావతి ఒకటుంది కదా, అంటే అమరులను ధరించే ప్రాంతం అది, అమరావతి ఒకప్పుడు. గుర్తుపెట్టుకోండి. అలా అది ధారణావతి. అయినటువంటి బుద్ధిని సమర్పించి, పరమానందంబు పొంది, *"సృష్టి పరంపరల పరిహరించు తలంపున"* మాటిమాటికి ఈసృష్టిలోకి దిగివచ్చే పరిస్థితి, అది పరంపరాగతంగా దిగుతూనే ఉంటాం కదా! *"సృష్టి పరంపరల పరిహరించు తలంపున*

*మందాకినీ నందనుండిట్లనియె."* ఇంక మరి చెప్తూంటారు కదా అపునరావృత్తి మార్గమని. అది పరమానంద స్థితి లేక బ్రహ్మానంద స్థితి. అందులోకి ప్రవేశించేటువంటి తలపుతో, భీష్మాచార్యుల వారు ఈవిధంగా స్తుతి చేయడం మొదలు పెట్టారండి.

# 11. శ్రీకృష్ణస్తుతి

**త్రిజగన్మోహననీలకాంతిన్ దను వుద్దీపింపన్ బ్రాభాత నీ**
**రజబంధుప్రభ మైన చేలము పయిన్ రంజిల్ల నీలాలక**
**వ్రజసంయుక్తముఖారవింద మతిసేవ్యంబై విజృంభింప మా**
**విజయం జేరెడు వన్నెకాఁడు మది నావేశించు నెల్లప్పుడున్!**

అన్నాడు. అంటే ఎప్పుడూ విజయుడితో చేరదామని చూస్తూ ఉంటాడు కృష్ణుడు. అసలు ప్రవచనం ప్రారంభమే విజయుడితో మొదలైపోయింది, విజయవాడలో ఉన్నామని. విజయుడంటే వాడు మానవుడు కాదు, నరుడు. మానవుడు కాక నరుడైనటువంటి వాడు, ఈ పురము (దేహము) చేత బంధింపబడి ఉండడు. వాడు విజయుడు. శ్రీకృష్ణుడు అలాంటి వాడి దగ్గరికి ఆయనే కోరి, చేరుతూ ఉంటాడు. అందుచేత, *"విజయుం చేరెడు వన్నెకాడు."* అంటే అది కేవలం అర్జునుడికే మనం పరిమితం చేయకూడదు. ఏ భక్తుడైనా, జ్ఞానియైనా, యోగియైనా, అతడు తన అంతఃకరణ శరీరమును నిర్మాణం చేసుకుని, తదనుగుణంగా ధారణ ధ్యానాది కార్యక్రమములు నిర్వర్తించుకుని, కర్మమును దగ్ధము చేసుకుని మరణమాసన్నమైన సందర్భంలో దైవము నుద్దేశించి భావన చేస్తున్నప్పుడు, అలాంటి వాడికి ఆయనే దగ్గరకు వచ్చి చేరతాడనేది ఒక శాశ్వత సత్యంగా మనం తెలుసుకోవాలి.

*"మా విజయుం చేరెడు వన్నెకాడు మదినావేశించు నెల్లప్పుడున్!"* అందుకని ఈ పద్యం మనం రోజూ రాత్రి నిద్రపోయే ముందు చదువుకోవాలి. ఎందుకంటే ప్రతిరాత్రి నిద్రపోయేటప్పుడు మనం అటే వెళ్తూ ఉంటాం. కాబట్టి ఈ పద్యం చదువుకుని వెళ్తే, కొంత మనకి వలసినటువంటి సర్దుబాట్లు నిద్రలో బాగా జరుగుతాయి. ఇలాంటివి భాగవతంలో ఎన్నున్నాయో! చక్కని నిర్దేశకమైనటువంటి ఆదేశములు. ఉపదేశములు.

*"ఏష ఆదేశః ఏష ఉపదేశః."*

అందుచేత ఇలాంటివి రోజూ రాత్రిపూట చదువుకోండని ఎప్పుడో చెప్పారు చిన్నతనంలో. మరల మాస్టరుగారు ఆ మాట చెప్పారు. అంటే రెండోసారి మళ్ళీ మాస్టరుగారి దగ్గర విన్నాం. చిన్నతనంలో మా అమ్మగారు ఈ పద్యం మా అందరిచేత రాత్రి చదివించి పడుకోపెట్టేవారు. పడుకునేముందు ఆవిడిలా చదువుతుంటే అందరం చెప్పేసేవాళ్ళం. అది అదృష్టం కదా! ఈ పద్యం ప్రత్యేకించి మళ్ళా మాస్టరుగారు రోజూ రాత్రి చదువుకొని పడుకోవోయ్! అన్నారు. అంటే నాకు చాలా ఆనందమేసింది. నేనప్పుడాయనకి చెప్పలా మా అమ్మగారు యిది వరకే చెప్పారని. అట్లా మాట్లాడగూడదు. అప్పుడమ్మ చెప్పింది, ఇప్పుడు గురువు చెప్పాడు అంతే! అమ్మ చెప్పింది కొంత ప్రభావం, గురువు చెప్పింది అపరిమితమైన ప్రభావం కలిగి ఉంటుంది.

ఇలా ఎప్పుడూ మది నావేశించి ఉండాలటండీ, ఎలా ఉంటాడుట అంటే ఆయన, మూడు లోకాలనీ మోహింప

చేసేటువంటి నీలకాంతి. ఇది మూడు లోకాలనీ మోహింప చేస్తుంది. కాబట్టి మూడు లోకాల్లో ఎవరూ కూడా ఈ మోహమునకు లోను కాని వారుండరు. ఆయన జగన్మోహనుడు కదా! ఆయన కాంతే నీలకాంతి. అది తనువు నుండి ఉద్దీపిస్తోందిట. ఉద్దీపనం అంటే, కృష్ణుడు దాచుకున్నా దాగనంతటి కాంతి భీష్ముడికి కనిపిస్తుంది. దాచుకున్నా దాగనంత కాంతి ఆయన్నించి అలా వ్యక్తమౌతోందన్న మాట. ఎందుకనీ? పరిపూర్ణంగా ప్రసన్నుడై ఉన్నాడు భగవంతుడు. ఆయన్ని without limitation, అనుగ్రహించటానికి వచ్చేశాడండీ! పాండవుల్ని వెంటపెట్టుకు వస్తే మిగతా వాళ్ళందరూ కూడా, చాలా పెద్దపెద్ద వాళ్ళందరూ, ఋషులు, నారదాది దేవర్షులు అందరూ వచ్చేశారు. వేదవ్యాసుడు కూడా వచ్చేశాడు.. అంటే వారందరికన్నా ఈయన (కృష్ణుని) యందు మనసు లగ్నమైపోయింది భీష్మునికి. లగ్నమైపోతే ఏం కనిపించింది? నీలమైన కాంతి కనిపిస్తోంది. అదలాగ పుంజాలు పుంజాలుగా దేహంలోంచి, అలా తరంగాలు తరంగాలుగా బయటికొస్తూ ఉన్నది. ఎంత గొప్ప విషయం. దాన్ని దర్శిస్తున్నాట్టండీ. *"ప్రాభాత నీరజబంధుప్రభమైన చేలము."* ఈ పచ్చగా ఉండే చేలముంటుందే, ఉత్తరీయం, పైన వేసుకునేది, *"పయింరంజిల్ల"*, ఆ నీలం మీద, ఈ మంచి బంగారపు కాంతి కూడా మెరుస్తోందిటండీ, అట్లా కనపడ్డదిట ఉత్తరీయం. *"ప్రాభాత నీరజ బంధుప్రభమైన చేలము."* అంటే తెల్లవారుతున్నప్పుడు, అది కదా ప్రభాత సమయం. అప్పుడుండే కాంతి ఎరుపు కొంత, పసుపు కొంత క్రమంగా పసుపైపోతూ, ఆ విధంగా ఉండేటువంటి ఒక

కాంతి. అందుకనే మనం ఎరుపు మెరుగు, పచ్చ మెరుగు పెట్టుకుంటూ ఉంటాం బంగారానికి. అలాంటి కాంతి ఒకటి దానిమీద కనిపిస్తోందిట, ఏది? ఆ నీలమైనటువంటి దేహం మీద. దాన్ని దర్శనం చేశాడాయన.

*"నీలాలక వ్రజసంయుక్త ముఖారవింద మతిసేవ్యంబై విజృంభింప"*

ఆయన వ్రజబాలకుడు కదా! ఆ ముఖం మీద ముంగురులు అలా అలా అలా ఆడుతూ ఉంటాయి. సహజంగా ఆ కిరీటం పెట్టుకుంటే, కొన్ని ఉంగరముల వలె, ఈ జుట్టు చక్కగా అల్లల్లాడుతూ కనిపించిందిటండీ. *"అతిసేవ్యంబై విజృంభింప"*, ఏది? ముఖారవిందము. అంటే, ఎలా ఉందంటే ఆ ముఖం, ఇంక ఇంతకన్నా సేవించటానికి వేరే అందం లేదు. అంతటి అందం. అరవిందమంటే మీకు తెలుసు కదా! అరవిందం అంటే కమలపువ్వు. వికసించిన కమల పువ్వు వలె, చక్కగా మనని ఆకర్షించేటువంటి విధంగా ఆ ముఖ మున్నదిటండీ!

*"మా విజయుం చేరెడు వన్నెకాడు మది నావేశించు నెల్లప్పుడున్"*

ఎప్పుడూ నరుణ్ణి చేరదామనుకుంటూ ఉంటాట్ట నారాయణుడు. ఎందుకంటే, నరుడు, నారాయణుడినే కోరుతుంటాడు. విజయుడంటే నరుడని చెప్పా కదా! ఎందుచేత? నరుడెప్పుడూ నారాయణుడినే కోరుకోవడంచేత, నారాయణుడు

కూడా same to you అంటాడండీ! అదీ! "If you look to me, I look to you" అన్నాడు కదా, అలా! Same to you, నువ్వు ఎప్పుడూ నన్నే కోరుకుంటావు కాబట్టి నేను ఎప్పుడూ నీతోనే ఉంటా! అర్జునుని భక్తి గురించి ఒకసారి ప్రశ్న వచ్చిందిట. ఎందుకిలా ఈ కృష్ణుడు, ఈ అర్జునుడి చుట్టూ తిరుగుతూ ఉంటాడని. అంటే ఒకాయన చెప్పాట్ట, ఆయన నిద్రపోతున్నప్పుడు వెళ్లి, ఉచ్ఛ్వాస నిశ్వాసలు వినమని. ఆ ఉచ్ఛ్వాస నిశ్వాసల్లోంచి, ఆయన స్పందన లోంచి కృష్ణ శబ్దం వినిపిస్తూ ఉంటుందటండీ. దానికి తగ్గట్టుగా ఆయన ముంగురులు కూడా, అట్లా స్పందిస్తూ, నాట్యమాడుతూ ఉంటాయిటండీ, అదీ అర్జునుడు. ఇలా చెప్పారు మరి కథలు. అలాంటి వాళ్ళు వాళ్లంతా! మరి అలా తలచుకునేవాడికి, కొండల్లాంటి ఏనుగుల పరంపరగా ఉండే కర్మ కూడా హరింపబడుతుంది కదా!

**హరియను రెండక్షరములు,**
**హరియించును పాతకముల నంబుజనాభా !**
**హరి నీ నామ స్మరణము,**
**హరి హరి పొగడంగ వశమే, హరి శ్రీకృష్ణా!** అన్నారు.

ఈ పద్యమన్నా చిన్న పిల్లలకి నేర్పించాలి. నేర్పించాలంటే మనం నేర్చుకోవాలి, కదా!

ఇవి మనం కోరి ప్రయత్నించి, శతకాలు తెచ్చుకుని, మనం నేర్చుకుంటూ పిల్లలకి నేర్పాలి. ఎందుకంటే ఇదివరకు పాఠశాలల్లో

నేర్పేవాళ్ళు. ఇప్పుడు నేర్పట్లేదు కాబట్టి. అలాంటి ముఖమండీ అది, ఆ ముఖాన్ని దర్శనం చేస్తున్నాడాయన. *"అతిసేవ్యంబై, విజృంభింప, మా విజయుంచేరెడు వన్నెకాడు మదినావేశించు"* ఈ పద్యం తప్పక మీరంతా నేర్చుకోండి. నేర్చుకుంటే చాలా బావుంటుంది, అందులో ఏం సందేహం లేదు. అందుచేత ఆ పద్యాన్ని ఇన్నిసార్లుగా మీకు చెప్తూ వస్తున్నా. దానికి, మాస్టరుగారు చక్కగా రాసింది కూడా ఒక్కసారి చదివి వినిపించాలి, అది న్యాయం, కదా!

''పచ్చని పట్టుబట్ట ధరించి, నాలుగు చేతులతో దర్శనమిచ్చు విష్ణుమూర్తి రూపము నందు మలపి, మనసు నిలిపి, ఏమియూ కోరనివాడై భీష్ముడు స్తుతించెను. తన ధ్యాన విశేషము చేత, సమస్త దోషములనూ తొలగించుకొనెను. ధారణ కలిగిన బుద్ధిని సమర్పణము చేసెను. పరమానంద స్థితి పొందెను. ప్రకృతిలోన కలుగు భావముల సృష్టియొక్క పరంపరను పరిహరించుటకై స్తుతిని ప్రారంభించెను. మూడు లోకములనూ మోహింపచేయు నీలకాంతిగా నీ తనువు ప్రకాశించుచున్నది. ఈ నీలదేహమును ధరించిన శ్రీ కృష్ణుని భుజముపై ఉత్తరీయము కనిపించినది. అది సూర్యోదయ కాలమున పద్మములకు బంధువై మేలుకొలుపు కాంతి. సూర్యోదయము ప్రజ్ఞను మేల్కొలుపుటకు చిహ్నము. పద్మము హృదయమునకు చిహ్నము. హృదయ ప్రజ్ఞను, దైవప్రజ్ఞ లోనికి మేల్కొన చేయునది, దైవానుగ్రహము. అది ప్రభాతము వంటిది. ఒకరు కోరినచో జరగదు. ఎప్పుడును జరుగక మానదు.

ప్రతినిత్యం సూర్యోదయం జరుగుతుంది. మనకు మెలకువ వచ్చినప్పుడు మన హృదయకమలమునకు ఆ కాంతి అంది, బంగారు కాంతి (హృదయకేంద్రం యొక్క కాంతి బంగారం కాంతిగానే చెప్తారు.) వికసిస్తుంది. ఇది ప్రభాతము యొక్క లక్షణము. దానిని స్ఫురింపచేయు కాంతితో, కృష్ణుని ఉత్తరీయము కనిపించినది. నల్లని ముంగురులతో కూడిన ముఖపద్మము సేవింపదగినదై, విజృంభణము చూపుచున్నది. దైవదర్శనము కృష్ణుని ముఖముగను, దానిని గూర్చిన మానవ భావములు ముంగురులుగనూ తోచుచున్నవి. ఈ శోభతో, మా విజయుని చేరెడు కాంతిమూర్తి, శాశ్వతముగా నా మనస్సున ఆవేశించుగాక! కృష్ణుని దృష్టి వలన అర్జునుడు విజయుడైనాడు. ఇది, జీవునకు దేవునకు నడుమగల నరనారాయణ సంబంధము. ఇది శాశ్వత కథ'' అన్నారు. **ఏ మానవుడు దైవమునకు ఉన్ముఖమై ఉంటాడో, అతడు క్రమంగా విజయుడై, నరుడౌతాడు. నశించని వాడౌతాడు. అలాంటి వాడిని పరమాత్మ ఎప్పుడూ ఆవేశించే ఉంటాడు,** అని చెప్పే రహస్యమున్నటువంటి పద్యమిది.

అటుపైన, యుద్ధభూమి యందు గుఱ్ఱముల గిట్టల వలన ధూళి రేగి. రథము తోలుచున్న కృష్ణుని ముంగురులపై చేరినది. రథవేగము వలన కలిగిన చెమట బిందువులతో, ముఖము సుకుమారముగ కనిపించినది. శస్త్రాస్త్రముల దెబ్బలు తగిలి, కృష్ణుని దేహము నొప్పిపెట్టుచున్నది. అయిననూ లెక్కచేయక, వేడుకతో కృష్ణుడు రథము తోలుచున్నాడు. ఇది ఆయనకి బాగా

లోపల establish అయిపోయింది, యుద్ధం జరుగుతున్నప్పుడు. యుద్ధానికేముంది లెండి ఎలాగైనా చేయగలడాయన, కదా! అందుకే ఆయన కృష్ణుడి ముఖమే చూస్తున్నాడటండీ! అర్జునుడు కదా అటునించి యుద్ధం చేస్తున్నాడు. అర్జునుడితో యుద్ధం చేస్తున్నప్పుడు భీష్ముడు ఎవర్ని చూస్తున్నాడు? కృష్ణుణ్ణి చూస్తున్నాడు. అలా చూస్తూ ఉండడంవల్ల, అది అలా మనసులో బాగా, లోతుగా ముద్రింపబడిపోయింది. అదిక్కడ చెప్తున్నాడు. చాలా దుమ్ముపట్టి పోయింది నీ ముఖమంతా, కదా! గుఱ్ఱముల గిట్టల వలన ధూళిరేగినది. రథము తోలుచున్న కృష్ణుని ముంగురులపై చేరినది. ముందాయనే కదా కూర్చుంటాడు! రథంలో ముందు కూర్చున్నవాడికి ఇట్లా మన లాగా wind shield ఏమన్నా ఉంటుందా? ఏముండదుగా! అంతా దుమ్మే! అన్ని రథాలు, గుఱ్ఱాలు, ఏనుగులు, మనుషులు పరిగెడుతూ ఉంటారు కదా! ఆ దుమ్మంతా రథసారథికి చేరుతూ ఉంటుంది. అందుచేత ఆ దుమ్ము ముంగురులపై చేరినది. రథ వేగమువలన కదిలిన చెమట బిందువులతో కృష్ణుడి ముఖము సుకుమారముగా కనిపించిందిటండీ! అంటే ఇంత సుకుమారుడే, ఇలా యుద్ధం చేస్తున్నాడు, అర్జునుడి కోసం కదా! ఎంత ప్రేమమూర్తి? అనేటటువంటి భావన భీష్ముడిలో కలిగింది, అదీ గొప్పవిషయం.

ఇట్లా భీష్ముడు యుద్ధం చేశాడని చెప్పుకుంటాం కానీ, భీష్ముడు కృష్ణుణ్ణి చూస్తూ యుద్ధం చేశాడని మనకి చెప్పరు కదా ఎవరూ? అదెలా తెలుస్తుంది? ఆయన చెప్పడం బట్టి

తెలిసింది. నిన్ను తొమ్మిది రోజులు ఇలా దర్శనం చేసుకున్నాను నేను. తొమ్మిదిరోజులపాటు, యుద్ధం చేస్తున్నప్పుడల్లా భీష్ముడి కొకటే పని, అలా కృష్ణుణ్ణి చూస్తూ ఉండడమే, ఆ ముఖాన్ని చూస్తూ ఉండడమే, ఆ ముంగురులని చూస్తూ ఉండడమే, సుకుమారమైనటువంటి ఆ శరీరాన్ని చూస్తూ ఉండడమే, ఆయనకది ధ్యానం. ఆయన (అర్జునుడు) బాణాలు వదిలితే ఈయన (భీష్ముడు) బాణాలు వదులుతాడు, అది పెద్ద విషయం కాదు. ఎందుకంటే భీష్ముడి ముందు అందరూ చాలా చిన్నవాళ్లు. అందుచేత చెమట బిందువులతో ముఖము సుకుమారముగ కనిపించినది. శస్త్రాస్త్రముల దెబ్బలు తగిలి.... వేశాడుగా మరి, వేస్తే కొన్ని ఎప్పుడూ రథసారథికే గుచ్చుకుంటాయి కదా. అక్కడ వెనకాల కూర్చుని యుద్ధం చేస్తున్న యోధుడికి తగలకుండా ముందీయనకి కొన్ని గుచ్చుకుంటాయి. అలాంటి దెబ్బలు తగిలి కృష్ణుని దేహము నొప్పి పెట్టుచున్నది. అయిననూ లెక్కచేయక, వేడుకతో కృష్ణుడు రథము తోలుచున్నాడు.

**"హయరింఖాముఖధూళి ధూసర పరిన్యస్తాలకోపేతమై**
**రయజాతశ్రమతోయబిందుయుతమై రాజిల్లు నెమ్మోముతో**
**జయముం బార్థున కిచ్చువేడ్క నని నా శస్త్రాహతింజాల నొ**
**చ్చియుఁ బోరించు మహానుభావుమదిలోఁ జింతింతు నశ్రాంతమున్."**

ఇదంతయూ వానిచే యుద్ధము చేయించి, జయము వానికి కట్టబెట్టుటకు! అంతేకదా ఎందుకు చేయాలిదంతా, ఈ చాకిరీ? వాడికి జయం కలగాలి. తనవాడు కాబట్టి! తనకి జయం

అనుకోడెప్పుడూ, కదా! తన్ను నమ్ముకున్నాడు వాడు, వాడికి జయం కలగాలి. నువ్వు రథంలో కూర్చో అని అడిగాడు కదా! నువ్వు కూర్చో చాలు, నే యుద్ధం చేస్తా అన్నాడు కదా! ఏం చేస్తాడు? ఏం చేయలేడు. అయినప్పటికీ కృష్ణుడికి అర్జునుడి మీద వాత్సల్యం చేత అలాగే కూర్చుంటాడు. మరి కూర్చున్నందుకు గెలిపించాలి కదా! అది భీష్ముడికి తెలుసు. కేవలము అర్జునుడికి ఈ విజయాన్ని కట్టబెట్టాలని ఇలా తయారైపోయాడండీ, ముందుగా కూర్చుని దెబ్బలు తింటూ, ఆ దుమ్మంతా మొహానికి పడుతూ ఉంటే, రథాన్ని వేగంగా, ఉత్సాహంగా నడుపుతూ ఉంటే ఈ భీష్ముడికి లోపల ఎలా ఉంటుందండీ కృష్ణుణ్ణి చూస్తూ ఉంటే? ఎందుకంటే కృష్ణుడంటే ఏమిటో తనకి తెలుసు. అర్జునుడికన్నా ఎక్కువ తెలుసు. ధర్మరాజు కన్నా ఎక్కువ తెలుసు. అందరికన్నా ఎక్కువ తెలుసు. అంతటి వాడు ఎదురుగుండా నిలబడితే మనం ఏం యుద్ధం చేస్తాం? చూస్తున్నాట్ట వేడుకతో ఆ విధంగా యుద్ధం చేయడం. ఇదంతా ఎందుకు చేస్తున్నాట్ట అంటే అర్జునుడికి విజయం కట్టబెట్టాలని. అట్టి మహానుభావుని దర్శనమును మనస్సున ఎప్పుడునూ నిలుపుదును అన్నాడండీ! భక్తుడికోసం భగవంతుడు పడే తాపత్రయం భీష్ముడు అక్కడ చక్కగా కనులారా చూచాడండీ! ఎంత సుకుమారుడో శ్రీకృష్ణుడు! అలాంటివాడు తనని నమ్ముకున్న వాడికోసం ఇలా తిప్పలు పడుతున్నట్టుగా చూసి, ఆ రూపాన్ని లోపల బాగా నిలుపుకున్నాడు. ఆ మాటే అన్నాడు. ఎప్పుడును నిలుపుదును–

*''చింతితు నశ్రాంతమున్.''*

అర్జునుని మాటలు విని, నవ్వుతో రెండు సేనల నడుమ కూడి, కృష్ణుడు రథము నిలిపెను. శత్రురాజులను చూపించుచున్నట్లు నటించుచూ, ఇదిగో వీడు వీడూ, వీడు వీడూ అని అందరినీ చూపిస్తాడు కదా! అట్లా అందరికీ అర్జునుడికి చూపిస్తున్నట్లుగా నటిస్తూ, చూపులతోనే వారి ఆయువులను మోసగించెను. ఎంత గొప్ప విషయం!

**"నరుమాటల్ విని నవ్వుతో, ఉభయసేనా మధ్యమక్షోణిలో**
**బరు లీక్షింప రథంబు నిల్పి, పరభూపాలావళిం జూపుచుం**
**బరభూపాయువు లెల్లన్ జూపులన శుంభత్కేలి వంచించు నీ**
**పరమేశుండు వెలుంగుచుండెడును హృత్పద్మాసనాసీనుడై**"– అన్నాడు.

అంటే ఈయన చేసింది యుద్ధమా, ధ్యానమా అండీ? తొమ్మిది రోజులపాటు నవరాత్రులు చేస్తుంటాం కదా! అట్లా మనకి తొమ్మిది రోజుల పాటు భీష్మునికి చక్కగా రోజూ కృష్ణ దర్శనమండీ! ప్రతి రోజూ కృష్ణ దర్శనం! ఆయన కృష్ణుణ్ణి చూడడానికే యుద్ధంలో ఉన్నట్టుగా ఉంది. తన మనోగతమైన విషయం ఇప్పుడు చెప్తున్నాడు కదా! ఎలా చెప్తున్నాడు? అర్జునుని మాటలు విని, చెప్పాడు కదా! అర్జునుడు అడుగుతాడు ఎవరెవరు ఎక్కడో చూపించమంటాడు. నవ్వుతాడు కృష్ణుడు. ఏం చూస్తాడు వీడు? చూసి కింద పడిపోతాడు కదా! అదుగో ఆయనే భీష్ముడు, ఆయనే ద్రోణుడు, ఆయనే కృపాచార్యుడు, ఇలా చెప్పుకుంటూ వస్తాడు కదా ఒక్కొక్కళ్ళని! అలా చూపులతోనే అందరినీ మోసగించేశాట్ట. ఈయనకి చూపిస్తూ చూశాట్ట వాళ్ళపక్క.

అలా నవ్వుతూ చూసేసరికి వాళ్ళ పక్కకి, వాళ్ళ ఆయువులన్నీ ఈయనలో వచ్చి చేరిపోయినాయి. అందుచేత, చూపించుచున్నట్లు నటించుచూ, చూపులతోనే వారి ఆయువులను మోసగించెను. అట్టి దేవుడు నా హృదయ పద్మమున ఆసీనుడగుగాక! అందుకని మనం కూడా, అట్లాంటి కృష్ణుడు మన హృదయమందు ఆసీనుడవ్వాలని ఆ పద్యం చదువుకోవాలి.

*"తనవారిన్ జంపజాలక"* వెనుకకు పోవుదునని నిర్ణయించుకొనిన విజయుని సందేహములను యోగవిద్యతో పోగొట్టిన కృష్ణుని పాదములు మునులు నమస్కరింపదగినవి, అన్నాడు భీష్ముడు. తనవారిని చంపలేక వెనుకకు పోవుదునని నిర్ణయించుకొనిన విజయుని సందేహములను, యోగవిద్యతో పోగొట్టిన కృష్ణుడి పాదములున్నాయే....! ఆయన యోగేశ్వరుడు! అంటే యోగులకి ఈశ్వరులుంటారట, వాళ్ళు యోగీశ్వరులుట. యోగీశ్వరులకి కూడా ఈశ్వరుడు యోగేశ్వరుడౌతాడని వివరించారు. యోగేశ్వరు డొకడే! యోగీశ్వరులు కొంతమంది ఉంటారు. యోగులు చాలామంది ఉంటారు. అంటే యోగులు, యోగీశ్వరులు, యోగేశ్వరుడు. అందుచేత, ఈయన యోగేశ్వరుడు! ఒక ముహూర్తకాలంలో అర్జునుడికి యోగవిద్య నెక్కించేశాడు. అంతకన్నా సమయం లేదప్పుడు కదా!

**"తనవారిన్ జంపజాలక,**
**వెనుకకు బోనిచ్ఛగించు విజయునిశంకన్**
**ఘన యోగవిద్య బాపిన**
**మునివంద్యునిపాదభక్తి మొనయున్ నాకున్**" అన్నాడు.

మునివంద్యుడంటే మునులచే నమస్కరింపదగినవాడు. అంటే మునులకి ఆ పాదములే గతి. అలాంటి మునివంద్యుడు, అలా అర్జునుడికి యోగవిద్య నేర్పుతుంటే చూస్తూ ఉన్నాడు భీష్ముడు. వెనక్కి పారిపోదామనుకునే అర్జునుని నిలబెట్టి, అతనికి యోగవిద్య నేర్పి, నిలబెట్టాడు కదా! పారిపోతే అప్రతిష్ఠేగా అర్జునుడికి? అలా నిలబెట్టినటువంటి ఈ పాదములు, తప్పక నమస్కరింపదగినవి. కృష్ణుని పాదములు మునులే తప్పక నమస్కరించవలసినవి, కాబట్టి నేను ఎప్పుడూ వాటికి నమస్కారం చేసుకుంటూ ఉంటానని భీష్ముడు పలికాడు.

తొమ్మిదో రోజు. పద్యం బావుంటుంది. ముందు మీకు చెప్పి తరువాత పద్యం చదువుతాను. నన్ను చంపుదునని, రథముపై నుండి లంఘించి, నాపై కురుకుచున్న కృష్ణుడు, ఏనుగు పైకి సింహము లంఘించుచున్నట్లు తోచెను. దుముకుటలో తన గర్భమునున్న లోకములు భారము భరింపలేనట్లు నేల అదరెను. ఆయనక్కడ రథంలోంచి ఒక్కసారి సింహంలాగా, ఒక్క దుముకు దుమికాడండీ! ఎవరికోసం? ఇటుపక్క ఏనుగల్లే భీష్ముడున్నాడు. ఆ ఏనుగు మీదకి లంఘించే సింహం సరాసరి కుంభస్థలం చేరితేగాని– ఇంక మరొకరకంగా కుదరదు. చాలాసార్లు వెనక నుండి ఎగిరి కొడుతూ ఉంటుంది. ముందు నుండి రాదు. అంటే ముందు నుండి అలా దూకాట్టండీ! దూకితే ఈయనకేం అనిపించిందిట? అమ్మో! ఈయన కడుపులో ఉండేటువంటి లోకాలన్నీ కదుల్తున్నాయి, కాబట్టి ఈ భూమి దద్దరిల్లినట్టుగా అనిపించిందిట ఆయన అలా దూకి కిందకి వస్తే!

చక్రము చేపట్టి వేగముగ వచ్చుటలో పచ్చని ఉత్తరీయము జారెను. అర్జునుడు వెంటబడి, "నిన్ను నమ్ముకుంటిని, నన్ను నలుగురిలో నవ్వులపాలు చేయకు. మన్నింపు" మని వెనుకకు లాగుచుండెను. అర్జునుని విదిలించుకొనుచూ కృష్ణుడు.... ఆయనేమో, బావా! ఆ విధంగా నువ్వు కొట్టేస్తే నా పనేమైపోతుంది, ఏదో చివరికి నేను చంపినట్లుగా ఉండాలి కదా! ఎవర్నీ నిజంగా వీళ్ళు కొట్టిందేం లేదు. భీష్మణ్ణీ లేదు, ద్రోణుణ్ణీ లేదు. కర్ణుణ్ణి ఒక్కడూ చంపాడా, ఎంతోమంది కలిసి చంపారు. అందరూ రకరకాలుగా, వాళ్లుగా వాళ్లు చేసుకున్న దుష్కృత్యముల వలన నశించారు కదా! కానీ ఏమన్నారు చివరికి? అర్జునుడికే కీర్తొచ్చింది. అది కృష్ణుడి మహిమ, కదా! భీముడు చాలామందిని మొత్తేశాడు. ఎంతోమంది, దృష్టద్యుమ్నుడు ఉన్నాడు, నకుల సహదేవులున్నారు. కీర్తి అర్జునుడికి వచ్చింది. అందుకని, ''నిన్ను నమ్ముకొంటిని, నన్ను నలుగురిలో నవ్వులపాలు చేయకు''మని వెనుకకు అర్జునుడు లాగుచుండెను. అర్జునుని విదిలించుకొనుచూ కృష్ణుడు, ''నేడు భీష్ముని చంపి, నిన్ను రక్షింతును, విడువుము అర్జునా!'' అని నా మీదకు వచ్చుచుండెను. ఆయనకీ scene అట్లా ఉండిపోయిందండీ! ఆయనకంతా అది చాలా ఆనందంగా కనిపించింది. ఆ దేవుని దృశ్యము, ఈనాడు నాకు దిక్కు, అన్నాడు. అప్పుడలా ఎగిరొచ్చాడే, అలా నిలబడ్డాడే, ఆ దృశ్యముందే, అదే ఈనాడు నాకు దిక్కని చెప్పాడు.

**"కుప్పించి యెగసిన కుండలంబులకాంతి**
**గగనభాగంబెల్ల గప్పికొనఁగ,"**

*'కుప్పించి ఎగసిన కుండలంబుల కాంతి',* ఆయన కాంతి, కుండలముల కాంతి, మొత్తం ఆకాశమంతా నిండిపోయింది. అంటే ఇది కుండలాలదా ఆ కాంతి? ఆయన కాంతే! కొంతమంది ఆభరణాలు పెట్టుకుంటే ఆభరణాలకే వన్నె వస్తుంది. కొంతమంది ఆభరణాలు పెట్టుకుంటే వాళ్లకి వన్నె వస్తుంది. అందుచేత మనకి చెప్తారు ద్రౌపదిదేవి, సీతాదేవి ఇలాంటివాళ్ళు ఆభరణాలు ధరిస్తే, ఆభరణాలకే వన్నె వస్తుందిట. వాళ్ళ కాంతి అంతకన్నా మించి ఉంటుంది. వాటిద్వారా ఇంకా ప్రకాశిస్తూ ఉంటుంది. అద్దం పెట్టినట్టు.

**"కుప్పించి యెగసిన కుండలంబుల కాంతి**
**గగనభాగంబెల్ల కప్పికొనగ,**
**నురికిన నోర్వక యుదరంబులో నున్న**
**జగముల వ్రేగున జగతి గదల,**
**జక్రంబు జేపట్టి చనుదెంచు రయమున**
**బైనున్న పచ్చని పటము జార,"**

అలా వస్తున్నాడాయన, అలా ఎగిరాట్ట, మొత్తమంతా కాంతిమంతమై పోయిందిట. అలా దూకేసరికి బొజ్జ కొంచెం కదుల్తుంది కదా, చిరుబొజ్జ! కదిల్తే లోపల లోకాలన్నీ కదిలిపోతున్నాయేమో అనిపించినట్టుగా అనిపించింది భీష్ముడికి. అందరికీ అట్లా అనిపించదు. చూచేవాళ్ల దృష్టి బట్టి కనిపించేదుంటుంది. భూమి కూడా కంపిస్తున్నట్లనిపించిందిట, ఆయన దూకేసరికి. *"చక్రంబు చేపట్టి, చనుదెంచు రయమున"*–

అలా చక్రాన్ని ఆవాహనం చేసేశాడు. చేసి అలా వడిగా ముందుకు నడుస్తూ ఉంటే, పైనుండే పచ్చని ఉత్తరీయము భుజం నుండి జారిపోయిందండీ! జారిపోయి ముందుకొచ్చేస్తున్నాడు, వస్తుంటే వెనుక నుండి అర్జునుడు పట్టేసుకున్నాడు. అర్జునుడేమన్నాడు? *"నమ్మితినాలావు"*. నీ లావేమిటి? అంటే, లావంటే బలమని అర్థం. అంతకుముందే కదండీ యోగవిద్య నేర్పాడు. ఇంతలోనే మాయ, కదా! ఇంతలోనే మాయ. *"నిమిత్తమాత్రం తవ సవ్యసాచి"* అంటాడు ఒకచోట భగవద్గీతలో. అంటే నువ్వు రెండుచేతులతో బాణాలు వేయగలిగినవాడివైనా నువ్వు నిమిత్తమాత్రుడివే సుమా, నిర్వర్తించేది నేనే! అని చెప్తాడు. మళ్ళీ ఇప్పుడొచ్చి ఈ మాటంటాడండీ. తొమ్మిదిరోజులు యుద్ధమయ్యేసరికి మర్చిపోయాడంతా! మనం మర్చిపోమా? ఇవాళ ఈ భీష్ముడిని ఈ ప్రాంగణంలో వదిలేసి వెళ్ళిపోతాం. మనముండం కాబట్టి ఆయన కూడా వెళ్ళిపోతాడు. మళ్ళీ మామూలుగా ఉంటుంది hall, అంతేకదా జరుగుతుంది. అందుచేత,

**"నమ్మితి నాలావు నగుబాటు సేయక**
**మన్నింపుమని క్రీడి, మరల దిగువ,"**

వెనక్కి లాగుతున్నాట్టాయన.

**"గరికి లంఘించు సింహంబుకరణి మెఱసి**
**నేడు భీష్ముని జంపుదు నిన్నుగాతు**
**విడువు మర్జున యనుచు, మద్విశిఖవృష్టి**
**దెరలి చనుదెంచు దేవుండు దిక్కునాకు."**

ఆ విధంగా వస్తున్నటువంటి ఈ చిత్రాలన్నీ ఆయనలో మిగిలిపోయినాయి. అవే ధ్యానం చేస్తున్నాడు, వీళ్ళు యుద్ధాలు చేసుకున్నారు, తరువాత పట్టాభిషేకాలు చేసుకున్నారు. ఈయన మాత్రం ఈ ధ్యాసలో ఉన్నాడు, కృష్ణుని ధ్యాసలో.

అందుచేత అప్పుడు కృష్ణుడేమన్నాడు? అర్జునుడు తనకు దాసుడు. వానిని రక్షించుట మహాధర్మమని నిర్ణయించి, కృష్ణుడు రథసారథ్యమున కంగీకరించి, పగ్గములు పూని నేర్పరియై నడుపుచూ, గుఱ్ఱములను ఉత్సాహము కలుగునట్లు మాత్రమే అదిలించుచూ, చూచువారిని మోహింపచేసెను. అట్టి దేవుని స్తుతించెను, అన్నాడు.

**"తనకున్ భృత్యుడు వీనిగాచుట మహాధర్మంబు వొమ్మంచు న**
**ర్జున సారథ్యము పూని, పగ్గములు చే జోద్యంబుగా బట్టుచున్**
**మునికోలన్ వడిబూన్చిఘోటకములన్ మోదించి తాడించుచున్**
**జనులన్ మోహము నొందచేయు పరమోత్సాహుం బ్రశంసించెదన్."**

అంటే ఏమిటి? అర్జునుడు అడిగాడు కదా! అపుడు శ్రీకృష్ణుడు వెనక్కొచ్చేశాడు మళ్ళీ. ఎక్కేసి, మళ్ళీ రథంలో కూర్చున్నాడండీ! కూర్చుని మళ్ళా సుకుమారంగా గుఱ్ఱాలని అదిలించాట్టండీ! వాటిని సున్నితంగా, వాటికి ఉత్సాహం కలిగించటానికి అదిలించటం తప్ప వాటిని కొట్టకూడదు. చాలా ఉత్సాహంగా *"తనకున్ భృత్యుడు వీనికాచుట మహాధర్మంబు వొమ్మంచు, అర్జున సారథ్యము పూని పగ్గములు చేజోద్యంబుగా*

*పట్టుచున్"*– అంటే ఆయన పగ్గాలు పట్టినా చూట్టానికి చాలా బావుంది, కదా! మళ్ళీ ఎక్కాట్ట, మళ్ళీ కూర్చున్నాట్ట, పగ్గాలు పుచ్చుకున్నాట్ట. *"మునికోలన్ వడిబూన్చి, ఘోటకములన్ మోదించి,"* మోదించడం అంటే మొత్తడం కాదు. మోదము కలిగించేట్టుగా అదిలించడం చేశాట్ట. ఇవన్నీ చూశాడు భీష్ముడు. *"మోదించి తాడించుచున్ జనులన్ మోహము నొందచేయు"*– మళ్ళీ అందరికీ మోహం కలిగేట్టుగా రథం నడపటం, అంతలో ఒక scene సృష్టించేసి, మళ్ళీ వీడు పిలిస్తే వెనక్కొచ్చేశాడండీ! వచ్చేసి, సరే కానీలే అన్నాడు. మళ్ళీ మామూలుగా అయిపోయాడు. అంటే ఒక్క క్షణంలో అట్నించిటు ఇంతలా మారిపోవడం ఆయనకే సాధ్యం, కదా! ఆ విధంగా, దీనికే చెప్పాను ఉదయం. నిన్న కూడా చెప్పా, కృష్ణుడు చక్రం పట్టుకోవాలని భీష్మడి సంకల్పం. అయిపోయింది, చక్రం పట్టుకున్నాడు. ఆయన దణ్ణంపెట్టేశాడు, నా మాట మన్నించాడు భగవంతుడని! ఆయనకీ ఆయన మాటా నెగ్గించాడు, అర్జునుడి మాటా నెగ్గించాడు. ఎవడు చేయగలడండీ ఇలాంటి పనులు? రెండు విరుద్ధమైనటువంటి సంకల్పాలను ఒకే సమయంలో సిద్ధింపచేశాడంతే! ఆయన కోరిందీ చేశాడు, ఈయన కోరిందీ చేశాడు. వచ్చాడు, రథంలో కూర్చున్నాడు. ఏమీకానట్టుగా మళ్ళీ నవ్వుమొహంతో అలా రథం తోలుతూ ఉన్నాట్టండీ!

**"పలుకుల నగవుల నడపుల**
**నలుకల, నవలోకనముల నాభీరవధూ**

**కులముల, మనములతాలిమి**
**కొలుకులు వదిలించు ఘనునిన్ గొలిచెద మదిలోన్.''**

అన్నాడు. అంటే, ఒక్క నిమిషం అలా నవ్వుతూ వదిలించేయగలడు మనకుండే బంధాలన్నీ. పలుకులతో వదిలించేయగలడు. కృష్ణుడు మాట్లాడటమంటే సామాన్యం కాదు కదా! అది గమనించాడు భీష్ముడు. ఎలా వదిలించేస్తాడో ఈయన! ఎంత చూశాడండీ భీష్ముడు? ఎవరు చూశారండీ? ఇలా ఇంకోచోట ఉందా కృష్ణుడి గురించి వర్ణన? ఈ భీష్ముని యొక్క కృష్ణ దర్శనం. ఇది చాలా లోతైన దర్శనం. అందుచేతే ఆయన చేత చెప్పిస్తానంటాడు కృష్ణుడు, కదా! అంటే తనగురించి చెప్తాడని కాదు. ఆయన దగ్గర వీళ్లంతా నేర్చుకోవాలి, ఆయనెంతటివాడో తెలియాలి. *''పలుకుల, నగవుల,''* నవ్వులతో, నడవడితో, చూపులతో, కోప నటనతో, గోపికల మనస్సులలోని అభిమానములను సడలించిన ఈ మహానుభావుని కన్న స్తుతింపదగిన వారెవ్వరు? అన్నాడు. **కృష్ణుడేం చేసినా మన బంధమోచనమునకే చేస్తాడండీ! అన్నీ వదిలించేస్తాడు.** ఎలా వదిలించేస్తాడంటే ఇంక ఏం లేకుండా ఆయనే మిగిలేట్టు వదిలించేస్తాడు. అలా వదిలించేశాడు గోపిక లందరికీ. అలా వదిలించేశాడు మీరాబాయికి. నువ్వెన్నన్నా నాకు ఊడగొట్టు, నీతో సంబంధం ఊడగొట్టక, అని పాడుతుంది మీరాబాయి. ఎందుకంటే ఆయన తల్చుకుంటే ఏముంది, ఎవరినన్నా పక్కన పడేయగలడు, కదా! అందుచేత, నేను ఎవరిని అనుగ్రహించదలుచుకున్నానో, వారి సకల విత్తము నే నపహరింతు అన్నాడు శ్రీ కృష్ణుడు గోపికలతో. అదే ఇక్కడ చెప్పాడు మళ్ళీ.

గోపికా వస్త్రాపహరణం గురించి భాగవతం దశమ స్కంధంలో చదువుకున్నాం. అద్భుతమైనటువంటి భక్తికి పరాకాష్ఠ. ఆవరణలన్నీ తీసేస్తాడు. **ఆవరణలన్నీ తీసేస్తే మిగిలేది కృష్ణుడే.** ఎనిమిది ఆవరణలుపోతే, శుద్ధ చైతన్యముగా అప్పుడు మనకి దర్శనాన్ని ఇస్తాడు. అందుకని నేను అనే భావన కూడా పోవాలి. పోతేగాని, ఆయన దర్శనం జరగదు. మనని బాగా అణుమాత్రం, దర్శనం చెయ్యడం కోసం ఉండేట్లుగా ఉంచి, మిగతా అంతా కృష్ణుడైపోవాలి. నేనే లేనప్పుడు, నాదేముంది, నావారేముంది? అంతా కృష్ణమయమే! ఆవిధంగా అన్నీ వదిలించేసి గోపికలకు మాటలతో, నవ్వులతో, నడవడికతో, ఏదో హాస్యం చేస్తూ అనేక విధములుగా చేశాడు. వదిలించేశాడు. అలాంటి మహానుభావుడు ఈయన, అందుచేత అలాంటి వాడికి నేను మొక్కుతున్నాను అని చెప్పి తెలియపరిచాడు. అటుపైన–

**"మునులు నృపులు జూడ మును ధర్మజుని సభా**
**మందిరమున యాగమండపమున**
**జిత్రమహిమతోడన్ జెలువొందు జగదాది**
**దేవున్ డమరు నాదు దృష్టియందు."**

కృష్ణుడికి అగ్రపూజ చేయమన్నది భీష్ముడని నిన్న చెప్పాను కదా! ఎందుకంటే అప్పుడు సమకాలికంగా అందరికన్నా ఉత్తమోత్తమమైన ప్రజ్ఞతో వున్నవాడు, లోకము నందున్నవాడు! వ్యాసాదులు ఈ లోక వ్యవహారాలకు దూరంగా వుంటారు. మైత్రేయాదులూ అంతే! ఈ లోక వ్యవహారాల్లో వుంటున్నవారిలో

ఇంతకన్నా గొప్పవారు ఇంకెవ్వరూ లేరు, కదా! అందరూ కలిసి సమ్మతించి, ఆయనకి అగ్రపూజ అంటే, ఆయన నేను కాదు అగ్రపూజకి అర్హుడిని, శ్రీకృష్ణుడని చెప్తాడు. ఎవరికీ అంత నచ్చుబాటు కాదు, పాండవులకి తప్ప. ఈ కృష్ణుడు చూస్తే మిగితావాళ్ళకేమీ అర్థంకాదు. అలా అర్థంకాకుండ వాళ్ళని ఎప్పుడూ ఏడిపిస్తూ వుంటాడు కృష్ణుడు. అదో సరదా! అర్థమైపోతే కథేముంది? వాళ్ళకి అలా అర్థమయ్యీ అర్థం కాకుండా, అప్పుడప్పుడు వాళ్ళకి మనమీద ప్రకోపం కలిగేటట్టుగా కూడా వుంటాడు. కేవలం కృష్ణుడిని చూస్తేనే శిశుపాలుడికి వచ్చేస్తుంది లోపలినుంచి reaction విపరీతంగా. భయంకరమైన Nux Vomica patient అయిపోతాడు వాడు. వికారమైన మాటలు, చేష్టలు వచ్చేస్తాయి శిశుపాలుడికి. అలా వుంటాడాయన కదా!

*"జగదాది దేవుడు"*, ఈ జగత్తుకి ఆది అయినటువంటి దేవుడు, *"అమరు నా దృష్టియందు"* అన్నాడండి. అప్పుడు భీష్ముడు కృష్ణుడిని చూసిన విధానమది. మిగతావాళ్ళు అలా చూడలేదు. ఆయనకి తెలుసు. అదే-ఇది అని. అందుకని అలా కూర్చుని ఆయనకి పూజలు చేస్తూవుంటే, ఆయనలో ఆ కాంతి పెరుగుతూ వస్తుందండి. ఆయన తలచుకుంటే ఎంతసేపు? వీళ్ల పూజలో వుండే భక్తిని బట్టి ఆ కాంతి పెరుగుతూ వుంటుంది. దాన్ని అలా దర్శనం చేస్తూ వున్నాడు భీష్ముడు. భీష్మునియొక్క కృష్ణ దర్శనం, మనం వివరించుకోకపోతే మనకి తెలీదు. భీష్ముడు కృష్ణ భక్తుల్లో అగ్రగణ్యుడుగా తెలుస్తుంది. తనే కూర్చోపెడతాడు ఆయనని. ఆయన కూర్చుంటాడు. కూర్చుంటే చిత్రమైన మహిమతో

వెలుగొందాడటండీ! అంటే ఈ చిత్రమైన మహిమ అంటే ఏమిటంటే, ఒక్కొక్కసారి ఒక్కొక్క మహిమ కనిపిస్తూ వుంటుంది. ఒకసారి దర్శనం ఇచ్చినట్లుగా ఇంకోసారి దర్శనం ఇవ్వడు. *"మహిమ తోడ వెలుగొందు జగదాది దేవుడు అమరు నాదు దృష్టియందు"* – నా దృష్టియందు ఆయన ఆవిధంగా నిలబడిపోవాలి అని కోరుతున్నాడండి. ఎదురుగుండా వున్నాడాయన, వున్నప్పటికీ తనలో అప్పుడప్పుడు కృష్ణుడు వేసినటువంటి ముద్ర వుందే.... అత్యంత రసానుభూతి కలిగించిన ఘటనలవన్నీ ఆయనకి. అవన్నీ ఏకరువు పెడ్తున్నాడు.

**"ఒక సూర్యుండు సమస్తజీవులకున్ దానొక్కొక్క డై తోచు పో**
**లిక నేదేవుడు సర్వకాలము మహాలీలన్ నిజోత్పన్నజ**
**న్యకదంబంబుల హృత్సరోరుహములన్ నానావిధానూన రూ**
**పకు డై యొప్పుచునుండు నట్టి హరి నే బ్రార్థింతు శుద్ధుండనై."**

ఈ పద్యంతో భీష్మస్తుతి అవుతుంది. ఎన్ని పద్యాలూ? తొమ్మిది పద్యాలండి. ఆ మాత్రం కంఠస్థం చెయ్యలేరా? *"త్రిజగన్మోహననీలకాంతి"* నుంచి *"ఒక సూర్యుండు సమస్త జీవులకు దానొక్కొక్కడై తోచు భంగిన్"* వరకు. సూర్యుడు మీ వీథిలో నుంచి చూస్తే మీకు కనిపిస్తాడు. ఆయన వీథిలో నుంచి చూస్తే ఆయనకి కనిపిస్తాడు. మా ఊళ్ళో నుంచి చూస్తే మాకు కనిపిస్తాడు. అందరికీ కనిపిస్తాడు, అన్ని సూర్యులున్నారా? లేరు కదా! మన కిటికీలో నుంచి కనిపిస్తాడు, పక్క ఆయన కిటికీలో నుంచి కనిపిస్తాడు. అంతేగా. ఒకడే సూర్యుడు. ఒక్కొక్కళ్ళకీ

ఒక్కొక్క రకంగా కనిపిస్తున్నాడు. అందుచేత ఒక సూర్యుడు సమస్త జీవులకూ తానొక్కొక్కడై తోచును. అట్లే భగవంతుడు, తన నుండి పుట్టుచున్న జీవుల హృదయములందు నానావిధములైన రూపములతో భాసించుచుండును. అదేగా చెప్తాడు భగవద్గీతలో కూడా. *''ఈశ్వర స్సర్వభూతానాం హృద్దేశే అర్జున తిష్ఠతి''* అని సర్వభూతముల హృదయముల యందు నేనే వున్నానని చెప్తాడు. అలా చెప్పినా గుర్తుండదు మనిషికి. మనిషి పరిస్థితి ఏమిటంటే, ఎలా చెప్పినా గుర్తువుండదు. నేనే వున్నానురా అందరి రూపాల్లో. *"ఈశాన సర్వవిద్యానాం ఈశ్వర సర్వభూతానాం"* అంటాం కదా! అన్నివిద్యలూ ఈశ్వరుడివే! ఈశ్వరుడి నుంచే వచ్చాయి. అందరు జీవులు, భూతాలన్నీ ఈశ్వరుడి నుంచే వచ్చాయి. *''ఈశావాస్యమిదంజగత్''*, అంటుంది ఉపనిషత్తు. ఈ సృష్టంతా కూడా ఈశ్వరుడు వసించి యుండేటటువంటి స్థానం అంతే. అలా భావించు.

అందుచేత అందరి హృదయాల్లో ఒక్కొక్కడుగా ఎలా కనిపిస్తాడో, జీవుల హృదయములలో నానావిధములైన రూపములతో భాసించుచుండును. అట్టి దేవుని నేను పరిశుద్ధ భావముతో స్మరించెదను. అందుచేత, ఈ విధంగా భగవంతుడి యొక్క అఖండత్వాన్ని స్మరిస్తాడు. ఎదురుగుండా వున్నటువంటి కృష్ణుడు కేవలం ఎదురుగుండా వున్నవాడు మాత్రమే కాదు. ఆయన అఖండత్వాన్ని ఒక్కసారి గుర్తుచేస్తాడు, ఇక్కడ ఇట్లా కనిపిస్తున్నాడు. నా హృదయంలో వున్నాడు. ఈ చుట్టుపక్కలవాళ్ళ హృదయంలో వున్నాడు. అంతేకాదు సమస్త లోకములయందూ,

అందరి హృదయమునందు, ఆ విధంగా వ్యాప్తి చెంది యున్నట్టుగా పలికాడండి. పలికి భీష్ముడు మనస్సున, వాక్కున, చూపున, హృదయమున, కృష్ణుని నిలిపి, అంతర్యామిగా స్మరించెను. అంటే రూపము ఆధారంగా రూపాతీతమైన తత్త్వములోకి ప్రవేశించాడు భీష్ముడు.

భక్తియోగంలో ఆ మాటే చెప్తాడు శ్రీకృష్ణుడు *"అవ్యక్తాహి గతిర్దుఃఖం"* అని ఒక శ్లోకం వుంటుంది. నిన్ను రూపంతో ఆరాధన చేయాలా? అరూపిగా ఆరాధన చేయాలా? అంటే రూపంతో మొదలుపెట్టు, క్రమముగా అరూపంలోకి వచ్చేస్తావు అని చెప్తాడు. అందుచేత, అంతర్యామిలో శ్వాస నిలిచిపోయెను, దేహాదులతో సంబంధము లేని వాసుదేవుడి ఎడల లీనమయ్యెను. ఏమి జరుగుచున్నదో తెలియక మిగిలినవారందరూ, అర్థరాత్రమున చెట్టుమీది పక్షులవలే చేష్టలుడిగి నిలిచిరి. దేవతలు దుందుభులు మ్రోయించిరి. వెంటనే గుర్తించి, మానవులు దుందుభులు మ్రోయించిరి. కుసుమ వర్షము కురిపించిరి. సాధుజనులు పెద్దగా స్తోత్రములు చేసిరి.

అలా చూస్తూ కృష్ణుని ధ్యానం చేస్తూ, అలా శ్వాస ఎంతో అవలీలగా వదిలేశాడండీ! శ్వాస వదిలి అంతర్యామిలో లీనమైపోయాడు. శ్వాస నిలిచి పోయెను. దేహముతో సంబంధము లేని వాసుదేవుని యందు లీనమయ్యెను. అయిపోతే ఎవరికి తెలుస్తుంది? ఎవరికీ తెలీదు. అలా అందరూ నిశ్చేష్టులై ఉన్నారు. "stunned" అంటాం కదా. అప్పుడు దేవ దుందుభులు

మ్రోగినాయి. అప్పుడు వీళ్ళకి అర్థమయ్యింది. వీళ్లూ దుందుభులు మ్రోగించారు. ఆకాశంలోనూ దుందుభులు మ్రోగినాయండి. భూమ్మీదా దుందుభులు మ్రోగినాయండి. పుష్పములు వర్షించినాయి. వెంటనే గుర్తించి మానవులు దుందుభులు మ్రోయించిరి. కుసుమ వర్షములు కురిపించిరి. సాధుజనులు పెద్దగా స్తోత్రములు చేసిరి. ఇంక అప్పుడు మొదలు పెట్టేశారు– ముందు నిశ్చేష్టత. అటుపైన ఇహ స్తోత్రాలు *"సహస్రశీర్షా పురుషః సహస్రాక్ష సహస్రపాత్"* మొదలుపెట్టేశారు. ఎందుకని? అప్పుడు మళ్ళీ వీళ్ళందరికీ తెలివి వస్తుంది. అంటే స్పృహ కలుగుతుంది. అంతవరకూ భీష్ముడు చేసిన స్తుతి లోంచి వీళ్ళందరూ మతులు కోల్పోయినవారై అక్కడ వున్నారంతే. అద్భుతమైనటువంటి నిష్క్రమణ కదూ భీష్ముని నిష్క్రమణ! పరలోకగతుడైన భీష్మునకు ధర్మజుడు ఉత్తరక్రియలు చేయించెను. కొంతకాలము మాత్రము దుఃఖించెను. మునులు ఋషులతో కలిసి ధర్మరాజు భీష్ముడు చూపిన మార్గమున, కృష్ణుని హృదయమున స్మరించుచూ దుఃఖమును మానెను. ఋషులు భగవదవతార స్తుతులు చేసిరి. శిష్యులతో తమతమ ఆశ్రమములకు జనిరి.

ఈ విధంగా శ్రీకృష్ణుడు, భీష్ముని అనుగ్రహించిన తీరు చూస్తే, అది నిరుపమానము. ఒక్కొక్కరికీ ఒక్కొక్కరకముగా. అందుకనే ఒక మహాత్ముడు దేహము నుంచి నిష్క్రమించిన తీరులో చాలా విషయాలు తెలుస్తాయి. భాగవతంలో మనకు చాలా వచ్చినాయి అలాగ. ప్రథమ స్కంధంలో వీళ్లంతా వెళ్లిపోయిన

విధానం కొంత కొంత పరిచయం చేస్తారు. అన్నిటిలోనూ ఉత్తమోత్తమమైన విధానం భీష్మునిది. మనకు భీష్ముని గూర్చిన అవగాహన ముఖ్యం. భీష్ముడు నిర్వర్తించిన ధర్మమును తెలుసుకోవడం ముఖ్యం. ఆయన యొక్క నిజస్థితి తెలియడం ముఖ్యం. ఆయనకు భగవంతునియందు గల ప్రేమ ఎలాంటిదో తెలియడం ముఖ్యం. ఆయన చేసిన స్తుతి మన ఆరాధనలో భాగంగా చేసుకోవడం ముఖ్యం. అన్నిటినీ మించి ఏ ప్రయోజనానికి దిగి వచ్చాడో ఆ ప్రయోజనాన్ని నిర్వర్తించాడాయన. "Let purpose guide the little wills of men" అంటాం కదా! అలాంటి ప్రయోజనాన్ని నిర్వర్తింపచేసి, పరిపూర్ణంగా దైవంలో లీనమైపోయినట్టి కథ భీష్మ పితామహుని కథ. అలాంటి కథ మనమీరోజు తెలుసుకోవడం జరిగింది. దానివల్ల శుభఫలితములు అందరికీ తప్పకుండా కలుగుతాయి. ఆయన యోగి, జ్ఞాని, భక్తుడు, విరాగి! నాలుగూనూ. ఆయనకున్నంత వైరాగ్యం ఎవరికీ లేదు. ఆయనకున్నంత జ్ఞానం ఎవరికీ లేదు. ఆయన ఎంత యోగో ఆయన దేహం వదులుతున్నప్పుడు కనబడుతుంది. ఆయన ప్రకటిస్తేనే ఆయన ఇంత భక్తుడని తెలిసింది. ఇంత దుర్యోధనుడికీ ఈయన కృష్ణ భక్తుడని తెలియదు. జేబులో బొమ్మలు పెట్టుకొని తిరిగితే రాదు భక్తి.

కృష్ణుని అత్యంత ఆరాధన చేసి తను నిష్క్రమించే సమయంలో కృష్ణుడు తన వద్దకు వచ్చేటట్లుగా చేసుకున్న భక్తుడంటే.... ఇంక అంతకు మించిన భక్తు లెవరున్నారండీ?

గోపికలు వెళ్లిపోతున్న సమయంలో కృష్ణుడున్నాడా ప్రక్కన? పాండవులు వెళ్లిపోతున్న సందర్భములో ప్రక్కన ఉన్నాడా? లేదు. అసలు ఎవరు వెళ్లిపోతున్నప్పుడు ప్రక్కన ఉన్నాడండీ ? యాదవులు వెళ్లిపోతున్నప్పుడు ప్రక్కన ఉన్నాడా? లేదు. తన పట్టమహిషికి కూడా ప్రక్కన లేదు. తన అన్నగారిని కూడా నువ్వు అక్కడికి వెళ్లి తపస్సు చేసుకో, నేనిక్కడ చేసుకుంటాను, అంటాడండీ! తల్లిదండ్రులకు కూడా ప్రక్కన లేదు వారు చివరి ప్రయాణము చేసినప్పుడు. భీష్ముడొక్కనికే! భీష్ముడు వెళ్లిపోయే సమయంలో కృష్ణుడు ప్రక్కనే ఉండి, వాసుదేవ తత్త్వంలోనికి ఆయన్ని అందుకున్నాడు. ఇలాంటి ఘటన పురాణపురుషుడగు శ్రీకృష్ణుని చరితంలో మరొకటి గోచరించదు. భీష్ముడు శ్రీకృష్ణునకు అత్యంత ప్రీతిపాత్రమగు భక్తుడు. ముమ్మాటికి భాగవతోత్తములలో అగ్రగణ్యుడు.

భీష్మ పితామహుడు వెళ్ళే సమయంలో కృష్ణుడుంటే, శ్రీకృష్ణుడు వెళ్ళే సమయంలో మైత్రేయ మహర్షి వచ్చి చేరతాడు. ఉద్ధవుని కృష్ణుడు వాత్సల్యముతో రప్పించుకొంటాడు.

# 12. వాసుదేవ వ్యూహము

కృష్ణుడు వెళ్లిపోయిన సమయంలో ఆయన వద్దకు వచ్చినది మైత్రేయ మహర్షి ఒక్కరే. అది చూడండి! కృష్ణుడు వాసుదేవతత్త్వం లోకి వెళ్లిపోతుంటే మొట్టమొదటిగా వచ్చినవాడు మైత్రేయ మహర్షి. ఎంత బావుంటుంది అది? ఎంత గొప్ప విషయం? అదెలా రాగలిగాడూ? ఇంకా సూక్ష్మలోకంలో ఉంటాడు. అందుచేత ఏమిటిలా వచ్చావ్! అని అడిగితే, నేను రావడమేమిటీ, నీ సంకల్పమే నన్ను పట్టుకొచ్చింది అంటాడు మైత్రేయుడు. ఎందుకనీ? ఈయన స్మరిస్తాడు మైత్రేయ మహర్షిని. తనయందు మైత్రేయుడిని స్మరిస్తే మరుక్షణంలో రూపుగట్టుకొని నిలబడతాడు కృష్ణుని ముందు. అంత సిద్ధుడాయన. అష్టాంగ యోగములో, ఆ రోజులలో అంతకు మించిన నిష్ణాతులే లేరు! అదీ మైత్రేయ మహర్షి. *'సద్యోజాతాయవై నమోనమః'* అంటాం కదా, అలా శ్రీకృష్ణుడు సంకల్పించగానే, అలా రూపు కట్టుకొని నిలబడగలడు మైత్రేయుడు. కనబడితే వెళ్తున్నాడని తెలుసు మైత్రేయునికి. ఉద్ధవుడు కూడా చేరతాడు. ముందు ఉద్ధవుడు చేరలేదు, కానీ కృష్ణుని ప్రభావం చేత చేరతాడు. ఉద్ధవుడు కృష్ణుడు కూర్చున్న చోటికి వస్తాడు, అందరూ మరణించిన తర్వాత. బలరాముడు కూడా వెళ్లిపోయాడు. కృష్ణుడు ఒక్కడే ఉన్నాడు. కృష్ణుడు వేణుగానం చేస్తూ, అలా ఆ

దారుకావనంలో కూర్చున్నాడు. కూర్చుంటే, ఈ గానం వింటూ, భక్తుడైన ఉద్ధవుడు దానికి ఆకర్షింప బడతాడు. అందుకేనేమో గానం చేశాడు. ఉద్ధవుడు వస్తాడు. అందరూ చచ్చిపడి ఉండడము చూస్తాడు. బలరాముడి శవం కూడా చూస్తాడు. చూసి, వచ్చి కృష్ణుడి వద్ద కూర్చుంటాడు.

ఉద్ధవా! దుఃఖించుచుంటివా, అని అడుగుతాడు కృష్ణుడు. ఆయనకి దుఃఖం లేదు. నాకు దుఃఖమేమిటీ, నాకు అన్నీ నీవే! అదీ ఉద్ధవుడు! ఊరికే ఏడిపించడానికి అడుగుతాడు, ఏడుపు వస్తోందా మనవాళ్ళంతా పోయారని అని. నాకు అర్థమైంది నువ్వు బయల్దేరుతున్నావని, నన్ను కూడా పట్టుకెళ్ళు, అంటాడు. అంటే, అలా రాలేవు అని చెప్తాడు. ఇలా రాలేవని చెప్తే ఏం చేస్తాడు? ఆయనే రాలేడంటే ఇంక ఈయనేం వస్తాడండీ? ఇంక కృష్ణుడిని చూడము, కృష్ణుడిని వినము అని లోపల చాలా ఆర్ద్రత కలుగుతుంది. పోనీ అలా వేణుగానం చేయి కాసేపు, అని కళ్ళు మూసుకుంటాడు. అది మంద్రగానం కదా! ఆ వేణునాదం అలా సరాసరి హృదయం చేరి, ఆ హృదయంలో ఒక స్థిరమైన ధ్యానం కలుగుతుంది ఆయనకు. అలా దాంతోనే ఉండిపోతాడు. ఉండిపోతే ఈ లోపల కృష్ణుడు ఇక్కడ నుండి లేచి ఇంకా లోపలకి వెళతాడు. లోపలికి వెళ్లి అక్కడ కూర్చుంటాడు. కూర్చుంటే, ఈ ధ్యానంలో ఉన్న ఉద్ధవుడు సూక్ష్మ దేహంతో అక్కడకి వెళతాడు. లేకపోతే ఈ భౌతిక దేహంతో తనతో పాటు రాలేడు. సూక్ష్మదేహంతో అక్కడకి వెడితే, అక్కడ కృష్ణుడు అంతకు ముందు తను చూస్తున్న 126 సంవత్సరముల కృష్ణుడు కాదు. ఇప్పుడు ఐదేళ్ల బాలుడిగా దర్శనమిస్తాడు.

అంటే ఏమిటండీ, వేరే లోకంలోనికి పట్టుకొచ్చాడు ఉద్ధవుడిని. పట్టుకొచ్చి, గుర్తుందా మన చిన్నతనం? అప్పుడిదే కదా నీ ప్రథమ దర్శనం అంటే, అవునంటాడు. ఇలా అంటూంటే మైత్రేయుడు తనంతట తనుగా వచ్చేస్తాడు. వచ్చేస్తే, ఉద్ధవుడికి చెప్పేస్తాడు ఎలాగూ నువ్వు రాలేవని నేనే రప్పించుకున్నాను అంటాడు. మైత్రేయ మహర్షి సూక్ష్మరూపంలో, కృష్ణ సంకల్పాన్ని అనుసరించి వచ్చేస్తాడు. దర్శనమిస్తాడు. అలాంటి సూక్ష్మశరీరంతో, అప్రాకృత శరీరంతో కృష్ణుడుండగా మైత్రేయుడు అక్కడకి రావడం జరుగుతుంది. ఎందుకనీ? మైత్రేయుని శ్రీకృష్ణమూర్తి సంకల్పిస్తాడు రావడం. ఎందుకనీ? అతని వల్లనే భవిష్యత్ కార్యక్రమం నిర్వర్తింపబడాలి. దివ్యప్రణాళిక కలియుగమునందు నిర్వర్తింపబడడానికి కృష్ణుడు ఎన్నుకున్నటువంటి మహత్తరమైన ప్రజ్ఞ మైత్రేయమహర్షి. అందుకని పిలుస్తాడు. వచ్చిన తర్వాత ఎందుకు వచ్చావు? అని అడుగుతాడు. ఎందుకు వచ్చావేమిటయ్యా నువ్వు పిలిస్తేనే కదా నేను వచ్చాను, అంటాడు మైత్రేయుడు. నవ్వుతాడు. మరి నువ్వు వెళ్లిపోతున్నావు అంటే, *“మైత్రేయుడికి శ్రీకృష్ణుడు బ్రహ్మోపదేశంబు గావించి”* అని ఉంటుంది భాగవతం తృతీయ స్కంధంలో. బ్రహ్మోపదేశం అంటే చెవిలో చేయాల్సిన పని చెప్పేయడం. ఎందుకంటే ఆయన అప్పటికే సమాధి స్థితికి చేరినటువంటివాడు. చేయవలసిన కర్తవ్యాన్ని బోధించి కృష్ణుడు నిష్క్రమిస్తాడు. నిష్క్రమించేటప్పుడు ఒక విచిత్రమైన పరిస్థితి వస్తుంది.

కృష్ణుడికి అప్రాకృత శరీరం మహర్షులు తయారు చేసింది. అందులోకి ఆయన దిగి వచ్చి, అందులో వసిస్తూ, రక్తమాంసాదులతో కూడిన శరీరం మీద ఆపాదించుకుంటాడు. అదీ కృష్ణుడు! పూతన వచ్చినపుడు, రోజుల పసిగుడ్డు కదా ఎలా చంపేస్తాడండీ ఆ రూపంతో! అలాగే శకటాసురుడిని! ఆ రూపంతో! అప్రాకృత శరీరంలో చతుర్బాహుడైనటువంటి శ్రీకృష్ణుడు రాక్షసులందరినీ చిన్నతనంలోనే మట్టుపెట్టేస్తాడు ఆ రూపంతో. ఆ రూపంతోనే ధర్మసంస్థాపన అంతా చేస్తాడు. ఈ రూపం కనిపించడానికి గాను ఒకటి ఉంటుంది. మనుషులకు కనిపించడానికిగాను ఈ రూపం ఉంటుంది. దీని వెనుక దృశ్యాదృశ్యముగా అది ఉంటుంది. అందుచేత భూదేవి ఒప్పుకోదు. నువ్వెళ్లిపోతే నేను ఏమైపోతాను, ఇన్నేళ్లుగా నీ స్పర్శ అనుభూతి పొందాను అంటుంది. పర్వతాలు ఒప్పుకోవు, నువ్వెళ్లిపోతే మా గతేంటీ అని. ఎందుకంటే వాటన్నిటికీ 126 సంవత్సరముల స్పర్శ! పాద స్పర్శ కదా! భూదేవి, పర్వతాలు, నదులు ప్రార్థిస్తారు నువ్వెళ్లిపోతే మాకెలా, మాకెలా అని. సూక్ష్మలోకాలలో ఉండే మహర్షులు ప్రార్థిస్తారు.

రాబోయేది కలియుగం. కృష్ణ నిర్యాణం నుండే కలియుగం ఆరంభం. వెలుగు వెళ్లిపోతుంటే ఇంక ఇక్కడ ఉండేది ఏముందండీ? నువ్వుండవా నువ్వుండవా అని అందరూ ప్రార్థన చేస్తే కాదనలేక ఈ అప్రాకృత శరీరాన్ని మైత్రేయునికి అప్పచెప్పేస్తాడు. ఇది నీ దగ్గరుంచు. దీనిద్వారా నువ్వే దర్శనము ఇస్తూండు, On my

behalf అంటాడు. ఆ శరీరము మైత్రేయునికి అందించడం అనేది పరమ రహస్యం. అది మన గ్రంథాలలో కనిపించదు. హిమాలయాల్లో కొన్ని తాళపత్ర గ్రంథాలలో అది ఉన్నది. అవి ఈ మధ్యే Madam Blavatsky గారి ద్వారా, మాస్టరుగారి ద్వారా బయటకు వచ్చింది. 'Spiritual Astrology' లో మాస్టరుగారు ఒకచోట రాస్తారు, కృష్ణుడు పూర్తిగా వెళ్లిపోలేదు భూమి నుంచీ అని. అంటే నీ యొక్క అన్వేషణ కారణంగా అది లభిస్తుంది అదెలా అనేది. అన్నీ చెప్పరు. నీలగిరులలో దుర్గపర్వతం ఫలానా చోట ఉందని చెప్తారేంటీ? మనకి దాని యందు తపన ఉంటే ఎన్నో విషయాలు తెలుస్తాయి. అందుచేత ఆయనలా అప్పచెప్తాడు తన అప్రాకృత శరీరాన్ని, దీనితో ధర్మసంస్థాపన చేస్తూండమని మైత్రేయునికి.

అదే శరీరాన్ని మైత్రేయుడు బుద్ధునికి ఇస్తాడు, బుద్ధుడు కార్యాన్ని నిర్వర్తించడానికి. అదే శరీరాన్ని ఆదిశంకరులకు ఇస్తాడు. ఆదిశంకరులు ఆ శరీరము యొక్క బలము చేత మహోత్కృష్టమైన కార్యములన్నీ నిర్వర్తిస్తారు. బుద్ధునికి ఆ శరీరం ఆపాదిస్తాడు. దానివల్ల బుద్ధుడు కృతకృత్యుడవుతాడు. శంకరులు కృతకృత్యులౌతారు. అంతేకాదు మనం ఎవరైతే ఏసుక్రీస్తుగా భావన చేస్తున్నామో ఆయన చిట్టచివరి మూడు సంవత్సరములూ ఈ అంగీ ఇస్తారు. ఈ దుస్తులు ఇస్తారు. దాన్నే ఏసుక్రీస్తు కూడా My Glorious White Robe అంటుంటాడు. అదివ్వడం బట్టి ఆ మూడు సంవత్సరములూ ఆయన అద్భుతమైన కార్యములు

నిర్వర్తిస్తారు. మైత్రేయుడు దానికి ధర్మకర్త. He is the Trustee. It is always with Him. అలాంటి మైత్రేయ మహర్షి. అలాంటి శ్రీకృష్ణుడు. ఎప్పుడు కృష్ణ సాన్నిధ్యం లభించాలన్నా దీన్నే వాడతారు.

ఇప్పుడు హరిజనులలో కూడా కృష్ణ దర్శనమైనవారు ఎంతోమంది ఉన్నారు కదా! వారందరికీ వారి వారి పరిపక్వతని బట్టి మైత్రేయ మహర్షే దాన్ని అనుగ్రహిస్తూంటాడు. ఎందుకంటే ప్రతినిత్యం ఈ భూమిని ఆశీర్వదిస్తూంటాడు, ప్రాతః సాయం సంధ్యలయందు మైత్రేయమహర్షి. అందుకనే కృష్ణుడు వెళ్లిపోలేదూ అంటారు. ఉన్నాడు. ఉన్నాడు అంటే ఆయన స్పర్శని ఇక్కడ మిగిల్చాడు. అది బలంగ పెట్టుకొనే పరమగురువు లందరూ పనిచేసుకుంటూంటారు. ప్రత్యేకించి మైత్రేయమహర్షి. అందుచేత భీష్మ నిర్యాణ సమయంలో దగ్గరుండి శ్రీకృష్ణుడు ఎలాగైతే ఆయన్ని వాసుదేవ వ్యూహంలోనికి ప్రవేశింపచేశాడో, అదే విధంగా శ్రీకృష్ణుడు మరల వాసుదేవ వ్యూహంలోనికి ప్రవేశించినప్పుడు మైత్రేయుడు సాక్షిగా ఉన్నాడు. ఉద్ధవుడికి ముందే చెప్తాడు, నువ్వు భక్తిప్రచారంలో ఉండు భూమి మీద అని.

మన మెరిగిన చైతన్య మహాప్రభువు ఉద్ధవుని ఒక అంశావతారమని చెప్తారు. ఆయనేగా హరే రామ హరే రామ! మంత్రాన్ని ప్రపంచానికి యిచ్చినవాడు. మైత్రేయ మహర్షిని అష్టంగ యోగ అధ్యక్షునిగా నియమించి, భూమి జీవులందరికి యోగవిద్యను నేర్పి, తరింపచేయమని ఆదేశిస్తాడు. ఒకప్రక్క

భక్తి ప్రచారము. మరొక ప్రక్క యోగము, జ్ఞానము, అష్టాంగ యోగము భూమికంతా నేర్పమని చెప్పి వెడతాడు కృష్ణుడు. భూమంతా అష్టాంగయోగం నేర్చుకోవాలి. మతంతో సంబంధం లేదు, ఆ యోగానికి మనిషితోనే సంబంధం. ఆ యోగము నందు ధారణకు చేరినవాడు అక్కడ నుండి ధ్యానము, సమాధి స్థితులకు చేరతాడు. భగవంతుని స్వరూప స్వభావములను తెలుసుకొని ఆయనతో అనుసంధానము చెందడమే కదా ధ్యానము. అంతకు ముందు చేయవలసినది ప్రాణాయామము. యమనియమాదులు మానవులందరూ నిర్వర్తించుకోవచ్చు. మతంతో సంబంధం లేదు. అప్పుడు మనసునకు ఆసనస్థితి కలుగుతుంది. అలాంటి స్థితిలో ప్రాణాయామము నిర్వర్తించుకుంటే అంతర్లోక ప్రవేశము కలుగుతుంది. ప్రాణాయామము నుండి ప్రత్యాహారములోనికి కొనిపోబడుతుంటాడు. అక్కడ నుండి మనము ఆజ్ఞని చేరితే ధారణ స్థితి వస్తుంది. అప్పుడు నీకు భగవంతుని స్వరూప స్వభావాలు పరిపూర్ణంగా అవగాహన అవుతాయి. అంటే నామమునకు, రూపమునకు పరిమితము కాని తత్త్వముందే, అది బాగా అవగాహన అవుతుంది. ఆ తత్త్వమే ఒక్కోసారి ఒక్కోరూపం కట్టుకు వస్తుంది. ఒక్కోనామం పెట్టుకొస్తుంది. నామరూపాత్మకమైన జగత్తు నుండి అతీతమైన తత్త్వం తెలియాలంటే ఇవన్నీ (నామరూపాలు) ఎక్కడో విసర్జించాలి. అక్కడి నుండి ధారణ స్థితిలోనికి వచ్చే సరికి అవగాహన ద్వారా వచ్చేస్తుంది. అక్కడి నుండి సర్వవ్యాపి అయిన ఈశ్వరునితో అనుసంధానం చెందడానికి ధ్యానం చేస్తే, ఈశ్వరానుసంధానం వల్ల ఈశ్వర ప్రాప్తి కలుగుతుంది. ఇదే పరమగురువులు ప్రత్యేకంగా

భూగోళమంతా నేర్పడానికి ఉద్యమించారు. ప్రస్తుతము యోగము భూగోళమంతా చేరింది. అంటే అష్టాంగములు స్థూలముగా తెలియబడినాయి. నిర్వహణము మళ్లీ తెలిసిన యోగపుంగవుల ద్వారా దీన్ని బృందములు బృందములుగా ఏర్పడినవారికి వేరే ప్రణాళిక ఇప్పుడు నిర్వర్తింపబడుతోంది. ఇదంతాగూడా దివ్య ప్రణాళికగ మైత్రేయ మహర్షి నిర్వర్తిస్తున్నారని మన అవగాహన.

అలాంటి మైత్రేయ మహర్షి ఆదర్శపురుషుడై భూమి మీద ఉన్నారు. అసలు భూమి మీద ఉండవలసిన అవసరం లేదు. ఆయన ఉండదలచుకుంటే ఇంద్రగ్రహంలో (Neptune) ఉండవచ్చు. అదీ ఆయన స్థానం. కానీ ఆయన భూమి మీద ఉండి ఎన్నో రకములుగా, ఆస్తిక్యబుద్ధి కలిగిన వారికి రకరకములుగా దోహదం చేస్తూ, వారి ఈశ్వర ప్రాప్తికై ప్రయాణంలో ప్రవేశించేట్లుగా ఆయనా, ఆయన బృందము కృషి చేస్తూంటారు. అందులో భాగంగానే మన కార్యక్రమాలు. అందులో భాగంగానే దివ్య జ్ఞాన సమాజ కార్యక్రమాలు. అందులో భాగంగానే ఎన్నో సంస్థలు పని చేస్తున్నాయి బయటకి తెలియకుండా. అందులో భాగంగానే క్రియాయోగం వచ్చింది. అందులో భాగంగానే సాయి ఉద్యమం వచ్చింది. సాయి ఎవరికి చెందిన వారో పరమగురువుల పరంపరలో స్పష్టంగా తెలుస్తుంది. దత్తాత్రేయ మార్గమున్నది. అది కూడా అదే! అన్ని మార్గములూ మన్నింపబడతాయి. ఎందుచేతంటే ఇన్ని రకాలనీ సమన్వయ పరచి, ఒకే ఒక దైవాన్ని చేరడానికి ఒక విధానాన్ని ప్రపంచమంతటా వ్యాప్తి చేసి అందిస్తున్నటువంటిది మైత్రేయమహర్షి యొక్క కృషి. ఇది అంతా వాసుదేవ వ్యూహం.

**స్వస్తి.**

# భీష్మ స్తుతి (మూలము)

మ. త్రిజగన్మోహననీలకాంతిఁ దను వుద్దీపింపఁ బ్రాభాత నీ
రజబంధుప్రభ మైన చేలము పయిన్ రంజిల్ల నీలాలక
వ్రజసంయుక్తముఖారవింద మతిసేవ్యంబై విజృంభింప మా
విజయం జేరెడు వన్నెకాఁడు మది నావేశించు నెల్లప్పుడున్.

మ. హయరింఖాముఖధూళిధూసరపరిన్యస్తాలకోపేతమై
రయజాతశ్రమతోయబిందుయుతమై రాజిల్లు నెమ్మోముతో
జయముం బార్థున కిచ్చువేడ్క నని నా శస్త్రాహతిం జాల నొ
చ్చియుఁ బోరించు మహానుభావుమదిలోఁజింతింతు నశ్రాంతమున్.

మ. నరుమాటల్ విని నవ్వుతో నుభయసేనా మధ్యమక్షోణిలో
బరు లీక్షింప రథంబు నిల్పి పరభూపాలావళిం జూపుచుం
బరభూపాయువు లెల్లఁ జూపులన శుంభత్కేలి వంచించు నీ
పరమేశుండు వెలుంగుచుండెడును హృత్పద్మాసనాసీనుఁడై.

క. తనవారిఁ జంపఁజాలక
వెనుకకుఁ బో నిచ్చగించు విజయునిశంకన్
ఘనయోగవిద్యఁ బాపిన
మునివంద్యునిపాదభక్తి మొనయున్ నాకున్.

సీ. కుప్పించి యెగసినఁ గుండలంబులకాంతి
గగనభాగంబెల్లఁ గప్పికొనఁగ
నుఱికిన నోర్వక యుదరంబులో నున్న
జగములవ్రేఁగున జగతి గదలఁ
జక్రంబుఁ జేపట్టి చనుదెంచు రయమునఁ
బైనున్న పచ్చనిపటము జాఱ
నమ్మితి నాలావు నగుఁబాటు సేయక
మన్నింపు మని క్రీడి మరలఁదిగువఁ

తే. గరికి లంఘించు సింహంబుకరణి మెఱసి
నేఁడు భీష్మునిఁ జంపుదు నిన్నుఁ గాతు
విడువు మర్జున యనుచు మద్విశిఖవృష్టిఁ
దెరలి చనుదెంచుదేవుండు దిక్కు నాకు.

మ. తనకున్ భృత్యుఁడు వీనిఁ గాచుట మహాధర్మంబు వొమ్మంచు న
ర్జున సారథ్యము పూని పగ్గములు చేఁ జోద్యంబుగాఁ బట్టుచున్
మునికోలన్ వడిఁబూన్చి ఘోటకములన్ మోదించి తాడించుచున్
జనులన్ మోహము నొందఁజేయు పరమోత్సాహుం బ్రశంసించెదన్.

క. పలుకుల నగవుల నడపుల
నలుకల నవలోకనముల నాభీరవధూ
కులముల మనములతాలిమి
కొలుకులు వదలించు ఘనునిఁ గొలిచెద మదిలోన్.

ఆ. మునులు నృపులుఁ జూడ మును ధర్మజుని సభా
మందిరమున యాగమండపమునఁ
జిత్రమహిమతోడఁ జెలువొందు జగదాది
దేవుఁ డమరు నాదు దృష్టియందు.

మ. ఒక సూర్యుండు సమస్తజీవులకుఁ దా నొక్కొక్కఁడై తోఁచు పో
లిక నే దేవుఁడు సర్వకాలము మహాలీలన్ నిజోత్పన్నజ
న్యకదంబంబులహృత్సరోరుహములన్ నానావిధానూన రూ
పకుఁడై యొప్పుచునుండు నట్టి హరి నేఁ బ్రార్థింతు శుద్ధుండనై.

DHANISHTA PUBLICATIONS

**DHANISHTA PUBLICATIONS**
D.No. 15-7-1, Angels' Enclave, Krishna Nagar,
Visakhapatnam - 530 002.
Phone : 0891- 2701531, 2509154

## WRITINGS OF MASTER PARVATHIKUMAR

| | | |
|---|---|---|
| 1. | Agni | E |
| 2. | A Clean Life | E/G/S |
| 3. | Adhyatmika Gigyasa | K |
| 4. | Amanaskudu | K/T |
| 5. | Ambareeshudu | T |
| 6. | Antardarsana Dhyanamulu | T/K |
| 7. | Anveshakudu | T |
| 8. | Asangudu | T/K |
| 9. | Aries | E |
| 10. | Ashram | E |
| 11. | Ashram Leaves | E/G/S |
| 12. | Ashram Regulation for Entry | E/G/S |
| 13. | An insight into the WTT | E |
| 14. | Atmasadhana Sutramulu | T |
| 15. | Avathara of Synthesis | E |
| 16. | Ayurvedic Principles of Daily Life | E/G/S |
| 17. | Bharatiya Sampradayamu | T/K/Hi |

*The Books are available in English (E), German (G), Spanish (S), French (F), Hebrew (H), Telugu (T), Hindi (Hi) and Kannada (K) Languages.*

| | | |
|---|---|---|
| 18. | Book of Prayers | E |
| 19. | Bricks for the Temple | E |
| 20. | Cow | K/T/E/Hi |
| 21. | C.V.V. - Mastaru Yogamu - Sadhana Sutramulu | T |
| 22. | Devapi Maharshi Bodhalu 1 & 2 | T/E/K/Hi |
| 23. | Dharmavigrahudu - Sri Ramudu | T |
| 24. | Dhanakamuni Katha | T |
| 25. | Doctrine of Eternal Presence | E |
| 26. | From the Teachers Pen | E |
| 27. | Gayatri Mantra Avagahana | T |
| 28. | Geetopanishad - Gnana Yogamu | T |
| 29. | Geetopanishad - Dhyana Yogamu | T |
| 30. | Geetopanishad - Karma Yogamu | T |
| 31. | Geetopanishad - Sankya Yogamu | T |
| 32. | Geetopanishad - Karma Sanyasa Yogamu | T |
| 33. | Geetopanishad - Vijnana Yogamu | T |
| 34. | Good Friday | E/S |
| 35. | Healers Handbook | E |
| 36. | Health & Harmony | E/G |
| 37. | Health & Harmony-2 | E |
| 38. | Hercules - The Man and the Symbol | E/G/S |
| 39. | Himalaya Guruparampara | T/Hi/K |
| 40. | Jupiter - The Path of Expansion | E/G/S |
| 41. | Just Adjust | E |
| 42. | Jyotirlinga Yatra | T |

43. Kapila and Kardama E/G/S
44. Katha Deepika T
45. Kumara Sambavam T
46. Lectures on Secret Doctrine - I S/E
47. Lectures on Secret Doctrine - II E
48. Lectures on Secret Doctrine - III E
49. Listening to the Invisible Master E/S/K
50. Lord Maitreya - The World Teacher E/S
51. Life and Teachings of Master Jupiter E
52. Maitreya Maharshi Bodhalu 1 & 2 T/K/E/Hi
53. Mana Master garu T
54. MANTRAMS - Their Significance and Practice E/G/S
55. Mars - The Kumara E/G/S
56. Mercury - The Alchemist E/G/S
57. Maria Magdalena E/S
58. Marriage - A Sublime Sacrament E/G/S
59. Maruvu Maharshi Bodhalu 1 & 2 T/K/Hi/E
60. MASTER C.V.V. (Birthday Message) T/K/E
61. MASTER C.V.V - Nuthana Yogamu T/K
62. MASTER C.V.V. - Yogamu T
63. MASTER C.V.V. - Yogamu (Karma Rahityamu) T/k
64. Master K. Parvathi Kumar - Short Biography E
65. Master CVV - Saturn Regulations E/G/S
66. MASTER CVV The Initiator -
MASTER E.K. The Inspirer E

| | | |
|---|---|---|
| 67. | Master M.N. - A Fiery Flame | E/G/S |
| 68. | MASTER E.K. - The New Age Teacher | E/S |
| 69. | Marana Rahasyam-1 (Markandeya) | T |
| 70. | Marana Rahasyam-2 (Sathi Savitri Devi) | T |
| 71. | Master CSG | E |
| 72. | Messages of Master E.K. | E |
| 73. | MITHILA - A New Age Syllabus | E/G/S |
| 74. | Moon - The Key | E |
| 75. | New Age Hospital Management | E |
| 76. | Nutrients For Discipleship | E |
| 77. | OM | T/K/E |
| 78. | Occult Meditations | E/G/S |
| 79. | Om Namo Narayanaya | E/G/S |
| 80. | On Change | E/S |
| 81. | On Healing | E |
| 82. | On Love | E/G/S |
| 83. | On Service | E/G/S |
| 84. | On Silence | E/G/S |
| 85. | PARIKSHIT-The World Disciple | E |
| 86. | Pranayamam | T |
| 87. | Prayers | E/G/S |
| 88. | RUDRA | E |
| 89. | Rukmini Kalyanam | T |
| 90. | Sai Sukthulu | T/K |
| 91. | Sai Ki Amruthavani | Hi |

92. Sanghaneethi T
93. SAM E
94. Saraswathi-The Word E/G/S
95. SANKHYA - The Sacred Doctrine E/S
96. Saturn - The Path of Systematised Growth E/G/S
97. Shodosopachara Pooja - Avagahana T
98. SOUND-The Key and its Application E/G/S
99. Spiritualism-Business and Management E/G
100. Spiritual Healing S/G
101. Sri Dattatreya E/G/S/T
102. Srimadramayana Dharmakusumalu T
103. Sri Guru Paadukastavamu T
104. SRI LALITHA (Set 10 Books) T
(Comentary on Sri Lalitha Sahasranamam)
105. SRI SASTRY GARU T/K/E/S
106. Sri Krishna Namamrutham T
107. Sri Shirdi Sai Sayings E/G/S
108. Sri Suktam E
109. Steps of Silence E
110. Sun that lam E/G/S
111. Temple and the Work E
112. Teachings of Lord Maitreya-1 E
113. Teachings of Lord Maitreya-2 E
114. The Aquarian Cross E/G/S
115. The Aquarian Master E/G/S

116. The Doctrine of Eternal Presence E
117. The Doctrine of Ethics E/S
118. The Etheric Body E/G/K
119. The Golden Stairs E/S
120. The Path of Synthesis E
121. The Splendor of Seven Hills E
122. Thus Spoke-Master Dhwhal Khul E
123. THE TEACHER-Meaning and Significance E
124. Teachings of Master Koot Hoomi 1 & 2 E
125. The Teachings of Lord Kapila E/G
126. The Teachings of Master Mourya 1 & 2 E
127. The Teachings of Sanath Kumara E/G/S
128. The Theosophical Movement E/G/S
129. The White Lotus E/S/K
130. The World Teacher E
131. The Mysteries of Sagittarius E
132. Time - The Key E/G
133. Uranus- The Alchemist of the Age E/G/S
134. Varuna Graha Prabhavamu T/K
135. VENUS-The Path to Immortality E/S
136. Violet Flame Invocations E
137. Vrutrasura Rahasyam T
138. Wisdom Buds E/S
139. Wisdom Teachings of Vidura E/G/S

## ONLY IN SPANISH LANGUAGE

140. The Path of Meditation
141. The Sublimity of Work
142. The Teachings of Master Tibetan
143. Death and Re-incarnation
144. Importance of Moon Nodes
145. Spiritual Practices for Disciples I & II
146. The Science of Health and Cure
147. Om Namo Narayanaya
148. Hanuman and Ramayana
149. Significance of Ganesha

## ONLY IN RUSSIAN LANGUAGE

150. Sun
151. Mars
152. Mercury
153. Jupiter
154. Venus
155. Saturn
156. Uranus

## OTHER BOOKS BY DHANISHTA

| | |
|---|---|
| 157. Sarannavaratri Pooja Vidhanamu | T |
| 158. Purana Purushuni Pooja Vidhanamu | T |
| 159. Sri Anjaneya Pooja Vidhanamu | T |
| 160. Sri Dattatreya Sodachopachara Pooja Vidhanamu | T |
| 161. Sri Hanuman Chalisa | T |
| 162. Srimad Bhagawad Geetha | T |
| 163. Sri Mahalakshmi Pooja Vidhanamu | T |
| 164. Sri Rama Pooja Vidhanamu | T |
| 165. Sri Shiva Hrudayamu | T |
| 166. Sri Shiva Pooja | T |
| 167. Sri Soukumarya Satakamu | T |
| 168. Sri Subrahmanya Swamy Pooja Vidhanamu | T |
| 169. Sri Surya Pooja Vidhanamu | T |
| 170. Sri Venkateswara Pooja Vidhanamu | T |
| 171. Sri Saraswathi Pooja Vidhanamu | T |
| 172. Sri Vinayaka Vratha Kalpamu | T |
| 173. Sri Narayana Kavachamu | T |
| 174. Sri Vishnu Sahasra Namamu | T |
| 175. Sri Sathguru Pooja Vidhanam | T |
| 176. Gajendra Mokshamu | T |
| 177. Sri Lalitha Sahasrana Stotramu | T |

**Please visit our website (www.dhanishta.org / info@dhanishta.org) for prices**

కృష్ణుని అత్యంత ఆరాధన చేసి తను నిష్క్రమించే సమయంలో కృష్ణుడు తన వద్దకు వచ్చేటట్లుగా చేసుకున్న భక్తుడంటే.... ఇంక అంతకు మించిన భక్తు లెవరున్నారండీ? గోపికలు వెళ్లిపోతున్న సమయంలో కృష్ణుడున్నాడా ప్రక్కన? పాండవులు వెళ్లిపోతున్న సందర్భములో ప్రక్కన ఉన్నాడా? లేడు. అసలు ఎవరు వెళ్లిపోతున్నప్పుడు ప్రక్కన ఉన్నాడండీ? యాదవులు వెళ్లిపోతున్నప్పుడు ప్రక్కన ఉన్నాడా? లేడు. తన పట్టమహిషికి కూడా ప్రక్కన లేడు. తన అన్నగారిని కూడా నువ్వు అక్కడికి వెళ్లి తపస్సు చేసుకో, నేనిక్కడ చేసుకుంటాను, అంటాడండీ! తల్లిదండ్రులకు కూడా ప్రక్కన లేడు వారు చివరి ప్రయాణము చేసినప్పుడు. భీష్ముడొక్కనికే! భీష్ముడు వెళ్లిపోయే సమయంలో కృష్ణుడు ప్రక్కనే ఉండి, వాసుదేవ తత్త్వంలోనికి ఆయన్ని అందుకున్నాడు.

ఇలాంటి ఘటన పురాణపురుషుడగు శ్రీకృష్ణుని చరితంలో మరొకటి గోచరించదు. భీష్ముడు శ్రీకృష్ణునకు అత్యంత ప్రీతిపాత్రమగు భక్తుడు. ముమ్మాటికి భాగవతోత్తములలో అగ్రగణ్యుడు.

ధనిష్ఠ

ISBN 978-81-89467-79-1

9 788189 467791

Sathyam-984 999 6538